సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

ఆదివారం 29-6-2025

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 18 సంచిక: 98

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'





కౌంటీ క్రికెట్‌లో ఎసెక్స్ తరఫున ఖలీల్ అహ్మద్

ఇంగ్లండ్ కౌంటీల్లో ఈ సీజన్‌లో ఆడుతున్న భారత ఆటగాళ్ల జాబితాలో మరో ప్లేయర్ చేరాడు. లెఫ్టార్మ్ పేస్ బౌలర్ ఖలీల్ అహ్మద్ 'ఎసెక్స్' జట్టుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీని ప్రకారం అతను దాదాపు రెండు నెలల పాటు టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ మధ్య కాలంలో ఖలీల్ 6 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లతో పాటు 8 వన్డేలు ఆడతాడు. ఎసెక్స్ టీమ్ నాకౌట్ దశకు చేరితే మరో రెండు వన్డేలు అదనంగా ఆడే అవకాశం వస్తుంది. వైవిధ్య భరితమైన ఖలీల్ లెఫ్టార్మ్ బౌలింగ్ తమ జట్టుకు అదనపు బలాన్ని ఇస్తుందని ఎసెక్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ క్రిస్ సిల్వర్‌వుడ్ వ్యాఖ్యానించారు. రాజస్తాన్‌కు చెందిన 27 ఏళ్ల ఖలీల్ భారత్ తరఫున 11 వన్డేల్లో 15 వికెట్లు... 18 టి20ల్లో 16 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో ఆడిన 71 మ్యాచ్‌ల ద్వారా అతనికి మంచి గుర్తింపు లభించింది. 20 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 56 వికెట్లు తీసిన అనుభవం ఖలీల్‌కు ఉంది. ఇంగ్లండ్ కౌంటీల్లో ఇప్పటికే భారత ప్లేయర్లు ఇషాన్ కిషన్ (నాటింగ్‌హామ్‌షైర్), తిలక్ వర్మ (హాంప్‌షైర్), రుతురాజ్ గైక్వాడ్ (యార్క్‌షైర్), చహల్ (నార్తాంప్టన్‌షైర్) ఆడుతున్నారు.

స్మృతి సెంచరీ ధమాకా

తొలి టి20లో భారత్ జయభేరి • 97 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చిత్తు

ఇంగ్లండ్ పర్యటనలో భారత మహిళల జట్టు అదరగొట్టింది. టాప్ బ్యాటర్ స్మృతి మంధాన టి20ల్లో తొలి శతకంతో చెలరేగడంతో ఈ ఫార్మాట్‌లో రెండో అత్యధిక స్కోరు చేసిన టీమిండియా... అనంతరం బౌలింగ్‌లోనూ ఇంగ్లండ్‌ను కట్టిపడేసి సిరీస్ ఆరంభ పోరులో భారీ విజయం ఖాతాలో వేసుకుంది. ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ శ్రీచరణి అరంగేట్రం టి20లోనే నాలుగు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్ పర్యటనలో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి పోరులో టీమిండియా 97 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఈ ఫార్మాట్‌లో టీమిండియాకు ఇది రెండో అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో భారత జట్టుకు సారథ్యం వహించిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (62 బంతుల్లో 112; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించింది. టి20ల్లో స్మృతికి ఇదే తొలి శతకం కాగా... హర్లీన్ డియోల్ (23 బంతుల్లో 43; 7 ఫోర్లు) రాణించింది. చాన్నాళ్ల తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన ఓపెనర్ షఫాలీ వర్మ (20) ఫర్వాలేదనిపించగా... రిచా ఘోష్ (12), జెమీమా రోడ్రిగ్స్ (0) విఫలమయ్యారు. తొలి వికెట్‌కు షఫాలీతో కలిసి 77 పరుగులు జోడించిన స్మృతి... రెండో వికెట్‌కు హర్లీన్‌తో 94 పరుగులు జోడించి భారీ స్కోరుకు బాటలు వేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో లౌరెన్ బెల్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 14.5 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటైంది. దీంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత జట్టు 1–0తో ఆధిక్యంలో నిలిచింది. మరోవైపు టి20ల్లో పరుగుల పరంగా ఇంగ్లండ్‌కు ఇదే అతిపెద్ద పరాజయం. నటాలియా సీవర్ బ్రంట్ (42 బంతుల్లో 66; 10 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా... టామీ బ్యూమౌంట్ (10), ఎమ్ అర్లాట్ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. డానీ వ్యాట్ (0), డాంక్లీ (7), అమీ జోన్స్ (1), కాప్సీ (5), ఎకెల్‌స్టోన్ (1) విఫలమయ్యారు. భారత బౌలర్లలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీ చరణి 4 వికెట్లతో అదరగొట్టింది. ఇప్పటికే జాతీయ జట్టు తరఫున 5 వన్డేలు ఆడిన శ్రీచరణి... అరంగేట్ర టి20లోనే తన స్పిన్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. దీప్తి శర్మ, రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య మంగళవారం బ్రిస్టల్ వేదికగా రెండో టి20 జరగనుంది.



శ్రీ చరణి
స్మృతి మంధాన

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) ఎకిల్‌స్టోన్ (బి) అర్లాట్ 20; స్మృతి (సి) సీవర్ బ్రంట్ (బి) ఎకెల్‌స్టోన్ 112; హర్లీన్ (సి) అర్లాట్ (బి) బెల్ 43; రిచా (సి) డాంక్లీ (బి) బెల్ 12; జెమీమా (సి) సీవర్ బ్రంట్ (బి) బెల్ 0; అమన్‌జ్యోత్ (నాటౌట్) 3; దీప్తి శర్మ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 210. వికెట్ల పతనం:** 1–77, 2–171, 3–186, 4–190, 5–202. **బౌలింగ్:** లౌరెన్ బెల్ 4–0–27–3; అర్లాట్ 4–0–38–1; లౌరెన్ ఫిలెర్ 4–0–35–0; లిన్సీ స్మిత్ 3–0–41–0; సోఫీ ఎకెల్‌స్టోన్ 3–0–43–1; కాప్సీ 2–0–21–0.

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: డాంక్లీ (సి) రిచా (బి) అమన్‌జ్యోత్ 7; డానీ వ్యాట్ (సి) హర్లీన్ (బి) దీప్తి 0; నటాలియా సీవర్ బ్రంట్ (సి) రిచా (బి) శ్రీచరణి 66; బ్యూమౌంట్ (బి) దీప్తి 10; అమీ జోన్స్ (స్టంప్డ్) రిచా (బి) రాధ 1; కాప్సీ (సి) అరుంధతి (బి) శ్రీచరణి 5; అర్లాట్ (సి) స్మృతి (బి) రాధ 12; ఎకెల్‌స్టోన్ (సి) జెమీమా (బి) శ్రీచరణి 1; లౌరెన్ ఫిలెర్ (సి) రిచా (బి) అరుంధతి 2; లిన్సీ స్మిత్ (నాటౌట్) 0; లౌరెన్ బెల్ (సి) జెమీమా (బి) శ్రీచరణి 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (14.5 ఓవర్లలో ఆలౌట్) 113. వికెట్ల పతనం:** 1–9, 2–9, 3–58, 4–62, 5–70, 6–88, 7–102, 8–111, 9–111, 10–113. **బౌలింగ్:** అమన్‌జ్యోత్ కౌర్ 2–0–22–1; దీప్తి శర్మ 3–0–32–2; శ్రీచరణి 3.5–0–12–4; అరుంధతి రెడ్డి 2–0–18–1; రాధా యాదవ్ 2–0–15–2; స్నేహ్ రాణా 2–0–13–0.

నిఖత్ శుభారంభం

తొలి రౌండ్‌లో అలవోక విజయం
- మనీషా మౌన్‌కు షాక్
- ఎలైట్ మహిళల బాక్సింగ్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టార్ మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ జాతీయ ఎలైట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ అయిన తెలంగాణ తేజం ధాటికి ఉత్తర ప్రదేశ్ ప్రత్యర్థి రాశి శర్మ చేతులెత్తేసింది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన 48–51 కేజీ కేటగిరీ తొలిరౌండ్ బౌట్‌లో నిఖత్ జరీర్ 4–1తో రాశిపై ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం ఐదుగురు జడ్జిల్లో నలుగురు జడ్జిలు నిఖత్ విసిరిన పంచ్‌లకు 10 పాయింట్లు ఇచ్చారు. ప్రత్యర్థికి 9 పాయింట్లు ఇవ్వగా... ఒకే ఒక జడ్జి మాత్రం తెలంగాణ బాక్సర్‌కు 9 పాయింట్లు, రాశి శర్మకు 10 పాయింట్లు కేటాయించడంతో 4–1తో గెలిచింది. లేదంటే 5–0తో స్వీప్ చేసేది! హరియాణా బాక్సర్ అంజలి తొలిరోజే అనూహ్య ఫలితాన్ని సాధించింది. 57–60 కేజీ కేటగిరీలో ఆమె 3–1తో ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మనీషా మౌన్ (టాప్స్)ను కంగుతినిపించింది. 45–48 కేజీ కేటగిరీలో 2023 ప్రపంచ చాంపియన్ నీతు (హరియాణా) 5–0తో రజనీ సింగ్ (ఉత్తరప్రదేశ్)పై గెలుపొందగా, 60–65 కేజీల కేటగిరీలో తెలంగాణ బాక్సర్ యశి శర్మ 5–0తో మోనిషా (తమిళనాడు)పై ఘన విజయం సాధించింది. 65–70 కేజీల కేటగిరీలో పూజ (తెలంగాణ) 5–0తో గితిమోని గగొయ్ (సాయ్)పై నెగ్గగా... 75–80 కేజీల కేటగిరీలో బండి కీర్తి (తెలంగాణ)... ప్రత్యర్థి గరిమా (రాజస్తాన్) వాకోవర్ ఇవ్వడంతో ముందంజ వేసింది. 51–54 కేజీల కేటగిరీలో 'టాప్స్' బాక్సర్ లక్ష్మి 5–0తో రాగిని (ఉత్తరప్రదేశ్)పై గెలిచింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో నిఖత్ జరీన్... 'సాయ్' బాక్సర్ కల్పనతో తలపడుతుంది.



సెమీస్‌లో తన్వీ, ఆయుశ్

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

అయోవా (అమెరికా): భారత యువ షట్లర్లు తన్వీ శర్మ, ఆయుశ్ షెట్టిలిద్దరూ యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్స్‌పై కన్నేశారు. ఇద్దరు సెమీఫైనల్లోకి అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్‌లో 16 ఏళ్ల తన్వీ తన జోరు కొనసాగించింది. క్వార్టర్ ఫైనల్లో తనకన్నా మెరుగైన ర్యాంకింగ్ ప్లేయర్‌ను కంగుతినిపించింది. శనివారం జరిగిన క్వార్టర్స్ పోరులో తన్వీ శర్మ 21–13, 21–16తో కరుపతెవన్ లెట్షనా (మలేసియా)పై అలవోక విజయం సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 66వ స్థానంలో ఉన్న తన్వీ... కేవలం 33 నిమిషాల్లోనే వరుస గేముల్లో 50వ ర్యాంకర్ కరుపతెవన్‌ను కంగుతినిపించింది. పురుషుల సింగిల్స్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్లో 20 ఏళ్ల ఆయుశ్ 22–20, 21–9తో జూనియర్ ప్రపంచ చాంపియన్ కువొ కువన్ లిన్ (చైనీస్ తైపీ)ను ఓడించాడు. తొలి గేమ్‌లో తైపీ ఆటగాడు గట్టిపోటీ ఇచ్చాడు. కానీ రెండో గేమ్‌ను గెలిచేందుకు మాత్రం పెద్దగా శ్రమించలేదు. 21–9తో ఏకపక్షంగా ప్రత్యర్థి ఆటముగించాడు. తన్వీ తన కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో సెమీఫైనల్స్‌కు చేరింది. అక్కడ ఆమెకు ఉక్రెయిన్‌కు చెందిన పోలిన బుహ్రొవా ఎదురవుతోంది. మరోవైపు ఈ సీజన్‌లో విశేషంగా రాణిస్తున్న ఆయుశ్ షెట్టి సెమీఫైనల్లో చైనీస్ తైపీ ఆటగాడు చో తియెన్ చెన్‌తో తలపడతాడు.

'తప్పులు సరిదిద్దుకుంటా'

- లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌పై దృష్టి
- పేసర్ ప్రసిధ్ కృష్ణ వ్యాఖ్య



బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ పరాజయానికి ప్రధాన కారణాల్లో బుమ్రా మినహా ఇతర బౌలర్ల పేలవ ప్రదర్శన. ముఖ్యంగా పేసర్ ప్రసిధ్ కృష్ణ అయితే ఏకంగా ఓవర్‌కు ఆరుకు పైగా రన్‌రేట్‌తో పరుగులిచ్చాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ కనీసం 15 ఓవర్లకు పైగా వేసిన సందర్భాల్లో చూస్తే టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఏ ఒక్క బౌలర్ కూడా బంతులకు మించి పరుగులివ్వలేదు. ఇలాంటి చెత్త రికార్డును సొంతం చేసుకున్న ప్రసిధ్ తన తప్పుల నుంచి నేర్చుకుంటానని, తర్వాతి టెస్టుల్లో మెరుగైన బౌలింగ్ ప్రదర్శన కనబరుస్తానని అతను అన్నాడు. రెండో టెస్టు సన్నాహకాల్లో భాగంగా ప్రాక్టీస్‌లో పాల్గొన్న అనంతరం శనివారం ప్రసిధ్ మీడియాతో మాట్లాడాడు. 'నా ఓటమికి పూర్తి బాధ్యత వహిస్తున్నా. నేను అనుకున్న లెంగ్త్‌ల ప్రకారం బౌలింగ్ చేయలేకపోయాను. పరిస్థితులకు తగినట్లుగా అర్థం చేసుకుంటూ నా బౌలింగ్‌ను మార్చుకోలేకపోయా. అక్కడే తప్పు జరిగింది. వాటిని సరిదిద్దుకొని వచ్చే సారి మంచి ఫలితాలు రాబడతా' అని ప్రసిధ్ చెప్పాడు. తాను వేసిన కొన్ని మంచి బంతులు బ్యాటర్ ఎడ్జ్ తీసుకొని దూసుకుపోయాయని, ఆ విషయంలో అదృష్టం కలిసి రాలేదన్న భారత పేసర్...బౌన్సర్లు ప్రయత్నించినప్పుడు కూడా చాలా పరుగులు రావడం నిరాశకు గురి చేసిందని వ్యాఖ్యానించాడు. తొలి టెస్టులో ఓటమినుంచి జట్టు కోలుకుందని, డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉందని ప్రసిధ్ పేర్కొన్నాడు. రాబోయే మ్యాచ్‌లో వ్యూహాలపై తన సహచర బౌలర్లతో చర్చిస్తున్నట్లు అతను వెల్లడించాడు. తొలి టెస్టులో మన లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ ఘోరంగా విఫలమైంది. దీనిని కూడా తాము మెరుగుపర్చుకునే పనిలో ఉన్నామని భారత పేసర్ వివరించాడు. 'నెట్ సెషన్‌లో మా లోయర్ ఆర్డర్ బ్యాటర్లంతా చాలా కష్టపడ్డాం. క్రీజ్‌లో ఎక్కువ సేపు నిలిచి పరుగులు జోడించే ప్రయత్నంలో తీవ్రంగా శ్రమిస్తున్నాం. వాటి విలువ గత మ్యాచ్‌లో తెలిసింది. అందుకే బ్యాటింగ్‌పై మరింత దృష్టి పెట్టాం' అని ఈ కర్నాటక పేస్ బౌలర్ స్పష్టం చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

దిల్ రాజు డ్రీమ్స్ అద్భుతమైన ప్లాట్‌ఫామ్

- విజయ్ దేవరకొండ


• 'దిల్' రాజు, దేవిశ్రీ, విజయ్ దేవరకొండ, శిరీష్

''కొత్త వాళ్లకి ఒక అవకాశం ఎంత గొప్పదో నాకు తెలుసు. 'దిల్'రాజుగారికి 'దిల్ రాజు డ్రీమ్స్' వెబ్ సైట్‌ని ఎందుకు ప్రారంభించాలనిపించిందో నాకు తెలియదు. ఇది ఒక అద్భుతమైన ప్లాట్‌ఫామ్. లక్షలాది మందికి ఒక నమ్మకాన్ని ఇచ్చింది. దరఖాస్తు చేసిన వారిలో ఒక్కరి కల నెరవేరినా ఈ వెబ్ సైట్ లాంచ్‌కి న్యాయం జరిగినట్టే'' అని హీరో విజయ్ దేవరకొండ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'దిల్ రాజు డ్రీమ్స్' వెబ్ సైట్ లాంచ్ ఈవెంట్‌కి విజయ్ దేవరకొండ, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై, వెబ్ సైట్‌ని లాంచ్ చేశారు. అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''శేఖర్ కమ్ములగారి 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమాకి నటుడిగా చాన్స్ కోసం అప్లై చేశాను. దాదాపు 6 నెలలు వేచి చూశాను. 16 వేల అప్లికేషన్స్‌లో 11 మందిని ఎంపిక చేయగా వారిలో నేనూ ఉన్నాను. ఆ సినిమా నా జీవితంలో పెద్ద పాత్ర పోషించింది'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ– ''మన కలని సాకారం చేసుకోవడానికి సపోర్ట్ చేసే వారికంటే నిరుత్సాహపరిచే వారు ఎక్కువ మంది ఉంటారు. మన కలని, మన లక్ష్యాన్ని మనమే నమ్మాలి'' అని చెప్పారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''కొత్త దర్శకులు, కొత్త నిర్మాతలు, ఆర్టిస్టులు, టెక్నీషియన్స్‌కి ఇండస్ట్రీలోకి రావాలని ఉంటుంది. వాళ్లకి సరైన గైడెన్స్ ఉండదు. అలాంటి కొత్త టాలెంట్ కోసం సరైన వేదిక అవుతుందనే ఆలోచనతో 'దిల్ రాజు డ్రీమ్స్' సంస్థని ప్రారంభించాం. మేము ఇక్కడికి రావడానికి 30 ఏళ్లు పట్టింది. ఇక్కడ సక్సెస్ అనేది ఒక్క శాతం మాత్రమే. ఎప్పుడైతే మీరు సినిమా రంగంలో సక్సెస్ అవుతున్నారని అర్థం అవుతుందో అప్పుడు 24 గంటలు కష్టపడాలి. నేను, విజయ్, దేవిశ్రీ, నాని... ఇలా అందరూ ఇండిపెండెంట్‌గా సక్సెస్ అయి వచ్చిన వాళ్లమే. అంతకుముందు జనరేషన్‌లో చిరంజీవి, రజనీకాంత్‌గార్లు కూడా ఇండిపెండెంట్‌గానే సక్సెస్ సాధించారు'' అని పేర్కొన్నారు. ''ఇక్కడికి ఎంతోమంది ప్రతిభావంతులు వచ్చారు. మీరు ఎదిగాక ఇండస్ట్రీని మర్చిపోవద్దు'' అని నిర్మాత శిరీష్ కోరారు.

నిజ జీవితం నుంచి వచ్చిన కథ ఇది

- సిద్ధార్థ్


• చిత్ర, సిద్ధార్థ్, మీతా రఘునాథ్

''తండ్రీ కొడుకుల బంధాన్ని, భావోద్వేగాలను 'బొమ్మరిల్లు' సినిమాలో చూశారు. ఆ సినిమా తర్వాత మళ్లీ తండ్రీ కొడుకుల బంధం, భావోద్వేగాలను '3 బీహెచ్‌కే' చిత్రంలో చూస్తారు. ఈ సినిమా ప్రివ్యూ చూసుకున్న తర్వాత మా నాన్నని గట్టిగా హత్తుకోవాలనిపించింది. '3 బీహెచ్‌కే' చూశాక ప్రేక్షకులకూ అదే అనుభూతి కలుగుతుందని భావిస్తున్నాను'' అని సిద్ధార్థ్ తెలిపారు. సిద్ధార్థ్ హీరోగా తెలుగు–తమిళ భాషల్లో రూపొందిన చిత్రం '3 బీహెచ్‌కే'. శ్రీ గణేష్ దర్శకత్వంలో అరుణ్ విశ్వ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ విడుదల చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''నిజ జీవితం నుంచి వచ్చిన కథే ఈ చిత్రం. ఈ సినిమాలో మెయిన్ క్యారెక్టర్ ఇల్లు. ఇప్పుడు ప్రొడ్యూసర్ అరుణ్‌గారు ఉంటున్న ఇంట్లో గతంలో కళాతపస్వి కె. విశ్వనాథ్‌గారు ఉండేవారు. అందుకే ఈ సినిమాని ఆయనకి అంకితం ఇస్తున్నాం'' అని చెప్పారు. శ్రీ గణేష్ మాట్లాడుతూ– ''చాలా ప్రేమతో ఈ సినిమా తీశాం. ప్రేక్షకులు కూడా మా చిత్రం చూసి అంతే ప్రేమ అందిస్తారని ఆశిస్తున్నాం'' అని పేర్కొన్నారు. ''ఈ సినిమా నా జీవితంలో ఎప్పటికీ ఓ జ్ఞాపకంగా నిలిచి పోతుంది'' అని అరుణ్ విశ్వ తెలిపారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు.

ప్యారడైజ్‌లోకి ఎంట్రీ


• నాని

'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్‌లో నాని పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా 'ధగడ్ ఆగయా!' అంటూ నాని సరికొత్త లుక్ రిలీజ్ చేశారు. ''ది ప్యారడైజ్' కోసం గ్రాండ్‌గా సెట్స్ వేశాం. 40 రోజుల హైదరాబాద్ షెడ్యూల్‌లో భాగంగా ఓ వారం పాటు కీలకమైన బాల్యం సన్నివేశాలు చిత్రీకరించాం. శనివారం నాని ఎంట్రీ ఇచ్చారు. ఆయనతో పాటు ప్రధాన తారాగణంపై సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. 'దసరా' పాన్ ఇండియా స్థాయిలో అదరగొట్టింది. 'ది ప్యారడైజ్' ప్రపంచ స్థాయికి వెళ్లబోతోంది. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో 2026 మార్చి 26న రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

కన్నప్పను అభినందిస్తుంటే ఆనందంగా ఉంది

- మంచు మోహన్‌బాబు


• విష్ణు మంచు, మోహన్‌బాబు, ముఖేష్‌కుమార్ సింగ్

''నటుడిగా 50 ఏళ్ల ప్రయాణం నాది. అప్పట్నుంచి ఇప్పటివరకు నా అభిమానులు నా వెన్నంటే ఉండి ముందుకు నడిపిస్తున్నారు. 'కన్నప్ప' సక్సెస్ తర్వాత వాళ్లంతా ఫోన్లు చేసి అభినందనలు తెలియజేస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. వారి ప్రేమకు నేను తిరిగి ఏమి ఇవ్వగలను... వారికి ఎప్పటికీ రుణపడి ఉంటాను'' అని నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు తెలిపారు. విష్ణు మంచు హీరోగా ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో మోహన్‌బాబు మాట్లాడుతూ– ''కన్నప్ప' కోసం యూనిట్ అంతా ప్రాణం పెట్టి పని చేశాం. భగవంతుడి ఆశీస్సులతోనే 'కన్నప్ప' చిత్రానికి ఇంత గొప్ప విజయం దక్కింది. మాకు ఇంత హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ– ''మాలాంటి నటీనటులకు ప్రేక్షకులే దేవుళ్లు. వారి ఆదరణ, ప్రేమతోనే మేం ఈ స్థాయికి వస్తాం. 'కన్నప్ప'కు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇదంతా శివలీల. 'కన్నప్ప'ను ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని చెప్పారు. ముఖేష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ– ''మోహన్‌బాబు, విష్ణుగార్లు పదేళ్లుగా 'కన్నప్ప' కోసం కష్టపడుతూ వచ్చారు. మా సినిమా మీద అందరూ ప్రేమను కురిపిస్తుండటం సంతోషంగా ఉంది'' అన్నారు. 'కన్నప్ప' చిత్రం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వినయ్ మహేశ్వరి, మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశి, నటులు శివ బాలాజీ, కౌశల్, అర్పిత్ రంకా మాట్లాడారు.

యూత్‌ఫుల్ పవర్


• సాయికృష్ణ

సాయికృష్ణ హీరోగా పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'పవర్' అనే టైటిల్ ఖరారు అయింది. మంగళగిరి పరిధిలోని ఆత్మకూరులో వంగవీటి రంగ విగ్రహం వద్ద జరిగిన ముహూర్తం షాట్‌తో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. 'నాది పొగరు కాదురా... నా జాతికి ఈ దేవుడు ఇచ్చిన పవర్...' అనే డైలాగ్‌తో సాయికృష్ణ సినీ ఎంట్రీ మొదలైంది. ఎస్ఐఎఫ్ ఏఏ సమర్పిస్తున్న చిత్రం ఇది. అరుణ్ విజయ్, సుజన, భాగ్యశ్రీ, ప్రజ్ఞ, ప్రియలతో పాటు కొందరు సీనియర్ నటీనటులు నటించనున్న ఈ సినిమాకు శంకర్ మహదేవన్ సంగీతం అందించనున్నారు. ''యువతను ఆకట్టుకునే శక్తిమంతమైన కథాంశంతో, అద్భుతమైన సాంకేతిక విలువలతో ఈ సినిమా రూపొందుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

క్రేజీ జిగ్రీస్


• 'జిగ్రీస్' పోస్టర్

కృష్ణ బురుగుల, ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో రూపొందుతోన్న చిత్రం 'జిగ్రీస్'. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మౌంట్ మెరు పిక్చర్స్‌పై కృష్ణ వోడపల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'జిగ్రీస్' అనే టైటిల్ ఖరారు చేశారు. టైటిల్, ఫస్ట్ లుక్‌ని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా లాంచ్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ''యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'జిగ్రీస్'. చైల్డ్‌హుడ్ ఫ్రెండ్‌షిప్, నాస్టాల్జియా, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఈశ్వరాదిత్య, సంగీతం: కమ్రాన్.

ఓటీటీ ఇది చూడొచ్చు

వీళ్ళు మామూలోళ్ళు కాదు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'గ్యాంగర్స్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.


తమిళ దర్శకుడు–నటుడు సుందర్ .సి వైవిధ్యమైన కథలతో సినిమాలు చేస్తుంటారు. ఆయన కథల్లో సామాన్యులు కూడా అనితరసాధ్యమైన ఫీట్లు చేస్తుంటారు. అలాంటి ఫీట్లు చేసేలానే కథలు రాసుకుంటారు సుందర్. అదే కోవలో తీసుకువచ్చిన మరో యాక్షన్ కామెడీ థ్రిల్లర్ 'గ్యాంగర్స్'. ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు వెర్షన్‌లో కూడా లభ్యమవుతోంది. సుందర్ .సి ఈ కథను తానే రాసుకుని, తాను నిర్మాతగా వ్యవహరించి, దర్శకత్వం కూడా వహించారు. అలాగే శరవణన్ పాత్ర చేశారు. ఇక... అరసన్ హైస్కూల్‌లో కంప్యూటర్ సైన్స్ టీచర్ సుజి తన స్టూడెంట్ రమ్య కనబడకుండా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రారంభమయ్యే ఈ సినిమా ఒక ఉత్కంఠభరిత యాక్షన్ థ్రిల్లర్. స్కూల్ కరస్పాండెంట్ మలైయరసన్, అలాగే అతని సోదరుడు కొట్టియరసన్‌లపై రమ్య గురించి సుజి చేసిన ఆరోపణలతో కథ ఊపందుకుంటుంది. ఈ ఫిర్యాదు తర్వాత



దానిని విచారించడానికి ఓ రహస్య అధికారిగా శరవణన్ పీటీ టీచర్‌గా ఆ స్కూల్‌లోకి వస్తాడు. శరవణన్ ఆ స్కూల్‌లోకి వచ్చీ రాగానే స్కూల్‌లో స్టూడెంట్స్ తీసుకుంటున్న మత్తు పదార్థాల బండారాన్ని బయట పెట్టడంతో పాటు రమ్య కేసును కూడా విచారిస్తుంటాడు. రమ్య కనబడకుండా పోవడానికి కారణం ఆ ఊరి డాన్ అయిన ముదియరసన్ అని శరవణన్ తెలుసుకుంటాడు. అంతేకాదు... ఆ ఊరిలో అక్రమంగా ముదియరసన్ దాదాపు 100 కోట్లకు పైగా డబ్బులు దాచి పెట్టాడని శరవణన్‌కు తెలుస్తుంది. తన తోటి టీచర్లతో కలిసి ఆ డబ్బును కొట్టేయడానికి ప్లాన్ వేస్తాడు శరవణన్. మరి... ఆ ప్లాన్ సక్సెస్ అవుతుందా లేదా అన్నది మాత్రం 'గ్యాంగర్స్' సినిమాలోనే చూడాలి. సాధారణ టీచర్లు 100 కోట్ల రూపాయలను ఓ డాన్ దగ్గర నుండి కొట్టేయడానికి ఏం చేస్తారు? అన్నదే ఈ సినిమాలో సూపర్ పాయింట్. సినిమా ఆద్యంతం యాక్షన్ కామెడీతో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ప్రముఖ హాస్య నటుడు వడివేలు పండించిన కామెడీ ఈ సినిమాకు హైలైట్. ఓవరాల్‌గా ఈ సినిమా వీకెండ్‌కు మంచి కాలక్షేపం. **– హరికృష్ణ ఇంటూరు**

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 98
SUNDAY Special
ఆదివారం 29-6-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



ఎగిరే ట్యాక్సీలు..
అమెరికాలో జూన్ 3న 'అలియా సీఎక్స్ 300' అనే విద్యుత్ విమానం ఐదుగురు ప్రయాణికులతో విజయవంతంగా గమ్యం చేరి చరిత్ర సృష్టించింది.
- వివరాలు 14లో



వారు విడిపోయి.. వీరికి.. ఒడిపోయి
పిల్లల చిన్న వయసులో తల్లిదండ్రులు విడిపోతే ఆ పిల్లలకు ఆయుష్షు తగ్గే అవకాశాలు పెరుగుతాయని అంటున్న అధ్యయనాలు.
- వివరాలు 12లో



'ఒకే దేశం.. ఒకే రాజ్యాంగం'..
'ఒక్కో రాష్ట్రం.. ఒక్కో రాజ్యాంగం' అనే ఆలోచనను అంబేడ్కర్ వ్యతిరేకించారని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు.
- వివరాలు 6లో



'రా' అధినేతగా పరాగ్ జైన్
'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించిన ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్ 'రా' నూతన చీఫ్‌గా నియమితులయ్యారు.
- వివరాలు 6లో



వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి
రష్యా ఆందోళనను పట్టించుకోకుండా పశ్చిమ దేశాలు విస్తరణ వాదాన్ని అనుసరిస్తున్నాయని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మండిపడ్డారు.
- వివరాలు 6లో



తీవ్ర వ్యసనం..
రీల్స్‌ను వరుసపెట్టి చూడటాన్ని 'డూమ్ స్క్రోలింగ్' అంటున్నారు నిపుణులు. రీల్స్ మనిషి మెదడును ఆక్రమించడంపై కథనం..
- వివరాలు 12లో

న్యూస్‌రీల్

683 మంది ఫోన్లు ట్యాప్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా 683 మంది ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు తేల్చారు. ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావును విచారిస్తున్న సిట్ అధికారులు.. మరిన్ని కీలక ఆధారాలు సేకరించినట్లు తెలిసింది.
- వివరాలు 2లో

వివాహితపై దాడి ఘటన.. అదుపులో నిందితులు


ఓ వివాహితను వివస్త్రను చేసి అమానవీయంగా దాడి చేసిన ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి ఘటనపై 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి యంత్రాంగం స్పందించింది.
- వివరాలు 14లో

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నేడు నోటిఫికేషన్

ఎంతోకాలంగా వాయిదా పడుతూ వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. అధ్యక్ష ఎన్నికలకు ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ఆదివారం నోటిఫికేషన్ జారీచేసి, ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.
- వివరాలు 2లో

యువ ఇంజనీరు.. జీతం బేజారు..

కెరీర్‌కు బంగారు బాటగా ఇంజనీరింగ్‌ను పరిగణించే మన దేశంలో.. ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకోవడానికి దాదాపు రూ.10 -20 లక్షలు ఖర్చు చేయాలి. అంతేకాదు జీవితంలో విలువైన 4 సంవత్సరాలు వెచ్చించాలి.
- వివరాలు 2లో

'ప్రైవేటు' పుస్తకాల దందా!




- ప్రైవేటు స్కూళ్లలో ఏటా వందల కోట్ల పుస్తకాల వ్యాపారం
- ప్రభుత్వ పుస్తకాలకు అదనంగా భారీగా ప్రైవేటు బుక్స్
- తప్పనిసరిగా కొనాల్సిందేనని తల్లిదండ్రులపై ఒత్తిడి
- నగదు రూపంలో మాత్రమే చెల్లింపులు.. రసీదు ఇవ్వరు
- లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు: అధికారులు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల్లో ఏటా పెరుగుతున్న ఫీజులకు పుస్తకాల భారం కూడా తోడు కావటంతో విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుగుతోంది. ప్రభుత్వ అధికారిక పుస్తకాలకు అదనంగా వర్క్‌షీట్ల పేరుతో లెక్కాపత్రం లేకుండా తామిచ్చే పుస్తకాలే కొనాలని స్కూళ్ల యాజమాన్యాలు హుకుం జారీచేస్తుండటంతో తల్లిదండ్రులు మౌనంగా ఆ భారాన్ని భరిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన పుస్తకాలు, వాటికి తగిన నోట్ పుస్తకాల కొనుగోలు విషయం తల్లిదండ్రులకు పెద్దగా భారం కాదు. ఒక్కో విద్యార్థికి గరిష్ఠంగా రూ.1,000 లోపు ఖర్చుతో పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయవచ్చు. కానీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎంపిక చేస్తున్న పుస్తకాలు కొనుగోలు చేయాలంటే ఒక విద్యార్థికి ఏడాది పాటు చెల్లించే ట్యూషన్ ఫీజులో కనీసం మూడో వంతు భరించాల్సిన పరిస్థితి వస్తోంది.

దండుకోవడమే లక్ష్యం..
రాష్ట్రంలో 41,628 పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 60 లక్షల మంది విద్యార్థులున్నారు. ఇందులో ప్రైవేటు పాఠశాలలు 11,454. వీటిలో ఒకటి నుంచి పదోతరగతి వరకు 34,92,886 మంది ఉంటే.. నర్సరీ, ఎల్‌కేజీ,
మిగతా 5వ పేజీలో ▶

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒకటి, రెండవ తరగతి విద్యార్థులకు 3 పాఠ్య పుస్తకాలు మాత్రమే ఉంటాయి. ఇందులో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ మాత్రమే ఉంటాయి. 3, 4,5వ తరగతుల విద్యార్థులకు నాలుగు పాఠ్యపుస్తకాలు ఉంటాయి. ఇందులో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ ,ఈవీఎస్ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) పుస్తకాలు ఇస్తారు. ఆరు నుంచి పదవ తరగతి వరకు ఆరు

ప్రభుత్వంలో 3.. ప్రైవేటులో 6..
పాఠ్యపుస్తకాలు ఉంటాయి. ఇందులో మూడు లాంగ్వేజెస్, మూడు ఆప్షనల్స్ ఉంటాయి. ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ పుస్తకాలకు బదులు ప్రైవేట్ పాఠశాలలు సబ్జెక్టువారీ పుస్తకాలను ఎంపిక చేసుకొని అమలు చేస్తున్నారు. దీంతో ఒకటో తరగతి నుంచే తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ పుస్తకాలు ఉంటాయి. ఆరో తరగతి నుంచి ప్రభుత్వ పుస్తకాలను అనుసరిస్తూ వాటికి వర్క్ బుక్‌లను కూడా అదనంగా జోడిస్తున్నారు.




పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం,శ్రీధర్‌బాబు, ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి, మేయర్ విజయలక్ష్మి తదితరులు

భారత్‌కే ఫ్యూచర్

- ప్రపంచమంతా మెచ్చేలా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాం
- గచ్చిబౌలిలో పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రపంచశ్రేణి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు పనిచేస్తున్నాం
- ఇందుకోసం 100 ఏళ్ల అభివృద్ధికి ప్రణాళిక రచిస్తున్నాం
- రాష్ట్ర సమ్మిళిత అభివృద్ధికి కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజన
- డిసెంబర్ 9లోగా విజన్ డాక్యుమెంట్
- కాంగ్రెస్ వేసిన బీజంతోనే హైటెక్ సిటీ ఏర్పాటు
- రాష్ట్రానికి మోదీ ఇచ్చింది, కిషన్‌రెడ్డి తెచ్చింది ఏముంది?
- అభివృద్ధికి నేతలంతా కలిసి రావాలి

చందానగర్: హైదరాబాద్‌ను ప్రపంచశ్రేణి నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని.. ప్రపంచమంతా మెచ్చేలా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అలాగే తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా.. మూడు ప్రాంతాలుగా విభజించి ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో ముందుకు వెళ్తామని చెప్పారు. రాష్ట్ర సమ్మిళిత, సమగ్రాభివృద్ధి కోసం రూపొందిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9లోగా విడుదల చేస్తామని వెల్లడించారు. గచ్చిబౌలిలో కొండాపూర్ నుంచి ఔటర్ రింగురోడ్డు వరకు రూ. 182.72 కోట్ల వ్యయంతో, ఆరు లేన్లతో
మిగతా 5వ పేజీలో ▶


- క్రమశిక్షణ కమిటీకి ఆరు పేజీల లేఖ ఇచ్చిన మురళి
- మంత్రి పొంగులేటి తమపై కక్షగట్టారని లేఖలో ప్రస్తావన!
- మంత్రి సీతక్కతో విభేదాలు కడియం శ్రీహరి సృష్టిస్తున్నవే
- మా నియోజకవర్గంలో రాజేందర్‌రెడ్డి జోక్యం

క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి లేఖ అందజేస్తున్న కొండా మురళి

కొండా లేఖ కలకలం

సాక్షి, హైదరాబాద్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్న లేఖ ఆ పార్టీలో కలకలం రేపుతోంది. మురళి శనివారం భారీ అనుచరగణంతో ర్యాలీగా గాంధీభవన్‌కు వచ్చి, నేరుగా పీసీసీ క్రమశిక్షణ కమిటీతో సమావేశమయ్యారు. కమిటీ చైర్మన్ మల్లురవి, సభ్యులు శ్యాంమోహన్, జి.వి.రామకృష్ణ, కమలాకర్‌రావులతో గంటన్నరకు పైగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆయన ఆరు పేజీల లేఖను క్రమశిక్షణ కమిటీకి అందించి, తమపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఆ లేఖలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. సీఎం సన్నిహితుడు వేం నరేందర్‌రెడ్డి గురించి పేర్కొన్న అంశాలు ఇప్పుడు సంచలనంగా మారాయి.

పొంగులేటి మాపై కక్షగట్టారు!: కొండా మురళి క్రమశిక్షణ కమిటీ భేటీకి వెళ్లడానికి ముందే ప్రచారంలోకి వచ్చిన ఆ లేఖలో తొలుత మంత్రి పొంగులేటి గురించి ప్రస్తావించినట్లు సమాచారం. 2007లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన సమయంలో దళితులు, గిరిజనులకు ఎక్కువ సీట్లు వచ్చేలా తాను పనిచేశానని, అందుకే జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలు రిజర్వ్‌డ్ కేటగిరీకి వెళ్లాయని తెలిపారు. ఈ పరిణామంతో సీటు కోల్పోయిన
మిగతా 2వ పేజీలో ▶

నన్ను రెచ్చగొట్టకండి: కొండా మురళి
క్రమశిక్షణ కమిటీకి ఏం చెప్పాలో చెప్పేశానని వెల్లడి
2 లో



- ఆర్థిక ఇబ్బందులున్న లబ్ధిదారులకు చేయూత.. ఖమ్మం జిల్లాలో 405 మందికి రుణ సదుపాయం
- స్వయం సహాయక సంఘాల ద్వారా అందజేత.. రాష్ట్రంలో తొలిసారిగా ఖమ్మం జిల్లాలో అమలు

ఇందిరమ్మ ఇళ్లకు రుణాలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు కట్టుకోలేకపోతున్న పేదలకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇప్పించే వినూత్న కార్యక్రమం ఖమ్మం జిల్లాలో ప్రారంభమైంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో జిల్లా అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. స్వయం సహాయక సంఘాలు అందిస్తున్న రుణాలతో ఇళ్ల నిర్మాణాలు ఒక్కొక్కటిగా మొదలవుతున్నాయి. జిల్లాలో మొత్తం 405 మందికి రుణాలు ఇవ్వాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 281 మందికి అందించారు.

శరవేగంగా ఎంపికలు..
ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా తొలుత 860 మందిని ఎంపిక చేశారు. ఆ తర్వాత అర్హతల మేరకు
మిగతా 5వ పేజీలో ▶


ఈ చిత్రంలోని మహిళ పేరు కోలా నాగమణి. కొణిజర్ల మండలం చిన్నగోపతికి చెందిన ఈమె ఐకేపీ ద్వారా రూ.లక్ష రుణం తీసుకుని ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంటోంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం రూఫ్ లెవల్ వరకు పూర్తయింది.

అంతరిక్షం నుంచి భారత్..
ఓ అద్భుత దృశ్యకావ్యం



- నా యాత్ర జాతి సమష్టి ఘనత ప్రధాని మోదీతో శుభాంశు
- మీ ప్రస్థానం యువతకు ఎనలేని స్ఫూర్తి: ప్రధాని

6 లో



'అంతరిక్షాన్ని అన్వేషించాలన్న మన యువత, విద్యార్థుల సంకల్పాన్ని శుభాంశు చరిత్రాత్మక యాత్ర మరింత బలోపేతం చేస్తుంది. తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు త్వరలో శ్రీకారం చుట్టేందుకు భారత్ పట్టుదలతో ఉంది'
- నరేంద్ర మోదీ, భారత ప్రధాని

జూరాల సమీపంలో కృష్ణానదిపై మరో బ్రిడ్జి



- రూ.100 కోట్ల నిధులు మంజూరు చేస్తాం
- ప్రాజెక్టులను బీఆర్ఎస్ గాలికి వదిలేసింది
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- వివరాలు 2లో

ఇదంజగత్


మనకి తప్ప అన్నిటికీ సేఫే ఈ విమానాలు!


వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

తనను తాను డెలివరీ చేసుకుంది!

- ప్రపంచంలోనే తొలిసారిగా పూర్తిస్థాయి అటానమస్ కారు స్వీయ డెలివరీ
- ఫ్యాక్టరీ నుంచి సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ యజమాని ఇంటికి చేరుకున్న టెస్లా 'మోడల్ వై'
- హైవేపై ట్రాఫిక్‌ను దాటుకుంటూ గంటకు గరిష్ఠంగా 115 కి.మీ. వేగంతో ప్రయాణం

14 లో



డీపీఆర్‌లో స్పష్టత లేదు

- హైదరాబాద్ మెట్రో ఫేజ్–2పై కేంద్రం అభిప్రాయం
- పలు కీలక ప్రశ్నలు లేవనెత్తిన కేంద్ర గృహనిర్మాణ శాఖ
- వాటిపై స్పష్టత వచ్చేవరకు ముందుకెళ్లకూడదని నిర్ణయం
- రూ.24,269 కోట్లతో 76.4 కి.మీ. రెండో దశ ప్రాజెక్ట్
- డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వం

- వివరాలు 13లో

607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు


- ఆరోగ్యశాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
- డీఎంఈ పరిధిలో 2,280 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలు
- మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్
- పలువురు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జూలై 10 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తూ బోర్డు కార్యదర్శి గోపాకాంత్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. దరఖాస్తులకు చివరి తేదీ జూలై 17. వైద్య విద్యలో పీజీ లేదా సూపర్ స్పెషాలిటీ కోర్సు చేసినవారు ఈ పోస్టులకు అర్హులు. మెడికల్ కాలేజీల్లో మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిని కూడా త్వరలోనే భర్తీ చేసేందుకు బోర్డు నోటిఫికేషన్ ఇవ్వనుంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని 34 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పూర్తిస్థాయిలో బోధన సిబ్బందిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను భర్తీ చేయడం ద్వారా ఇప్పటికే విధుల్లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు
మిగతా 14వ పేజీలో ▶

కెరీర్‌కు బంగారు బాటగా ఇంజనీరింగ్‌ను పరిగణించే మన దేశంలో.. ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకోవడానికి దాదాపు రూ.10 -20 లక్షలు ఖర్చు చేయాలి. అంతేకాదు జీవితంలో విలువైన 4 సంవత్సరాలు వెచ్చించాలి. ఇంత వ్యయ ప్రయాసలకు ఓర్చి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా కొత్తగా ఉద్యోగంలో చేరితే చేతికి వచ్చే జీతం ఎంతో తెలుసా? సగటున గంటకు రూ.139-186 మాత్రమే. అదేదో చిన్నాచితకా కంపెనీల్లో వీరు ఉద్యోగం చేస్తున్నారా అంటే అదీ కాదు. అగ్రశ్రేణి ఐటీ కంపెనీల్లో! ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, డ్రైవర్ల వంటి నిపుణులైన కార్మికుల కంటే ఈ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు అందుకునే వేతనం తక్కువ. - సాక్షి, స్పెషల్ డెస్క్

యువ ఇంజనీరు.. జీతం బేజారు..



రికవరీకి 6-8 ఏళ్లు..

భారత్‌లో ఎంట్రీ-లెవల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల సగటు జీతం 2007-2010 కాలంలో సంవత్సరానికి దాదాపు రూ. 3.5 లక్షలుగా ఉండేది. అప్పటితో పోలిస్తే 2024లో ఆర్థికంగా చాలా మార్పులు వచ్చాయి. పెట్రోల్, డీజిల్ సహా అన్నింటి ధరలూ పెరిగాయి. కానీ, సాఫ్ట్‌వేర్ రంగంలో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో పనిచేస్తున్న చాలామంది ఫ్రెషర్ల వేతనాల్లో మాత్రం పెద్దగా మార్పు రాలేదు. అర్బన్ కంపెనీ, స్విగ్గీ, జొమాటో, ఊబర్, ఓలా వంటి ప్లాట్‌ఫామ్స్‌పై పనిచేస్తున్న కార్మికులైతే బీటెక్ గ్రాడ్యుయేట్ల కంటే రెండింతలకుపైగా ఆదాయం అందుకుంటున్నారని ఎడ్యుకేషనల్ ప్రొడక్ట్స్, సర్వీసెస్ కంపెనీ 'కెరీర్స్360' నివేదిక చెబుతోంది. ఇంజనీరింగ్ విద్యార్థులను ప్రోత్సహించాలంటే జీతాలు పెంచాల్సిన అవసరం ఉందని సూచించింది.

బీటెక్ చదువు ఖర్చు పెరిగింది..: రోజుకు 9 గంటల చొప్పున నెలలో 20 రోజుల పని దినాలకు.. అంటే నెలలో 180 గంటలు విధులు నిర్వర్తించారని భావిస్తే.. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, కాగ్నిజెంట్‌లో ఫ్రెషర్లు అందుకునే వేతనం కంపెనీని బట్టి గంటకు రూ. 139 నుంచి రూ. 186 మధ్య ఉంది. బీటెక్ డిగ్రీ దశాబ్దన్నర క్రితం రూ.1-2 లక్షల్లో పూర్తి అయ్యేది. ఇప్పుడు ఏకంగా దానికి పదిరెట్లకుపైనే ఖర్చు పెరిగింది. గ్రాడ్యుయేట్లు తమ నాలుగేళ్ల చదువు కోసం అధిక సమయం, కృషి, డబ్బును పెట్టుబడిగా పెడుతున్నారు. కానీ, చదువు పూర్తై పట్టా చేతికొచ్చాక.. కోటి ఆశలతో కొత్త ఉద్యోగంలో చేరితే జీతాలు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు.

బీటెక్ గ్రాడ్యుయేట్లకు ఐటీ కంపెనీల్లో చాలీచాలని జీతాలు

- వారికంటే ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్ల సంపాదన ఎక్కువ
- ఐటీ ఉద్యోగితో పోలిస్తే గంటకు రెట్టింపు ఆదాయం.. విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్‌లలో ఇదీ పరిస్థితి
- 'కెరీర్స్360' అధ్యయనంలో ఆశ్చర్యకర విషయాలు

అర్బన్ కంపెనీలో నైపుణ్యం కలిగిన కార్మికులు సగటున గంటకు రూ.311 సంపాదిస్తున్నారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్స్, టెక్నీషియన్స్, బ్యూటీషియన్స్, కార్పెంటర్లు, డ్రైవర్లు, మసాజ్ థెరపిస్ట్ వంటి నైపుణ్యం కలిగిన ఈ కార్మికులు నెలకు సగటున 160 గంటలు పనిచేస్తే.. పన్నులు, కమీషన్, మెటీరియల్ వ్యయాలు పోను నెలకు రూ. 49 వేలకుపైగా సంపాదిస్తున్నారు. ఇది కేవలం జీతాల పోలిక కాదని 'కెరీర్స్360' అంటోంది. 2010కి పూర్వం బీటెక్ విద్యార్థి తన డిగ్రీకి అయిన ఖర్చును తిరిగి రాబట్టుకోవడానికి రెండు మూడేళ్లు పట్టేది. ఇప్పుడు అది తగ్గాల్సింది పోయి పెరిగిపోయింది. ఏకంగా 5 ఏళ్లకుపైనే పడుతోంది. మరోవైపు గిగ్ ఎకానమీలోనూ ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ఈ రంగంలో నైపుణ్యం కలిగిన కార్మికులు ఉపాధి అవకాశాలను వేగంగా, తక్కువ అడ్డంకులతో సాధిస్తున్నారని 'కెరీర్స్ 360' చెబుతోంది.

కంపెనీ	ఉద్యోగం	నెల జీతం (రూపాయల్లో)	వార్షిక వేతనం (రూ.లక్షల్లో)	గంటకు ఆదాయం (రూపాయల్లో)
టీసీఎస్	అసోసియేట్ సిస్టమ్ ఇంజనీర్	28,072	3.36	156
ఇన్ఫోసిస్	సిస్టమ్ ఇంజనీర్ ట్రైనీ	30,000	3.60	167
కాగ్నిజెంట్	ప్రోగ్రామ్ అనలిస్ట్ ట్రైనీ	33,499	4.01	186
విప్రో	జూనియర్ మెంబర్	25,000	3.00	139

కంపెనీ	గంటకు ఆదాయం	నెలకు సంపాదన (రూపాయల్లో)
అర్బన్ కంపెనీ (స్కిల్డ్ ప్రొఫెషనల్)	311	49,719
స్విగ్గీ (డెలివరీ ఎగ్జిక్యూటివ్)	315	25,234
జొమాటో (డెలివరీ పార్ట్‌నర్)	350	28,000
ఊబర్ (డ్రైవర్)	331	29,732
ఓలా (డ్రైవర్)	367	33,000

ఆరోగ్య శాఖకు నెలకు రూ.536 కోట్లు కావాలి

డిప్యూటీ సీఎం భట్టిని కోరిన దామోదర



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరోగ్య శాఖ నిర్వహణకు ఆర్థిక శాఖ నుంచి నెలకు రూ.536.69 కోట్లు కావాలని ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. అత్యవసర సేవలు అందించే ఆరోగ్యశాఖలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆసుపత్రులకు నెలనెలా చెల్లించే మొత్తం మొదలుకొని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల వరకు, ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు అందించే మందుల నుంచి మెడికల్, నర్సింగ్ కళాశాలల అద్దెల వరకు కలిపి ప్రతి నెలా రూ.536.69 కోట్లు ఠంచనుగా విడుదల చేయాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. నిధుల విడుదలలో ఆలస్యమైన ప్రతిసారీ కొన్ని చెల్లింపులు నిలిచిపోతుండటంతో ఆ ప్రభావం వైద్య, ఆరోగ్య శాఖ పని తీరుపై పడుతోందన్నారు. ఈ మేరకు మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం డిప్యూటీ ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో కలసి తమ ఇబ్బందులను వివరించారు. తమ శాఖకు అవసరమయ్యే నెలవారీ చెల్లింపుల వివరాలను అందజేశారు. నిధులు అందకపోతే ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని తెలిపారు.

'ఉద్యోగులకు త్వరలోనే నూతన ఆరోగ్య పథకం'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ త్వరలోనే నూతన ఆరోగ్య పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సారథ్యంలో జేఏసీ నాయకులు రమేశ్ పాక, ఎం.రాధ, బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, తదితరులు మంత్రి దామోదరను కలిసి ఆరోగ్య పథకానికి సంబంధించి ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగికి క్యాష్ లెస్ ఆరోగ్య పథకాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్ ఖన్నా ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరడంతో అతడి కుటుంబం పడిన ఇబ్బందులను మంత్రికి లచ్చిరెడ్డి వివరించారు. రాష్ట్రంలోని ఏ ఉద్యోగికి కూడా రాజేశ్ లాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే నూతన ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలన్నారు. దీనిపై మంత్రి దామోదర స్పందిస్తూ ఉద్యోగులకు సరికొత్త ఆరోగ్య పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నామని, దీంతో ఏ ఒక్క ఉద్యోగి కూడా బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదని హామీ ఇచ్చారు. గతంలో జేఏసీ ఏ పథకం అమలు చేయాలని కోరిందో, దానినే అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు.

జూరాల సమీపంలో కృష్ణానదిపై మరో బ్రిడ్జి

రూ.100 కోట్ల నిధులు మంజూరు చేస్తాం

- బీఆర్ఎస్ పాలకులు ప్రాజెక్టులను గాలికి వదిలేశారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



జూరాల ప్రాజెక్టు డ్యామ్ గేట్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో వాకిటి శ్రీహరి, కృష్ణమోహన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

గద్వాల: జూరాల ప్రాజెక్టు మీదుగా భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రాజెక్టుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుకు సమీపంలో కృష్ణానదిపై కొత్త బ్రిడ్జిని నిర్మిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం రూ.100 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఈ రోజు (శనివారం) సాయంత్రమే జీవో విడుదల అవుతుందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటిస్తారని పేర్కొన్నారు. శనివారం ఆయన మరో మంత్రి వాకిటి శ్రీహరితో కలసి జూరాల ప్రాజెక్టు, దాని పరిధిలోని ఎత్తిపోతల జలాశయాలను పరిశీలించారు. ముందుగా నెట్టెంపాడులోని ర్యాలంపాడు జలాశయాన్ని సందర్శించి అక్కడి స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లుగా ర్యాలంపాడు జలాశయం ఆనకట్ట అడుగు భాగాన సీపేజ్ రూపంలో లీకేజీలు ఏర్పడ్డాయని, దీంతో జలాశయం నీటి నిల్వ సామర్థ్యాన్ని 4 టీఎంసీల నుంచి 2 టీఎంసీలకు తగ్గించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం ఆయన జూరాలకు చేరుకుని ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను పరిశీలించారు. తర్వాత గద్వాల జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ పాలకులు అధికారంలో ఉన్న పదేళ్లలో కమీషన్లకు కక్కుర్తి పడి పాత ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట వేల కోట్లను కమీషన్ రూపంలో కొల్లగొట్టి ఇప్పుడు మొసలికన్నీరు పెడుతున్నారని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్టుతో పాటు, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ వంటి పాత ప్రాజెక్టుల నిర్వాహణను పట్టించుకోలేదని అన్నారు. ఇప్పుడు జూరాలకు ఏదో జరిగిపోయిందని అసత్యపు ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి సిగ్గులేదా అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గడచిన పదేళ్లు మీరే అధికారంలో ఉన్న విషయాన్ని మర్చిపోతే ఎలా అంటూ చురకలంటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును సైతం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహ న్‌రెడ్డి, పర్ణికారెడ్డి, మేఘారెడ్డి, ప్లానింగ్ కమిషన్ వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి, నాయకులు సంపత్‌కుమార్, సరిత ఇరిగేషన్ శాఖ రాష్ట్ర అధికారులు శ్రీనివాస్, ప్రమీల, కలెక్టర్ బీఎం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లేఖ కలకలం

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ సీనియర్ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి.. అందుకు తానే కారణమని చెబుతూ రాజకీయాలకు దూరమయ్యారని చెప్పారు. ఇప్పుడు ఆయన వియ్యంకుడు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వచ్చి, ఆ కోపంతో తన సతీమణి, మంత్రి కొండా సురేఖపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించినట్లు తెలిసింది. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వేం నరేందర్‌రెడ్డి గతంలో కొండా సురేఖపై పోటీ చేస్తే 2 వేల ఓట్లు మాత్రమే వచ్చాయని, డీలిమిటేషన్‌లో ఆయన సీటు ఎగిరిపోయేందుకు కూడా తానే కారణమని నరేందర్‌రెడ్డి కోపం పెంచుకున్నారని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.

మా సాయం పొంది.. మాకే వ్యతిరేకంగా..

జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేల గురించి కూడా కొండా మురళి తన లేఖలో వివరించినట్లు తెలిసింది. వర్ధన్నపేటలో తమ ప్రభావం బలంగా ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో సత్సంబంధాలున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నుంచి గత ఎన్నికల్లో గండ్ర సత్యనారాయణకు మద్దతిచ్చామని, ఇప్పుడు ఆయన తమకు వ్యతిరేకంగా ఇతర నేతలతో కలిశారని ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. మంత్రి సీతక్కతో తమకు ఎలాంటి విభేదాలు లేవని మురళి తెలిపారు. మంత్రులు సురేఖ, సీతక్క మధ్య గ్యాప్ వచ్చిందని కడియం శ్రీహరి పెయిడ్ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల పూర్తిగా తమ నియోజకవర్గమేనని, అయినా ఎన్నికల సమయంలో రేవూరి అభ్యర్థన మేరకు మనస్ఫూర్తిగా సహకారం అందించినట్లు తెలిపారు. అయినా ప్రకాశ్‌రెడ్డి తమకు వ్యతిరేకంగా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డట్లు తెలిసింది. నాయిని రాజేందర్‌రెడ్డి (వరంగల్ వెస్ట్) కూడా ఎన్నికల సమయంలో తమ మద్దతు కోరారని, ఇప్పుడు తమ నియోజకవర్గంలోకి వచ్చి (వరంగల్ ఈస్ట్) ఎలక్ట్రిసిటీ అధికారులకు పోస్టింగులు ఇప్పించుకుంటున్నారని అభ్యంతరం తెలిపారు. తమ పరిధిలోనికి వచ్చే ఎంజీఎం ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. జనగామలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తమతో బాగానే ఉంటున్నారని వెల్లడించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి వచ్చి స్థానిక కాంగ్రెస్ ఇన్‌చార్జి ఇందిరకు చుక్కలు చూపిస్తున్నారని, కేడర్‌ను టార్చర్ చేస్తున్నారని ఆరోపించారు. పాలకుర్తిలో యశస్వినిరెడ్డి, డోర్నకల్ రాంచంద్రునాయక్‌లతో కూడా తమకు ఇబ్బంది లేదని మురళి తెలిపినట్లు సమాచారం. డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఇప్పటివరకు ఒక్క ఎన్నిక కూడా గెలవలేదని తెలిపారు. కాగా, తాము బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేటప్పుడు 26 మంది కార్పొరేటర్లు తమతో వచ్చారని, వరంగల్‌లో కొండా దంపతుల పవరేంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని కూడా ఆ లేఖలో మురళి పేర్కొన్నట్లు తెలిసింది. అయితే, ఆ లేఖ గురించి తనకు తెలియదని, బయట ఏం ప్రచారం జరుగుతుందో తన దృష్టికి రాలేదని క్రమశిక్షణ కమిటీ భేటీ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొండా మురళి వ్యాఖ్యానించడం కొసమెరుపు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి

20 నెలల్లో 12 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు

చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి బీఆర్ఎస్ మద్దతు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోబెల్స్‌ను మించిపోయి మాట్లాడుతున్నాడని, ఆ ఉద్యోగాలు ఎప్పుడిచ్చాడో శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లతో వచ్చిన ఉద్యోగాలను తానిచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం విద్యార్థులు, నిరుద్యోగులతో మాజీ మంత్రి హరీశ్‌రావు భేటీ అయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్, వివిధ జిల్లాల నుంచి నిరుద్యోగ యువత తరలివచ్చి నిరుద్యోగులు తలపెట్టిన 'చలో సెక్రటేరియట్' కార్యక్రమానికి మద్దతివ్వాలని కోరారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నాడు జాబ్ క్యాలెండర్ ప్రకటించిన ప్రభుత్వం వెంటనే సభలో చర్చ పెట్టకుండా వాయిదా వేసుకుని పారిపోయిందని విమర్శించారు. 20 నెలలు కావొస్తున్నా రేవంత్ ఇచ్చిన ఉద్యోగాలు 12 వేలు కూడా దాటలేదని హరీశ్‌రావు అన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే లక్షా 62వేల ఉద్యోగాలు

విద్యార్థులకు, నిరుద్యోగులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించి 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు వచ్చేలా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కృషి చేశారని అన్నారు. అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పింఛన్, రెండు లక్షల ఉద్యోగాలు, అమ్మాయిలకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్ దిక్కు లేకుండా పోయిందన్నారు. జీవో 29 రద్దుచేసి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నియామకాల్లో దగా చేశారని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చేదాకా రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'హలో నిరుద్యోగి, చలో సెక్రటేరియట్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉద్యోగాల భర్తీపై చర్చకు వస్తారా?: బల్మూరి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాల భర్తీపై తమతో చర్చకు రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు సవాల్ విసిరారు. తాము అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలెన్నో, 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ భర్తీ చేసిన ఉద్యోగాలెన్నో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం ఇస్తానని కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని ఆధారాలతో సహా చూపించారు. ఏ నియామకాల కోసమైతే నిరుద్యోగులు పోరాటం చేశారో వారిని మోసం చేసిన నీచ చరిత్ర బీఆర్ఎస్‌దని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో 58,868 ఉద్యోగాలను భర్తీ చేశామని బల్మూరి చెప్పారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ మాట్లాడుతూ.. పదేళ్లు పాలించి ఉద్యోగాలివ్వకుండా మోసం చేసినందుకు హరీశ్‌రావు ముందు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నన్ను రెచ్చగొట్టకండి

బీసీ నేతలను గౌరవించడం నేర్చుకోండి

- క్రమశిక్షణ కమిటీకి ఏం చెప్పాలో చెప్పేశాను
- విలేకరుల సమావేశంలో కొండా మురళి
- నేను పిలిస్తేనే కొండా మురళి వచ్చారు
- చిట్‌చాట్‌లో మల్లురవి వెల్లడి



గాంధీభవన్‌లో మల్లు రవితో భేటీ అయిన కొండా మురళి

సాక్షి, హైదరాబాద్: తనను దయచేసి రెచ్చగొట్టవద్దని వరంగల్ కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆ జిల్లా నాయకులను కోరారు. బీసీ నాయకులను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీని కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను చెప్పాల్సింది కమిటీకి చెప్పానని, తనను ఎవరూ ఎలాంటి ప్రశ్నలు అడగలేదని చెప్పారు. 'కాంగ్రెస్ పార్టీ అంటే నాకు అపార గౌరవం ఉంది. పార్టీ పెద్దలంటే కూడా గౌరవం ఉంది. రేవంత్‌రెడ్డి పది కాలాలపాటు సీఎంగా ఉండాలి. బీసీ నేత మహేశ్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నందుకు నాకు సంతోషంగా ఉంది. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలనే తపనతో పనిచేస్తున్నా. సోనియాగాంధీపై అపార గౌరవం ఉంది. వరంగల్ పార్టీ నేతలను ఉద్దేశించి నేను బహిరంగంగా చేసిన కామెంట్లు మంచివో చెడ్డవో నా అంతరాత్మకు తెలుసు. నేను బలహీనుడిని కాదు. నా బలమేంటో ప్రజలకు తెలుసు. నేను బలహీనుడినైతే ఇంతమంది నా దగ్గరకు ఎందుకు వస్తారు? చావుకు కూడా భయపడే వ్యక్తిని కాదు. ఇప్పటికీ నా శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నాయి. ఎవరికీ భయపడేది లేదు. పార్టీ మారే ముందు నేను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వచ్చాను. కడియం శ్రీహరి కూడా రాజీనామా చేస్తారా లేదా? అన్నది ఆయన ఇష్టం. క్రమశిక్షణ కమిటీ ముందు నేను మంత్రి పొంగులేటి గురించి ఏమీ చెప్పలేదు. గాంధీభవన్‌కు రావడం ఇది మూడోసారి మాత్రమే. ఇక్కడికి రాగానే దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరన్న గుర్తుకు వచ్చారు. ఆయన కోసం త్యాగం చేసిన కుటుంబం మాది. కాంగ్రెస్ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటా'అని కొండా మురళి స్పష్టం చేశారు.

నేనే పిలిచా: మల్లురవి

కొండా మురళిని తానే పిలిపించినట్లు పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. మురళితో భేటీ అనంతరం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'నేను ఫోన్ చేసి పిలిస్తే మురళి గాంధీభవన్‌కు వచ్చారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై లేఖ ఇచ్చారు. అయితే మురళి, సురేఖపై వరంగల్ నేతలు ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను వివరిస్తూ మురళికి నోటీసు ఇచ్చాం. అందులోని అంశాలకు లిఖితపూర్వకంగా వచ్చే నెల ఐదో తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరింది. ఆదిలాబాద్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని ఫిర్యాదులపై కూడా కమిటీ చర్చించింది. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం'అని వివరించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నేడు నోటిఫికేషన్

- సోమవారం నామినేషన్ల స్వీకరణ... జూలై 1న ఎన్నిక
- రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రాంచందర్‌రావు
- బీసీ వర్గానికే అధ్యక్ష పదవి కట్టబెట్టే యోచనలో అధిష్టానం



సాక్షి, హైదరాబాద్: ఎంతోకాలంగా వాయిదా పడుతూ వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. అధ్యక్ష ఎన్నికలకు ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ఆదివారం నోటిఫికేషన్ జారీచేసి, ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జూలై ఒకటో తేదీన అధ్యక్ష ఎన్నిక నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఎన్నికల కమిటీలో కీలకంగా వ్యవహరిస్తున్న రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ సైతం ఎన్నికల షెడ్యూల్‌ను ధ్రువీకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించిన జి.కిషన్‌రెడ్డి పదవీ కాలం ఇటీవల ముగిసింది. తాజాగా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ ఖరారు కావడంతో ఆశావహుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఈ ఎన్నిక కోసం ఓటర్ల జాబితాను పార్టీ ఎన్నికల బృందం సిద్ధం చేస్తోంది. జాతీయ కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాలను సైతం స్వీకరిస్తోంది.

బీసీకే పట్టం: ఈసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీ నేతను వరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోటీలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చినా, తాను రేసులో లేనని ఆయన ప్రకటించారు. కాగా, రాష్ట్ర పార్టీలో కొత్త, పాత నాయకుల మధ్య విభేదాలు ఇప్పటికే భారీగా ఉన్నాయి. ఈ ఎన్నికపై కార్యకర్తలు, ముఖ్య నేతల అభిప్రాయాలు సైతం తీసుకుంటామని కె.లక్ష్మణ్ మీడియాతో చెప్పారు.

683 మంది ఫోన్లు అక్రమంగా ట్యాప్

- తాజాగా గుర్తించిన సిట్ అధికారులు
- ఎమ్మెల్సీ కవిత పీఏకు నోటీసులు

బంజారాహిల్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలలో ఎస్ఐబీ కేంద్రంగా మొత్తం 683 మంది ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు తేల్చారు. ఈ కేసులో కీలక నిందితులైన ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావును కొద్దిరోజులుగా విచారిస్తున్న సిట్ అధికారులు.. మరిన్ని కీలక ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. ప్రణీత్‌రావు ఫోన్‌లో పలు రికార్డులు కూడా బయటపడ్డాయి. ఈ కేసులో తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పీఏకు సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ఇప్పటికే ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి లాంటి ప్రముఖుల వాంగ్మూలాలను సిట్ నమోదుచేసింది. మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితోపాటు సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు గుర్తించారు. మొత్తం 683 మంది ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా 2022లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై కూడా సిట్ ఫోకస్ పెట్టింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే నాడు ఆ కాల్స్‌ను రికార్డు చేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రేగా కాంతారావు, పైలట్ రోహిత్‌రెడ్డిని ప్రలోభాలకు గురిచేసిన ఘటనకు సంబంధించిన ఆ కేసులో నాటి సీఎం కేసీఆర్ మీడియాకు విడుదల చేసిన ఆడియో రికార్డులు ఎక్కడి నుంచి వచ్చాయనే అంశాన్ని తేల్చేందుకు సిట్ సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు?

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్న



మాట్లాడుతున్న కవిత

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ పసుపు బోర్డును ఇదివరకే రెండుసార్లు ప్రారంభించారని.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పుడు మూడోసారి ప్రారంభించేందుకు వస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, యాకుత్‌పురా నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు, యువకులు శనివారం కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, 'పసుపు బోర్డుకు పదేపదే ప్రారంభోత్సవాలు చేయడం కాదు.. ఎన్డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించాలి'అన్నారు. పసుపు బోర్డుకు ఇదివరకే ప్రారంభోత్సవాలు చేసిన సంగతి ఎంపీ అర్వింద్, కేంద్ర హోంమంత్రికి చెప్పకపోవచ్చని అన్నారు. నిజామాబాద్‌లోనే పసుపునకు క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించి వెళ్లాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటోన్న సమస్యలను తెలంగాణ జాగృతి నుంచి లేవనెత్తుతుంటే కాంగ్రెస్ పార్టీ ఉలిక్కిపడుతోందని అన్నారు. మహిళల గురించి జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలే కాంగ్రెస్ పార్టీ విధానమా అని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ప్రశ్నించారు.

తెలంగాణ జాగృతితో కలిసి పనిచేస్తాం..

తెలంగాణ జాగృతితో సీపీఐ సాంస్కృతిక విభాగం యువ కళావాహిని కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని కేరళకు చెందిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సందోష్ కుమార్ తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఆమెతో సందోష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.





విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచండి

నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేయాలి

- ప్రాజెక్టుల పర్యవేక్షణకు డ్యాష్ బోర్డు
- సింగరేణిపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థ చేపట్టనున్న 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్, 500 మెగా వాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. కాల పరిమితి విధించుకొని సత్వరమే ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు. శనివారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో సింగరేణి సంస్థ చేపట్టనున్న పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..ం సింగరేణి సంస్థ లోయర్ మానేరు రిజర్వాయర్‌పై నిర్మించనున్న 300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, మల్లన్నసాగర్‌పై నిర్మించతలపెట్టిన 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లకు ఇరిగేషన్ శాఖ అనుమతుల కోసం లేఖలు రాయాలని ఆదేశించారు. సింగరేణి సంస్థ ఐదు జిల్లాలలో ఏర్పాటు చేయనున్న 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డీపీఆర్‌లను వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. రామగుండం-1 ఏరియాలో మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని నీటిసంపు ఆధారంగా నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రాజస్తాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆ రాష్ట్రంలోని సోలార్ వ్యాలీలో త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏర్పాటుచేసే 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుపైనా కూలంకశంగా చర్చించారు. వీటితోపాటు సింగరేణి ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజీ సిస్టం వంటి ఇతర పనులపైనా భట్టి సమీక్షించారు. ఇంధన శాఖలోని అన్ని విభాగాల పనితీరును, చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుగా డాష్ బోర్డును రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్, తెలంగాణ రెడ్కో వైస్ చైర్మన్ అనీలా, సింగరేణి ఉన్నతాధికారులు ఎస్.డి.ఎం సుభానీ, చిరంజీవులు, జానకిరామ్, శ్రీనివాసులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో నవీన్ మిత్తల్, బలరామ్ తదితరులు

సింగరేణి ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సింగరేణి ఉద్యోగి కుటుంబానికి రూ.1.2 కోట్ల ప్రమాద బీమా చెక్కు అందజేత

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లో అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఓ కార్మికుడి కుటుంబానికి రూ.1.2 కోట్ల బీమా సొమ్ము చెక్కును శనివారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రామగుండం-1 ఏరియాకు చెందిన సపోర్టు మెన్ పెండ్రి రంజిత్ కుమార్ భార్య లతకు అందజేశారు. సింగరేణి కార్మికుడు పెండ్రి రంజిత్ కుమార్‌కు ఎస్‌బీఐలో వేతన ఖాతా ఉంది. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి నామినీగా ఉన్న భార్య లతకు రూ.1.2 కోట్ల ప్రమాద బీమా కింద అందించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, రెడ్కో వైస్ చైర్మన్, ఎండీ అనీలా, ఎస్‌బీఐ డీజీఎం నీలాక్షి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఫార్ములా' కేసులో ఇక అర్వింద్‌కుమార్ వంతు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ-కారు రేసు కేసులో రెండో దఫా విచారణ మరింత ముమ్మరం కానుంది. ఇప్పటికే ఈనెల 16న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు 8 గంటలకు పైగా విచారించారు. దర్యాప్తులో భాగంగా ఈ కేసులో ఏ-2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను సైతం మరోసారి ప్రశ్నించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ మేరకు ఆయనకు జూలై మొదటి వారంలో నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్టు ఏసీబీ వర్గాల ద్వారా తెలిసింది. అయితే, వ్యక్తిగత కారణాలతో విదేశాలకు వెళ్లిన అర్వింద్‌కుమార్ ఈనెల 2 నుంచి 30 వరకు సెలవు పెట్టారు. దీంతో విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆయనకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ ఏడాది జనవరి 8న అర్వింద్‌కుమార్‌ను తొలిసారి ప్రశ్నించిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా మరోసారి అర్వింద్‌కుమార్ స్టేట్‌మెంట్‌ను నమోదు చేసే అవకాశం ఉంది.

వీ-గార్డ్ స్టైలిష్ లక్షిక్యూబ్ వాటర్ హీటర్ సిరీస్ లాంచ్

సాక్షి, హైదరాబాద్: భారత్‌లోని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌లో అగ్రగామి బ్రాండ్ అయిన వీ-గార్డ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తన ప్రీమియం లక్షిక్యూబ్ వాటర్ హీటర్ సిరీస్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. అత్యాధునిక సాంకేతికతతో దీన్ని డిజైన్ చేశామంది. ఇందులో లక్షిక్యూబ్, లక్షిక్యూబ్ డీజీ, లక్షిక్యూబ్ స్మార్ట్ అనే మూడు విలక్షణమైన మోడళ్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది. సిక్కింలోని వీ-గార్డ్ అత్యాధునిక సౌకర్యాలతో తయారు చేసిన ఈ సిరీస్‌లో అధునాతన థర్మోక్లైన్ టెక్నాలజీని ఉపయోగించినట్లు పేర్కొంది. ఈ సిరీస్‌లో లక్షిక్యూబ్ స్మార్ట్ ముందంజలో ఉందని తెలిపింది.



వంకరగానున్న దానిని చక్కపరచ శక్యముకాదు,
లోపము గలది లెక్కకు రాదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** శు.చవితి ప.11.50 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.9.39 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.9.58 నుండి 11.36 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.46 నుండి 5.38 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.01 నుండి 9.36 వరకు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం : 6.34
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నవీన్ పట్నాయక్ (మాజీ సీఎం)

రాయని డైరీ


మాధవ్ శింగరాజు

కొన్ని మాటల్ని మళ్లీ తలచుకున్నప్పుడు, సందర్భం మారి – అవి పట్టలేనంత నవ్వును తెప్పిస్తాయి!

"నా ఒంట్లోని ప్రతి ఎముకా సెక్యులర్ ఎముక. ఆ సెక్యులర్ ఎముకల్లో ఒక్కటైనా దెబ్బతిని ఉంటుందని నేను అనుకోను" – అని నేను ఎప్పుడూ అంటుండే మాటను... ఇప్పుడీ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి బెడ్డుపై పడుకుని ఉండగా అనుకోటానికి లేకుండా పోయింది. వైద్యులు నా సెక్యులర్ వెన్నెముకకు శస్త్ర చికిత్స చేశారు మరి.

"పట్నాయక్ జీ! మీక్కొంచెం హుషారు రాగానే ఇవాళ గానీ, రేపు గానీ మీరు డిశ్చార్జ్ కావచ్చు..." అన్నారు డాక్టర్ రమాకాంత పాండా, నేనున్న గదిలోకి వచ్చి.

డాక్టర్ పాండా నాకు చికిత్స చేస్తున్న వైద్యుడు కారు. నన్నిక్కడ కనిపెట్టుకుని ఉండవలసిన వైద్యుల బృందానికి చీఫ్‌గా వచ్చిన వారు. అసలైతే ఆయన అరేబియా సముద్రానికి ఆవలా ఈవలా కూడా కార్డియాలజిస్టు. ముంబైలోని ఆసియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్.



సరిగ్గా వారం, నాకు సర్జరీ జరిగి! సర్వికల్ ఆర్థరైటిస్ అన్నారు డాక్టర్లు. మొదట మెడ నొప్పి మొదలైంది. అక్కడి నుంచి భుజాలు, చేతులు, తల. ఆ తలనొప్పి భరించలేనంతగా ఉంటుండేది.

"చిన్న సర్జరీతో మీకు ఈ నొప్పులన్నీ తగ్గిపోతాయి పట్నాయక్ సర్..." అన్నారు డాక్టర్ రాజశేఖరన్. ఆయనే నాకు సర్జరీ చేసిన వైద్యుడు. కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రి నుంచి రప్పించారు.

"మీ సర్జరీకి నాలుగు గంటల సమయం పట్టింది సర్..." అని – నేను కళ్లు తెరవగానే ఒక యువ డాక్టర్ వచ్చి చెప్పాడు. ఆ యువకుడు నా కోసం ఏర్పాటైన డాక్టర్ పాండా టీమ్‌లోని సభ్యుడు.

"అవునా?!" అన్నాను, నిస్సత్తువ కనిపించకుండా నవ్వుతూ చూస్తూ.

"అవును సర్, ఇంకొక విషయం కూడా ఉంది. లోపల మీకు సర్జరీ జరుగుతున్నంత సేపూ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి ముంబైలో ఉన్నట్లు లేదు. భువనేశ్వర్‌లో ఉన్నట్లుంది" అన్నాడు నవ్వేస్తూ.

ఆసుపత్రి బయటంతా నా కోసం ఒడిశా నుంచి వచ్చిన వారే ఉన్నారని చెప్పటం అది.

ఆ మాటతో నా నిస్సత్తువ కాస్త తగ్గింది.

వయసులో ఉన్నవారు రుతుపవనాల్లా వచ్చి, పరిసరాల్లోని 'వృద్ధ' వాతావరణాన్ని అప్పటికప్పుడు ఉల్లాసంగా మార్చేసి వెళతారు.

ఐసీయూ నుంచి నన్ను షిఫ్ట్ చేశాక, మళ్లీ కనిపించాడు ఆ యువ డాక్టర్.

"పట్నాయక్ సర్! ఉదయం నుంచీ నేను, నా... కో–డాక్టర్ మిస్ విభ మీ కోసం చూస్తూ ఉన్నాం..." అన్నాడు!

'ఎందుకు?' అన్నట్లు చూశాను.

"తను మీతో ఒక సెల్ఫీ కావాలని అడుగుతుంటే, 'సరే ఇప్పిస్తాలే. నువ్విక్కడే ఉండు' అని తనను బయటే నిలబెట్టి నేను లోపలికి వచ్చాను..." అన్నాడు.

హాయిగా నవ్వాన్నేను.

పిల్లలు పనిగట్టుకుని మన మనసుకు నచ్చినట్లుగా మాట్లాడాలని చూడరు. అసలు వాళ్లు మాట్లాడటమే మన మనసుకు నచ్చినట్లుగా ఉంటుంది.

వాళ్లు అలా మాట్లాడుతూనే ఉన్నారు... "పట్నాయక్‌జీకి శ్రీ మోదీ నుంచి ఫోన్..." అని చెప్పి డాక్టర్ పాండా ఆ యువ డాక్టర్లిద్దర్నీ నా రూమ్ నుంచి బయటికి పిలిపించుకున్నారు.

మోదీజీ లైన్‌లోకి వచ్చారు. "నమస్తే మోదీజీ..." అన్నాను.

"ఎలా ఉన్నారు నవీన్‌జీ..." అని ఫోన్‌లోనే రెండు నిమిషాల పాటు ఆయన నన్ను తన హృదయానికి గట్టిగా హత్తుకున్నారు.

మునుపెన్నడూ ఫోన్‌లో ఆయన నన్నలా హత్తుకుని మాట్లాడినట్లుగా నాకు అనిపించ లేదు.

బహుశా అప్పటివరకు నా గదిలో చల్లటి మాటలను వీచి వెళ్లిన ఆ రెండు యువ పవనాల మహత్యం అనుకుంటాను!!

మనుగడ కోసం 'మహా' కుట్ర!

జనతంత్రం

వర్ధెల్లి మురళి



సుభద్రాదేవి గర్భంతో ఉన్న సమయంలో ఒకసారి అర్జునుడు ఆమెకు యుద్ధరంగంలో పద్మవ్యూహానికి సంబంధించిన జ్ఞానాన్ని బోధిస్తున్నాడట! ఆమె నిద్రలోకి జారుకోవడాన్ని గమనించకుండా అర్జునుడు చెప్పడం కొనసాగిస్తుండగా గర్భస్థ శిశువైన అభిమన్యుడు ఊ... కొడుతూ వింటున్నాడట! పద్మవ్యూహంలో ఎలా ప్రవేశించాలనే ఉపదేశాన్ని పూర్తిచేసి, ఎలా నిర్గమించాలనే కథను అర్జునుడు ప్రారంభిస్తాడు. అదే సమయంలో కృష్ణపరమాత్ముడు ప్రత్యక్షమై సుభద్ర నిద్రపోతున్నది... ఇక చాల్లే అని ఆపించాడట! ఆ రకంగా అభిమన్యుడు పద్మవ్యూహ ప్రవేశాన్ని గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడే క్షుణ్ణంగా నేర్చుకోగలిగాడు. భారత రామాయణాది ఇతిహాసాలు, పురాణాలు మన సంస్కృతిలో భాగం కనుక, వాటికి సంబంధించిన కథలన్నీ నమ్మాలనే కట్టుబాటు ఉన్నది కనుక ఈ కథను కూడా మనం నమ్ముతాము.

ఈ కాలంలో కూడా అంతకు మించిన వండర్ టెలీపతీ ఉన్నదనే సంగతి నిన్ననే తెలిసింది. 'ఏపీ పోలీస్–హ్యాకథాన్–25' అనే పేరుతో నిన్న గుంటూరులో ఒక టెక్నాలజీ సదస్సు జరిగింది. సందర్భం ఏదైనా సరే, టెక్నాలజీకి ఆది మధ్యాంతాలు తానేనని చెప్పుకోవడం చంద్రబాబు ఆనవాయితీ. అదే ఒరవడిని ఇక్కడ కూడా కొనసాగించారు. దేశంలో ఆటోలు, మోటార్ బైక్‌ల ఊబరైజేషన్ కోసం రూపొందించిన 'ర్యాపిడో' వృత్తాంతాన్ని ఆయన సభికులకు వివరించారు. ఆ యాప్‌ను రూపొందించిన వ్యక్తి తండ్రి గతంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉండేవారట! అందువల్ల బాబు దగ్గరికి వస్తూపోతూ ఆయన చెప్పే సంగతులన్నీ వినేవారట. అలా విన్న ఫలితమే ఆయన కుమారుడు ర్యాపిడో యాప్‌ను డెవలప్ చేయడానికి కారణమైందట! చంద్రబాబు చేసిన జ్ఞానబోధ తండ్రి తలలోంచి తరంగయానం చేసి కుమారుడి మేధను తేజోమయం చేసిందన్నమాట!

ఇటువంటి విడ్డూరాలను శషభిషలేమీ లేకుండా చెప్పుకోవడం చంద్రబాబుకు పరిపాటే! భారతదేశానికి ఐటీని పరిచయం చేసిందీ, సెల్‌ఫోన్ తీసుకొచ్చిందీ తానేనని చెప్పుకోవడం చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఎవరూ మరిచిపోకుండా ఉండడానికి ఆయన మళ్ళీ మళ్ళీ గుర్తుచేస్తూనే ఉంటారు. కలామ్‌ను రాష్ట్రపతిని చేసిందీ, వాజ్‌పేయికి జ్ఞానోదయం కలిగించి 'స్వర్ణ చతుర్భుజి' పథకానికి శ్రీకారం చుట్టించిందీ తానేనని కూడా ఆయన చెప్పుకున్నారు. సత్య నాదెళ్ల, పీవీ సింధు విజయాల వెనుక తన పాత్ర, కోవిడ్‌కు వ్యాక్సిన్ కనిపెట్టడం వెనుక తన దూరదృష్టి వగైరాల గురించి పలు సందర్భాల్లో ఆయన నొక్కి వక్కాణించారు. ఇటువంటి వాగాడంబరాన్ని చూసి చాలామంది చాలారకాల అనుమానాలు వ్యక్తం చేస్తుంటారు. ఎటువంటి అనుమానమూ అవసరం లేదు. ఆయన పూర్తి స్వస్థతతోనే ఇలా మాట్లాడుతుంటారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన ఈ హాస్యరసాన్ని పండిస్తుంటారు.

ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమైపోతుందనే గోబెల్స్ సూత్రాన్ని ఆయన తన పొలిటికల్ ఫిలాసఫీకి పునాదిగా భావిస్తారు. తాను వందసార్లు చెబితే వెయ్యిసార్లు రీసౌండ్ ఇచ్చేందుకు యెల్లోమీడియా ఉండనే ఉన్నది. ఈ సూత్రాన్ని ప్రత్యర్థులను అప్రతిష్ఠ పాల్జేయడానికీ, తనను ప్రమోట్ చేసుకోవడానికీ రెండు వైపులా పదునున్న కత్తిలా ఆయన వాడుతుంటారు. ఇప్పుడీ కత్తిని దూయడం బాగా ఎక్కువైంది. తనకిప్పుడు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న అఖండ ప్రజాదరణ ఆయనకు కలవరం కలిగిస్తున్నది. ఇంచుమించు తన రాజకీయ అనుభవంతో సమానమైన వయసున్న జగన్ మాస్ ఇమేజ్ ఎన్ని జన్మలెత్తితే తనకు లభించాలి? లభించదు! అందుకే ఆయనపై దాడి. ఆయన వ్యక్తిత్వంపై కనీవినీ ఎరుగని దాడి. కోడికత్తి, తల్లీ – చెల్లీ, బాబాయ్–గొడ్డలి అనే పసలేని పదబంధాలతో అరిగిపోయిన రికార్డుల్నే ఆశ్రయిస్తూ చేస్తున్న అనైతిక దాడి. మద్య నియంత్రణ కోసం జగన్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఒక మంచి పాలసీకి సైతం అవినీతి మరక అంటించేందుకు ఆపసోపాలు పడుతూ చేస్తున్న అసహ్యకరమైన దాడి.

ఏడాది గడిచిపోయింది. జగన్ వ్యక్తిత్వ హననం కోసం ఎక్కుపెట్టిన దాడులు, ఆయన పార్టీ శ్రేణుల్ని చెల్లాచెదురు చేయడానికి పెడుతున్న కేసులు, చేస్తున్న అరెస్టులు ఫలితమిస్తున్న సూచనలేవీ కనిపించడం లేదు. పైపెచ్చు ఎదురుదాడి మొదలైంది. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక గళం వీధివీధినా ప్రతిధ్వనిస్తున్నది. ఇక వ్యక్తిత్వ హనన కార్యక్రమమొక్కటే సరిపోదని, ఇంకేదో పెద్ద దాడే జరపాలని భావిస్తున్నట్టు పలువురు అనుమానిస్తున్నారు. జగన్‌పై ఏదో దారుణమైన కుట్ర జరుగుతున్నదని రాష్ట్ర ప్రజలు బహిరంగంగానే శంకిస్తున్నారు. ఈ అనుమానాలను నిజం చేస్తూ జగన్‌ను ఉద్దేశించి 'ఆ భూతం తిరిగి రాదు, భూస్థాపితం చేస్తాన'ని ముఖ్యమంత్రి చెబుతున్నారు. టీవీ ఇంటర్వ్యూల్లో చెబుతున్నారు. పెట్టుబడిదారులతో జరిగే సమావేశాల్లో చెబుతున్నారు. పోలీసు అధికారుల సమావేశాల్లోనూ అదే రాజకీయ ఉపన్యాసం. కలెక్టర్ల మీటింగ్‌లోనూ అదే తరహా సంస్కారహీనమైన ప్రసంగం.

'జగన్ మళ్లీ వస్తే ఎలా' అని పెట్టుబడులు పెట్టేవాళ్ళు ఎప్పుడు ప్రశ్నించారో తెలియదు. జగన్ హయాంలో పారిపోయిన కంపెనీలేమిటో చెప్పరు. కూటమి వచ్చాక రూపాయికి ఎకరం ఇస్తామంటే తప్ప పరుగెత్తుకొచ్చిన ఇతర కంపెనీలేమిటో చెప్పరు. నిజానికి వాస్తవాలను పరిశీలిస్తే పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. కూటమి నేతల కప్పం డిమాండ్లకు బెదిరి 'ఇండియా సిమెంట్స్' కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. చెట్టినాడు, భవ్య సిమెంట్‌లు లంచాలివ్వలేక లాకౌట్‌లు ప్రకటించాయి. నవీన్ జిందాల్‌పై తప్పుడు కేసు పెట్టి వేధిస్తే జెఎస్‌డబ్ల్యు కంపెనీ రాష్ట్రాన్ని వదిలేసి మహారాష్ట్రలో 3 లక్షల కోట్లు పెట్టుబడి పెడుతున్నది. మామూళ్ళ కోసం కూటమి నేతలు యూబీ కంపెనీ లారీలను అడ్డుకున్న ఖ్యాతి ఢిల్లీ సర్కార్‌ను కూడా తాకింది. గ్రీన్‌టెక్ రీమిక్స్‌లో, కోకాకోలా ప్లాంట్‌లో స్థానిక ఎమ్మెల్యేలు లంచాలు డిమాండ్ చేసి రచ్చకెక్కారు. రామాయపట్నం పోర్టు పనుల్లో వాటా కోసం ఎమ్మెల్యే లారీలను అడ్డుకొని గబ్బు లేపాడు. కూటమి పాలనలో ఇటువంటి ఘటనలను డజన్లకొద్దీ ఉదాహరించవచ్చు.

ఇక రూపాయికి ఎకరం కోటా పెట్టుబడిదారులను మినహాయించి కూటమి సర్కార్ తెచ్చిన పెట్టుబడులు ఏమున్నాయి? ఎన్టీపీసీ వాళ్ళు గ్రీన్ ఎనర్జీ కోసం లక్ష కోట్ల పెట్టుబడి పెట్టేందుకు జగన్ హయాంలోనే ఒప్పందం కుదిరింది. దానికి సంబంధించిన పరిపాలనా అనుమతులు, భూ బదలాయింపులు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడు దాన్ని చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారు. జగన్ హయాంలో ఒక్క గ్రీన్ ఎనర్జీ రంగంలోనే పది లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. 'అవి మా ఘనతే'నని ఇప్పుడు కూటమి సర్కార్ ప్రకటించుకుంటున్నది. జగన్‌మోహన్‌రెడ్డి దావోస్‌లో ఆదిత్య మిట్టల్‌తో సమావేశమై స్టీల్ ప్లాంట్ స్థాపనకు ఒప్పందం చేసుకుంటే అది కూడా బాబు తన జేబులో వేసుకున్నారు. నిజం చెప్పాలంటే ఏపీలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం పారిశ్రామికవేత్తలను భయకంపితులను చేస్తున్నది. రాష్ట్రానికి రావడానికి వారు నిరాకరిస్తున్నారు. కాని, జగన్‌కు భయపడి పరిశ్రమలు వెళ్ళిపోయాయనే తప్పుడు ప్రచారాన్ని మాత్రం కూటమి నేతలు హోరెత్తిస్తున్నారు. యెల్లో మీడియా గగ్గోలు పెడుతున్నది.

జగన్‌ను భూస్థాపితం చేస్తానని చంద్రబాబు ఒకటికి రెండుసార్లు అనగానే, ఓ వృద్ధ నేత జగన్ తల నరుకుతానంటూ బీపీ పెంచుకుంటాడు. ఒకరి తర్వాత ఒకరు చొప్పున కూటమి నేతలు ఇటువంటి ప్రకటనలే చేస్తారు. జగన్‌మోహన్‌రెడ్డి జనంలోకి వెళ్తున్నప్పుడు ఆయనకు ఇవ్వాల్సిన జడ్ ప్లస్ కేటగిరీ భద్రతను నిరాకరించడం ద్వారా కూటమి సర్కార్ తన ఉద్దేశాన్ని బయటపెట్టుకుంటున్నది. ఆయనొక విశేష ప్రజాదరణ కలిగిన మాస్ లీడర్. ఆయన బయటకు వెళ్ళినప్పుడు ప్రజలు ఏ స్థాయిలో ఆయన వెంట నడుస్తా రన్నది అనేకమార్లు రుజువైంది. పోలీసులకు ప్రత్యేకంగా చెప్ప వలసిన పని లేదు. రాప్తాడు హెలిప్యాడ్‌ను అసంఖ్యాక జన సమూహం చుట్టుముట్టిన విజువల్స్‌ను టీవీల్లో చూడలేదా? ఆయన రోడ్డు ప్రయాణాల్లో వాహనాన్ని చుట్టుముట్టి కారు బానెట్‌పైకి కూడా ఎగబాకడం కనిపించలేదా? ఆయనకు ఇవ్వాల్సిన భద్రత ఇవ్వకపోతే ఆయనంటే గిట్టని శక్తులు సమూహంలో చొరబడి ఆయన సమీపానికి చేరుకునే అవకాశం లేదా? అటువంటిదేదో జరగాలనే ఉద్దేశం లేకపోతే ఆయన భద్రతను ఎట్లా ఉపేక్షిస్తారు? ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, కుట్రపూరిత నిర్లక్ష్యం!

ఈ వ్యవహారంపై పోలీసులు చెబుతున్న కహానీ చిత్రంగా ఉన్నది. మేము వందమందికి మాత్రమే అనుమతిచ్చాము, కానీ వాళ్ళు వేలాదిమంది వెళ్లారని పోలీసుల అభియోగం. ప్రజలు వేలాదిగా తరలిరావాలని జగన్‌మోహన్‌రెడ్డి గానీ, ఆయన పార్టీ వాళ్ళు గానీ దండోరా వేయలేదే? వార్త తెలిసిన ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వాళ్ళను అడ్డుకోవడానికి రెంటపాళ్ల చుట్టూ ఇరవై చెక్‌పోస్టులు పెట్టి పోలీసుల్ని మోహరించారు కదా! నియంత్రించగలిగారా? రోడ్డు మీద అడ్డుకుంటే చేలల్లోంచి, చెలకల్లోంచి, వంకల్లోంచి, డొంకల్లోంచి తండోపతండాలుగా జనం చేరుకోలేదా? చెక్‌పోస్టుల్లో మోహరించిన పోలీసు సైన్యాన్ని జగన్ భద్రత కోసం కేటాయిస్తే అవాంఛనీయ సంఘటనలేమీ జరగవు కదా! అవాంఛనీయ ఘటనలు జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమైనపుడు, అందుకోసమే కుట్ర చేస్తున్నప్పుడు ఈవిధంగా ఆలోచించడం కూడా కుదరని పని.

ఈ కార్యక్రమంలో ఒక వైసీపీ అభిమాని దురదృష్టకర మరణాన్ని కూడా కుట్రపూరిత కథకు ఉపయోగించుకోవడం రోత పుట్టించే చర్య. మరో కారు కింద పడి గాయాలైన సింగయ్య మృతి చెందాడని ప్రకటించిన ఎస్పీ, మూడు రోజుల తర్వాత ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ప్లేటు మార్చిన వైనాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారు. ఒక ఫేక్ వీడియోను సృష్టించి జగన్ ప్రయాణించే కారు కిందనే పడి సింగయ్య మరణించాడనే కథను ప్రచారం చేశారు. మూడు నాలుగు రోజుల పాటు యెల్లో మీడియా దీనిపై వీరంగం వేసింది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమికి ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ లోకల్ నాయకురాలు మాత్రం కూటమి తానా అంటే తందానా అనే స్థాయికి దిగజారిపోయారు. సింగయ్య మరణంపై ఎస్పీ ముందుగా చెప్పిన ప్రకారం నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌కు వర్తించే సెక్షన్లపై కేసులు పెట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి కారును రంగంలోకి దించిన తర్వాత ఉద్దేశపూర్వకంగానే ప్రమాదం చేసినట్టు సెక్షన్లు మార్చారు. తమ పార్టీ కార్యకర్తను జగన్‌మోహన్‌రెడ్డితో పాటు అందులో ఉన్న వాళ్లంతా హత్య చేసే ఉద్దేశంతో కారు ఎక్కించారట! వాహనం ప్రమాదం చేస్తే అందులో ఉన్న ప్రయాణికులు ఎట్లా బాధ్యత వహిస్తారని ఉన్నత న్యాయస్థానమే చీవాట్లు వేయవలసి వచ్చింది. సాక్ష్యాధారాలతో మళ్ళీ వస్తామని ప్రభుత్వ లాయర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. మరి ఏ సాక్ష్యాలున్నాయని కూటమి నేతలు, యెల్లో మీడియా నిపుణులు వీరంగం వేశారో?

జగన్ భద్రతపై కూటమి సర్కార్ కపట నాటకమాడుతున్నది. ఒక ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన భద్రతను ఇస్తున్నామని హోంమంత్రి చెబుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనా? ఒంటరిగా పోటీలోకి దిగిన ఆయన పార్టీకి నలభై శాతం ఓట్లు వచ్చాయి. మూడు పార్టీల కూటమికి 55 శాతం ఓట్లు పడ్డాయి. అవన్నీ నిజంగానే పడ్డాయని వాదన కోసం ఒప్పుకుందాం. 2024 ఎన్నికలపై పరిశోధన చేసిన వోట్ ఫర్ డెమోక్రసీ (విఎఫ్‌డీ) అనే సంస్థ అనేక అనుమానాలు వ్యక్తం చేసిన సంగతిని వదిలేద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ ముగిసి ఎనిమిది గంటలకు తుది ప్రకటన చేసిన తర్వాత, వారం రోజుల పిదప అనూహ్యంగా పన్నెండున్నర శాతం ఓట్లు పెరిగిన మాయాజాలాన్ని కూడా వదిలేద్దాం. ఈవీఎమ్‌లలో ఎన్నికలు జరిగితే నూటికి నూరుపాళ్లు ట్యాంపరింగ్ జరిగే అవకాశం ఉన్నదని ఎలాన్ మస్క్ లాంటి వాళ్లు ఎంతోమంది చెబుతున్న విషయాన్ని పక్కనపెడదాం. ఈవీఎమ్‌లతో జరుగుతున్న ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయనీ, అందుకు సాక్ష్యాలున్నాయనీ అమెరికా ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబార్డ్ చెబుతున్న మాటల్ని కూడా పెడచెవిన పెడదాం. అయినా మూడు పార్టీలకు కలిసి వచ్చిన ఓట్లు 1 కోటీ 53 లక్షలు. జగన్ ఒక్కడికే 1 కోటీ 33 లక్షల ఓట్లు పడ్డాయి. తేడా ఇరవై లక్షలు. వారంరోజుల తర్వాత అనూహ్యంగా పెరిగిన ఓట్లు 49 లక్షలని విఎఫ్‌డీ ప్రకటించింది. అయినా, జగన్ కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనా? ఇటువంటి సాకులతో జగన్ భద్రతను ప్రమాదంలో పడేయాలని ప్రభుత్వం కుట్రలు చేస్తే, ఆయనకు పార్టీ కార్యకర్తలే రక్షణ కవచమవుతారు.

vardhelli1959@gmail.com

ఏడాది గడిచిపోయింది. జగన్ వ్యక్తిత్వ హననం కోసం ఎక్కుపెట్టిన దాడులు, ఆయన పార్టీ శ్రేణుల్ని చెల్లాచెదురు చేయడానికి పెడుతున్న కేసులు, చేస్తున్న అరెస్టులు ఫలితమిస్తున్న సూచనలేవీ కనిపించడం లేదు. పైపెచ్చు ఎదురుదాడి మొదలైంది. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక గళం వీధివీధినా ప్రతిధ్వనిస్తున్నది. ఇక వ్యక్తిత్వ హనన కార్యక్రమమొక్కటే సరిపోదని, ఇంకేదో పెద్ద దాడే జరపాలని భావిస్తున్నట్టు పలువురు అనుమానిస్తున్నారు. జగన్‌పై ఏదో దారుణమైన కుట్ర జరుగుతున్నదని రాష్ట్ర ప్రజలు బహిరంగంగానే శంకిస్తున్నారు. ఈ అనుమానాలను నిజం చేస్తూ జగన్‌ను ఉద్దేశించి 'ఆ భూతం తిరిగి రాదు, భూస్థాపితం చేస్తాన'ని ముఖ్యమంత్రి చెబుతున్నారు. టీవీ ఇంటర్వ్యూల్లో చెబుతున్నారు. పెట్టుబడిదారులతో జరిగే సమావేశాల్లో చెబుతున్నారు. పోలీసు అధికారుల సమావేశాల్లోనూ అదే రాజకీయ ఉపన్యాసం. కలెక్టర్ల మీటింగ్‌లోనూ అదే తరహా సంస్కారహీనమైన ప్రసంగం.

అక్షరం మీద ఆగ్రహం

సందర్భం

డా॥ గోపరాజు నారాయణరావు

అణచివేత, ఆంక్షలు బ్రిటిష్ ఇండియా కాలం నుంచి భారతీయ పత్రికారంగానికి అనుభవమే. ఎమర్జెన్సీ ప్రకటనపై రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ సంతకం మరొకసారి బ్రిటిష్ కాలంనాటి నిర్బంధాలను పునరావృతం చేసింది. 1975 జూన్ 25 అర్ధరాత్రి భారత పత్రికా రంగం చీకటి తెరలోకి వెళ్లింది. 26న సెన్సార్‌షిప్ పేరుతో అణచివేత అధికారికంగా అమలైంది. ఆ రోజు నుంచి 1976 జనవరి 22 వరకు 272 పత్రికల మీద సెన్సార్ వేటు పడింది. 19 మాసాల తరువాత గాని పత్రికారంగం వెలుగు చూడలేదు. 1975లోనే తూర్పు గోదావరి జిల్లా, ధవళేశ్వరంలోని గోదావరి ఆనకట్ట బీటలు వారింది. ఆ వార్త సైతం సెన్సార్ కత్తెరకు గురైంది. 1976 జనవరి నాటి పార్లమెంట్ శీతకాల సమావేశాల వార్తలను కూడా సెన్సార్ చేసింది ప్రభుత్వం. ఎమర్జెన్సీ తెచ్చిన సెన్సార్ షిప్ ఎంత గుడ్డిగా, నిరంకుశంగా సాగిందో చెప్పడానికి ఇవి చాలు. ఎన్ని కీలక వార్తలు కత్తెర పాలైనాయో ప్రఖ్యాత జర్నలిస్ట్ కుల్దీప్ నయ్యర్ 'ది జడ్జిమెంట్' పుస్తకానికి ఇచ్చిన అనుబంధంలో చూడవచ్చు. దీనికంతకూ బాధ్యత ఇందిరదే.

జూన్ 26 ఉదయం ఇందిర ఆకాశవాణిలో ప్రసంగించారు. ప్రజాస్వామ్య విధానాలతో సాధారణ పౌరులకు మేలు చేయాలని అనుకుంటే ప్రతిపక్షాలు, పత్రికలు తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాయని నేరుగా యుద్ధం ప్రకటించారు. ఆ రోజు నుంచే పత్రికలపై సెన్సార్‌షిప్ అమలులోకి వచ్చింది. అత్యధికంగా ఆంగ్ల దినపత్రికలు ఢిల్లీలోని బహదూర్ షా జఫర్ మార్గ్‌లోనే కేంద్రీకృతమై ఉండేవి. 25వ తేదీ అర్ధరాత్రి ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కన్నాట్‌ప్లేస్‌లోని 'ది స్టేట్స్‌మన్', 'ది హిందుస్తాన్ టైమ్స్', 'ది ఎకనామికల్ టైమ్స్', 'ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' పత్రికలు మాత్రం వెలువడ్డాయి. కన్నాట్ ప్లేస్ ఢిల్లీ కార్పొరేషన్ పరిధిలో కాక మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉంది. మునిసి పాలిటీకి కరెంట్ కట్ చేయలేదు. కరెంట్ కోత నుంచి పొరపాటున బయటపడిన మరో ఆంగ్ల దినపత్రిక 'మదర్లాండ్'. ఈ పత్రిక ఎడిటర్ కెఆర్ మల్కానీని 25 రాత్రే జేపీ, మొరార్జీలతో పాటే అరెస్టు చేశారు. ఒక ఉగ్రవాదిని పట్టుకున్నంత హడావిడి చేశారు. కాని పత్రిక యాజమాన్యం 26న ప్రత్యేక అనుబంధం ప్రచురించింది. అదే 'మదర్లాండ్' ఆఖరి సంచిక అయింది. ఎమర్జెన్సీ విధింపు, అర్ధరాత్రి అరెస్టుల వివరాలతో అనుబంధాన్ని తెచ్చారు. ఉత్కంఠతో ఉన్న ప్రజలు పది పైసల ఆ అనుబంధాన్ని, ఇరవై రూపాయలకు కూడా కొన్నారు.

అంతవరకు సమాచార ప్రసార శాఖ మంత్రిగా ఉన్న ఐ.కె. గుజ్రాల్‌కు ఉద్వాసన పలికి, పత్రికలను బుద్ధిగా నడుచుకునేటట్టు చేయగలిగిన సమర్థుడు వీసీ శుక్లాను ఆ పదవిలో నియమించారు ఇందిర. పత్రికలు సెన్సారింగ్‌ను తీవ్రంగా నిరసించాయి. ఇందుకు పరాకాష్ఠ చర్య, సంపాదకీయం ప్రచురించే స్థలాన్ని ఖాళీగా ఉంచడం.



వీసీ శుక్లా సమాచార మంత్రిగా ప్రమాణం చేసిన క్షణం నుంచి ఇందిర తొలి శత్రువుగా భావించిన ఆంగ్ల దినపత్రిక 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' మీద యుద్ధం ప్రారంభించారు. నాటి సంపాదకుడు వీకే నరసింహన్ తన రచన 'డెమాక్రసీ రిడీమ్డ్'లో అదంతా వివరించారు. మొదటి అడుగు ఎమర్జెన్సీ తొలినాళ్లలో ఎడిటర్‌గా ఉన్న మూల్గాంవ్‌కర్‌కు ఉద్వాసన పలికించడం. ఆ పత్రికకు విద్యుత్ నిలిపివేశారు. ప్రభుత్వ ప్రకటనలు ఆపారు. ఢిల్లీ కార్యాలయాన్ని కూల్చడానికి ఉత్తర్వులు ఇచ్చారు. గుండె జబ్బుతో బాధపడుతున్న భగవాన్ దాస్ గోయెంకాను అరెస్టు చేస్తామని ఆయన తండ్రి, ఎక్స్‌ప్రెస్ అధిపతి రామ్‌నాథ్‌ను బెదిరించారు. అచ్చుకు వెళ్లే ప్రతి పేజీని సెన్సార్ అధికారులకు చూపాలని డీఐఆర్ 48 (1) నిబంధన విధించి ప్రీ సెన్సార్‌షిప్‌ను ప్రయోగించారు.

పార్లమెంట్ ప్రసంగాలను ప్రచురించినందుకు ముంబై కేంద్రంగా వెలువడే వారపత్రిక 'ఒపీనియన్' (ఎ.డి. గొర్వాలే సంపాదకుడు)పై ప్రభుత్వం కక్షకట్టింది. పత్రికను ముద్రించడానికి ప్రెస్ లేకుండా చేశారు పోలీసులు. అయినా సైక్లోస్టయిల్డ్ పత్రికను తెచ్చారు. ఆఖరికి ఈ పత్రిక ప్రచురణనే ప్రభుత్వం నిషేధించింది. ఎమర్జెన్సీని, నాటి విధానాలను సీపీఐ బాహాటంగానే సమర్థించింది. ఈ పార్టీకి మద్దతుపలికే పత్రికగా ఖ్యాతి ఉన్న పత్రిక, 'మెయిన్‌స్ట్రీమ్'. నిఖిల్ చక్రవర్తి సంపాదకుడు. కానీ ఈ పత్రిక నాడు సీపీఐ వైఖరికి దూరంగా ఉంది. సంజయ్‌గాంధీని దృష్టిలో పెట్టుకుని పరోక్షంగా వెలువరించిన 'డు వుయ్ నీడ్ నెహ్రూ టుడే' వంటి వ్యాసాలు సర్కార్‌కి తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ పత్రికను అచ్చువేసే ప్రెస్‌ను జప్తు చేశారు.

ప్రపంచంలోనే 'పంచ్' తరువాత ఖ్యాతిగాంచిన కార్టూన్ల పత్రిక 'శంకర్స్ వీక్లీ'. దేశం గర్వించదగిన కార్టూనిస్ట్ శంకర్ పిళ్లై ఈ పత్రిక అధిపతి, ఎడిటర్. ఈ వీక్లీ 1975, అక్టోబర్‌లో మూతపడిపోయింది. కారణం – ప్రీ సెన్సార్ నిబంధన. వినోబా భావే 'మైత్రి', జయ ప్రకాశ్ నారాయణ్ 'ఎవ్రీమ్యాన్స్', ఫెర్నాండెజ్ 'ప్రతిపక్ష'... ఎన్నో శాశ్వతంగానో, తాత్కాలికంగానో ప్రచురణ నిలిపి వేశాయి. తెలుగులో 'సృజన', 'జాగృతి', 'పిలుపు', 'ప్రజాసమస్యలు' ఆగిపోయాయి (తరువాత కొన్ని మళ్లీ ప్రచురణ ప్రారంభించాయి).

ఎమర్జెన్సీ విదేశీ విలేకరులను కూడా విడిచి పెట్ట లేదు. అమెరికా వారే ఢిల్లీలో 15 మంది ఉన్నారు. 25 మంది పశ్చిమ యూరప్‌వారు, 20 మంది తూర్పు యూరప్ దేశాల వారు పనిచేసేవారు. పీటర్ హాజెల్ హ్రస్ట్ (లండన్ టైమ్స్) తరెన్ జెండిన్స్ (న్యూస్ వీక్) పీటర్ గిల్ (లండన్ డెయిలీ టెలిగ్రాఫ్)లకు 24 గంటలలో దేశం విడిచి వెళ్లమని ఆదేశించారు. విదేశీ పత్రికలు ఏదో మార్గంలో భారతదేశ వార్తలను ప్రచురించాయి.

దేశంలో జరుగుతున్నదేమిటో సాక్షాత్తు ప్రధానికి తెలియకపోవడానికి మూల కారణం సెన్సార్‌షిప్. సెన్సార్‌షిప్‌ను తొలగించమని 1975 జూలై 5న తనను కలిసిన ఇండియన్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్‌కు ఇందిర చెప్పిన సమాధానం – దేశాన్ని రక్షించడానికి సెన్సార్‌షిప్ విధించానని (ఆరో తేదీ పత్రికలు ఈ విషయాన్ని వెల్లడించాయి). కానీ జరిగినదేమిటి మారుతి కారు ఉదంతం, స్నేహలతా రెడ్డి విషాదాంతం, పోలీసుల అరాచకాలు, 'కిస్సా కుర్సీకా', 'ఆంధీ' సినిమాల నిలిపివేతలు, బలవంతపు ఆపరేషన్లు, అరెస్టులు, తుర్క్‌మన్ గేట్, పోలీసు కాల్పులు, కూల్చివేతలు... అన్నీ సెన్సార్ ఇనుప తెర వెనుక ఉండిపోయాయి.

వ్యాసకర్త 'జాగృతి' సంపాదకుడు । 98493 25634

చివరి పిచ్చుకలు

దేశ వ్యాప్తంగా ఆకాశవాణి ప్రసారవ్యవస్థతో మమేకమై నడిచిన కార్యక్రమ విభాగ చివరి తరం వెళ్ళిపోతున్న సమయమిది. ఆకాశవాణి కేంద్రాల నిర్వహణలో కీలకమైన డ్యూటీ రూమ్‌లో చేరిన వీరు, పలు సంస్థాగత శిక్షణలతో పనిలో సుశిక్షితులుగా ఎదిగి ఇప్పుడు మౌనంగా పదవీ విరమణ చేస్తున్న కాలమిది. ఆకాశవాణి తరతరాల సంగీత, సాహిత్య, సాంస్కృతిక వారసత్వ సంపదతో పాటు విశ్వసనీయత, విలువలకు భంగం కలుగకుండా కంటికి రెప్పలా కాపాడుకున్న చివరి పిచ్చుకలు ఇవి. నేర్చుకున్న విద్యకు, సంస్థ ఇచ్చిన శిక్షణ జోడించి, వెనుకటి తరాలు నేర్పిన విలువలతో ప్రసారాలను అందించిన చిట్ట చివరివారు. ఇప్పుడిక పూర్తిగా 'ప్రసార భారతి' తరమే!

కాల గమనంలో వచ్చిన మార్పులతో డ్యూటీ రూమ్ కళ తప్పింది. తన ప్రాసంగికతను అర్థం చేసుకోలేని, అహంకారమే తప్ప అనుభవం లేని ఉన్నత స్థాయి అధికారుల చర్యల వల్ల అస్తిత్వం కోల్పోయింది. పుండు మీద కారం దట్టించినట్లు తరువాత వచ్చిన ప్రసార భారతి ఉద్యోగులకు డ్యూటీ రూమ్ ప్రాముఖ్యతను చెప్పినవారు లేరు. ఫలితంగా దాని విలువ వారికి అర్థం కాలేదు. ఇప్పుడు వారి చేతుల్లోనే ఆకాశవాణి భవిష్యత్ ఉంది. స్థానిక ఆకాశవాణి కేంద్రాల చివరి పిచ్చుకలు అనంతపురం నాగేశ్వరరెడ్డి, కర్నూలు మురళి, నెల్లూరు విజయ భాస్కర్‌లు అయితే, ప్రధాన ఆకాశవాణి కేంద్రాల విషయంలో హైదరాబాద్‌లో అవధానులు శ్రీహరి, ఎన్. విష్ణువర్ధన రెడ్డి, విజయవాడ బి. వెంకటేశ్వర్లును ఆకాశవాణి చివరి పిచ్చుకలుగా చెప్పవచ్చు. ఈ తరంవారు ఈ చివరి పిచ్చుకల పని తీరును గమనించారు. ఆసక్తిగా మిత్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతపురం ఆకాశవాణి కేంద్రం నాగేశ్వర రెడ్డి సాధించిన విజయాలు అందరికీ తెలిసినవే. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగస్వామ్యం అందుకుంటూ అపార అనుభవం కలిగిన సీనియర్ ప్రోగ్రాం అధికారులు రాంబాబు, రాఘవ రెడ్డి, అవధానులు శ్రీహరి, రాజబాబుల పని సంస్కృతినీ దగ్గరగా చూశారు. రానున్న రోజుల్లో ఆకాశవాణి గమనం, గమ్యం ఎలా ఉంటుందో కాలమే చెప్పాలి. అయితే, ఆకాశవాణి కేంద్రంలో పదవీ విరమణ రోజు అధికారిక వీడ్కోలు కార్యక్రమంలో కనీసం తేనీరు, బిస్కెట్ కూడా ఇవ్వలేని గడ్డు కాలం కూడా ఒకటి వస్తుందని వెనుకటి తరాలు కలలో కూడా ఊహించి ఉండరు. కలికాలం అంటే ఇదేనేమో!

– వలేటి గోపీచంద్ । ఆకాశవాణి విశ్రాంత ఉన్నతాధికారి

క్లుప్తంగా...

ఎస్‌హెచ్‌ఓలు నిబద్ధతతో పనిచేయాలి: డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓలు) నిబద్ధతతో పనిచేస్తేనే తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అగ్రస్థానంలో కొనసాగుతుందని డీజీపీ డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో శనివారం శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌తో కలిసి డీజీపీ జితేందర్ సమావేశమయ్యారు. శాంతి భద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ పనులు వేగంగా జరుగుతున్నందున నకిలీ విత్తనాల అమ్మకాలపై, ఉత్పత్తిదారులపై నిఘా పెట్టాలన్నారు. అవసరమైతే నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. సమీక్షలో శాంతి భద్రతల ఏఐజీ రమణ కుమార్, డీఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి 'అడ్లూరి'కి తప్పిన ముప్పు

- ఊడిపోయిన కాన్వాయ్ కారు టైరు



మెట్‌పల్లి రూరల్: రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రమాదం తప్పింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో శనివారం వివిధ కార్యక్రమాలు ముగించుకుని ధర్మపురి వెళ్తున్న ఆయన కారు మెట్‌పల్లి శివారు మారుతీనగర్ సమీపంలో ప్రమాదానికి గురైంది. మరమ్మతులో ఉన్న ఒక కారు కోరుట్ల వైపు నుంచి టోచన్‌తో కమ్మర్‌పల్లి వైపు వెళ్తోంది. అదే సమయంలో మెట్‌పల్లి నుంచి వస్తున్న మంత్రి అడ్లూరి కారు కుడివైపు ముందు భాగంలోని టైరుకు.. టోచన్‌తో ఉన్న కారు తగిలి కొంతదూరం దూసుకెళ్లింది. ఈ ఘటనలో మంత్రి కారు టైర్ ఊడిపోయింది. అప్రమత్తమైన మంత్రి కారు డ్రైవర్ కారును నిలిపివేశాడు. అడ్లూరి ఆ కారు దిగి మరో కారులో ధర్మపురి వెళ్లిపోయారు.

టీఈడీఎక్స్ జాబితాలో బాసర ట్రిపుల్‌ఐటీ



టీఈడీఎక్స్ లోగోను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, విద్యార్థులు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆవిష్కరణ, విజ్ఞానం, ప్రపంచ మేధో సంపర్కంలో కీలకమైన విజయాన్ని సాధించింది. ప్రపంచవ్యాప్తంగా 190కి పైగా దేశాల్లో స్వతంత్రంగా నిర్వహించే టీఈడీఎక్స్ ఈవెంట్ల జాబితాలో ఆర్జీయూకేటీని చేర్చినట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. ఈమేరకు టీఈడీఎక్స్ లైసెన్స్ పొందినట్లు వెల్లడించారు. టీఈడీఎక్స్ లోగోను శనివారం వర్సిటీలో ఆవిష్కరించారు. ఈ ఈవెంట్ గ్రామీణ విద్యార్థుల గొంతును ప్రపంచ వేదికపై వినిపించడంతోపాటు, వారిలో విమర్శనాత్మక ఆలోచన, ప్రజాసంభాషణ నైపుణ్యాలను పెంపొందించే గొప్ప వేదికగా నిలుస్తుందని తెలిపారు. శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, కళలు, విద్య, వ్యవస్థాపకత, సామాజిక ప్రభావం వంటి పలు రంగాల్లో విశేష ప్రతిభావంతులైన వ్యక్తుల ప్రసంగాలు ఈ వేదిక ద్వారా వినిపించనున్నట్లు చెప్పారు.

భారత్‌కే ఫ్యూచర్

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మించిన దివంగత పి. జనార్దన్‌రెడ్డి ఫ్లైఓవర్‌ను సీఎం రేవంత్ రెడ్డి శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఆర్ఆర్ లోపలి భాగంలో కోర్ అర్బన్‌గా, ఓఆర్ఆర్ అవతలి నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు వరకు సెమీ–అర్బన్‌గా, రీజనల్ రింగ్‌రోడ్డు అవతలి భాగాన్ని గ్రామీణ ప్రాంతంగా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా ఓఆర్ఆర్ ఆవలి వైపున 30 వేల ఎకరాల్లో ప్రపంచ శ్రేణి భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిపాదించామని.. అందులో క్రీడలు, ఏఐ, ఐటీ, కాలుష్యరహిత ఫార్మా రంగాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో పచ్చదనం కోసం దాదాపు 15 వేల ఎకరాల్లో పార్కులను, మిగతా ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు వివరించారు. వచ్చే వందేళ్లలో హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళిక రచిస్తున్నామన్నారు.

హైదరాబాద్‌ను ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దేలా..

'వాయు కాలుష్యంతో ఢిల్లీ, విపరీతమైన ట్రాఫిక్ సమస్యలతో బెంగళూరు, వరదలతో చెన్నై నగరాలు అతలాకుతలమవుతున్న పరిస్థితుల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. నగరంలో కాలుష్యాన్ని నివారించాలన్న లక్ష్యంతోనే విద్యుత్ వాహనాలపై రిజిస్ట్రేషన్ పన్నులను పూర్తిగా రద్దు చేశాం. జంట నగరాల్లో తిరుగుతున్న 3 వేల ఆర్టీసీ బస్సులను ఓఆర్ఆర్ బయటి ప్రాంతాలకు తరలించి వాటి స్థానంలో వచ్చే ఏడాదిలోగా 3 వేల విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

మోదీ, కిషన్‌రెడ్డి రాష్ట్రానికి ఏం ఇచ్చారు, తెచ్చారు?

రాష్ట్రానికి ప్రధాని మోదీ ఇచ్చింది, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెచ్చింది ఏముందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీకి యమునా ఫ్రంట్, గుజరాత్‌కు నర్మదా రివర్ ఫ్రంట్ ఇచ్చారని.. తెలంగాణకు మూసీ రివర్ ఫ్రంట్ మాత్రం ఎందుకివ్వరని నిలదీశారు. చెన్నై, బెంగళూరు, ఏపీకి మెట్రో ఇచ్చారని.. కానీ హైదరాబాద్ మెట్రో రెండో దశకు మాత్రం మొండిచేయి చూపారని మండిపడ్డారు. తెలంగాణపై ఈ వివక్ష ఎందుకని ప్రశ్నించారు. నాలాలు, చెరువుల ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపడితే దీన్ని కొందరు రాజకీయం చేసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని రేవంత్ విమర్శించారు. 2028 వరకు రాజకీయాలు వద్దని.. వచ్చే మూడేళ్లపాటు రాష్ట్రాభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల 'ఎన్ కన్వెన్షన్' కూల్చివేత అనంతరం సినీనటుడు నాగార్జున అభివృద్ధిలో భాగస్వామినవుతానని ముందుకొచ్చారని సీఎం గుర్తుచేశారు. రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించి చెరువును అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామని చెప్పారన్నారు.

1992లోనే ఐటీ రంగానికి పునాది

హైదరాబాద్‌లో 1992లోనే హైటెక్ సిటీకి రాజీవ్‌గాంధీ టెక్నాలజీ పేరిట పునాది పడిందని.. అందుకోసం దివంగత పీజేఆర్ నాయకత్వంలో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ గుర్తుచేశారు. ఆ తర్వాత కాలంలో హైటెక్ సిటీ, సైబరాబాద్ సిటీ అభివృద్ధి చెందాయన్నారు. అందుకు కాంగ్రెస్ పార్టీ వేసిన పునాదులే కారణమన్నారు. పేదల సమస్యలు తీరుస్తూ జంట నగరాల అభివృద్ధికి దివంగత పీజేఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. పీజేఆర్ పేరును ఫ్లైఓవర్‌కు పెట్టుకోవడం సముచితమన్నారు. తగిన స్థలం గుర్తిస్తే పీజేఆర్ విగ్రహాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు.

నాడు భయం.. నేడు కళకళ

గచ్చిబౌలి, శేరిలింగంపల్లి ప్రాంతంలో ఒకప్పుడు సాయంత్రం 6 దాటితే జనసంచారం లేక అక్కడ నివసించే వారు భయపడే పరిస్థితి ఉండేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం ఈ ప్రాంతం అభివృద్ధిలో దూసుకుపోయిందని.. గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి ఫార్చ్యూన్ 500 కంపెనీలతో కళకళలాడుతోందని చెప్పారు. దీనివల్ల లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఆటంకాలను అధిగమించి కంచ గచ్చిబౌలి భూములను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ చెప్పారు. అక్కడి భూముల అభివృద్ధికి ఏర్పడిన ఆటంకాలు తాత్కాలికమేనని వ్యాఖ్యానించారు. కొత్త కంపెనీల ఏర్పాటుతో లక్షలాది ఉద్యోగాలు వస్తాయన్నారు. మరింత మంది యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతోనే రూ. 2.8 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను తమ ప్రభుత్వం సాధించిందని సీఎం రేవంత్ గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఉన్నతాధికారులు, పీజేఆర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సత్వరమే భూసేకరణ

సాక్షి, హైదరాబాద్: ఫ్యూచర్ సిటీకి సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, డేటా సెంటర్ల కోసం కావాల్సిన స్థలాలను సిద్ధం చేయాలన్నారు. శనివారం పరిశ్రమల శాఖపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, టీజీఐఐసీ వైస్ చైర్మన్ శశాంక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పెట్టుబడుల కోసం రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలెవరూ వెనక్కి వెళ్లడానికి వీల్లేదన్నారు. నిమ్జ్‌లో మిగిలి ఉన్న భూసేకరణను తక్షణమే పూర్తి చేయాలని.. రైతులతో మాట్లాడి భూములు ఇవ్వడానికి ఒప్పించాలన్నారు. ఫ్యూచర్ సిటీలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని.. ఇందుకోసం అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఆర్కిటెక్చర్స్‌ను నియమించుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ క్యాంప్లెక్స్‌లో క్రికెట్, ఫుట్‌బాల్, గోల్ఫ్ వంటి క్రీడలు ఉండేలా ప్రణాళిక రచించాలన్నారు. మెగా ప్రాజెక్టులపై మంత్రివర్గ ఉపసంఘం 15 రోజులకోసారి సమావేశమై పురోగతిని సమీక్షించాలన్నారు. గతేడాది రాష్ట్రానికి 70 గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్ (జీసీసీ) వచ్చాయని.. ఈ ఏడాది ఇప్పటికే 25 గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు వచ్చాయని సీఎం తెలిపారు. మరిన్ని సెంటర్లు వచ్చేలా కృషి చేయాలని.. 100 రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకొని అధికారులు పనిచేయాలని రేవంత్ ఆదేశించారు.

'ప్రైవేటు' పుస్తకాల దందా!



ఈ ఫొటోలో కనిపిస్తున్న పుస్తకాల బ్యాగులు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ పాఠశాలకు చెందినవి. ఆ పాఠశాలలో పుస్తకాలు కొనుగోలు చేసిన వారికి ఈ బ్యాగులో పెట్టి ఇస్తున్నారు. పుస్తకాల కోసమే స్కూలు యాజమాన్యం ఈ బ్యాగులు ప్రింట్ చేయించింది. అయితే, పుస్తకాల కొనుగోలుకు సంబంధించి బిల్లు(రసీదు) మాత్రం ఇవ్వడం లేదు. రసీదు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు అడిగితే... రసీదు పుస్తకాలు లేవంటూ తెల్లకాగితంపై చీటీ రాసి చేతులు దులుపుకుంటున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో తరగతులవారీగా విద్యార్థుల సంఖ్య ఇలా...

తరగతి	విద్యార్థుల సంఖ్య
1	4,40,556
2	3,91,179
3	3,70,029
4	3,81,757
5	3,52,503
6	3,37,579
7	3,26,280
8	3,26,280
9	2,83,494
10	2,83,229

▶ మొదటి పేజీ తరువాయి

యూకేజీ విద్యార్థులు 3,55,254 మంది ఉన్నారు. నర్సరీ నుంచి పదోతరగతి వరకు 38,48,140 మంది ఉన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందిస్తుంది. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన ధరకు వాటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలతోపాటు అదనంగా మరికొన్ని పుస్తకాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విక్రయిస్తున్నాయి. వీటిని పుస్తకాల పబ్లిషర్లతో కలిసి రూపొందిస్తున్నాయి. ఈ పుస్తకాలకు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి.. ఎంఆర్‌పీ (గరిష్ట చిల్లర ధర)పై ఒక్క పైసా తగ్గించకుండా బలవంతంగా విద్యార్థులకు అంటగడుతున్నారు. సగటున ఒక్కో తరగతికి రూ.6,370 చొప్పున పాఠ్యపుస్తకాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాల విక్రయాలను లెక్కిస్తే ఏటా దాదాపు రూ.2 వేలకోట్లకు పైగానే వ్యాపారం జరిగినట్లు స్పష్టమవుతోంది.

బిల్లుకు చెల్లు..

ప్రైవేటు స్కూళ్లలో ఇప్పటికే 85 శాతం విద్యార్థులు పుస్తకాలను కొనుగోలు చేశారు. అయితే, ఈ 'ప్రైవేటు'పుస్తకాల విక్రయంలో స్కూళ్ల యాజమాన్యాలు ఎక్కడా లెక్కా పత్రం కనిపించకుండా జాగ్రత్తపడుతున్నాయి. చాలా స్కూళ్లలో పుస్తకాలకు నగదు మాత్రమే స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం ఇవ్వటంలేదు. పుస్తకాల కొనుగోలుకు సంబంధించిన బిల్లులు (రసీదు) కూడా ఇవ్వటం లేదు. దీంతో ఈ వ్యాపారం గుట్టుగా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ పుస్తకాల విక్రయంపై ప్రభుత్వానికి పన్నులు కూడా చెల్లించటంలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా పుస్తకాల వ్యాపారంలో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన దాదాపు రూ.457 కోట్లు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల ఖాతాలోకే చేరుతున్నాయి.

పుస్తకాల ధరలు రెట్టింపు చేశారు...

నాకు ఇద్దరు పిల్లలు. 4, 5వ తరగతి చదువుతున్నారు. వీరికి గతేడాది పుస్తకాల కోసం రూ.8 వేలు ఖర్చు చేస్తే... ఈసారి ఏకంగా 15 వేలు చెల్లించాల్సి వచ్చింది. గతేడాది 4వ తరగతి విద్యార్థికి రూ.4 వేలు పుస్తకాలకు చెల్లిస్తే... ఈ ఏడాది రూ.8 వేలు అయ్యింది. అనవసరమైన పుస్తకాలు కట్టబెడుతున్నారు. వాటికి సంబంధించి ఎలాంటి బోధన, అభ్యసన మాత్రం పట్టించుకోరు. చివరకు పాతసామాను వాడికి అమ్ముకోవాల్సిందే.

– అఖిల, విద్యార్థి తల్లి, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా

తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాలు విక్రయించటం చట్టరీత్యా నేరం. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు వస్తే నిబంధనల మేరకు తప్పకుండా చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ లేదా దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి.

– రేణుక, జిల్లా విద్యాశాఖ అధికారి, వికారాబాద్ జిల్లా

ఇందిరమ్మ ఇళ్లకు రుణాలు



▶ మొదటి పేజీ తరువాయి

ఎంపికలు జరిగాయి. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుండగా.. అన్ని అర్హతలున్న వారికి మంజూరు పత్రాలు అందజేస్తున్నారు. అయితే, ఇల్లు మంజూరైనా కొందరి వద్ద డబ్బు లేకపోవటంతో నిర్మాణం మొదలు పెట్టలేదు. ఇటీవల అధికారులు ఇళ్ల నిర్మాణాల పరిశీలనకు వెళ్లగా పలువురు లబ్ధిదారులు తమ సమస్యలు తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన జిల్లా అధికారులతో చర్చించి స్వయం సహాయక సంఘాలను ఇందులో భాగస్వాములను చేశారు. ఇళ్ల లబ్ధిదారులు స్వయం సహాయక సంఘంలో సభ్యులైతే వారికి రుణం అందించేలా ఆయా సంఘాలను ఒప్పించారు. 860 మందిలో 405 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్టు గుర్తించారు. వీరిలో ఇప్పటివరకు 281 మందికి రుణ సౌకర్యం కల్పించారు. మరో 124 మందికి రుణాలు అందించాల్సి ఉంది.

రూ.లక్షన్నర రుణం తీసుకొని..



తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెం గ్రామానికి చెందిన రేఖ విజయకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అయితే, డబ్బు లేక ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ఇబ్బంది పడ్డారు. దీంతో ఐకేపీ సాయంతో రూ.50 వేలు ముద్ర లోన్ తీసుకున్నారు. అలాగే ఆమె అత్త డ్వాక్రా సభ్యురాలు కావడంతో రూ.లక్ష రుణం తీసుకున్నారు. ఈ సొమ్ముతో నిర్మాణం ప్రారంభించడంతో పునాదుల తర్వాత ప్రభుత్వం తొలి విడత బిల్లు చెల్లించింది. ఆ తర్వాత రూఫ్ లెవెల్ వరకు పూర్తి కావడంతో ఇప్పటివరకు రూ.2 లక్షల బిల్లు వచ్చినట్లు విజయ తెలిపింది.

డబ్బుల కోసం తల్లికి నిప్పంటించి..

- కన్న కొడుకు కిరాతకం
- చావుబతుకుల్లో తల్లి
- వరంగల్ జిల్లాలో ఘటన



వినోద

సంగెం: కన్న కొడుకే తల్లిపాలిట కాలయముడయ్యాడు. డబ్బులకోసం తల్లిని చంపేందుకు సిద్ధమయ్యాడు. 'వద్దు కొడుకా'.. అంటూ తల్లి బతిమాలినా వినకుండా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుంటపల్లికి చెందిన ముత్తినేని వినోద (60), సాంబయ్య దంపతులకు ఒక కూతురు, లింగమూర్తి, సతీశ్ అనే కుమారులు ఉన్నారు. వీరిలో కొంతకాలం కిందట లింగమూర్తి అనారోగ్యంతో మరణించాడు. సాంబయ్యకు ఉన్న భూమిలో 4 ఎకరాలను ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకోసం తీసుకుంది. మరో ఎకరం భూమి ఇంకా సాంబయ్య పేర ఉంది. ప్రభుత్వం పరిహారంగా రూ.40 లక్షలు ఇచ్చింది. వీటిలో రూ.30 లక్షలను చిన్న కుమారుడు సతీశ్‌కు ఇచ్చారు. ఈ డబ్బులతో సతీశ్ వేరే చోట రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. సాంబయ్య పేర రూ.3 లక్షలు, తల్లి వినోద పేర రూ.3.50 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేసుకున్నారు. మిగిలిన డబ్బులో నుంచి కూడా కొంత సతీశ్‌కు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ రూ.2 వేలు, డిపాజిట్ ద్వారా వచ్చే వడ్డీతో కాలం వెళ్లదీస్తున్నారు. కాగా, తల్లిదండ్రుల వద్ద ఉన్న డబ్బులను కూతురుకు ఇస్తున్నారని సతీశ్ తరచూ గొడవ పడుతుండేవాడు. మిగిలిన డబ్బులను కూడా తనకు ఇచ్చేయాలని వేధించేవాడు. డబ్బులు ఇవ్వకుండా తల్లి అడ్డుపడుతోందని గతంలో తల్లి కాలు, చేయి విరగ్గొట్టాడు. దీంతో అతడిని ఇంటి నుంచి వెళ్లగొట్టారు. తల్లిపై కక్ష పెంచుకున్న సతీశ్ శుక్రవారం రాత్రి ఇంటి ముందు తల్లిదండ్రులు నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో వచ్చి తల్లి వినోదపై దాడి చేశాడు. బాటిల్‌లో తెచ్చిన పెట్రోల్ ఆమెపై చల్లి నిప్పు అంటించి పారిపోయాడు. భార్య అరుపులు విని లేచిన సాంబయ్య చుట్టుపక్కల వారి సాయంతో మంటలు ఆర్పారు. అప్పటికే 80 శాతం గాయాలైన వినోదను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. న్యాయమూర్తి సమక్షంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్సై నరేశ్‌లు వినోద వాంగ్మూలం రికార్డు చేశారు. భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ శనివారం తెలిపారు.

సమగ్ర విత్తన చట్టం తీసుకొస్తాం

- రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



భూదాన్‌పోచంపల్లిలో రైతుతో మాట్లాడుతున్న కోదండరెడ్డి. చిత్రంలో భూమి సునీల్ తదితరులు

భూదాన్‌పోచంపల్లి: కల్తీ విత్తనాలను అరికట్టేందుకు సమగ్ర విత్తన చట్టం రూపకల్పన జరుగుతోందని, త్వరలో ప్రభుత్వం దీనిని అమలు చేయనుందని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. లక్ష మంది రైతులకు సాగు, రైతు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు న్యాయ సలహాలిచ్చేందుకు లీఫ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, భూభారతి చట్టం రూపశిల్పి భూమి సునీల్ ఆధ్వర్యంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణం నుంచి సాగు న్యాయయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ, కల్తీ విత్తనాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత నాడు దివంగత వైఎస్సార్‌తో పాటు, నేడు సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని అన్నారు. కాగా, రాష్ట్ర వ్యాపంగా 2,400 కిలోమీటర్లు పర్యటించి కనీసం లక్ష మంది రైతులకు వ్యవసాయ చట్టాలు, రైతుల హక్కులను వివరించడమే సాగు న్యాయయాత్ర ముఖ్య ఉద్దేశమని లీఫ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు భూమి సునీల్ అన్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, భూదానయజ్ఞబోర్డు అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గనుల శాఖ డైరెక్టర్‌గా క్రాంతి

- పలువురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతల అప్పగింత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) వీసీ, ఎండీగా అదనపు బాధ్యతల నుంచి ఇ.విష్ణువర్ధన్ రెడ్డిని ప్రభుత్వం తప్పించింది. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్ కె.శశాంకకు అదనపు బాధ్యతలతో ఆ పోస్టులో నియమించింది. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతికి గనుల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. గనుల శాఖ డైరెక్టర్ పోస్టు అదనపు బాధ్యతల నుంచి శశాంకను తప్పించారు. సెర్ప్ అదనపు సీఈవో పి.కాత్యాయిని దేవికి రాష్ట్ర ఆర్థిక సంఘం జేఎండీగా అదనపు బాధ్యతలతో నియమించారు. ఖమ్మం మెప్మా పీడీ పి.మహేందర్‌ను ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిపాలన అధికారిగా బదిలీ చేశారు.

దివ్యాంగులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి

- మంద కృష్ణ మాదిగ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వీహెచ్‌పీఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్ ప్రకటిస్తూ చట్ట సవరణ ఆర్డినెన్స్ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దివ్యాంగుల రోస్టర్ సంఖ్యను 10లోపు సవరించాలని, ఎస్ఆర్టీ జీవోను తక్షణమే ఇవ్వాలన్నారు. డ్రెస్ కోడ్ ఉద్యోగాలలో 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని, క్యారీ ఫార్వడ్ చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని చెప్పారు. దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలు, ఇతర ఆసరా పెన్షన్లు రూ. 4 వేలు, తీవ్ర వైకల్యంగల దివ్యాంగులకు రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. ఇవన్నీ కూడా హామీ ఇచ్చిన తేదీ నుంచి చెల్లించాలన్నారు. దివ్యాంగులైన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు దివ్యాంగుల పెన్షన్ వర్తింప చేసి.. ప్రభుత్వ ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు.

ఏఏఐబీ డీజీ యుగంధర్‌కు ఎక్స్ కేటగిరీ భద్రత

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న అధికారి

సాక్షి, న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఈ నెల 12వ తేదీన చోటుచేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాసిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్‌కు కేంద్ర ప్రభుత్వం అదనపు భద్రత కల్పించింది. యుగంధర్‌కు ముప్పు పొంచి ఉన్నట్లు నిఘా సంస్థలు అందజేసిన నివేదిక మేరకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఆయనకు ఎక్స్ కేటగిరీ భద్రత కల్పిస్తూ శనివారం హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కుప్పకూలిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమాన శకలాల్లో లభించిన బ్లాక్‌బాక్స్ నుంచి కీలక సమాచారాన్ని యుగంధర్ రాబట్టినట్లు తెలిసింది.

అహ్మదాబాద్ విమాన ప్రమాదం... ఆఖరి బాధితుడి గుర్తింపు

260 మంది చనిపోయారన్న అధికారులు

అహ్మదాబాద్: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి గుర్తింపు పూర్తయింది. డీఎన్ఏ పరీక్ష ద్వారా శనివారం 260వ మృతుడిని గుర్తించి, సంబంధీకులకు మృతదేహాన్ని అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ విషాద ఘటనలో మొత్తం 260 మంది చనిపోయినట్లు తేలిందన్నారు. జూన్ 12వ తేదీన జరిగిన దుర్ఘటనలో విమానంలోని ఒకే ఒక్క ప్రయాణికుడు మినహా మొత్తం 241 మంది చనిపోయారు. విమానం కూలిన ప్రాంతంలో మరికొందరు చనిపోయారు. దీంతో, 270 మంది వరకు చనిపోయి ఉంటారని అంచనా వేశారు. అయితే, మృతదేహాలను బట్టి విమానంలోని 241 మంది, నేలపైనున్న 19 మంది కలిపి మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తేలిందని అహ్మదాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ జోషి శనివారం చెప్పారు. ప్రమాదం కారణంగా తీవ్రంగా గాయపడిన ముగ్గురికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు.

కార్తీక్ మహరాజ్‌పై అత్యాచార ఆరోపణలు



కోల్‌కతా: భారత్ సేవాశ్రమ్ సంఘ్‌కు చెందిన సాధువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కార్తీక్ మహరాజ్ తనపై పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డారంటూ ఓ మహిళ సంచలన ఆరోపణలు చేసింది. టీచర్ జాబ్ ఇప్పిస్తాననే హామీతో ముర్షిదాబాద్‌లోని ఆశ్రమానికి తీసుకెళ్లి, అక్కడ తనపై అత్యాచారం చేశారంది. 2013 జనవరి–జూన్ మధ్యలో ఆరు నెలల కాలంలో డజనుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించింది. భయం, నిస్సహాయత వల్లే ఇంతకాలం మౌనంగా ఉన్నట్లు వివరించింది. పోలీసులకు ఈ విషయం చెబితే ఆత్మహత్య చేసుకుంటానని కార్తీక్ మహరాజ్ బెదిరించారంది. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఆరోపణలను కార్తీక్ మహరాజ్ తీవ్రంగా ఖండించారు. తమవంటి సన్యాసులకు ఇలాంటి అడ్డంకులు సహజమేనన్నారు. ఈ వ్యవహారాన్ని తమ లాయర్లు చూసుకుంటారని చెప్పారు. కాగా, కార్తీక్ మహరాజ్ బీజేపీకి సన్నిహితుడని పేరుంది. తమ టీఎంసీకి వ్యతిరేకంగా, బీజేపీకి అనుకూలంగా కార్తీక్ మహరాజ్ పనిచేస్తున్నారంటూ 2024లో సీఎం మమతా బెనర్జీ ఆరోపణలు చేశారు. తమ ఆశ్రమం ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన సీఎం మమత క్షమాపణ చెప్పాలంటూ కార్తీక్ మహరాజ్ లీగల్ నోటీసు పంపారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 16 మంది సైనికులు మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో కల్లోలిత ఖైబర్ ప్రావిన్స్‌లో చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు మృతి చెందారు. ఘటనలో మరో 10 మంది సైనికులు, 19 మంది పౌరులు గాయపడ్డారు. ఉత్తర వజీరిస్తాన్ జిల్లాలో శనివారం ఈ దారుణం చోటుచేసుకుంది. ఆత్మాహుతి బాంబర్ పేలుడు పదార్థాలు నింపిన ట్రక్కుతో వచ్చి మిలటరీ కాన్వాయ్‌ను ఢీకొట్టాడని అధికారులు తెలిపారు. దాడి తీవ్రతకు పక్కనే ఉన్న రెండు నివాస భవనాల పైకప్పు కూలి పడగా ఆరుగురు చిన్నారులు గాయాలపాలయ్యారన్నారు. ఈ ఘటనకు తమదే బాధ్యతని పాకిస్తాన్ తాలిబన్ అనుబంధ హఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ప్రకటించుకుంది. 2021లో అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చాక సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు పెచ్చుమీరాయి.

విషమంగానే అచ్యుతానందన్ ఆరోగ్యం



తిరువనంతపురం: సీపీఎం వ్యవస్థాపక సభ్యుడు, కురువృద్ధ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్(101) ఆరోగ్యంలో ఎటువంటి మార్పు లేదని శనివారం వైద్యులు తెలిపారు. కొంతకాలంగా వయో సంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతున్న అచ్యుతానందన్ పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. ఇటీవల గుండెపోటుకు గురైన ఆయన్ను కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నిపుణులైన వైద్యుల బృందం చికిత్స అందిస్తోంది. ఆరోగ్య పరామితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. అచ్యుతానందన్ ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పులేదని ఆస్పత్రి శనివారం విడుదల చేసిన ఆరోగ్య బులెటిన్‌లో తెలిపింది. కాగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో సీపీఐ, సీపీఎంగా చీలిపోవడం తెల్సిందే. సీపీఎం వ్యవస్థాపకుల్లో సజీవంగా ఉన్న ఆఖరి సభ్యుడు అచ్యుతానందన్. కార్మికుల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాటం సాగించిన అచ్యుతానందన్ కేరళ ముఖ్యమంత్రిగా 2006–2011 సంవత్సరాల్లో పనిచేశారు.

అంతరిక్షం నుంచి భారత్

ఓ అద్భుత దృశ్యకావ్యం

నా యాత్ర జాతి సమష్టి ఘనత ● ప్రధాని మోదీతో శుభాంశు

- మీ పేరులోనే శుభం దాగుంది
- భూమికి అత్యంత దూరంగా
- మా హృదయాలకు దగ్గరగా
- మీ ప్రస్థానం యువతకు ఎనలేని స్ఫూర్తి: ప్రధాని
- భారత్ మాతా కీ జై!
- ఐఎస్ఎస్‌లో శుభాంశు నినాదం





న్యూఢిల్లీ: ''అంతరిక్షం నుంచి భారత్ ఓ అద్భుత దృశ్యకావ్యంలా కనువిందు చేస్తోంది'' – మన వ్యోమగామి వాయుసేనాని, యాగ్జియం–4 మిషన్ కెప్టెన్ శుభాంశు శుక్లా (39) చేసిన భావోద్వేగపూరిత వ్యాఖ్యలివి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో క్రమంగా కుదురుకుంటున్న ఆయన శనివారం ప్రధాని నరేంద్ర మోదీతో వీడియో లింక్ ద్వారా మాటామంతి జరిపారు. ''మ్యాప్‌లో చూసే భారతావనికి, అంతరిక్షం నుంచి కనిపిస్తున్న దృశ్యానికి పోలికే లేదు. ఇక్కడినుంచి మన దేశం చాలా పెద్దదిగా, ఎంతో గొప్పగా కనిపిస్తోంది. అంతరిక్షం నుంచి భూమి కూడా దేశాల ఎల్లలన్నవే లేకుండా ఎటునుంచి చూసినా నిండుగా, 'వసుధైక కుటుంబం'లా కనువిందు చేస్తోంది. భూగోళమంతా మన ఇల్లుగా, అన్ని దేశాల ప్రజలందరం సమస్త మానవాళికీ ప్రాతినిధ్యం వహిస్తున్నామని మనసుకు తోస్తోంది'' అని వివరించారు. ఐఎస్ఎస్‌లో కాలుపెట్టిన తొలి భారతీయునిగా శుభాంశు తిరుగులేని చరిత్ర సృష్టించారంటూ మోదీ ప్రస్తుతించారు. ''మాతృభూమి నుంచి మీరు అత్యంత దూరంగా ఉండొచ్చు గాక. కానీ ప్రస్తుతం ప్రతి భారతీయుని హృదయానికీ అత్యంత దగ్గరగా ఉన్నారు. మీ పేరులోనే శుభముంది. అందుకు తగ్గట్టే మీ యాత్ర కూడా సరికొత్త యుగానికి శుభారంభం పలికింది. మన దేశ యువతకు కొంగొత్త ఆశలతో కూడిన కొత్త అధ్యాయానికి మీ ప్రస్థానం గొప్పగా బాటలు పరిచింది'' అంటూ కొనియాడారు. ''ఇప్పుడు మనమిలా మాట్లాడుకుంటున్న ఈ సమయాన ప్రతి ఒక్క భారతీయునికీ భావోద్వేగపరంగా మీతో విడదీయలేనంతటి బంధం పెనవేసుకుపోయింది. ఆ 140 కోట్ల పై చిలుకు అవ్యక్త భావనలను, ఆకాంక్షలను వారి ప్రతినిధిగా మీకు చేరవేస్తున్నాను. త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా వెంట తీసుకెళ్లిన మీకు నా మనఃపూర్వక శుభాభినందనలు. యాగ్జియం–4 మిషన్‌కు నా శుభాకాంక్షలు'' అని పేర్కొన్నారు. తన ఐఎస్ఎస్ యాత్రను దేశ ప్రజలందరి సమష్టి ఘనతగా శుభాంశు అభివర్ణించారు.

మీ సారథ్యంలో కలలకు కొత్త రెక్కలు

''రోజుకు 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమయాలు ఆస్వాదిస్తున్నాం. గంటకు 28 వేల కి.మీ. వేగంతో భూమికి ప్రదక్షిణలు చేస్తున్నాం. ఈ వేగం మన దేశ ప్రగతి పరుగులకు అద్దం పడుతోంది'' అని శుభాంశు తెలిపారు. ఐఎస్ఎస్‌లో పరిస్థితులు ఎలా ఉన్నాయంటూ మోదీ ఆరా తీశారు. అక్కడి పరిస్థితులకు ఎలా అలవాటు పడుతున్నారని అడిగారు. తాను బావున్నానని శుభాంశు తెలిపారు. కాకపోతే శూన్య గురుత్వాకర్షణ స్థితిలో నిద్రపోవడం కూడా పెను సవాలుగానే ఉందంటూ చమత్కరించారు! అన్నింటికీ ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నట్టు చెప్పారు. ''ఇలాంటి సవాళ్ల కోసమే ఏడాది పాటు కఠోర శిక్షణ పొందాం. కానీ తీరా ఇక్కడికొచ్చాక అంతా మారిపోయింది. శూన్యస్థితి కారణంగా చిన్నచిన్న విషయాలు కూడా భూమి మీదికంటే ఎంతో భిన్నంగా ఉన్నాయి. ఇది నాకు నిజంగా సరికొత్త అనుభూతి. ''అంతరిక్షంలో తరచూ తీవ్ర ఒత్తిళ్లతో కూడిన పరిస్థితులెన్నో ఎదురవుతుంటాయి. అందుకే ఏకాగ్రత, ప్రశాంతచిత్తం చాలా అవసరం. అప్పుడే సరైన నిర్ణయాలు తీసుకోగలం. శిక్షణ సందర్భంగా వీటి గురించి ఎంతో తెలుసుకున్నా. అదంతా బాగా ఉపకరిస్తోంది. భూమికి 400 కి.మీ. ఎత్తుకు చేరిన ఈ ప్రయాణం నా ఒక్కనిది కాదు. మొత్తం దేశానిది. అంతరిక్షంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం పట్ల ఎనలేని సంతోషంగా ఉన్నా. నాకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపిన మీకు, 140 కోట్ల సహచర భారతీయులకు కృతజ్ఞతలు. ఇలా ఒకనాటికి వ్యోమగామిని అవుతానని చిన్ననాడు కలలో కూడా అనుకోలేదు. మీ నాయకత్వంలో దేశం తన కలలకు కొత్త రెక్కలు తొడుక్కుంటోంది'' అంటూ ప్రధాని నాయకత్వాన్ని ప్రశంసించారు. ''యువతకు నేనిచ్చే సందేశమల్లా ఒక్కటే. ఆకాశమే మీ హద్దు!'' అని పేర్కొన్నారు. సంభాషణను ముగిస్తూ 'భారత్ మాతా కీ జై' అంటూ శుభాంశు చేసిన నినాదాలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రమంతటా ప్రతిధ్వనించాయి.

అపార అనుభవంతో తిరిగి రండి

మన గ'ఘన' యాత్రలకు అదే పునాది

శుభాంశుకు ప్రధాని 'హోంవర్క్'

అంతరిక్షాన్ని మరింతగా అన్వేషించాలన్న మన యువత, విద్యార్థుల సంకల్పాన్ని శుభాంశు చరిత్రాత్మక యాత్ర మరింత బలోపేతం చేస్తుందని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ఆయనకు ప్రత్యేకమైన 'హోంవర్క్' అప్పగించారు. ''తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు వీలైనంత త్వరలో శ్రీకారం చుట్టేందుకు భారత్ ఎంతో పట్టుదలతో ఉంది. అలాగే పూర్తి స్వదేశీ 'భారత అంతరిక్ష కేంద్రం' నిర్మించేందుకు, భారత వ్యోమగాములను చంద్రునిపైకి పంపేందుకు కూడా! అంతరిక్ష పరిస్థితులపై సంపూర్ణ అనుభవం గడించి విజయవంతంగా తిరిగిరండి. గగన్‌యాన్ తదితర ప్రాజెక్టులన్నింటికీ మీరు వెంటతీసుకొచ్చే వెలకట్టలేని అనుభవమే తిరుగులేని పునాది!'' అని విశ్వాసం వెలిబుచ్చారు. అంతరిక్షంలో భారత్ సృష్టించబోయే నూతన చరిత్రకు తన యాత్ర కేవలం ఆరంభం మాత్రమేనని శుభాంశు బదులిచ్చారు.

క్యారెట్ హల్వా, మామిడి రసం రుచి చూపా

తనతో పాటు ఐఎస్ఎస్‌కు క్యారెట్ హల్వా, మామిడి రసం తీసుకొచ్చానని ప్రధానికి శుభాంశు వివరించారు. వాటిని, చవులూరించే పలు భారతీయ మిఠాయిలను ఐఎస్ఎస్‌లోని 10 మంది తోటి వ్యోమగాములతో శుభాంశు పంచుకున్నట్టు చెప్పారు.

'రా' చీఫ్‌గా పరాగ్ జైన్

- వచ్చే నెల 1న బాధ్యతల స్వీకరణ
- అధికారిక ఉత్తర్వు జారీ చేసిన కేంద్రం
- 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర



న్యూఢిల్లీ: పాకిస్తాన్ ఉగ్రవాద మూకలపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించిన 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్‌కు ముఖ్యమైన పదవి లభించింది. కేంద్ర ప్రభుత్వం ఆయనను అత్యున్నత నిఘా సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా) నూతన చీఫ్‌గా నియమించింది. ఈ మేరకు శనివారం అధికారిక ఉత్తర్వు జారీ చేసింది. పరాగ్ జైన్ వచ్చే నెల ఒకటో తేదీన బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారు. ప్రస్తుత 'రా' చీఫ్ రవి సిన్హా ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. నూతన చీఫ్(సెక్రెటరీ)గా పరాగ్ జైన్ నియామకానికి కేబినెట్ అపాయింట్స్‌మెంట్ కమిటీ ఇటీవలే ఆమోద ముద్ర వేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. పరాగ్ జైన్ ఇప్పటిదాకా ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ చీఫ్‌గా వ్యవహరించారు.

ప్రతిభావంతుడు పరాగ్ జైన్

పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్‌కు ప్రతిభావంతుడిగా పేరుంది. గొప్ప నేరపరిశోధకుడిగా నిఘా వర్గాల్లో గుర్తింపు సాధించారు. మానవ మేధస్సు, సాంకేతిక పరిజ్ఞానాన్ని మిళితం చేసి అనుకున్న ఫలితం సాధించడంలో దిట్ట. దేశంలో పలు కీలక ఆపరేషన్లలో స్వయంగా పాలుపంచుకున్నారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత జరిగిన ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక ఆయనది కీలక భూమిక. పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను, లాంచ్‌ప్యాడ్‌లను నేలమట్టం చేయడంలో ఆయన హస్తం ఉంది. పరాగ్ జైన్ ఇచ్చిన కచ్చితమైన నిఘా సమాచారంతోనే పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలింది. ఆయనకు జమ్మూకశ్మీర్‌లో క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం ఉంది. తన పదవీ కాలంలో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పంజాబ్‌లో తీవ్రవాదాన్ని అణచివేశారు. 2021 జనవరి 1న పంజాబ్‌లో డీజీపీ ర్యాంక్ పొందారు. డిప్యూటేషన్‌పై కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోనే ఎక్కువ కాలం పనిచేశారు. కెనడా, శ్రీలంకలోనూ వివిధ మిషన్లలో ఇండియాకు ప్రాతినిధ్యం వహించారు. కెనడాలో ఉన్నప్పుడు ఖలిస్తాన్ ఉగ్రవాద శక్తులపై నిఘా పెట్టి, కీలక సమాచారం సేకరించారు.

ఒంటి చేత్తో యుద్ధం ఆపేశా

ట్రంప్ నోట మళ్లీ అదే మాట!



వాషింగ్టన్: భారత్, పాకిస్తాన్ మధ్య అణు యుద్ధం జరిగే పరిస్థితి ఏర్పడగా, తానే చొరవ తీసుకొని ఒంటిచేత్తో ఆపేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టంచేశారు. అన్ని రకాల వాణిజ్య సంబంధాలు తెంచేసుకుంటామని హెచ్చరించడంతో ఈ రెండు దేశాలు తన మాట విని దారికొచ్చాయని, యుద్ధం ఆపేశాయని చెప్పారు. ట్రంప్ తాజాగా శ్వేతసౌధంలో మీడియాతో మాట్లాడారు. భారత్, పాక్ మధ్య ఘర్షణ మొదలైన తర్వాత తన సీనియర్ అధికారులను రంగంలోకి దించానని, ఇరుదేశాలను ఒత్తిడి పెంచానని తెలిపారు. తన చాతుర్యం ఫలించి యుద్ధం ఆగిపోయిందని వెల్లడించారు. తానే కనుక చొరవ తీసుకోకపోతే రెండు దేశాల మధ్య కచ్చితంగా అణు యుద్ధం జరిగేదని స్పష్టంచేశారు. తనలాగా గొప్ప పని చేసిన అమెరికా అధ్యక్షుడు గతంలో మరొకరు ఉన్నారో లేదో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. మధ్య కాల్పుల విరమణకు భారత్, పాక్‌లను ఒప్పించడం ద్వారా గొప్ప పని చేశానని అన్నారు. సెర్బియా, కొసావో దేశాలను సైతం ఇలాంటి దారికి తీసుకొచ్చానని, అక్కడ పెద్ద యుద్ధం ఆపేశానని ట్రంప్ ఉద్ఘాటించారు. వాణిజ్య సంబంధాలు తెంచేసుకుంటానని బెదిరించడంతో అవి ఘర్షణకు స్వస్తి చెప్పి, శాంతిని ఆశ్రయించాయని పేర్కొన్నారు. ఈ రెండు దేశాల్లో మంచి నాయకులు ఉన్నారని, వారు తెలివైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. అమెరికాతో వాణిజ్యం కావాలా? లేక ఒకరిపై ఒకరు అణు బాంబులతో దాడులు చేసుకుంటారా? అని ప్రశ్నించగా, వాణిజ్యమే కావాలని బదులిచ్చారని వివరించారు.

అంబేడ్కర్ ఆశయం 'ఒకే దేశం.. ఒకే రాజ్యాంగం'

- ఆయన దార్శనికతకు అనుగుణంగానే ఆర్టికల్ 370 రద్దును సమర్థించాం
- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి



నాగపూర్: దేశాన్ని ఐక్యంగా ఉంచాలంటే ఒక్కటే రాజ్యాంగం అమల్లో ఉండాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నిర్దేశించారని, ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రాజ్యాంగం అనే ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. ఆయన ఆశయం ఒకే దేశం.. ఒకే రాజ్యాంగం అని స్పష్టంచేశారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో శనివారం 'రాజ్యాంగ ప్రవేశిక ఉద్యానవనాన్ని' జస్టిస్ గవాయ్ ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ఐక్యతకు ఏకైక రాజ్యాంగం అనే అంబేడ్కర్ దార్శనికత నుంచి సుప్రీంకోర్టు స్ఫూర్తి పొందిందని, అందుకే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిందని తెలిపారు. ఈ ఆర్టికల్ రద్దును సమర్థించిన ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ సైతం ఉన్న సంగతి తెలిసిందే. ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు తమ ముందుకు వచ్చినప్పుడు అంబేడ్కర్ మాటలు గుర్తుచేసుకున్నానని జస్టిస్ గవాయ్ చెప్పారు. దేశానికి ఒక్కటే రాజ్యాంగం ఉండాలన్న అంబేడ్కర్ బాటను అనుసరిస్తూ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

ఎన్ని సవాళ్లు ఎదురైనా ఐక్య భారత్

రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాలు అధికంగా ఉన్నట్లు అంబేడ్కర్‌పై అప్పట్లో విమర్శలు వచ్చాయని జస్టిస్ గవాయ్ గుర్తుచేశారు. యుద్ధాలు జరిగితే దేశం ఐక్యంగా ఉండలేదని, ముక్కలవుతుందని చాలామంది అనుమానించారని చెప్పారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడంతోపాటు అన్ని రకాల సవాళ్లు సమర్థంగా ఎదుర్కొగల సత్తా రాజ్యాంగానికి ఉందని అంబేడ్కర్ బదులిచ్చారని పేర్కొన్నారు. పొరుగుదేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలో ఏం జరుగుతోందో చూడాలని, ఎన్ని సవాళ్లు ఎదురైనా మన దేశం మాత్రం దృఢంగా, ఐక్యంగానే ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సైతం ప్రసంగించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే గొప్ప బహుమతులను రాజ్యాంగం రూపంలో అంబేడ్కర్ మనకు అందించారని కొనియాడారు. ప్రజాస్వామ్యంలోని నాలుగు మూలస్తంభాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయ, మీడియా రంగాల బాధ్యతలు, హక్కులను రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిందని వెల్లడించారు.

కొలీజియంపై పదవీ విరమణ తర్వాత మాట్లాడుతా..

ముంబై: న్యాయమూర్తులకు పదోన్నతులు, నియామకాలు, కొలీజియం తీసుకుంటున్న నిర్ణయాలపై పదవీ విరమణ (ఈ ఏడాది నవంబర్ 24) చేసిన తర్వాత వివరంగా మాట్లాడతానని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. ఇప్పుడు తనకున్న పరిమితుల దృష్ట్యా ఆయా అంశాలపై ఎక్కువగా స్పందించలేనని పేర్కొన్నారు. మనం కోరుకున్నట్లుగా ఏదీ జరగదని న్యాయమూర్తులు, న్యాయవాద వర్గాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆఫ్ బాంబే హైకోర్టు బెంచ్ ఆధ్వర్యంలో జస్టిస్ గవాయ్‌ని తాజాగా సన్మానించారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన జస్టిస్ సంజయ్ వి.గంగాపూర్‌వాలాకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసే అవకాశం దక్కలేదని అన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సంజయ్ వి.గంగాపూర్‌వాలాను ఉద్దేశిస్తూ.. ''సంజయ్ భాయ్.. సుప్రీంకోర్టుకు రాకపోవడం వల్ల మీరు నష్టపోయింది ఏమీ లేదు. సుప్రీంకోర్టే నష్టపోయింది. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను'' అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకానికి ఉద్దేశించిన కొలీజియంలో సభ్యుడిగా చేరినప్పటి నుంచి ప్రతిభకే పట్టం కట్టేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నానని చెప్పారు. ప్రతిభ ఆధారంగా న్యాయమూర్తులను నియమించడానికి తపన పడుతున్నానని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో ఉన్న ఉత్తమమైన ప్రధాన న్యాయమూర్తులు సుప్రీంకోర్టుకు న్యాయమూర్తులుగా రావాలన్నదే తన ఉద్దేశమని, అందుకోసం కొలీజియంలోని సహచర సభ్యులను ఒప్పిస్తుంటానని అన్నారు. జడ్జీల నియామకం కోసం పేర్లను ఒకసారి షార్ట్‌లిస్టు చేసే సమయంలో వారి కులం, మతం, ప్రాంతం చూసే అలవాటు లేదని చెప్పారు. వారికి అర్హత ఉందా? లేదా? వారికి చట్టాలు తెలుసా? లేదా? అనేది మాత్రమే చూస్తామని స్పష్టంచేశారు. జస్టిస్ ఏఎస్ చందూర్కర్ ఇటీవల బాంబే హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చారని, ఆయన తన పాత మిత్రుడేనని, గతంలో కలిసి పని చేశామని జస్టిస్ గవాయ్ వెల్లడించారు. ఆయనకు పదోన్నతి కల్పించే విషయంలో ఆ స్నేహాన్ని పక్కనపెట్టి, అర్హతలు మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని స్పష్టంచేశారు.

'కాంటా లగా' ఫేం షెఫాలీ జరివాలా హఠాన్మరణం



ముంబై: 'కాంటా లగా' మ్యూజిక్ ఆల్బమ్‌తో ఒక్కసారిగా సెలబ్రిటీగా మారిపోయిన టీవీ నటి షెఫాలీ జరివాలా (42) హఠాన్మరణం చెందారు. షెఫాలీని శుక్రవారం రాత్రి 11.15 గంటల సమయంలో బెల్‌వ్యూ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లామని భర్త పరాగ్ త్యాగి చెప్పారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు డ్యూటీ డాక్టర్ ధ్రువీకరించారన్నారు. ఆమె గుండెపోటుతో మృతి చెందారని మీడియా తెలిపింది. షెఫాలీ ఆకస్మిక మరణంపై పలువురు బాలీవుడ్ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంధేరీలోని నివాసానికి వచ్చి షెఫాలీ మృతదేహం వద్ద నివాళులర్పించారు. 1972 నాటి సినిమా 'సమాధి'లో లతా మంగేష్కర్ పాడిన పాటకు 2002లో విడుదలైన రీ మిక్స్ 'కాంటా లగా'ద్వారా షెఫాలీ పేరు మారుమోగిపోయింది. విజయ్ సప్రు, రాధికా రావ్ దర్శకత్వం వహించిన ఈ మ్యూజిక్ ఆల్బంలో షెఫాలీ డ్యాన్స్ యువతను ఉర్రూతలూగించింది. ఆ సమయంలో ఇంజనీరింగ్ చదువుకుంటున్నట్లు షెఫాలీ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సల్మాన్ ఖాన్, అక్షయ్ ఖన్నా, ప్రియాంకా చోప్రాలతో కలిసి 2004లో 'ముఝ్‌సే షాదీ కరోగి'లో తళుక్కుమన్నారు. 'నాచ్ బలియే'డ్యాన్స్ షో సిరీస్‌లో భర్త పరాగ్ త్యాగితో కలిసి పాల్గొన్నారు. సల్మాన్ ఖాన్ వ్యాఖ్యాతగా ఉన్న 'బిగ్ బాస్ 13'లో సిద్ధార్థ శుక్లాతో కలిసి విజేతగా నిలిచారు. 'జీవితాన్ని ఆస్వాదించాల్సిన సమయమిదే. అంతా మంచే జరుగుతుందనే భావనతో ముందుకు సాగాలి'అంటూ వారం క్రితం సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన షెఫాలీ ఇంతలోనే శాశ్వతంగా దూరం కావడంతో అంతా షాక్‌కు గురయ్యారు.

ఆఖరి వ్యక్తికి సైతం సంక్షేమ పథకాలు

- అదే మా సంకల్పం: ప్రధాని నరేంద్ర మోదీ
- విద్యానంద్‌జీ మహారాజ్ శత జయంతి వేడుకలు ప్రారంభం
- మోదీకి 'ధర్మ చక్రవర్తి' బిరుదు ప్రదానం చేసిన నిర్వాహకులు



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన నాగరికత, సజీవ సంస్కృతి మన సొంతమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎందరో యోగులు, గురువులు, ఆచార్యులు, సాధువులు అందించిన మన ఆలోచనలు, ఆశయాలు, తాత్వికత శాశ్వతమని, అందుకే భరతజాతి వేలాది సంవత్సరాలుగా సజీవంగా మనగలుగుతోందని వివరించారు. ప్రఖ్యాత జైన ఆధ్యాత్మిక గురువు ఆచార్య శ్రీవిద్యానంద్‌జీ మహారాజ్ శత జయంతి వేడుకలు, ఏడాదిపాటు జరిగే శతాబ్ది ఉత్సవాలు శనివారం ఢిల్లీలో ప్రారంభమయ్యాయి. కేంద్ర సాంస్కృతిక శాఖ, భగవాన్ మహావీర్ అహింసా భారతి ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పాల్గొన్నారు. ఆచార్య స్మారకార్థం తపాలా బిళ్ల ఆవిష్కరించారు. ఆచార్యుడి జీవిత విశేషాలతో కూడిన ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి కార్యక్రమ నిర్వాహకులు 'ధర్మ చక్రవర్తి' బిరుదు ప్రదానం చేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఈ బిరుదుకు తాను అర్హుడినని భావించడం లేదని చెప్పారు. కానీ, గురువులు, యోగుల నుంచి ఏదీ లభించినా దాన్ని ప్రసాదంగా స్వీకరించడం మన సంప్రదాయం, సంస్కృతిలో భాగమని తెలిపారు. అందుకే 'ధర్మ చక్రవర్తి' ప్రసాదాన్ని స్వీకరించి, భరతమాతకు అంకితం ఇస్తున్నానని ఉద్ఘాటించారు.

మానవ జన్మకు అసలైన పరమార్థం అదే

భారతీయ తాత్విక చింతనకు సేవ, మానవత్వం మూల స్తంభాలని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. హింసను హింసతోనే అణచివేసే ధోరణి ప్రపంచంలో కొనసాగిందని, కానీ, మన దేశం అహింస అనే ఆయుధం అందించిందని చెప్పారు. మానవ సేవే మహోన్నతం అని మన దేశం బోధించినట్లు తెలిపారు. షరతులు లేకుండా, నిస్వార్థంగా సాటి మానవులకు సేవ చేయడమే మానవ జన్మకు అసలైన పరమార్థమని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆచార్య శ్రీవిద్యానంద్‌జీ మహారాజ్ ఆశయాలు, బోధనలే స్ఫూర్తి అని తెలిపారు. పీఎం ఆవాస్ యోజన, జల్‌జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్ యోజన వంటి పథకాలను సంతృప్త స్థాయిలో అందించాలని నిర్ణయించామని చెప్పారు. సమాజంలో ఆఖరి వ్యక్తికి సైతం ఈ పథకాలు అందాలన్నదే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. 'ప్రజలంతా కలిసి పని చేయాలి.. కలిసికట్టుగా ఎదగాలి' అని ఆచార్య విద్యానంద్‌జీ మహారాజ్ బోధించారని, అదే తమ సంకల్పమని ప్రధానమంత్రి తేల్చిచెప్పారు.

రష్యాలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి

పశ్చిమ దేశాలపై పుతిన్ ఆగ్రహం



మాస్కో: రష్యా ఆందోళనను పట్టించుకోకుండా పశ్చిమదేశాలు విస్తరణ వాదాన్ని అనుసరిస్తున్నాయని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మండిపడ్డారు. తమ దేశంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. శుక్రవారం పుతిన్ బెలారస్ రాజధాని మిన్స్క్‌లో జరిగిన యురేసియన్ ఎకనామిక్ సమిట్(ఈఏఈయూ)కు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. 'రష్యాలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు దాడులు, కాల్పులకు తెగబడుతున్నా ఎవరూ పట్టించుకోరు. ఇప్పటికీ దారుణాలు కొనసాగుతున్నా వాటి గురించి మాట్లాడరు. అంతా బాగుందని చెప్పుకుంటుంటారు'అంటూ పశ్చిమదేశాలపై పుతిన్ ధ్వజమెత్తారు. ఉగ్రవాదాన్ని సైతం రష్యాలో వేర్పాటువాదానికి ఒక సాధనంగా పశ్చిమ దేశాలు భావించాయని ఆరోపించారు. 'నాటో విస్తరణకు సంబంధించి రష్యాకు ఇచ్చిన హామీలను పశ్చిమదేశాలు విస్మరించాయి. ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో సైతం విఫలమయ్యాయి. ఉక్రెయిన్‌లో మేం చేపట్టిన స్పెషల్ ఆపరేషన్ మూలాలేమిటనే అంశంపై పశ్చిమ దేశాలు ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ఉక్రెయిన్ సంక్షోభానికి దశాబ్దాల క్రితమే బీజాలు పడ్డాయి. నాటో విస్తరణ విషయంలో చెప్పిన పచ్చి అబద్ధాలే తాజా సమస్యకు కారణం. ఒకదాని తర్వాత మరో దేశాన్ని నాటోలోకి కలుపుకుంటూ విస్తరించుకుంటూ వస్తున్నాయి. మా ఆందోళనలను పట్టించుకోకుండా నాటో కార్యకలాపాలు యథా ప్రకారం కొనసాగిస్తోంది. ఇది కాదా దుందుడుకు వైఖరి? ఇది కచ్చితంగా దుందుడుకు విధానమే. పశ్చిమ దేశాలు దీనిపై దృష్టి పెట్టడానికి ఇష్టపడవు'అని పుతిన్ అన్నారు. ఉక్రెయిన్‌తో మూడేళ్లుగా సాగిస్తున్న యుద్ధంపై పశ్చిమ దేశాలతో రష్యాకు విభేదాలు తీవ్రతరమైన నేపథ్యంలో ఆయనీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రష్యా దూకుడును నిలువరించేందుకు సభ్య దేశాలు తమ జీడీపీలో 5 శాతం రక్షణకు కేటాయించాలంటూ నాటో ఇటీవల నిర్ణయించడం తెల్సిందే.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 29 । జూన్ । 2025



ఏపీలో వి'ఫలమై'.. రాష్ట్రానికి పోటెత్తి..

ఏపీలో మామిడి పండ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టగా, తెలంగాణ మార్కెట్‌కు పోటెత్తాయి. మద్దతు ధర కల్పిస్తామన్న అక్కడి ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. -10లో



భార్య.. భర్త.. ఓ మిడ్ వైఫ్..

నగరంలో ఇటీవల సహజ ప్రసవాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, 'మిడ్ వైఫ్' పేరిట ప్రాచీన విధానం ఆధునిక రూపంలో అందుబాటులోకి వస్తోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 34.0/24.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 34, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో వరద ముప్పు నుంచి నగరాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ (ఎంఈటీ)లు సిద్ధమయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఎంపిక చేసిన ఎంఈటీలకు సర్కిళ్ల వారీగా విధులను శనివారం హైడ్రా అప్పగించింది. మొత్తం 30 సర్కిళ్లలో 150 టీమ్‌లు జులై 1వ తేదీ నుంచి పని చేయనున్నాయి. విధి నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బృందాలకు సూచించారు. వర్షం ఎప్పుడు పడినా అప్రమత్తంగా ఉండి.. ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వర్షానికి ముందే రహదారుల్లో నీరు వెళ్లేందుకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నాలాలను, కల్వర్టులను పరిశీలించి.. వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేలా జాగ్రత్త పడాలన్నారు. ఎక్కడ నీరు నిలుస్తుందో ముందుగానే ఒక అంచనాకు వచ్చి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. 150 ఎంఈటీ బృందాలకు హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు కూడా సహకరిస్తాయని.. సమన్వయంతో పని చేయాల్సిన వసరం ఉందని ఆయన చెప్పారు.





పీజేఆర్ ఫ్లైఓవర్.. థాంక్యూ సార్

గచ్చిబౌలిలో రూ.182.72 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్‌కు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. దీనికి పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపి.. జ్ఞాపికను అందజేశారు.

నేటి నుంచి ఉజ్జయినీ మహంకాళి ఘటోత్సవాలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. అమ్మవారి బోనాల జాతరకు 15 రోజుల ముందు (ఘటోత్సవం) ఘటాల ఎదుర్కోలు నిర్వహించడం ఆనవాయితీ. ఘటాల ఎదుర్కోలుతోనే బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లుగా భావిస్తారు. ఘటాలకు సంబంధించిన సామగ్రిని కర్బలా మైదానం ప్రాంతంలోని అమ్మవారి దేవాలయానికి తీసుకువెళ్లి ఘటాన్ని ముస్తాబు చేస్తారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు ముస్తాబైన ఘటాన్ని డప్పుల దరువులతో దేవాలయానికి తీసుకువస్తారు.

వీధి వీధికి అమ్మవారి దర్శనం

ముస్తాబైన ఘటాన్ని సోమవారం నుంచి వివిధ ప్రాంతాల్లోని భక్తులకు దర్శనం గావిస్తారు. జూలై 11 వరకు ఆయా ప్రాంతాల్లో దర్శనం ఇచ్చి 12న దేవాలయానికి తీసుకువస్తారు. 13న బోనం, 14న రంగం, భవిష్యవాణి అనంతరం అంబారీ ఊరేగింపుతో అమ్మవారి ఘటాన్ని మెట్టుగూడలోని అమ్మవారి ఆలయానికి సాగనంపుతారు.

బోనాలకు అంతా సిద్ధం

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చాయని ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. దేవాలయానికి 80 శాతం రంగుల పనులు పూర్తయ్యాయన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ఘటోత్సవానికి హాజరవుతారని చెప్పారు. అనువంశిక ధర్మకర్తలు సురిటి రామేశ్వర్, కామేశ్వర్ పాల్గొన్నారు.



పీవీకి పుష్పాంజలి


రాంగోపాల్‌పేట్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని శనివారం నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.

'బేగంపేట'.. ఉత్కంఠ!



విమానాలకు అడ్డొచ్చే భవనాల్ని తొలగించాల్సిందే!!

- ప్రత్యేక రూల్స్ రూపొందించిన విమానయాన శాఖ
- అహ్మదాబాద్ ఘటన నేపథ్యంలో గత ఉత్తర్వుల్లో కీలక సవరణలు
- బేగంపేట ఎయిర్‌పోర్టు సమీప బస్తీలు, కాలనీల బాధితుల ఆందోళన



కంటోన్మెంట్:

గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో గౌరవ విమానయాన శాఖ ముందస్తు జాగ్రత్తలకు శ్రీకారం చుట్టింది. పౌర విమానాల రాకపోకలకు అడ్డుగా ఉండే భవనాలు చెట్ల తొలగింపులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా 'భారతీయ వాయుయాన్ అదినీయం', 2024 (16 ఆఫ్ 2024)లో కీలక సవరణలు చేపట్టింది. ఈ చట్టంలోని సెక్షన్ 34 పరిధిలోకి వచ్చే నిర్మాణాలకు నోటీసుల జారీ ప్రక్రియలో పలు సవరణలు చేశారు. ఈ మేరకు రూపొందించిన డ్రాఫ్ట్ రూల్స్‌తో ఈ నెల 18న ప్రత్యేక గెజిట్ ప్రచురించింది. ఈ గెజిట్ ప్రచురితమైన 21 రోజుల తర్వాత సంబంధిత రూల్స్ వినియోగంలోకి రానున్నాయి. ఈ గడువులోపు సంబంధిత రూల్స్‌పై అభ్యంతరాలను వ్యక్తం చేయాల్సిందిగా పేర్కొన్నారు. దీంతో ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బేగంపేట విమానాశ్రయ పరిసరాల్లో బస్తీలు, కాలనీల్లోని వేలాది నిర్మాణాల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. రసూల్‌పురా, అన్నానగర్ పరిధిలోని వేలాది నిర్మాణాలు పూర్తిగా ఎయిర్‌పోర్టు స్థలాల్లోనే వెలసినవి కావడం గమనార్హం. కంటోన్మెంట్ పరిధిలోని కాలనీల్లో నిర్మాణాలకు ముందస్తుగానే ఎయిర్‌పోర్టు అథారిటీ ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే.. ఈ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను పాక్షికంగా తొలగించాల్సి ఉంటుంది.

ఏమిటీ సవరణలు..

- 'భారతీయ వాయుయాన్ అదినీయం', చట్టం సెక్షన్ 18 (1), (3) ప్రకారం సంబంధిత అధికారి విమాన యాన రాకపోకలకు అడ్డంకిగా ఉండే భవనాలు, చెట్ల తొలగింపు నోటీసు జారీ చేస్తారు.
- నోటీసు జారీ చేసిన 60 రోజుల్లోపు సంబంధిత భవనం, చెట్ల యజమాని పూర్తి వివరాలతో సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అవసరమైతే ఈ గడువును మరో 60 రోజుల వరకు పెంచే వెసులుబాటు ఉంది.
- నిర్దేశిత గడువులోపు సంబంధిత యజమాని కోరిన వివరాలు సమర్పించకపోతే, అధికారులు ఇచ్చిన సమాచారాన్నే పరిగణనలోకి తీసుకుంటారు.
- విమానయాన రాకపోకలకు అడ్డంకిగా ఉన్నట్లు గుర్తించిన ఏదైనా భవనం లేదా చెట్టును సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది నివేదిక రూపొందిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలనకు యజమానులు పూర్తిస్థాయిలో సహకరించాల్సి ఉంటుంది.
- పౌర విమానయాన శాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులకు స్పందించని యజమానులపై జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేసి, తదుపరి చర్యలు చేపడతారు.

ఆ బస్తీల మనుగడ ప్రశ్నార్థకం

ఈ నిబంధనలపై విమానాశ్రయాల సమీపంలోని భవనాల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని యజమానులు నిరసన వెలిబుచ్చుతున్నారు. కంటోన్మెంట్లో భవన నిర్మాణాలకు పౌర విమాన యాన శాఖ నుంచి ముందస్తుగానే ఎన్‌ఓసీలు తీసుకుంటారు. వారు సూచించిన ఎత్తుకు లోబడే మెజారిటీ నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. కొన్ని నిర్మాణాలు మాత్రమే నిర్దేశిత ఎత్తుకంటే ఎక్కువ మోతాదులో ఉన్నాయి. బేగంపేట విమానాశ్రయం చుట్టూ ఉన్న కంటోన్మెంట్ పరిధిలోని నిర్మాణాలకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది.

- జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వచ్చే వేలాది నిర్మాణాలకు ఎయిర్ పోర్టు ఎన్‌ఓసీ నిబంధన అమల్లో లేదు. పౌర విమానయాన శాఖ తాజా ఉత్తర్వులతో బేగంపేట ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ఉన్న వేలాది నిర్మాణాలు పాక్షికంగా కూల్చివేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. నగరం నడిబొడ్డున ఉన్న బేగంపేట విమానాశ్రయంలో సాధారణ పౌరుల విమానాల రాకపోకలు కొన్ని ఏళ్ల క్రితమే నిలిచిపోయాయి. కేవలం చార్టెడ్ ఫ్లైట్లు, రక్షణ శాఖ విమానాలు మాత్రమే బేగంపేటకు వస్తున్నాయి. వీటి కోసం వేలాది భవనాలను కూల్చివేసే బదులు, ఈ విమానాశ్రయాన్నే తరలించాల్సిందిగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బేగంపేట ఎయిర్‌పోర్టును తరలించండి: వికాస్ మంచ్



సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ వికాస్ మంచ్ సభ్యులు

సామాన్య పౌరుల రాకపోకలు నిలిచిపోయిన బేగంపేట ఎయిర్‌పోర్టును పూర్తిగా మూసివేయాల్సిందిగా కంటోన్మెంట్ వికాస్ మంచ్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చార్టెడ్, వివిధ సంస్థలకు చెందిన విమానాల కోసం మాత్రమే వినియోగిస్తున్న బేగంపేట ఎయిర్ పోర్టును దుండిగల్ లేదా హకీంపేటకు తరలించాలని కోరారు.

సుజలం.. సఫలం!

కలుషిత నీటి సరఫరా కట్టడి ప్రధాన లక్ష్యం

- ఒకే ప్రాంతంలోని డ్రైనేజీలు, వాటర్ పైపులైన్లపై నజర్
- లైన్ల వారీగా నీటి సరఫరాపై ఆరా
- లీకేజీల గుర్తింపుతో తక్షణ మరమ్మతులు
- నీటి నమూనాల సేకరణ.. స్వచ్ఛత పరీక్షలు
- చర్యలకు ఉపక్రమించిన జలమండలి



సాక్షి, సిటీబ్యూరో: 'నగరంలో సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా గట్టి చర్యలు చేపట్టండి' అని రెండు రోజుల క్రితం జరిగిన పురపాలక శాఖ ఉన్నత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ దిశగానే నగరానికి సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా జలమండలి చర్యలు చేపట్టింది. వర్షాకాలం నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి పైపులైన్ లీకేజీలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతోంది. మరోవైపు లైన్లవారీగా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై ఆరా తీస్తోంది. నీటి నమూనా సేకరణ సంఖ్య పెంచి పరీక్షలు నిర్వహిస్తోంది. వాటిపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తోంది. ప్రధానంగా మురుగు నీటి, తాగునీటి పైపులైన్లు ఒకే దగ్గర గల ప్రాంతాల్లోని నల్లా క్రాసింగ్‌లపై దృష్టి సారించింది. మురికి వాడల్లో గుంతల్లోని నల్లాలకు మూతలు పెట్టేలా స్థానికులకు అవగాహన కల్పిస్తోంది. మెట్రో కస్టమర్ కేర్ వచ్చే ఫిర్యాదులపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టింది.

స్వచ్ఛతపై పరీక్షలు

నీటి సరఫరా సమయంలో స్వచ్ఛత పరీక్షల సంఖ్య పెంచింది. రోజువారీగా సుమారు 20వేల నీటి నమూనాలను సేకరించి పరీక్షిస్తోంది. క్లోరినేషన్ హెచ్చు తగ్గులు నమోదైతే తక్షణమే సంబంధిత పైపులైన్‌కు నీటి సరఫరా నిలిపివేసి చర్యలు చేపడుతోంది. వాస్తవంగా జలమండలి తాగునీటి సరఫరాలో మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియను అమలు చేస్తోంది. మొదటి దశలో నీటి శుద్ధి కేంద్రాల వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ చేపడుతోంది. సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

- నీటి సరఫరా పైపులైన్లలో కలుషిత మూలాలను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమున్న యంత్రాలను వినియోగిస్తోంది. రోడ్డు, పైపులైన్ తవ్వకుండానే నీటి కాలుష్య మూలాలు, లీకేజీలను త్వరగా గుర్తించి సరిచేసేందుకు ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ కెమెరాతో కూడిన అధునాతన 'క్విక్ ఇన్‌స్పెక్షన్‌వాటర్ పొల్యూషన్ సిస్టం యంత్రాలను రంగంలోకి దింపింది. యంత్రం ద్వారా పైపులైన్‌లో అంతర్గత స్థితి, విస్తరించిన కాలుష్యం వాటర్‌లైన్ బ్లాక్‌లు, పైపులైన్ పగుళ్లు, నీటిలో మునిగిన వాల్వ్‌లను గుర్తిస్తోంది.
- బ్యాటరీతో నడిచే ఈ యంత్రానికి 120 మీటర్ల పొడవైన పైపు ఉంటుంది. దానికి లైట్‌తో కూడిన ఒక కెమెరా, పైన మానిటర్ ఉంటుంది. యంత్రం పైపునకు ఉన్న కెమెరాను సంబంధిత వాటర్ పైపులైన్, మ్యాన్‌హోల్‌లోకి పంపిస్తున్నారు. ఈ యంత్రాన్ని ఆపరేట్ చేసి సిబ్బంది పైన మానిటర్ ద్వారా పర్యవేక్షిస్తారు. వీడియో సైతం రికార్డు అవుతోంది. సమస్యను గుర్తించి తక్షణమే చర్యలు చేపడుతున్నారు.

త్వరలో రైఫిల్ షూటింగ్ శిక్షణ

అమీర్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో.. • జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు



సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే వివిధ క్రీడల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ త్వరలో రైఫిల్ షూటింగ్‌లోనూ శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే అమీర్‌పేటలోని గురుగోవింద్ సింగ్‌జీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షూటింగ్ రేంజ్, శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ.. దాని నిర్వహణ కోసం, శిక్షణ నిచ్చేందుకు ఆసక్తి గల ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణతోపాటు బిడ్స్‌ను ఆహ్వానించింది.

ఒలింపిక్స్ పతకాల స్ఫూర్తితో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ ప్రాధాన్యమిస్తుండటం తెలిసిందే. గత సంవత్సరం ఒలింపిక్స్‌లో ఎయిర్‌పిస్టల్ షూటింగ్‌లో మనూభాకర్ వ్యక్తిగతంగా, మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్‌జోత్‌సింగ్‌తో కలిసి రెండు పతకాలు సాధించిన నేపథ్యంలో పలువురు విద్యార్థులు,క్రీడాకారులు షూటింగ్‌పై ఆసక్తి కనబరచడంతో జీహెచ్‌ఎంసీ షూటింగ్ శిక్షణనిప్పించేందుకు సిద్ధమైంది. తొలిదశలో అమీర్‌పేట, శేరిలింగంపల్లి, అంబర్‌పేట ప్రాంతాల్లోని స్టేడియంలలో ఏర్పాట్లు చేయాలనుకున్నప్పటికీ, అమీర్‌పేట కేంద్రంలో షూటింగ్ రేంజ్‌ఏర్పాట్లు పూర్తి కావడంతో నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణతో పాటు బిడ్‌లను ఆహ్వానించింది. ఆసక్తి కల ఏజెన్సీలు స్విస్ చాలెంజ్ మోడల్‌లో తమ ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. బిడ్‌లు సమర్పించే ఏజన్సీలు స్పోర్ట్స్ అర్హత, అనుభవం కలిగిన సూపర్‌వైజర్/వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి. అంకితభావం కలిగిన కేర్‌టేకర్ ఉండాలి. అవసరమైనప్పుడు మరమ్మతులు చేయగలిగే సామర్థ్యం ఉండాలి. నిర్వహణ కోసం తగినంత మంది సిబ్బందిని నియమించాలి. శిక్షణ నిచ్చేందుకు అర్హులైన కోచ్‌లు ఉండాలి. ఏజెన్సీ ఎంపిక పూర్తయ్యాక, శిక్షణకార్యక్రమాలు ప్రారంభించనున్నారు.

వడివడిగా ఎలివేటెడ్ కారిడార్ పనులు

శామీర్‌పేట్ కారిడార్‌కు టెండర్లు

- భూముల బదలాయింపుపై రక్షణశాఖ, హెచ్‌ఎండీఏల మధ్య కుదిరిన ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి మార్గం సుగమమైంది. రక్షణ శాఖ భూముల సేకరణపై ఆ శాఖ అధికారులు, హెచ్‌ఎండీఏకు మధ్య శనివారం పరస్పర ఒప్పందం కుదిరింది. హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్, రక్షణ శాఖకు చెందిన స్టేషన్ కమాండర్ బ్రిగేడియర్ ఎస్.రాజీవ్‌లు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఎంఏయూడీ సెక్రటరీ ఇలంబర్తి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, మేజర్ జనరల్ మిశ్రా, రిటైర్డ్ ఆర్మీ అధికారి కె.సోమశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ రెండు కారిడార్‌ల నిర్మాణానికి రక్షణశాఖ గత సంవత్సరం మార్చి ఒకటో తేదీనే అనుమతినిచ్చింది. ఇందుకనుగుణంగా తాజాగా ఈ ఒప్పందం కుదిరింది. దీంతో ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వేలతో పాటు అన్ని ప్రాథమిక పనులు పూర్తి కావడంతో త్వరలో కారిడార్‌ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు 5.4 కి.మీ. కారిడార్‌కు టెండర్లు పూర్తయ్యాయి. నిర్మాణ సంస్థను ఎంపిక చేశారు. దీంతో మొదట ఈ రూట్‌లో ఎలివేటెడ్ పనులు పట్టాలెక్కనున్నాయి. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు 18.10 కి.మీ ఎలివేటెడ్‌కు టెండర్ల ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు చెప్పారు.

330 ఎకరాల భూమి అప్పగింత..

తాజా ఒప్పందం ప్రకారం రెండు మార్గాల్లో సుమారు 156 ఎకరాల రక్షణశాఖ భూములు కారిడార్‌ల కోసం కేటాయించనున్నారు. అందుకు ప్రతిగా జవహర్‌నగర్, తదితర ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏకు ఉన్న భూముల్లో 330 ఎకరాలను రక్షణశాఖకు బదిలీ చేస్తారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు 114 ఎకరాలు, ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు 42 ఎకరాల చొప్పున రక్షణశాఖ భూములు కోల్పోనుంది. మరోవైపు శామీర్‌పేట్ రూట్‌లో 78 ఎకరాలు, డెయిరీఫామ్ రూట్‌లో 13 ఎకరాల ప్రైవేట్ భూముల సేకరణ కూడా తుదిదశకు వచ్చిందని అధికారులు తెలిపారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- చెత్త అనుకుని వృద్ధురాలిని జేసీబీతో ఎత్తేసిన బల్దియా సిబ్బంది
- తలకు తీవ్ర గాయాలతో మృత్యువాత



ప్రమాదంలో మృతి చెందిన రేఖ

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యానికి ఓ వృద్ధురాలు బలైంది. చెత్త ఎత్తే క్రమంలో అప్రమత్తంగా ఉండని కారణంగా ఓ నిండుప్రాణం గాల్లో కలిసింది. ఈ ఘటన శనివారం నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్‌లోని గాంధీ కుటీర్ వద్ద చెత్తకుండీ సమీపంలో రేఖ (58) అనే వృద్ధురాలు ప్లాస్టిక్ కవర్ కప్పుకుని నిద్రించింది. అదే సమయంలో చెత్త తరలించేందుకు లారీ, జేసీబీతో అక్కడికి వచ్చిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది.. ప్లాస్టిక్ కవర్ కింద పడుకున్న రేఖను గమనించకుండా.. అది కూడా చెత్త అనుకుని జేసీబీతో ఎత్తి లారీలో వేసేందుకు ప్రయత్నించారు. దీంతో వృద్ధురాలి తలకు తీవ్రగాయాలై మృతి చెందింది. ఇది గమనించిన సిబ్బంది వెంటనే 108కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది రేఖను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. 2018లో రేఖ భర్త చనిపోయాడని, కూతురు సోనీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S. No. 184 of 2025.

Between:
Nimmagadda Krishnaveni and others ...Plaintiffs.
And
The Tahsildar, Office of Saidabad Mandal and another. ...Defendants
To, All concerned.
Take notice that the plaintiffs filed the above suit to declare them as class-I legal heirs of Late Nimmagadda Laxmi Narayana, and to succeed to the his property, ie., all that house premises bearing No. 16-2-752/118, constructed over plot.No.C-49, totally admeasuring 318 sq. yards, or 266.3 sq. forming part of Sy.No. 53/1, situated at State Bank of Hyderabad cooperative Housing Society Limited, Saidabad-Unit. III Saidabad village and Mandal, Hyderabad, and bounded by: **North:** 40' Road; **South:** Open Land of Neighbours; **East:** Plot.No.48; & **West:** Plot.No. 50, anyone having objection/s over the same may appear before the above Court **on 8-07-2025 at 10.30 a.m** either in person or through an authorized Advocate and answer the claim of the plaintiffs, failing which the matter will be decided as per material available on record.
"BY ORDER OF THE COURT"
Sd/- K. Dhanpal Reddy, A. Jagadishwar Advocates
D/No 16-2-740/75/80, Plot. No.80, Main road, V.K. Dhage Nagar Malakpet, Hyderabad-36. (M) 94847 12532

కారు ఢీకొని మహిళ మృతి


నవ్య

నాగోలు: రోడ్డు దాటుతున్న మహిళను గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్, విజయపురికాలనీ చెందిన రాజేశ్వరి కుమార్తె జి.నవ్య(24) శనివారం తెల్లవారు జామున 2:30 గంటల సమయంలోఎల్‌బీనగర్ ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో నవ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి రిటైర్డ్ ఎస్‌ఐ ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి రిటైర్డ్ ఎస్‌ఐ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం..అంబర్‌పేట, బాపూనగర్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఎస్‌ఐ ఎం.హనుమంతరావు (77) కుటుంబ కలహాలతో విసుగు చెంది విద్యానగర్ - జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్‌లో తన చావుకు ఎవరూ బాధ్యులు కారని పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శేరిలింగంపల్లికి ఇక మహర్దశ

- అనువైన చోటు చూపిస్తే పీజేఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడి
- అట్టహాసంగా పీజేఆర్ ఫ్లైఓవర్ ఆరంభం

అభివృద్ధికి దండిగా నిధులిస్తామన్న సీఎం రేవంత్



చందానగర్: రాష్ట్రంలో అత్యధిక ఆదాయం సమకూరే ప్రాంతంగా శేరిలింగంపల్లి పేరొందిందని, అందుకే శేరిలింగంపల్లికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి అభివృద్ధిలో దూసుకెళ్లాలా చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొండాపూర్ నుంచి ఓఆర్ఆర్ వరకు నిర్మించిన పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం సీఎం ఈ ప్రకటన చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గాంధీ చేసే ప్రతి ప్రతిపాదనకు ఎక్కడా నిధుల కొరత ఉండదని, ఆయా పనులకు వెంటనే మంజూరు చేయాలని అధికారులందరినీ ఆదేశించామని సీఎం వెల్లడించారు. అలాగే అధికారం చేపట్టగానే రూ.1,600 కోట్ల నిధులను మంజూరు చేశామని ఆయన గుర్తు చేశారు. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థమెరుగు, మంచినీటి సౌకర్యాన్ని కల్పించడానికి చర్యలు చేపట్టామన్నారు.

నాలుగు నియోజకవర్గాలుగా శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి ప్రస్తుతం రాష్ట్రంలోనే కాదు దేశంలోనే అతిపెద్ద జనాభా, ఓటర్లు ఉన్న నియోజకవర్గమని సీఎం గుర్తు చేశారు. ఈ నియోజకవర్గాన్ని విభజనలో భాగంగా 2029లో నాలుగు నియోజకవర్గాలుగా మారుస్తామన్నారు. గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గం అతిపెద్దగా ఉండేదని, దాన్ని విభజిస్తే ఏడు నియోజకవర్గాలుగా విభజించారని, ఏడు మంది ఎమ్మెల్యేలు అయ్యారని, అదే స్థాయిలో శేరిలింగంపల్లిని అభివృద్ధి చేస్తే నలుగురు కొత్త ఎమ్మెల్యేలు అవుతారని, వారిని గెలిపించే బాధ్యత గాంధీనే తీసుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

సీఎం ప్రకటనతో ఉత్సాహం..

శేరిలింగంపల్లిని అభివృద్ధిలో ముందుంచుతామని సీఎం స్పష్టం చేయడం అందరిలో ఉత్సాహం నింపిందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ప్రజలు కోరిన విధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు అవసరమని ఆయన గుర్తు చేశారు. ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టు ద్వారా సాఫీగా ప్రయాణాలు సాగే విధంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే రోడ్ల విస్తరణకు కూడా ప్రతిపాదనలు చేశామని వెంటనే మంజూరు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పీజేఆర్ విగ్రహానికి గ్రీన్ సిగ్నల్

ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన పీజేఆర్ పేరిట ఫ్లైఓవర్‌కు నామకరణం చేయడం సముచితంగానే ఉన్నా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గాంధీ సీఎం రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా కోరారు. అందుకు సీఎం వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అధికారులు అనువైన చోటు చూపిస్తే అక్కడ పీజేఆర్ విగ్రహానికి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీజేఆర్ కుటుంబ సభ్యులు, కుమార్తెలు అనురాగిణి రెడ్డి, విజయారెడ్డి, పావని రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని వేదికపై ప్రత్యేకంగా కలిసి సన్మానించారు. అనంతరం జ్ఞాపికను అందించారు.

బైక్ దొంగల ఆటకట్టు

11 బైకుల స్వాధీనం, నలుగురు రిమాండ్


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో ఏసీపీ శంకర్‌రెడ్డి

సుభాష్‌నగర్: ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తూ జల్సాలకు అలవాటు పడిన నలుగురిని కటకటాల్లోకి పంపిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం సూరారం పోలీస్ స్టేషన్‌లో స్థానిక సీఐ, దుండిగల్ సీఐలతో కలిసి మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. అన్నారానికి చెందిన విజయ్‌కుమార్ సూరారం కాలనీలో నివాసం ఉంటూ రోడ్డు పక్కన చెప్పులు కుడుతుండేవాడు. సులభంగా డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో స్నేహితులు దుండి రాజు, సాయి, కోరల రవితో కలిసి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేయడం ప్రారంభించాడు. శనివారం బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డు పక్కన అనుమానాస్పదంగా తిరుగుతుండగా విజయ్‌కుమార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా స్నేహితులతో కలిసి 11 బైకులు దొంగతనం చేసినట్లు వెల్లడించాడు. ఈ మేరకు దుండిగల్, సూరారం, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో డిఐ సతీష్ ఆధ్వర్యంలో 11 బైకులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.15 లక్షలు ఉంటుందని తెలిపారు. గడిచిన 26 రోజుల వ్యవధిలో మేడ్చల్ ఏసీపీ పరిధిలోని దుండిగల్, సూరారం పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు గురైన 30 ద్విచక్ర వాహనాలను తమ సిబ్బంది రికవరీ చేశారని ఏసీపీ తెలిపారు. సమావేశంలో సూరారం ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్, దుండిగల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ పాల్గొన్నారు.

నకిలీ ప్రకటనలతో చీటింగ్: నిందితుడి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక మాధ్యమాలలో నకిలీ ప్రకటనలు చేస్తూ అమాయకులను మోసం చేస్తున్న సైబర్ నేరస్తుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాకినాడకు చెందిన పేకేటి వీరబాబు ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకు ఎంబ్రాయిడరీ యంత్రాన్ని విక్రయిస్తున్నట్లు నకిలీ ప్రకటన ఇచ్చాడు. దీన్ని గమనించిన హైదరాబాద్‌కు చెందిన 33 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగి సంప్రదించాడు. రూ.2.30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఫోన్ పే ద్వారా సొమ్మును బదిలీ చేయాలని సూచించడంతో కేటుగాడి మాటలను నమ్మిన బాధితుడు తన కెనరా బ్యాంక్ ఖాతా నుంచి పలు దఫాలుగా సొమ్మును బదిలీ చేశాడు. ఆ తర్వాత నుంచి నిందితుడు స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు వీరబాబును అరెస్టు చేశారు. అతని నుంచి ఫోన్, యూనియన్ బ్యాంక్ డెబిట్ కార్డును స్వాధీనం చేసుకున్నారు.

నిషేధిత ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

గన్‌ఫౌండ్రీ: నిషేధిత ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన నిషేధిత ఎలక్ట్రానిక్ నికోటిన్ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అబిడ్స్ కట్టెలమండి ప్రాంతంలోని సుల్తాన్ సిగరెట్ల విక్రయిస్తూ మహ్మద్ తబీర్ హుస్సేన్, మహ్మద్ పాషాలను మార్కెటింగ్ చేయడం కోసం నియమించాడు. వీరు సుల్తాన్ నుంచి ఈ-సిగరెట్లు కొనుగోలుచేసి అవసరమైన వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 190 ఎలక్ట్రానిక్ సిగరెట్లు, 3 యాపిల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.13,500 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ముగిసిన యాంకర్ స్వేచ్ఛ అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

ముషీరాబాద్/గాంధీఆస్పత్రి: టీవీ న్యూస్ చానల్ యాంకర్ స్వేచ్ఛ అంత్యక్రియలు అంబర్‌నగర్ శ్మశానవాటికలో శనివారం మధ్యాహ్నం ముగిశాయి. గాంధీ ఆసుపత్రి మార్చురీ నుంచి ఆమె భౌతికకాయాన్ని ఈస్ట్ మార్సిగుట్టలోని వారి నివాసానికి తీసుకురాగా బంధుమిత్రులు, స్నేహితులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై కన్నీటి నివాళులు అర్పించారు. తల్లిదండ్రులు శంకర్, శ్రీదేవి కూతురు స్వేచ్ఛ భౌతికకాయాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. సికింద్రాబాద్ గాంధీ మార్చురీలో స్వేచ్ఛ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. యాంకర్ స్వేచ్ఛ మృతదేహంపై ఎటువంటి గాయాలు లేవని, ఉరివేసుకున్న గుర్తులు ఉన్నాయని, ఆత్మహత్యగానే తాము భావిస్తున్నామని గాంధీ మార్చురీ వైద్యుడు ప్రొఫెసర్ వెంకటనాగరాజు స్పష్టం చేశారు.

పలువురి నివాళి..

మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, వేముల వీరేశం, మందుల సామ్యూల్, మాజీ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు స్వేచ్ఛ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కాగా తన కూతురి ఆత్మహత్యకు తనతో సహజీవనం చేస్తున్న పూర్ణచందర్‌నాయక్ కారణం అని స్వేచ్ఛ తండ్రి శంకర్ ఆరోపించారు. ఈ మేరకు అతనిపై చర్యలు తీసుకోవాలని చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇలా అయితే తీర్పుల అమలు ఎలా ?

- వినియోగదారుల ఫోరంలో కేసు గెలిచినా తప్పని తిప్పలు
- దశాబ్దాలుగా ఎదురుచూపులు

సిటీ కోర్టులు: కారు పార్కింగ్ స్థలం కోసం 2008లో వినియోగదారుల ఫోరంలో ఓ వ్యక్తి కేసు దాఖలు చేశాడు. రాష్ట్ర విభజనకు ముందే అతనికి అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే సదరు వ్యక్తి కోర్టు ఆదేశాల అమలు కోసం ఏకంగా 17 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాడు. రాష్ట్ర కమిషన్, నేషనల్ కమిషన్‌లను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఆ తీర్పు అమలు కోసం జిల్లా కమిషన్‌లో 2014లో దాఖలు చేసుకున్న పిటిషన్ దశాబ్ద కాలంగా కొనసాగుతోంది. ప్రతివాదులు కేసును ఏదో సాకుతో వాయిదా వేస్తూ వస్తున్నారు. 70 ఏళ్ల వయసులో ఫిర్యాదుదారు ప్రతి వాయిదాకు వస్తున్నా...ప్రతివాదులు మాత్రం ఏదో ఒక వంక చూపి తీర్పును అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిట్‌కోతో ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్నా రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వ ప్రతినిధుల ప్రాతినిధ్యం లేదు. భాగస్వామ్య కంపెనీ ఆధీనంలో ఉన్నా దానికి కూడా పూర్తి స్థాయి పాలకవర్గం లేక అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. దీంతో అక్కడ పార్కింగ్ ప్రాంతాలు వేరే వారి ఆక్రమణలో ఉన్నాయని, అసోషియేషన్ సహకరించడం లేదని ప్రతివాదులు పేర్కొంటున్నారు. తీర్పు అమలు చేయని ప్రతివాదులపై క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ అధికారాలు కలిగిన వినియోగదారుల కమిషన్ విచారణ జరిపి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.1లక్ష వరకు జరిమానా విధించొచ్చు. కానీ ఇది జరగడం లేదు. హైదరాబాద్ జిల్లా కమిషన్‌లో చాలా కాలంగా వారెంట్లు పెండింగులో ఉన్నాయి.

ఒక మహిళ కోర్టు చుట్టూ తిరిగి విసిగిపోయిన దశలో పోలీసుల నుండి వారెంట్ల అమలు కోసం ఒత్తిడి రావడంతో ప్రతివాదులు వేరే దారి లేక జిల్లా కమిషన్ ముందు వారెంట్ రద్దు చేయమని పిటిషన్ వేసుకున్నారు. జిల్లా కమిషన్ పిటిషన్ కొట్టివేయగానే ప్రతివాదులు రిమాండ్ చేస్తారనే భయంతో విచారణ సమయంలో గైర్హాజరయ్యారు. తరువాత పై కోర్టులను ఆశ్రయించి బయటపడ్డారు. అనంతరం జిల్లా కమిషన్‌పైనే ఎదురు పిటిషన్ వేసి వేధించారు. మరో కేసులో ఢిల్లీ నేషనల్ కమిషన్ వరకు వెళ్లినా అక్కడా చుక్కెదురు కావడంతో తిరిగి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. స్టే కోసం మరో పిటిషన్ వేశారు. జిల్లా కమిషన్ సమయమిచ్చినా స్టే ఉత్తర్వులు జారీ కానందున సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసు విచారణకు ఉపక్రమించింది. ప్రతివాది రెండు వాయిదాలకు హాజరు కాలేదు. మినహాయింపు కోసం ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కమిషన్ వారెంటు జారీచేసింది. దాంతో కమిషన్‌పైనే ఫిర్యాదులు వేస్తున్నారు. కమిషన్ పరిస్థితే ఇలా ఉంటే తమ తీర్పుల అమలు ఎలా అని బాధితులు వాపోతున్నారు. తీర్పు అమలు పిటిషన్లను ఆరు నెలల్లో పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎలాంటి ఫలితం లేకపోతోంది.

ఇక పక్కాగా రెయిన్ అలర్ట్

- వర్షాలపై ముందస్తు సమాచారం ఇచ్చేందుకు హైడ్రా ప్రయత్నం
- వివిధ విభాగాలతో సమన్వయ సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: వర్షానికి సంబంధించి సరైన సమాచారం ఇచ్చేందుకు హైడ్రా ప్రయత్నిస్తోంది. ఇందుకు గాను వివిధ శాఖలకు చెందిన విభాగాలతో సమన్వయం కుదుర్చుకునే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో చీపట్టణ ప్రాంతాల్లో వాతావరణ అంచనా, పర్యవేక్షణచీ అనే అంశంపై శనివారం ఓ సదస్సును నిర్వహించింది. వర్షానికి సంబంధించి సరైన సమాచారం ముందుగానే నగర ప్రజలకు అందించడానికి అనుసరించాల్సిన పద్ధతులపై చర్చించింది. ఎంత మొత్తంలో, ఏఏ ప్రాంతాల్లో, ఎప్పుడు వర్షం పడుతోంది అనే కచ్చితమైన సమాచారం నగర ప్రజలకు చేరవేయాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నొక్కి చెప్పారు. ఇందుకు అనుసరించాల్సిన పద్ధతులపై వివిధ శాఖలు, విభాగాలకు చెందిన నిపుణులు కలసి పని చేయాల్సినవసరం ఉందన్నారు. వర్షానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం ఇవ్వగలిగితే.. నగరంలో ట్రాఫిక్ సమస్యను కొంతమేర తగ్గించవచ్చునని అన్నారు.

వివిధ విభాగాలతో వర్కింగ్ గ్రూప్..

హైడ్రా, వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్, తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. ఈ విభాగాలన్నీ సమన్వయంతో పని చేసి వర్షాన్ని అంచనా వేయడంతో పాటు..తర్వాత జరిగే పరిణామాలను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తాయి. నగరంలో దాదాపు 157 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లున్నాయని..వీటి సంఖ్యను పెంచుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ఇందుకు వేదికలు చేసుకోవాలని సూచించారు. గాలుల తీవ్రతను కూడా అంచనా వేయాల్సినవసరం ఉందన్నారు. ఒక చదరపు కిలోమీటరు పరిధిలో ఒక సెంటీమీటర్ వర్షం పడితే 9.96 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులోకి వస్తుందని.. ఆ నీరు ఎంత మేర భూమిలోకి ఇంకుతుందో చూసుకుని వరదను అంచనా వేయవచ్చునని ఐఎండీ రిటైర్డ్ డీజీ డా.కేజే రమేష్ అన్నారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య , రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్, ఐఎండీ తెలంగాణ డైరెక్టర్ నాగరత్న, టీజీడీపీఎస్ కన్సల్టెంట్ రామారావు, ఐఎండీ నుంచి శ్రీధర్, ఎన్ఆర్ఎస్సీకి చెందిన నరేంద్ర, ఇస్‌కాయిస్ నుంచి డా. ప్రసాద్, ఐఐటీ ప్రొఫెసర్ సతీష్, వెదర్‌మ్యాన్ బాలాజీ తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

నాలుగు రోజులుగా నీళ్లు బంద్



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఎమ్మార్పీస్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగు రోజుల నుంచి నీళ్లు రాకపోవడంతో నీళ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు దూర ప్రాంతాల నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి నీళ్లు తీసుకురావాల్సిన పరిస్థితులు తలెత్తాయి. చేతులు కడుక్కునేందుకు నీళ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫిలింనగర్ జలమండలి అధికారులు స్పందించి పాఠశాలకు నీటి సరఫరాను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఫిలింనగర్: గచ్చిబౌలిలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌కు దివంగత సీఎల్పీ నేత పి.జనార్దన్‌రెడ్డి పేరు పెట్టడాన్ని హర్షిస్తూ పీజేఆర్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు శనివారం ఫిలింనగర్ విగ్రహాల చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు పీజేఆర్ ఎన్నో సేవలు చేశారని ఆయన సేవలను గుర్తించి ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పెట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీను, రవి, అశోక్ కుమార్, వరలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో తాగునీటి, సీవరేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బోరబండ సైట్-2 జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డీజీఎం వాహబ్, మేనేజర్ రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం లోప్రెషర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో పాత పైప్‌లైన్ల కారణంగా లీకేజీలు ఉన్నాయని వివరించారు. బీజేపీ నగర నాయకులు అట్లూరి రామకృష్ణ, కొలన్ సత్యనారాయణ, బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ ముదిరాజ్, తంగలపల్లి లక్ష్మణ్, షర్మిలా జాదవ్, కృష్ణ మోహన్, శరణ్‌రెడ్డి, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది రెండు రోజులే..

● ఇప్పటి వరకు 99.5 శాతం మందికి పంపిణీ పూర్తి ● మిగతా వారు తీసుకోవాలంటున్న అధికారులు



భగత్‌సింగ్ కాలనీ రేషన్‌షాపు వద్ద బారులు తీరిన జనం

బంజారాహిల్స్: రేషన్‌కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉచితంగా సన్న బియ్యం పంపిణీని ఏప్రిల్ నెల నుంచి ప్రారంభించింది. అయితే అధిక వర్షాల నేపథ్యంలో బియ్యం సరఫరాలో, పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈనెల 30వ తేదీ వరకు పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఎలాంటి సెలవులు లేకుండా రేషన్ దుకాణాలు తెరిచి ఉండగా ఉదయం నుంచి రాత్రి వరకు డీలర్లు అందుబాటులో ఉండి పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. లబ్ధిదారులు కూడా బారులు తీరి సన్నబియ్యాన్ని తీసుకున్నారు. ఇందుకోసం ఆయా దుకాణాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషనింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఖైరతాబాద్ సర్కిల్‌లో 99.5 శాతం పంపిణీ

రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాల పరిధిలో ఈ నెల 28 నాటికి 99.5 శాతం కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ పూర్తయ్యిందని రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్-07 సహాయ సరఫరాల అధికారిణి జ్యోతి తెలిపారు. మిగతా వారు కూడా ఆది, సోమవారాల్లో సన్నబియ్యం తీసుకోవాలని ఆమె సూచించారు. రేషన్ బియ్యం ఎక్కడైనా తీసుకునే వెసులుబాటు ఉంది. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి చాలామంది హైదరాబాద్‌లో స్థిరపడటంతో ఇక్కడే బియ్యం తీసుకుంటున్నారు. దీంతో సర్కిల్7 పరిధిలో రేషన్ పోర్టబులిటి ద్వారా కోటాకు మించి బియ్యం పంపిణీ చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర వాటాకు సంబంధించి వేర్వేరుగా వేలి ముద్రలు తీసుకున్నారు. కాగా ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించి ఆరుసార్లు వేలి ముద్రలు సేకరించారు. దీనికి చాలా సమయం పట్టడంతో పాటు సాంకేతిక సమస్యలు కొద్ది రోజులు వేధించాయి. దీంతో 28 రోజుల నుంచి ఉదయం నుంచి రాత్రి వరకు బియ్యం పంపిణీ చేపట్టారు. ప్రారంభంలో కార్డుదారులు బారులు తీరగా ఇప్పుడిప్పుడే కొంత రద్దీ తగ్గింది. ఎట్టకేలకు పంపిణీ 99.5 శాతం పూర్తికావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిన సన్న బియ్యం మూడు నెలలకు సంబంధించి గడువు మరో రెండు రోజులు ఉందని తదుపరి పొడిగింపు ఉత్తర్వులు ఇంకా రాలేదని అధికారులు పేర్కొన్నారు. కార్డుదారులంతా రేషన్ బియ్యాన్ని తీసుకోవాలన్నారు.

54,682 క్వింటాళ్ల సన్న బియ్యం పంపిణీ

ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధిలో 81 రేషన్ దుకాణాలు ఉండగా వీటి పరిధిలో ఆహార భద్రతా కార్డులు, అంత్యోదయ, అన్నయోజన, అన్నపూర్ణ కార్డులు మొత్తం కలిపి 83,013 ఉన్నాయి. ఈ కార్డుల్లో 2,92,882 మంది ఉన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ జరుగుతోంది. మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తుండటంతో ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో శుక్రవారం నాటికి 54,682 క్వింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేశారు. పోర్టబులిటీ ద్వారా మరో 8 వేల క్వింటాళ్లు అదనంగా పంపిణీ చేశారు. ఈ నెల 28నాటికి అన్ని షాపుల్లో 1704 క్వింటాళ్ల బియ్యం స్టాక్ ఉంది. ఈ రెండు రోజుల్లో మిగతా వారికి కూడా పూర్తిచేసే విధంగా బియ్యాన్ని సిద్ధంగా పెట్టుకున్నారు.

వెస్ట్‌జోన్ ఆర్టీఏ కార్యాలయం సేవలు షురూ



ఆర్టీఏకు కేటాయించిన స్థలంలో వాహనాల రిజిస్ట్రేషన్లు చేస్తున్న ఆర్టీఏ సిబ్బంది

బంజారాహిల్స్: షేక్‌పేట మండల పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్ పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీని ఆనుకొని ఉన్న వెస్ట్‌జోన్ ఆర్టీఏ కార్యాలయానికి రెండు నెలల క్రితం ప్రభుత్వం ఎకరం 38 గుంటల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితమే మండల అధికారులు ఈ స్థలాన్ని రవాణా శాఖకు అప్పగించగా తాజాగా వారు పది రోజుల నుంచి భూమిని చదును చేయించారు. దీనికి తోడు నాలుగు రోజుల నుంచి ఇక్కడ వాహనాల రిజిస్ట్రేషన్లతో పాటు వాహనాల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. నగరంలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఎంవీఐ సింగం శ్రీనివాస్ తెలిపారు. టోలిచౌకి ప్రధాన రహదారిలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో వాహనాల సామర్థ్య పరీక్షలతో పాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం కేటాయించిన స్థలం వద్దనే చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మానవ వనరులను మరింత బలోపేతం చేయాలి



ఎన్‌హెచ్ఆర్‌డీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

బంజారాహిల్స్: ఎన్‌హెచ్ఆర్‌డీ ద్వారా వివిధ సంస్థల్లో మానవ వనరులను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీలో నూతనంగా నిర్మించిన నేషనల్ హెచ్ఆర్‌డీ నెట్‌వర్క్ అత్యాధునిక కార్యాలయాన్ని ఆయన శనివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. హెచ్ఆర్ వృత్తి నిపుణులకు ఇది మంచి వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. హెచ్ఆర్ నిపుణుల మధ్య పరస్పర విధానాల మార్పిడిలాంటి వాటన్నింటికీ ఈ భవనం బాగా ఉపయోగపడుతుందని దానికి తగ్గట్లుగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఆర్‌డీఎన్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ మాట్లాడుతూ పలు బహుళ జాతి సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఎంఎస్ఎంఈలు, ఎన్జీవోల నుంచి 21 మందికిపైగా వృత్తి నిపుణులతో పాటు దేశంలో ఈ నెట్‌వర్క్‌కు 58 చాప్టర్లు ఉన్నాయన్నారు.

నేడు తెలంగాణ నాయర్ సేవా సంఘం ఆవిర్భావ సభ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు కె.సురేంద్రన్

హిమాయత్‌నగర్: కులమతాలకు అతీతంగా నిస్వార్థ సేవ, సామాజిక నిబద్ధతకు పర్యాయపదంగా నాయర్ సేవా సొసైటీని గోవా రాష్ట్ర గవర్నర్ పీఎస్.శ్రీధరన్ పిళ్లై ముఖ్య అతిథిగా హాజరై ఆదివారం కాప్రాలోని ఎర్ర లలిత ఫంక్షన్ హాల్‌లో ప్రారంభిస్తారని తెలంగాణ నాయర్ సేవ సొసైటీ అధ్యక్షుడు కె.సురేంద్రన్ తెలిపారు. ఆవిర్భావ సభ వాల్ పోస్టర్‌ను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం.కె.శశి కుమార్, కోశాధికారి పి.సేతు మాధవన్‌తో కలిసి కె.సురేంద్రన్ ఆవిష్కరించారు. లోక్‌సభ సభ్యులు ఎన్‌కే.ప్రేమచంద్రన్, ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ కె.విజయచంద్రన్ గౌరవ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం దారిలోనే రాష్ట్ర ప్రభుత్వం

హిమాయత్‌నగర్: కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో రాష్ట్రంలోని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సంఘటిత అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలు 8 నుంచి 10 గంటల పనిదినాలను చేసే విధంగా పావులు కదపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.23, నల్లవంకాయ రూ.28, పొడుగువంకాయ రూ.28, బెండకాయ రూ.55, పచ్చిమిర్చి రూ.35, బజ్జీమిర్చి రూ.23, క్యాప్సికం రూ.60, పచ్చికాకరకాయ రూ.38, పందిరిబీర రూ.28, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.40, ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడంపై అసంతృప్తి



వెంకటేశ్వరకాలనీ: అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు ఇందిరా క్యాంటీన్లుగా మార్చడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తిరిగి అన్నపూర్ణ క్యాంటీన్లుగా పేరు మార్చాలని డిమాండ్ చేశారు. అంతకుముందు నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు.



బీసీ కుల వృత్తుల ప్రదర్శన

ఖైరతాబాద్: సాగరతీరంలో హెచ్ఎండీఏ మైదానంలో బీసీ కులాల చేతి వృత్తుల వస్తువుల ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోంది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన కులవృత్తుల వారు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. మట్టితో తయారు చేసిన కుండలు, పాత్రలు, కూజాలు, టీకప్ సాసర్లు, వాటర్ బాటిళ్లు వంటలు చేసుకునే మట్టి పాత్రలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగియనుంది.



మాపై ఎలాంటి ఒత్తిడి లేదు

శ్రీవేంకటేశ్వర ఆలయ ఈవో శ్రీనివాసశర్మ

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఎంపిక విషయంలో వస్తున్న ఆరోపణలను ఆలయ ఈవో శ్రీనివాసశర్మ కొట్టిపారేశారు. ఇప్పటికే తాము ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులైన 16 మందితో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగిందని, త్వరలోనే చైర్మన్ ఎన్నికకు తేదీని నిర్ణయించి చైర్మన్ ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తామని అన్నారు. రాష్ట్రంలో బోనాల పండుగ నేపథ్యంలో అత్యవసరంగా అంబారి ఏనుగు తీసుకొచ్చేందుకు తాము కర్ణాటకలోని బెంగళూరుకు వెళ్లామని, అందువల్లే తాము 27వ తేదీన రాలేకపోయామని అన్నారు. నిబంధనల ప్రకారం తాను లేని సమయంలో చైర్మన్ ఎన్నిక వాయిదా వేయడం జరిగిందని, అంతే తప్ప తమపై ఎలాంటి ఒత్తిడి లేదని చెప్పారు. త్వరలోనే మరో తేదీని ప్రకటించి చైర్మన్ పదవి ఎన్నిక పూర్తిచేస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మన భవిష్యత్ కోసం ఎంతో కృషి చేసిన జ్యోతిరావ్ పూలే

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

లక్డీకాపూల్: మన భవిష్యత్ కోసం ఆనాడు జ్యోతిరావ్ పూలే ఎంత కృషి చేశారో పూలే చిత్రం ద్వారా అర్థం అవుతుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పీవీఆర్ సినిమాస్‌లో మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన పూలే సినిమాను శనివారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. నేడు బహుజనులు చదువుకొని ఉన్నత స్థాయికి వచ్చారంటే పూలే కృషి వల్లే అన్నారు. మహిళలు చదువుకుంటే నేరంగా పరిగణించే రోజుల్లో అగ్రవర్ణ సమాజాన్ని ఎదురించి సావిత్రిబాయిని చదివించారన్నారు. 200ఏళ్ల క్రితం జరిగిన సంఘటనలను కళ్లకు కట్టినట్లుగా పూలే చిత్రాన్ని తెరకెక్కించారంటూ.. చిత్ర నిర్మాతలు,డైరెక్టర్‌తో పాటు చిత్రంలోని నటీనటులకు అభినందనలు తెలిపారు. తెలంగాణలో పులే చిత్రానికి టాక్స్ మినహాయింపు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్టు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్,పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి, పీసీసీ మహిళా అధ్యక్షురాలు సునీతారావ్ పాల్గొన్నారు.





పీవీ దేశం గర్వించదగ్గ నేత

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి



బంజారాహిల్స్: దేశానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలు వెలకట్టలేనివని ఆయన కూతురు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. పీవీ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తాలో ఉన్న పీవీ నరసింహారావు విగ్రహానికి శనివారం ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చి విప్లవాత్మక మార్పులకు ఆయన నాంది పలికారని కొనియాడారు.

కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో..

పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ నేత కాటూరి రమేష్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పీవీ విగ్రహానికి నివాళులర్పించారు.

కిడ్నీ రోగుల పెన్షన్ రూ.10 వేలకు పెంచండి

ప్రభుత్వానికి నిమ్స్ కిడ్నీ పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి



లక్డీకాపూల్: తెలంగాణలో కిడ్నీ బాధితులను పెన్షన్ పెంచి ఆదుకోవాలని నిమ్స్ కిడ్నీ పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శివ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీలో కిడ్నీ బాధితులకు ఇస్తున్న రూ.10 వేల పెన్షన్‌ను తెలంగాణలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిమ్స్‌లో డయాలసిస్ చేయించుకుంటున్న 900 మంది కిడ్నీ రోగులకు రూ.2016 చొప్పున నెలనెలా పెన్షన్ వస్తోందన్నారు. పెన్షన్ అందించడంలో కీలక పాత్ర పోషించిన నిమ్స్ కిడ్నీ వైద్యులు, హెచ్ఓడీ శ్రీభూషణ్ రాజు, గంగాధర్, స్వర్ణలతతోపాటు మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యాగౌడ్‌లను శనివారం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీలు ఎస్ కే అల్తాఫ్, పాషామియా, కోశాధికారి కేఎస్ రావు, సభ్యులు పార్వతి, రఘు, గ్రేస్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ బాధితుడి వేడుకోలు



ప్రమాదంలో గాయపడ్డ రవి నాయక్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-11 లోని శ్యాంక్రపా బిల్డింగ్‌లో స్వరోజ్ ఫ్యాబ్రిక్స్ యజమాని టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ అధికారుల అనుమతులు లేకుండానే కరెంటు వైర్ల కేబుల్ పనులు చేస్తుండటంతో ప్రమాదవశాత్తు అవి పేలి ఇద్దరు దినసరి కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సరోజ్ ఫ్యాబ్రిక్స్ యజమాని రాజ్‌కుమార్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విద్యుత్ అధికారుల అనుమతులు లేకుండా కేబుల్ తవ్వకాలు చేపట్టాడు. ప్రతాప్‌నగర్‌కు చెందిన రవినాయక్, ఆయన భార్య సావిత్రి ఈ నెల 23వ తేదీన రోడ్డు కటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కేబుల్ పేలిపోయింది. దీంతో ఒక్కసారిగా దుమ్ము, మంటలు రవినాయక్ కళ్లతో పాటు మెడకు అంటుకున్నాయి. కళ్లు పూర్తిగా కోల్పోయాడు. ఆయన భార్య సావిత్రికి కూడా గాయాలయ్యాయి. రోడ్డు కటింగ్ మిషన్ కరెంటు కేబుల్‌కు తాకడం వల్ల బ్లాస్ట్ అయినట్లుగా గుర్తించారు. వెంటనే రవి నాయక్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లగా రెండు కళ్లు పనిచేయడం లేదని తేలింది. మెడకు కూడా గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాజ్‌కుమార్‌ను పోలీసులు పిలిపించి విచారణ చేశారు. ఈ ఘటనలో రవినాయక్ కుటుంబం రోడ్డుపాలైంది. న్యాయం చేయాలంటూ బాధితుడు శుక్రవారం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో యువతి హల్‌చల్

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఓ యువతి హల్‌చల్ చేయడమే కాకుండా ఎదురింటి యువతిపై తప్పుడు ఆరోపణలు చేసి పోలీసులను పిలిపించి హంగామా చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం.13లోని శ్రీరాంనగర్ బస్తీలో నేహ తాపా(22) కోకాపేట్‌లోని సెలూన్‌లో పనిచేస్తూ అద్దెకుంటోంది. ఆమె ఇంటి ఎదురుగానే ఆలిఫ్ జోసెఫ్(26) అనే మరో యువతి ఉంటోంది. ఆలిఫ్ గతంలో ఓ ప్రైవేట్ సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేసి మద్యానికి బానిసై ఖాళీగా ఉంటోంది. శుక్రవారం తెల్లవారుజామున మద్యం మత్తులో వీరంగం చేస్తూ ఎదురు ఇంట్లో ఉండే నేహతో గొడవ పడింది. డయల్ 100కు కాల్ చేసి గంజాయి విక్రయిస్తోందంటూ ఆమెపై తప్పుడు ఫిర్యాదు చేసింది. పోలీసుల ముందే గదిలోకి వెళ్లి గ్యాస్ సిలిండర్ ఓపెన్ చేసి నిప్పు పెట్టింది. దీంతో మంటలు వ్యాపిస్తుండగా పోలీసులు అప్రమత్తమై తలుపులు బద్దలుకొట్టి మంటలను ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆలిఫ్ జోసెఫ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలి

శ్రీనగర్‌కాలనీ: అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, పోలీసుల నుంచి సహకారం ఉంటుందని, కీలక ఘటనల్లో సీసీ కెమెరాలు ఆధారాలుగా ఉపయోగపడతాయని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఎర్రగడ్డ ఫ్లైఓవర్ కింద ఉన్న శ్రీనల్లపోచమ్మ ఆలయంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులను ఆదర్శంగా తీసుకొని కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాలతో పాటు ఇతరులు కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హరీష్, ఆలయ కమిటీ చైర్మన్ గంట మల్లేష్, అధ్యక్షుడు శీలం రాజ్‌కుమార్, కార్యదర్శి గంట శ్రీనివాస్, అశోక్, చందు, రసూల్, సజ్జద్, దయానంద్, హనుమంతు పాల్గొన్నారు.



నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని హైటెక్స్ గార్డెన్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సూత్ర ఆధ్వర్యంలో ఫ్యాషన్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోనాలు– చేతివృత్తుల మేళా పేరిట నెక్లెస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం పక్కన గ్రౌండ్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు బీసీ చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట మేసవికాలం, వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఏపీలో వి'ఫలమై'..

రాష్ట్రానికి పోటెత్తి..



బాటసింగారం మార్కెట్‌కు ఏపీ మామిడి

- పొరుగు రాష్ట్రంలో కేజీ రూ.4కి కూడా కొనే నాథుడే లేడు
- ఏపీ కంటే హైదరాబాద్‌లో ఐదురెట్లు ఎక్కువ ధరలు

సాక్షి, సిటీబ్యూరో: ఏపీలో మామిడి పండ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టగా, తెలంగాణ మార్కెట్‌కు పోటెత్తాయి. కిలోకు రూ.12 మద్దతు ధర కల్పిస్తామన్న ఏపీలోని కూటమి ప్రభుత్వ హామీ ప్రకటనలకే పరిమితమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కిలో మామిడి రూ.4కే ఇస్తామన్నా కొనే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రకాలు కిలో రూ.2 కూడా పలకడంలేదు. జూస్ ఫ్యాక్టరీలకు విక్రయించడానికి అక్కడ రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్‌లో కనీస ధర కనీసం 3 నుంచి 5 రెట్లు ఎక్కువ పలుకుతోంది. పండ్లు రకాన్ని బట్టి కిలో రూ.11 నుంచి రూ.25 వరకు కనీస ధర లభిస్తోంది. దీంతో ఉమ్మడి చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన వందలాది మంది రైతులు హైదరాబాద్‌లోని బాటసింగారం పండ్ల మార్కెట్‌కు సరుకు తరలిస్తున్నారు. ఫలితంగా గతంతో పోల్చితే ఈ ఏడాది సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల మామిడి అదనంగా వచ్చిందని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

గత ప్రభుత్వంలోనే బాగుండేది..



గత ప్రభుత్వ హయాంలో మామిడి పంటకు మంచి గిట్టుబాటు ధర లభించేది. అందుకే ఈ ఏడాది రూ.70 లక్షలకు తోటలు కొనుగోలు చేశాను. సీజన్ మొత్తం రూ.40 లక్షలు కూడా అమ్మలేదు. రూ.30 లక్షల వరకు అప్పులు మిగులేలా ఉన్నాయి. జ్యూస్ ఫ్యాక్టరీలు కూడా తీసుకోవడం లేదు. కిలో రూ.4కి అడుగుతున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న ప్రోత్సాహకం రూ.4 రావడం లేదు. అందుకే హైదరాబాద్‌కు తెస్తున్నాం. 20 కిలోల ట్రే రూ.200 పైగా పలుకుతోంది.

– అహ్మద్ బాషా, గాలివీడు, అన్నమయ్య జిల్లా

ప్రయాణ ఖర్చులు తగ్గితే గిట్టుబాటు



ఆంధ్రప్రదేశ్‌లో మామిడి అమ్ముకోవడానికి పరిస్థితులు బాగాలేవు. హైదరాబాద్ నుంచి వ్యాపారులు వస్తే 20 కిలోల బాక్సుకు రూ.120 ఇస్తున్నాం. అదే బాక్సును మేం హైదరాబాద్‌కు వచ్చి అమ్మితే రూ.200 వరకు వస్తుంది. ప్రయాణ ఖర్చులు తగ్గితే గిట్టుబాటు అవుతుంది.

– సనత్ కుమార్, పక్కనపల్లి, చిత్తూరు జిల్లా

పెరిగిన 30 వేల మెట్రిక్ టన్నులు



ఏపీలో మామిడికి ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. బాటసింగారం పండ్ల మార్కెట్‌లో పోతాపురి కిలోకు రూ.11 చెల్లిస్తున్నాం. బెనిషాన్ రకం మామిడిని ఏపీలో అమ్ముకోలేక మా మార్కెట్‌కు తెస్తే కిలోకి రూ.17 నుంచి రూ.25 వరకు ధర లభిస్తోంది. బంగినపల్లికి కిలో రూ.70 వరకు ధర పలుకుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పంట వచ్చింది. ఇది గత ఏడాదితో పోల్చితే 30 వేల మెట్రిక్ టన్నులు అధికం.

– చిలుక మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, గడ్డిఅన్నారం

అక్కడ డిమాండ్ లేక వస్తున్నారు..



విజయవాడ, బెంగళూరు మార్కెట్లలో డిమాండ్ లేనపుడు హైదరాబాద్‌కు వస్తుంటారు. ఇందులో సుమారు 75 శాతం మంది వ్యాపారులు ఉండగా, 25 శాతం మంది రైతులే నేరుగా పంటను తీసుకొస్తారు. హైదరాబాద్ మార్కెట్ పెద్దది. ఇతర రాష్ట్రాలతోపాటు, విదేశాలకు ఎగుమతి చేసే ట్రేడర్స్ ఇక్కడున్నారు. రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– ఎ.శ్రీనివాస్, పండ్ల మార్కెట్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బాటసింగారం

బీసీలకు హక్కుగా 42 శాతం రిజర్వేషన్లు కావాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో 90 బీసీ కుల సంఘాలు, 30 బీసీ సంఘాల డిమాండ్



లక్డీకాపూల్: బీసీ రిజర్వేషన్ పెంచే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివాదాస్పదమైన ప్రకటనలు జారీ చేయడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా ఆక్షేపించాయి. 'మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఒకసారి 42 శాతం రిజర్వేషన్లు పెంచనున్నట్టు ప్రకటిస్తారు.. ఇంకోసారి పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామంటారు. ఇదేం వైఖరి'అంటూ ఆయా సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై భవిష్యత్తు కార్యాచరణ'అనే అంశంపై శనివారం లక్డీకాపూల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, వీజీఆర్ నారగోని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ, నాయకులు నీల వెంకటేష్, మల్లేష్, అనంతయ్య, రాజేందర్, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఈడబ్ల్యుఎస్ కేసులో 50 శాతం సీలింగ్‌ను ఎత్తేసిన నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ పెంపునకు కూడా చట్టపరమైన, న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అవరోధాలు లేవని పేర్కొన్నారు.

తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

బంజారాహిల్స్: తెలంగాణ భవన్ వద్ద శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు హైడ్రామా నడిచింది. ఓ టీవీ చానెల్‌పై దాడి చేసినవారు తెలంగాణ భవన్‌లో తలదాచుకున్నారనే ఆరోపణలు మేరకు పోలీసులు భారీగా అక్కడికి చేరుకున్నారు. వారి కోసం భవన్‌లోకి పోలీసులు వెళ్లేందుకు ప్రయత్నించగా నేతలు, లీగల్ సెల్ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ తాత మధు, పార్టీ జనరల్ సెక్రటరీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బాల్క సుమన్ తోపాటు లీగల్ సెల్ ప్రతినిధులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ముందస్తు నోటీసులు లేకుండా, పార్టీ పరంగా అనుమతులు తీసుకోకుండా ప్రతిపక్ష పార్టీ కార్యాలయానికి ఎలా వస్తారంటూ నిలదీశారు. అదే సమయంలో తెలంగాణ భవన్‌కు మండల ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అక్కడికి చేరుకున్నారు. న్యాయపరంగా తెలంగాణ భవన్ లోకి రాకూడదని పోలీసులకు స్పష్టం చేశారు.

డీసీసీబీ ఉద్యోగుల వేతన సవరణపై త్వరలో నిర్ణయం



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన రవీందర్‌రావు బృందం

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో ఉన్న 9 డీసీసీబీ ఉద్యోగుల పీఆర్సీ వేజ్ రివిజన్ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు ఆధ్వర్యంలో అన్ని జిల్లాల డీసీసీబీ చైర్మన్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.9 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎం.రవీందర్‌రావు తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చి రైతుల పక్షపాతన నిలబడ్డామని, డీసీసీబీల పక్షాన నిలబడి అన్ని సహాయ సహకారాలు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, కొత్తకురుమ సత్తయ్య, రమేష్ రెడ్డి, దొండపాటి వెంకటేశ్వర్ రావు, చిట్టి దేవేందర్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నపూర్ణ' పేరు మారిస్తే ఊరుకోం

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద కార్పొరేటర్లతో కలిసి తలసాని ధర్నా

సాక్షి,సిటీబ్యూరో: పేదలు, విద్యార్థులు, నిరుద్యోగుల ఆకలి బాధను తీర్చాలనే సదుద్దేశంతో ప్రారంభించిన 'అన్నపూర్ణ' క్యాంటీన్ల పేరు మార్పు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని క్యాంటీన్ల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. పేరు మార్పుపై స్టాండింగ్ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ మంచి ఉద్దేశంతో అప్పటి సీఎం కేసీఆర్ రూ.5 భోజనం అందించే అన్నపూర్ణ క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో 150 వరకు ఉన్న క్యాంటీన్లను పెంచలేదని, మూతపడిన 20 క్యాంటీన్లను తెరిపించాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్యక్రమాలు చేపట్టి వారికి నచ్చిన పేరు పెట్టుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీని కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించలేదా అని ప్రశ్నించారు. పేరు మార్చాలనుకుంటే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి చర్చ జరిపి, అన్ని పార్టీల సభ్యుల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లను గేటువద్ద పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. కొందరు కార్పొరేటర్లు కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఘనంగా 'స్పర్శ'-2025



రాయదుర్గం: యువతీ యువకుల కోసం నిర్వహించిన 'స్పర్శ–2025'కార్యక్రమం ఘనంగా సాగింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో శనివారం రాత్రి ఈ కార్యక్రమాన్ని టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్ వార్షిక కార్యక్రమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం యువతీయువకులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుత సమాజాన్ని ఆదర్శ సమాజంగా నిర్మించడానికి అందరూ ముందుకురావాలని జయేష్‌రంజన్ కోరారు. సమాజంలో మహిళల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతోందని, చేయూత అందించిన దగ్గర ఆశించిన మేర అభివృద్ధి ఉందని అన్నారు. వెనుబడిన మహిళల అభ్యున్నతికి ఈ ఫౌండేషన్ ముందుకొచ్చి 2020లో 1000 మంది మహిళలకు చేయూత అందించిందని, అందులో 200 మందిని తమ కాళ్లపై తాము నిలబడేలా చేశారని అభినందించారు. కార్యక్రమంలో నిలోఫర్ కేఫ్ అధినేత ఎ.బాబూరావు, టీహబ్ సీఈఓ సీతా పల్లచోల్ల, ఫ్యూజి సీఈఓ మనోహర్‌రెడ్డి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యక్షుడు ఎంఏ ఫయాజ్ ఖాన్, శ్రీలత అన్నమనేని ప్రసంగించారు. నిర్వాహకులు విభూతి జైన్, రీనా, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఢిల్లీలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 19న నాట్య సిందూర్, భారత్ ఐకాన్ జాతీయ పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు శిఖరం ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, విద్య, వైద్య, వ్యాపార, కళారంగం, రాజకీయ సినీరంగం, సంగీతం, సాహిత్యం, నృత్యం, న్యాయం, టీవీ, మీడియా, ఎన్‌జీఓ, ఆధ్యాత్మిక, అర్చక పురోహిత, వాస్తు రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల వారు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల వారు జూలై 10లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94945 23562 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మెరుగైన ఆరోగ్యంతో జీవించాలి: గోపీచంద్



రాయదుర్గం: మెరుగైన ఆరోగ్యం, శక్తితో ప్రతి ఒక్కరూ జీవించాలని భారత బ్యాడ్మింటన్ జట్టు చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ సూచించారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ది వెల్నెస్ కో సంయుక్తంగా శనివారం గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో సరికొత్త క్లినిక్‌ను వెల్నెస్ కో సంస్థ ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కోలుకునేలా చేయడం, మెరుగైన పనితీరు కనబరిచేందుకు తోడ్పడటం, సమగ్ర శ్రేయస్సును మెరుగు పర్చడానికి ఈ క్లినిక్ తోడ్పడుతుందన్నారు. ఇది కేవలం అథ్లెట్ల కోసం మాత్రమే కాదని తమ పూర్తి సామర్థ్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి మెరుగైన శక్తితో జీవించాలనుకునే ఎవరికైనా ఇది ఒక మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. ది వెల్నెస్ కో సహ వ్యవస్థాపకుడు రిషబ్ జైన్ మాట్లాడుతూ తమ సరికొత్త వెల్నెస్ సెంటర్ మెరుగైన సౌకర్యం, మానస్వాంతిని అందించడానికి, అథ్లెట్ల నుంచి సాధారణ వ్యక్తుల వరకు అందరూ గరిష్ట పనితీరును సాధించడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పుల్లెల గోపీచంద్ అకాడమీ ప్రతినిధులు, ది వెల్నెస్ కో క్లినిక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాలుగో స్థానంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్

–ఏవియేషన్ ఏ టు జడ్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ విమానాశ్రయాల్లో హైదరాబాద్ ఎయిర్ పోర్టు నాలుగోస్థానంలో నిలిచింది. ప్రతి ఏడాది విమానాల రాకపోకలు, సీట్ల భర్తీ సామర్థ్యం, ప్రయాణికుల సంఖ్య వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకొని ప్రపంచంలోని మొదటి పది విమానాశ్రయాలను ఎంపిక చేశారు. ఈ మేరకు ఏవియేషన్ ఏ టు జడ్ వెబ్‌సైట్ వెల్లడించింది. చైనాలోని గ్వాంగ్ జౌ అంతర్జాతీయ విమానాశ్రయం మొదటిస్థానంలో నిలవగా, హాంకాంగ్ రెండు, షాంఘై మూడో స్థానంలో ఉన్నాయి. బెంగళూర్ ఎయిర్‌పోర్ట్ 6వ స్థానంలో ఉంది. సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన నిపుణులు, మధ్యతరగతి ప్రజలు, కార్పొరేట్ వర్గాలు హైదరాబాద్ నుంచి దేశ విదేశ నగరాలకు అత్యధికంగా రాకపోకలు సాగిస్తున్నట్లు ఈ సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది మే నెలలో 1.66 మిలియన్ సీట్లతో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నాలుగో స్థానంలో నిలిచింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎయిర్‌పోర్టులలో 25.6 శాతం వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది.

రూ.600 కోట్లతో మంజీరా రెండో పైప్‌లైన్

బ్యారేజీని సందర్శించిన జల మండలి ఎండీ అశోక్ రెడ్డి



మంజీరా ప్రాజెక్టును సందర్శించిన జల మండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీ బ్యూరో: మహానగర భవిష్యత్తు తాగునీటి అవసరాల కోసం మాంజీరా మంచినీటి సరఫరా పథకం మరో పైప్‌లైన్ పనులు చేపట్టేందుకు సుమారు రూ.600 కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు జల మండలి ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి మంజీరా బ్యారేజ్, గేట్లు, పిల్లర్లు, పంప్‌హౌస్‌లను పరిశీలించారు. మాంజీరా ఫేస్ 1, 2 మంచినీటి సరఫరా పైపులైన్ల ఆధునీకీకరణతోపాటు మరో కొత్త పైపులైను నిర్మించాలని ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సమర్పించినట్లు చెప్పారు. మంజీరా బ్యారేజీకి ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేశారు. బ్యారేజీకి సంబంధించిన గేట్లు, రోప్‌ల పనితీరు బాగానే ఉందని, దిగువన ఆప్రాన్ కొంత మేరకు దెబ్బతిన్నదని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టినట్లు చెప్పారు. బ్యారేజీపై గేట్లు, రోలర్, ప్యానల్ బోర్డ్స్, ఎలక్ట్రో మెకానికల్ తదితర భాగాలను పరిశీలించిన ఎండీ ఎప్పటికప్పుడు గ్రీజు, కలరింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్పిల్‌వే ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మానవ సంచారం నిరోధించాలని సూచించారు.

బారాజ్ గేట్ల మరమ్మతు పనులు

ఆరున్నర దశాబ్దాల క్రితం మంజీరా బ్యారేజీ బిగించిన గేట్లకు రోప్‌లు, బేరింగ్‌లను మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు అశోక్‌రెడ్డి తెలిపారు ఇప్పటికే రూ. 3.52 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బ్యారేజీపై గేట్లను మార్చే క్రమంలో దాదాపు 45 రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. జలాశయంలోని మొత్తం నీటిని ఎండీఎల్ దిగువకు వదలవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, దీంతో నగరానికి 40 ఎంజీడీల నీటి కొరత ఏర్పడుతుందని వివరించారు. నగరవాసులకు తాగునీటి ఇక్కట్లు రాకుండా ఉండేందుకే కొత్తగేట్ల ఏర్పాట్లను వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డైరెక్టర్ టెక్నికల్ సుదర్శన్, సీజీఎం బ్రిజేష్, ట్రాన్స్‌మిషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రగతిశీల చట్టాలున్నా మహిళలకు తప్పని సవాళ్లు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ మాధవీదేవి, బోధమయానంద

కవాడిగూడ: ప్రగతిశీల చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు ఇంకా చట్టపరమైన సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తోందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో తెలంగాణ న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత– రాజ్యాంగ బాధ్యత'అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జస్టిస్ టి.మాధవీదేవి, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, తెలంగాణ న్యాయవాద పరిషత్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి.లక్ష్మీ హాజరై వర్క్‌షాపు ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ మాధవీదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి నేటి వరకు మహిళా కేంద్రీకృత చట్టాల పరిణామాన్ని వివరించారు. నేటికి అనేక మంది మహిళలు గృహహింసకు బలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వారసత్వ ఆస్తిలో మహిళలకు సమాన హక్కు ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. ప్రగతిశీల చట్టాలన్నింటిపై మహిళా న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. భారతదేశంలో సాధికారత లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడం, రాజ్యాంగ విలువలను నిలబెట్టడం పట్ల ప్రతి న్యాయవాది నిబద్ధతతో పని చేయాలని సూచించారు. స్వామి బోధమయానంద మాట్లాడుతూ అనేక సంవత్సరాల క్రితమే స్వామి వివేకానంద జాతీయ పురోగతికి మహిళా సాధికారత అవసరమని బోధించారని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జి.సంపద కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సునీల్, కార్యదర్శి కవితా యాదవ్, కోశాధికారి మాసియోసో, హైకోర్టు యూనిట్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి రవీంద్రకుమార్, వాకిటి రామకృష్ణారెడ్డి , మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీవీ సంస్కరణలతోనే దేశ ఆర్థికాభివృద్ధి



బంజారాహిల్స్: దేశ ఆర్థిక అభివృద్ధికి మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు సంస్కరణలు నాంది పలికాయని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ విశ్రాంత సీనియర్ అధ్యాపకులు వనం జ్వాలా నరసింహారావు అన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని పి.వి.నరసింహా రావు 104వ జయంతిని పురస్కరించుకుని శనివారం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో స్మారకోపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసింహారావు 'బహుముఖ ప్రజ్ఞాశాలి– భారతరత్న పీవీ నరసింహారావు దార్శనికత'అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. పీవీ గొప్ప ఆర్థిక–రాజకీయ సామర్థ్యం కలిగిన బహుముఖ ప్రజ్ఞాశీలి అని కొనియాడారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో భారతదేశాన్ని ప్రపంచ మార్కెట్లకు తెరిచి, ఆర్థికాభివృద్ధిలో కొత్త శకానికి నాంది పలికారని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుల జీవిత విశేషాలు, సమాజానికి వారు చేసిన సేవలను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతోనే విశ్వవిద్యాలయంలో క్రమం తప్పకుండా స్మారకోపన్యాసాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మాజీ ప్రధాని పీవీ హయాంలో తెచ్చిన ఆర్థిక, పాలనా సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసినట్లు గుర్తుచేశారు. విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్ప, రిజిస్ట్రార్ డా.ఎల్.విజయ కృష్ణారెడ్డి పీవీ కుటుంబసభ్యులు శేఖర్ మారం రాజు, వై.వి.చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'ని సందర్శించిన ఉన్నత వైద్యబృందం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల్లో వసతి సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది కొరత తదతర అంశాలను పరిశీలించేందుకు ఉన్నత వైద్యబృందం శనివారం 'గాంధీ'ఆసుపత్రిని సందర్శించింది. రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా, వీటిలో 26 వైద్య కళాశాలల్లో సౌకర్యాలు లేవని నేషనల్ మెడికల్ కౌన్సిల్ అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర ఉన్నత వైద్యబృందం గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల్లో వైద్యుల కొరత, వైద్య విద్యార్థుల వసతిగృహాలు, సెమినార్ హాల్స్, లైబ్రరీ, ఇతర మౌలిక వసతులు, నిధులు, నియామకాలు వంటి అంశాలపై ఆరా తీసింది. ఈ మేరకు నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయనుంది. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర, సూపరింటెండెంట్ రాజకుమారి, తెలంగాణ వైద్యవిద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ) చీఫ్ ఇంజనీర్ దేవేందర్, ఈఈ సునీతాబాయి, డీఈ అనిల్ కుమార్, ఆయా విభాగాలకు చెందిన హెచ్ఓడీలతో వైద్యశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, డీఎంఈ నరేందర్ కుమార్, అడిషనల్ డీఎంఈ వాణి ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించి, నివేదిక రూపొందించారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉందని, వైద్యవిద్యార్థుల వసతిగృహాల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని, మిగిలిన వసతులు, సౌకర్యాలు తగినన్ని అందుబాటులో ఉన్నట్లు వైద్యబృందం అభిప్రాయపడినట్లు తెలిసింది.

సమ్మెకు సమాయత్తం కావాలి

గాంధీ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు



గాంధీఆస్పత్రి: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను విజయవంతం చేసేందుకు జూడాలంతా సంఘటితంగా సమాయత్తం కావాలని జూనియర్ డాక్టర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో ప్రభుత్వం కాలాయాపన చేస్తోందన్నారు. వైద్య మంత్రి, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోయిందని చెప్పారు. ప్రతి నెలా 10వ తేదీలోగా స్టైపండ్, గ్రీన్ చానెల్ ఏర్పాటు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మౌలిక వసతుల కల్పన వంటి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసులు అందించామని చెప్పారు. తెలంగాణలోని 34 మెడికల్ కాలేజీల్లో విధులు నిర్వహిస్తున్న అండర్, పోస్టు గ్రాడ్యుయేట్స్, హౌస్ సర్జన్లు, సీనియర్ రెసిడెంట్స్ అందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జూడా సంఘ ప్రతినిధులు డాక్టర్ గిరిప్రసాద్, సందీప్, వినయ్, మహాలక్ష్మీలతోపాటు గాంధీ జూడాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తకాలు ప్రేరణనిస్తాయి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

బంజారాహిల్స్: పుస్తకాలు, ప్రసంగాలు ఎంతో ప్రేరణనిస్తాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ రచించిన బహుముఖ బనారస్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ కాశీ గొప్పతనం గురించి కిల్లాడ సత్యనారాయణ రచించిన పుస్తకంలో ఆసక్తికర అంశాలు ఉన్నాయని, దానిని చదవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. భారతదేశంలో కాశీకి విశిష్ట స్థానం ఉందని, మన పురాణాలు, చరిత్ర గురించి నేటితరం తెలుసుకోవాలన్నారు. భారతీయ సంస్కృతి గురించి చెప్పాలంటే అందులో ఖచ్చితంగా కాశీ గురించి చెప్పాల్సిందేనని, అంతటి గొప్ప చరిత్ర కలిగిన నగరం కాశీ అని అన్నారు. రచయిత సత్యనారాయణ మాట్లాడుతూ బనారస్‌లో ఐజీగా ఉన్నప్పుడు జరిగిన ఎన్నో ఘటనలు కుదిపేశాయని స్వీయ అనుభవాలతో ఈ పుస్తకాన్ని రాశానని తెలిపారు.

27 ఆంధ్రా బీసీ కులాలను తెలంగాణలో చేర్చొద్దు

బీసీ 'ఏ'కులాల మేధోమథన సభ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న బాగయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏపీలోని 27 బీసీ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చ వద్దని బీసీ ఏ గ్రూపు కులాల మేధోమథన సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ 'ఏ'కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. బీసీ ఏ గ్రూపులోని ఆయా కులాల నాయకులు, మేధావులు, న్యాయవాదులు, రిటైర్డ్ ఆఫీసర్లు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భాగయ్య, ప్రొఫెసర్ సుదర్శన్, ఎం.సుదర్శన్, శంకర్, గడప శ్రీహరి తదితరులు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో నీళ్లు, నిధులు, నియామకాల్లో ఆంధ్ర ప్రాంతంవారి వల్ల తెలంగాణ భూమి పుత్రులకు, స్థానిక కులాలకు అన్యాయం జరుగుతోందనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ ఆంధ్రా కులాలను ఇక్కడి బీసీ జాబితాలో చేర్చి స్థానిక చిన్న కులాల, సంచార జాతుల పిల్లల భవిష్యత్తును అంధకారం చేయవద్దని బీసీ కమిషన్‌ను, రేవంత్‌రెడ్డి సర్కారుకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి ఎ, బి, సి, డి లుగా వర్గీకరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ'ఏ'జేఏసీ తాత్కాలిక కన్వీనర్ ఎస్.రఘునాథ స్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.భూపతి, కృష్ణయ్య, మోహన్, విశ్వేశ్వర్, శాంతప్ప, నరహరి, రాజ్యలక్ష్మి, శైలజ, సాంబయ్య, చిత్తరంజన్, ఎస్.వెంకటేష్, పాపని నాగరాజు, సీనియర్ జర్నలిస్టు నీలం వెంకన్న, రజక కుల సంఘం నేత ముత్యాల నర్సింహ పాల్గొన్నారు.



తెలుగు రుచులకు కేరాఫ్ అంతేరా..

● మియాపూర్‌లో నూతన బ్రాంచ్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: అంతేరా పేరుతో ఆంధ్ర తెలంగాణ రాయలసీమ రుచులను నగరవాసులకు చేరువ చేస్తున్న ఫుడ్ రెస్టారెంట్ అంతేరా కిచెన్ అండ్ బార్ మియాపూర్, మదీనగూడలో నూతన బ్రాంచ్ ఆవిష్కరించింది. ఈ ప్రారంభోత్సవంలో అంతేరా భాగస్వాములు, మేనేజింగ్ డైరెక్టర్లు విజయ రెడ్డి కోట, నారాయణ రెడ్డి కోట, సామిత్ రెడ్డి కోట పాల్గొన్నారు. ఇది కేవలం రెస్టారెంట్ మాత్రమే కాదు, తెలుగు సంస్కృతిలో ఒక ప్రయాణం. ఆహారం చెప్పే కథలు, ప్రతి వంటకం తెలుగు సంస్కృతిలోని మూలాలకు గౌరవమని సామిత్ రెడ్డి కోట అన్నారు.

అవయవ దానంపై అవగాహనకు..

సాక్షి, సిటీబ్యూరో: మనం తీసుకునే నిర్ణయం మరో వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించేటట్లు ఉండాలని ఆకాంక్షిస్తూ సమాజంలో అవయవ దానంపై అవగాహన పెంచేందుకు తెలంగాణ 10 కె రన్ నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రెండు సీజన్లలో ఈ రకమైన అవగాహన చేపట్టారు. మోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడో ఎడిషన్ ఆగస్టు 3న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉదయం 5 గంటలకు రన్ ప్రారంభం కానుంది. ఆగస్టు 13న ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా తెలంగాణలో ముందే 10 కే రన్ నిర్వహిస్తున్నారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.



భార్య.. భర్త.. ఓ మిడ్ వైఫ్..

నగరంలో ఇటీవల సహజ (నేచురల్) డెలివరీకి ప్రాధాన్యతతో పాటు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, 'మిడ్ వైఫ్' పేరిట ఓ ప్రాచీనమైన విధానమే తనదైన ఆధునిక రూపంలో విస్తృతంగా అందుబాటులోకి వస్తోంది. గర్భిణులకు మరింత సురక్షితమైన, మందుల రహితమైన, హాస్పిటల్ ఆధారిత, సిజేరియన్ డెలివరీలకు ప్రత్యామ్నాయంగా ఈ మిడ్ వైఫ్ సేవలు నగరంలో వేగంగా ప్రాచుర్యం పొందుతున్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో

› నగరంలో విస్తరిస్తున్న ఆధునిక మంత్రసాని కల్చర్

› సహజమైన సిజేరియన్ రహిత డెలివరీలకు ప్రాధాన్యం

› వీటి కోసమే ప్రత్యేకంగా ఏర్పాటవుతున్న ప్రసవ కేంద్రాలు

› రూ.వేల నుంచి రూ.లక్షల్లో వ్యయం అయినా ఆదరణే

ఒకప్పుడు అంటే మన అమ్మమ్మల కాలంలో మంత్రసాని పేరిట కాన్పులు చేసే మహిళలు ఉండేవారు. ఏ శిక్షణా లేకపోయినా వంశపారంపర్య వృత్తిగా వీరు అత్యంత చాకచక్యంగా ఇంటికి వచ్చి మరీ తమ సేవలు అందించేవారు. ఇప్పుడు దాదాపు అదే కాన్సెప్ట్‌తో మిడ్ వైఫ్ గా తిరిగి ఆధునికులకు చేరువైంది. మిడ్ వైఫ్ అంటే ప్రత్యేక శిక్షణ పొందిన ప్రసూతి నిపుణురాలు అని పేర్కొనవచ్చు. వీరు గర్భిణులు, మహిళలకు గర్భధారణ నిర్ధారితమైన దగ్గర నుంచి సహజ ప్రసవం వరకూ వెన్నంటి ఉంటారు. అంతేకాదు వీరు ప్రసవానంతర కాలంలో సహాయం చేస్తారు. నేచురల్ బర్త్‌కు వీరు అత్యంత ప్రోత్సాహం ఇస్తారు. ప్రసవ సమయంలో ప్రత్యక్ష పర్యవేక్షణ, భావోద్వేగ సహాయం అవసరమైన మద్దతునూ అందిస్తారు.





మిడ్ వైఫ్ విధానానికి కారణాలివే..

డాక్టర్ ఆధారిత హాస్పిటల్ ప్రసవాల్లో అధిక జోక్యం, అధిక మందుల వాడకం పట్ల విముఖత కలిగిన వారు, ఎట్టి పరిస్థితుల్లోనూ సిజేరియన్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నవారు, సహజమైన, వ్యాధుల రహిత ప్రసవాన్ని ప్రసవానంతర సేవలు కోరుకునే వారు వీరిని ఎంచుకుంటున్నారు.

సేవల ధరలు ఇలా..

ఈ మిడ్ వైఫ్ సేవలు అందుకోవాలనుకునే వారి కోసం ప్రాథమిక ప్యాకేజీ రూ.40,000 నుంచి రూ.70,000 వరకూ ఉన్నాయి. ఇందులో గర్భధారణ సమయంలో రెగ్యులర్ కన్సల్టేషన్, 8–10 విజిట్లు, ప్రీ నాటల్ కౌన్సిలింగ్, బర్త్ ప్లాన్ తయారీ, ప్రసవ సమయంలో మిడ్ వైఫ్ సపోర్ట్ (ఇన్–సెంటర్), పోస్ట్‌నాటల్ ఫాలో–అప్ (1 లేదా 2 విజిట్లు) వంటివి ఉంటాయి. అలాగే అడ్వాన్స్‌డ్ బర్తింగ్ సెంటర్ ప్యాకేజీ : రూ.80,000 నుంచి రూ.1,50,000 వరకూ ఛార్జ్ చేస్తారు. దీనిలో ఉమెన్ ఎడ్యుకేషన్ సెషన్స్ లామాజ్ / బెర్తింగ్ క్లాసెస్ వాటర్ బర్త్ ఎంపిక, ఇంటిగ్రేటెడ్ డౌలా (పోషక సహాయం) సపోర్ట్, బర్తింగ్ టబ్, సౌండ్ థెరపీ, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటాయి. అదే విధంగా హోం బర్త్ ప్యాకేజీ ఎంచుకుంటే రూ.1,20,000 – రూ.2,00,000 వరకూ ఖర్చు అవుతుంది. దీనిలో భాగంగా మిడ్ వైఫ్ + అసిస్టెంట్ బృందం ఇంటికి వస్తారు. మానిటరింగ్ ఎక్విప్‌మెంట్ అమరుస్తారు. అత్యవసర జాగ్రత్తల కోసం హాస్పిటల్ సపోర్ట్.. వంటివి ఉంటాయి. కొందరు మిడ్ వైఫ్స్ వ్యక్తిగతంగానూ సేవలు అందిస్తూ తమ ప్రతి విజిట్‌కూ రూ.2,000 నుంచి రూ.4,000 మధ్య ఛార్జ్ చేస్తున్నారు. ప్రస్తుతానికి ఆరోగ్య బీమా సంస్థలు మిడ్ వైఫ్ సేవలను కవరేజ్ ఇవ్వడం లేదు. దీంతో కొన్ని బర్తింగ్ సెంటర్లు తమదైన పాలసీలను కూడా అందిస్తున్నాయి.

ప్రభుత్వాస్పత్రుల్లోనూ..

నగరానికి చెందిన ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 2011లో దేశంలో మొట్టమొదటి మిడ్ వైఫ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా మిడ్ వైఫ్ విధానాన్ని ప్రభుత్వాస్పత్రుల వరకూ విస్తరించే దిశగా పరిశీలన చేస్తోంది. ఇటీవల నేషనల్ మిడ్ వైఫ్ కోర్సులు సైతం ప్రారంభమయ్యాయి. దీని వల్ల కొత్తగా ట్రైనింగ్ పొందిన మిడ్ వైఫ్స్ ఈ రంగంలోకి వస్తున్నారు. ఏదేమైనా నేచురల్ డెలివరీల పట్ల పెరుగుతున్న అవగాహన, ఆసక్తి వల్ల మిడ్ వైఫ్ విధానం నగరవాసులకు ఒక ఆరోగ్యకరమైన, భావోద్వేగపూరితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది.





ప్రత్యేక ఆస్పత్రులు సైతం..

నగరంలో పలు కార్పొరేట్ ఆస్పత్రులతో పాటు మిడ్ వైఫ్ సేవలు అందించే ప్రత్యేక ప్రసవ కేంద్రాలు సైతం ఏర్పాటవ్వడం విశేషం. గచ్చిబౌలి, బంజారాహిల్స్, మాదాపూర్ వంటి సంపన్న నివాస ప్రాంతాల్లోనే ఇవి ఎక్కువగా నెలకొన్నాయి. కొన్ని ప్రసూతి కేంద్రాలు, డౌలా క్లినిక్స్, బర్తింగ్ సెంటర్లు ఇప్పుడు మిడ్ వైఫ్ సేవలను అందుబాటులోకి తెచ్చాయి. వీటిలో బర్త్ విలేజ్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్, హెల్తీ మదర్ బర్త్ సెంటర్, ది సాంక్టమ్ నేచురల్ బర్త్ సెంటర్. వంటివి కొన్ని కేంద్రాల్లో మిడ్ వైఫ్ లు గర్భిణులకు సరైన ఆహార మార్గదర్శనం, ప్రీ–నాటల్ కౌన్సిలింగ్, ప్రసవ వ్యాయామాలు, మెడిటేషన్ తరగతులు, ఎమోషనల్ సపోర్ట్ కూడా అందిస్తున్నారు.



సాంస్కృతిక సంబరం..

ఉజ్జయినీ అమ్మవారి ఘటం..

లష్కర్ బోనాల పండుగ అనగానే కొత్త కుండలో ప్రత్యేకంగా వండిన ప్రసాద నైవేద్యం.. డప్పుల దరువులు.. పోతురాజుల వీరంగాలు.. ఫలహారపు బండ్ల ఊరేగింపులు.. రంగం ద్వారా భవిష్యవాణి వినిపించడం.. ఎక్కువగా ఇవే గుర్తుకొస్తాయి. కానీ.. జాతరలో ప్రతి ఇంటికీ వెళ్లి భక్తులకు దర్శనభాగ్యం కల్పించే ఘటం అత్యంత కీలకమైనది. ఈ నెల 29న ఆదివారం అమ్మవారి ఘటం ఎదుర్కోలుతో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జూన్ 29 నుంచి జులై 12 వరకూ అమ్మవారి ఘటం భక్తులకు దర్శనం కోసం సికింద్రాబాద్ పురవీధుల్లో ఊరేగిస్తారు.

- బన్సీలాల్‌పేట్



పొడవైన వెదురు బద్దలతో నిలువెత్తు ఆకారంలో దర్శనం

ఇంటింటికీ వెళ్లి దర్శనభాగ్యం కల్పించే ఘటం

నేటి నుంచి జులై 12 వరకూ నిర్వహణ

ఘటం ఎదుర్కోలుతో బోనాల ఉత్సవాలు ప్రారంభం

అమ్మవారి ఘటాన్ని పొడవైన వెదురు బద్దలతో నిలువెత్తు ఆకారంతో.. పూలతో అందంగా తీర్చిదిద్దుతారు. నడుమ అమ్మవారి విగ్రహాన్ని అమర్చి ఆకర్షణీయంగా రూపొందించేదే ఘటం. ఒంటినిండా పసుపు పూసుకున్న వ్యక్తులు ఘటాన్ని అధిరోహించి.. తలపై ఉన్న ఘటం కిందపడకుండా డప్పుల వాద్యాలకు, దరువులకు అనుగుణంగా విన్యాసాలతో నాట్యమాడతారు. సాధారణంగా కనికట్టు విద్యలు చేసే వారు ఇటువంటి వాటిని ప్రదర్శించినా.. సుమారు 60 కిలోల బరువుతో కూడిన ఘటాన్ని కేవలం పసుపు ముద్ద.. తలచుట్టకు మధ్యన పెట్టి పడకుండా చూడాల్సి ఉంటుంది. సికింద్రాబాద్‌లో 15కు పైగా ఆలయాలకు సంబంధించిన అమ్మవారి ఘటాలు ఈ రకంగా 13 రోజుల పాటు ఆయా ప్రాంతాల్లో భక్తులకు దర్శనమిస్తుంటాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల వేడుకలు జులై 13 ఆదివారం బోనాలు, 14న రంగం కార్యక్రమం ఉంటుంది. ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అమ్మవారి బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. లష్కర్ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ఇప్పటికే ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఘటం మొదలైంది ఇలా..

తొలినాళ్లలో ఘటం అనేది ఉండేది కాదు. ప్రధానంగా 1813లో సురిటి అప్పయ్య అనే మిలటరీ ఉద్యోగి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ప్రాంతంలో విధులు నిర్వహించేవారు. ఆ సమయంలో నగరంలో కలరా వ్యాధి సోకి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కలారా వ్యాధి తగ్గితే.. సికింద్రాబాద్‌లో ఆలయాన్ని కడతానని మొక్కుకున్నారు. అనంతరం సికింద్రాబాద్‌లో ఆషాఢంలో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆషాఢమాసంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు అమ్మవారి ఘటాన్ని మొదలుపెట్టారు.

ఘటం అధిరోహకుల వేషధారణ..

ఘటం అధిరోహకులు కూడా ఘటం మాదిరిగా ప్రత్యేకంగా తయారవుతారు. ముఖ్యంగా పసుపులో తడిపిన పంచె ధరించి.. ఒంటి నిండా పసుపు పులుముకుని కళ్లకు కాటు.. కాళ్లకు గజ్జెలు ధరించి అమ్మవారి ఘటాన్ని అధిరోహిస్తుంటారు. వేపాకులతో కూడిన చన్నీళ్ల సాకతో ఘటం అధిరోహకుల కాళ్లను భక్తులు కడిగి మొక్కుతారు.

ఎదుర్కోలు నుంచి జాతర ముగిసే వరకూ..

ఆషాఢమాసం తొలి ఆదివారం ఈ నెల 29వ తేదీ ఆదివారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఘటం ఎదుర్కోలు ఉత్సవాల్లో పాల్గొంటుంది. అదే విధంగా సోమసుందరం వీధిలోని శ్రీ దేవి పోచమ్మ, కళాసిగూడలోని మాతా ముత్యాలమ్మ, శివాజీనగర్‌లోని డొక్కలమ్మ, రెజిమెంటల్ బజార్‌లోని గండిమైసమ్మ, ఓరుగంటి ఎల్లమ్మ, సెకెండ్ బజార్‌లోని ముత్యాలమ్మ, పీనుగుల మల్లన్న, కుమ్మరిగూడలోని నల్లపోచమ్మ, ఆర్పీ రోడ్డులోని మావురాల పెద్దమ్మ వంటి అమ్మవారి ఘటాలు కూడా ఎదుర్కోలు ఉత్సవాల్లో వేర్వేరుగా పాల్గొంటాయి. ప్రధానంగా సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఘటం బోట్స్‌క్లబ్ సమీపంలోని బుద్ధభవన్ ఎదురు వీధిలో ఉన్న మహంకాళమ్మ దేవాలయంలో రూపుదిద్దుకుంటుంది. ఆ తరువాత జులై 12 శనివారం రాత్రి వరకూ ఆయా బస్తీలు.. కాలనీల్లో ఊరేగుతూ భక్త జనుల పూజలు అందుకుంటాయి. 13 ఆదివారం బోనాల పండుగ రోజున ఉజ్జయిని మహాకాళి మినహా ఇతర ఘటాలు ఆనకట్ట ఉత్సవాల్లో పాల్గొంటాయి. 14వ తేదీ సోమవారం రంగం కార్యక్రమం ముగిసిన తరువాత అమ్మవారి ఘటం వీడ్కోల ఉత్సవంలో పాల్గొంటుంది. దీంతో జాతర ముగుస్తుంది.





ఉమెన్స్ బాక్సింగ్ టోర్నీ ప్రారంభం

నిఖత్ జరీన్, నీతుగంగస్‌తో పాటు టాప్-12 క్రీడాకారులు హాజరు



హుందాకాంప్లెక్స్: తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎలైట్ ఉమెన్స్ నేషనల్ లెవెల్ బాక్సింగ్ టోర్నమెంట్ (2025) షార్ప్ ఎండీ సోని బాలాదేవి, టోర్నీ ఎండీ లెల్లిడిగామ, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ నేషనల్ లెవెల్ బాక్సింగ్ టోర్నీలో దేశంలోని 101 మంది జాతీయ క్రీడాకారులతో పాటు టాప్– 12 అంతర్జాతీయ క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్ రెండు సార్లు ఒలింపిక్ క్రీడల్లో పాల్గొని మెడల్ సాధించారని, నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ నీతుగంగస్ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని శివసేనా రెడ్డి తెలిపారు. తెలంగాణ బాక్సింగ్ క్రీడాకారిణితో పోటీపడిన ఉత్తరప్రదేశ్ క్రీడాకారిణి యసిశర్మ 4– 1 పాయింట్లతో ఓడిపోయారు. ఫైనల్స్ సోమవారం ఉంటాయని తెలిపారు. తెలంగాణ కోచెస్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతి వినోద్‌గౌడ్, కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

చేనేత విశిష్టతపై ఫ్యాబ్ ఇండియా ప్రచారం..



సాక్షి, సిటీబ్యూరో : భారతీయ సంప్రదాయ కళలతో పాటు రసాయన రహిత వస్త్రాలు, ఆధునిక డిజైన్లకు ప్రసిద్ధి చెందిన ప్రముఖ లైఫ్‌స్టైల్ బ్రాండ్ ఫ్యాబ్ ఇండియా చేనేతల, చేతి వృత్తుల, హస్తకళల విశిష్టతను వివరించేలా 'బ్యూటీఫుల్ ఇంపర్‌ఫెక్షన్స్' పేరిట ఓ ప్రచారాన్ని శనివారం ప్రారంభించింది. ఈ విషయాన్ని ఫ్యాబ్ ఇండియా ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. భారతదేశపు అమూల్యమైన చేతివృత్తుల సంప్రదాయాలైన డబు, ఎజ్రాఖ్, బాగ్రు, హ్యాండ్‌బ్లాక్ ప్రింటింగ్, టై – డై విశేషాలకు అద్దంపట్టేలా ఈ ప్రచారం, పురాతన కళా నైపుణ్యాన్ని ప్రతిబింబించేలా సాగుతుందని, దేశవ్యాప్తంగా గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ సహా పలు ప్రాంతీయ కళలకు మద్ధతు అందిస్తుందని వివరించారు.


సాల్వ్ ఫర్ టుమారో చివరి తేదీ 30

సాక్షి, సిటీబ్యూరో: వినూత్న ఆవిష్కరణలు చేయగల సృజనాత్మక శక్తి కలిగిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించే సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో కార్యక్రమానికి దరఖాస్తుకు చివరి తేదీ జూన్ 30 అని నిర్వాహకులు తెలిపారు. 'నేను రేపటి కోసం పరిష్కరించగలను' అనే థీమ్‌తో ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను అందించగలిగిన 14–22 సంవత్సరాల వయసు గల విద్యార్థుల నుంచి విజేతలను ఎంపిక చేస్తామని, విజేతలకు పలు సహాయ సహకారాలతో పాటు రూ.1 కోటి బహుమతి అందించనున్నారు.

లైటస్ స్టూడియోస్.. లైటస్ మ్యూజిక్..



సాక్షి, సిటీ బ్యూరో: ఓటీటీ కంటెంట్‌తోపాటు డిజిటల్ క్రియేటివిటీకి పేరొందిన నగర సంస్థ లైటస్ టెక్నాలజీస్ ఇటీవల తన వినోద విభాగాన్ని మరింత విస్తరిస్తూ లైటస్ స్టూడియోస్ ఎక్స్‌ఆర్ ఇండియాను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సంగీత ఉత్పత్తి, పంపిణీ, కళాకారుల కలయికను ప్రోత్సహించే దిశగా లైటస్ మ్యూజిక్ అనే ప్రత్యేక విభాగాన్ని శనివారం ప్రారంభించింది. ఇది కేవలం ఒక స్టూడియో లేదా మ్యూజిక్ లేబుల్ ప్రారంభించడమే కాదని, డిజిటల్ యుగంలో వినోదాన్ని కొత్తగా, సృజనాత్మకంగా అందించడమే లక్ష్యమని స్టూడియోస్ సీఈఓగా నియమితులైన సాయిరామకృష్ణ ముదిగొండ అన్నారు. లైటస్ టెక్నాలజీస్ సీఈఓ ధర్మేష్ పాండ్యా పాల్గొన్నారు.



● రీల్స్

తీవ్ర వ్యసనం

మొన్నటి మేలో కర్నాటకలోని ఉడిపిలో ఒక సంఘటన జరిగింది. రోడ్డు మీద తిరుగుతున్న ఒక పిచ్చివాణ్ణి ఒక స్వచ్ఛంద సంస్థ కార్యకర్త సంరక్షించి, వైద్యం చేయించి, తిరిగి మామూలు మనిషిని చేశాడు. మెల్లగా ఆ కోలుకున్న వ్యక్తి తమిళుడని, సొంత ఊరు కుంభకోణం అని తెలిసింది. అతని మనుషులు వెతుక్కుంటూ వచ్చారు. 'ఇతను ఆరు నెలలుగా కనిపించకుండా పోయాడు. దానికి ముందు ఫోన్‌లో రీల్స్ చూస్తూ కుటుంబంతో మాట్లాడక, స్నానం చేయక, తిండి తినక అదే లోకంగా ఉండేవాడు. ఆ తర్వాత ఈ స్థితిలో దొరికాడు' అని చెప్పి తీసుకెళ్లారు. రీల్స్‌ను వరుసపెట్టి చూడటానికి 'డూమ్ స్క్రోలింగ్' అంటున్నారు నిపుణులు. రీల్స్ మనిషి మెదడును ఏ విధంగా ఆక్రమించగలదో ఇదొక ఉదాహరణ.

ఇటీవలే గుజరాత్‌లోని వడోదరలో మరో ఘటన జరిగింది. అక్కడి ఒక కొడుకు తన భార్యతో కలిసి పోలీసుల సహాయం కోరుతూ ఫోన్ చేశాడు. దానికి కారణం ఆ ఇంట్లోని తల్లి రీల్స్‌లో పడి తిండి తినడం మానేసింది. కొడుకు, కోడలు డ్యూటీకి వెళుతుంటే ఆమెకు బోర్ కొట్టి రీల్స్ చూడటానికి అలవాటు పడిందట. ఆ రీల్స్‌లో కూడా ఒక ఇన్‌ఫ్లూయెన్సర్ పెట్టే రీల్స్ చూస్తుందట. వాటికింద కామెంట్స్ పెడుతుందట. ఆ కామెంట్స్‌కు ఆ ఇన్‌ఫ్లూయెన్సర్ రియాక్ట్ అయితే ఆమెకు సంతోషం. లేదంటే అప్‌సెట్ అయ్యి అన్నం తినదు. కొడుకు కోడలు ఆమె ఫోన్ నుంచి ఇన్‌స్టా యాప్‌ను తొలగించారు. దాంతో ఇంకా పెద్ద గొడవ జరిగి, ఆమె అన్నం తినడం మానేసింది. దాంతో ఇప్పుడా కొడుకు, కోడలు తల పట్టుకుని కూచుని ఉన్నారు.

అసలు రీల్స్ అంటే ఏమిటి? కొన్ని సెకన్ల విన్యాసం. 2020లో మన దేశంలో టిక్‌టాక్‌ను నిషేధించాక, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ పేరుతో 90 సెకన్ల నుంచి 3 నిమిషాల వీడియోస్‌ను ప్రవేశ పెట్టింది. వీటిద్వారా గుర్తింపు, పేరు, ఫాలోయెర్సు తద్వారా డబ్బు... ఇవన్నీ వచ్చేసరికి కేవలం రీల్స్ మీద ఆధారపడినవారు కోకొల్లలుగా పెరిగారు. వీరు రకరకాల విన్యాసాలతో నిత్యం వేలకొద్దీ రీల్స్ వదులుతుంటారు. అవి చూడటానికి ఎవరికైనా, ఎన్ని సంవత్సరాలైనా సరిపోవు. ఆ సంగతి గ్రహించి ఎప్పుడైనా సరదాగా చూసి ఫోన్ కట్టేయాలి తప్పితే వాటిలోనే కూరుకుపోతే మెదడు ఆ రీల్స్‌కు బానిసవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చేయి విరగ్గొట్టుకున్న అమ్మాయి

అహ్మదాబాద్‌లో నర్సింగ్ కోర్సులో చేరిన ఒక అమ్మాయి హాస్టల్‌లో బోరు కొడుతున్నదని రీల్స్ చూడటానికి అలవాటు పడింది. పరీక్షలు వచ్చాయి. రీల్స్ చూడాలంటే పరీక్షలు రాయకూడదని ఆ అమ్మాయి తన కుడి చేతిని బల్ల మీద పదేపదే బాది విరగ్గొట్టుకుంది. ఇలా ఉంటాయి రీల్స్ ఉత్పాతాలు.

బి.పి. పెరుగుతుంది

చైనాలోని హైబె మెడికల్ యూనివర్సిటీ చేసిన అధ్యయనం ప్రకారం రీల్స్ వల్ల 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉన్నవారిలో బి.పి. పెరుగుతుందని నిరూపణ అయ్యింది. రీల్స్‌లోని కంటెంట్ ఒక్కోసారి ఎక్కువగా, మరోసారి తక్కువగా కొనసాగుతూ మూడ్స్‌ను హెచ్చుతగ్గులు తెచ్చిపెడుతుండటం వల్ల ఇలా జరుగుతుంది. రాత్రివేళ గంటలు గంటలు రీల్స్ చూస్తూ నిద్ర పాడుచేసుకుని ఉద్యోగాల్లో కునికిపాట్లు పడుతున్నవారు వేలమంది ఉన్నారు. ఇక దేహం కదల్చకుండా ఉండటం వల్ల వస్తున్న శారీరక సమస్యలు ఎన్నో.

టీవీ నయం

రీల్స్ చూడటం కన్నా టీవీ చూడటం నయం అంటున్నారు నిపుణులు. ఎందుకంటే టీవీ చూస్తూ కనీసం ట్రెడ్‌మిల్ మీద వాకింగ్ చేయొచ్చు. లేదా పుస్తకాల ర్యాక్ సర్దుకోవచ్చు. లేదా బట్టలు మడతపెట్టడమో, కూరగాయలు తరగడమో... ఏదో ఒక పని టీవీ చూస్తూ చేయొచ్చు. రీల్స్ చూడాలంటే ఇలా చేయడానికి చేతులు ఖాళీ ఉండవు. ఒక చేతిలో ఫోన్ పట్టుకుని మరో చేత్తో స్క్రోలింగ్ చేస్తూ వెళ్లాలి. కాబట్టి శరీరం వేరే పని చేయలేదు.

కాపురాలలో చిచ్చు

రీల్స్ చూడటం భార్యాభర్తల మధ్య చిచ్చు తెస్తోంది. నాలుగురోజుల క్రితం కర్నాటకలోని మంగళూరు సమీపంలో రీల్స్ చూస్తున్న భార్యను కట్టడి చేయలేక భర్త ఆమెను చంపేశాడు. ఉత్తర ప్రదేశ్‌లో ఒక భార్య రీల్స్ చూడనివ్వడం లేదని, గిన్నెలు తోమమంటున్నాడని భర్త మీద కేసుపెట్టింది. వీటన్నింటికి విరుగుడు ఆరోగ్యకరమైన వ్యాపకాల్లో ఉండటమే అంటున్నారు నిపుణులు. హస్తకళలు, పుస్తకాలు చదవడం, క్రీడలు వీటిలో సమయాన్ని వెచ్చించడం మేలంటున్నారు. ముఖ్యంగా పిల్లల్ని రీల్స్ బారిన పడకుండా చూడమంటున్నారు.

ఈ తరం కాపురం

● డైవోర్స్



విడాకులు కేవలం ఇద్దరు పెద్దల మధ్యే కాదు, ఆ కుటుంబంలో ముఖ్యంగా ఐదారేళ్ల వయసు పిల్లలపైనా తీవ్ర భావోద్వేగాల గందరగోళాన్ని, ఆరోగ్య నష్టాన్ని కలిగిస్తాయని, ఆయుష్షునూ తగ్గిస్తాయని నివేదికలు తెలుపుతున్నాయి.

వారు విడిపోయి వీరికి... ఒడిపోయి

తల్లిదండ్రులు పిల్లల ఐదారేళ్ల వయస్సులో విడిపోతే, ఆ పిల్లలకు ఆయుష్షు తగ్గే అవకాశాలు పెరుగుతాయంటోంది ఒక అధ్యయనం. ఈ పరిశోధనను మిడ్ అట్లాంటిక్‌లోని మేరీల్యాండ్ విశ్వవిద్యాలయం నిర్వహించింది. ప్రొఫెసర్ నోలన్ పోప్, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం మెర్సెడ్ నుండి ఆండ్రూ సి. జాన్‌స్టన్, అమెరికా జనగణన బ్యూరోకి చెందిన మ్యాగీ ఆర్. జోన్స్ సంయుక్తంగా ఈ ఫలితాలను వివరించారు.

జీవనశైలిలో తీవ్ర మార్పులు

చిన్నవయస్సులో తల్లిదండ్రులు విడిపోయిన పిల్లలు జీవితాంతం అనేక ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారని పరిశోధకులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు దూరమైన పిల్లల్లో తక్కువ ఆదాయం, చిన్న వయస్సులోనే గర్భం ధరించడం, జైలు శిక్షలు, త్వరగా మరణించే ప్రమాదాలు .. వంటివి ఉన్నాయి. ఇవన్నీ కుటుంబంలో విడాకుల కారణంగా ఏర్పడ్డ అగాధాల మూలంగా జరుగుతున్నాయని పరిశోధకులు వివరించారు. విడాకుల తర్వాత తల్లిదండ్రులు వేరు వేరు చోట్ల నివసించాల్సి వస్తుంది. ఆదాయం తగ్గిపోతుంది. ఒంటరిగా పిల్లల్ని పెంచాల్సిన తల్లిదండ్రులు ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తుంది. తరచూ నివాసం మారుతుంది. తక్కువ ఆర్థిక అవకాశాలు ఉన్న పేద ప్రాంతాలకు తరలి వెళ్లాల్సి ఉంటుంది. ఇవన్నీ పిల్లల జీవితంలో సామాజిక, ఆర్థిక సవాళ్లకు దారితీస్తాయి. 1988 నుండి 1993 మధ్యకాలంలో జన్మించిన 50 లక్షల మందికి పైగా పిల్లలపై వారు గణాంకాలను విశ్లేషించారు. ఫెడరల్ ట్యాక్స్ రికార్డులు, సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్, జనగణనా బ్యూరో డేటా ఆధారంగా వారు ఈ విశ్లేషణ చేశారు.

వ్యాధుల పాలయ్యే ప్రమాదం

కొందరు పిల్లలు తమ వల్లే తల్లిదండ్రులు విడిపోయారేమో అనే ఆలోచనను పెంచుకుంటారు. ఇది వారిలో నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని తగ్గించవచ్చు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవ్వచ్చు. తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న పిల్లలలో 16 శాతం అధిక స్థాయి సి-రియాక్టివ్ ప్రొటీన్ ఉందని అధ్యయనం. ఈ ప్రొటీన్ వల్ల కరోనరీ హార్ట్ డిసీజ్, టైప్- 2 డయాబెటిస్ వంటి వ్యాధులకు లోనయ్యే రిస్క్ ఎక్కువ ఉందని గుర్తించారు.

ఇద్దరిదీ సమాన బాధ్యత



ఐదారేళ్ల వయసు పిల్లలకు తల్లిదండ్రుల సమస్య ఏంటో అర్థం కాదు. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి, దంపతులు తమ జీవితంలో సర్దుబాట్లు చేసుకోవాలి. పిల్లల భావోద్వేగాలను అర్థం చేసుకొని, ధైర్యమివ్వాలి. విడాకుల అనంతరం పిల్లలు ఇద్దరిలో ఎవరి దగ్గర ఉన్నా మరొకరి గురించి చెడుగా మాట్లాడకూడదు. ఇవి పిల్లల భవిష్యత్తుకు పెద్ద అవరోధమని గ్రహించాలి. మారుతున్న కాలానికి తగినట్టు బంధాలను అర్థం చేసుకుంటూ సామాజికంగానూ బంధుమిత్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు అండగా ఉండాలి. విడాకులకు ముందు తల్లిదండ్రులుగా ఎలా ఉన్నారో, ఆ తర్వాత కూడా ఇద్దరూ పిల్లల పట్ల సమాన బాధ్యత తీసుకో వాలి. విడాకులకు ముందు మానసిక నిపుణుల సూచనలు అవసరం.

- డా. సునీత, సైకాలజిస్ట్

మానసిక అనారోగ్యం

పిల్లలు తల్లిదండ్రుల మధ్య ప్రేమ, సహకారం చూసి పెరుగుతారు. ఆ మద్దతు వారికి ధైర్యాన్నిస్తుంది. కానీ విడాకుల సమయంలో వారిలో భయాలు, అనిశ్చితి, ఒంటరితనం మొదలై మనోవేదన ఎక్కువవుతుంది. ఒక అధ్యయనంలో విడాకులు తీసుకున్న, విడిపోయిన లేదా మరణించిన తల్లిదండ్రులలో ఇద్దరు పిల్లలు కౌమారదశలో ఉంటే వారిలో ఒకరికి మానసిక రుగ్మత ఉందని తేలింది.

విపరీతమైన భావోద్వేగాలు

తిండి తినడంలో మార్పులు, నిద్రలో ఆటుపోట్లు, శరీర బలహీనత .. వంటి లక్షణాలు పిల్లల్లో బయటపడతాయి. ఇది వారి చదువు పై దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. ఏకాగ్రత లోపించటం, స్కూల్లో పర్‌ఫార్మెన్స్ తగ్గిపోవటం, ఇంటి నుంచి వెళ్లిపోవడం.. వంటివీ కనిపించవచ్చు.

సమాజంలో ప్రవర్తన

కొన్ని సందర్భాల్లో పిల్లలు అతి శాంతంగా మారిపోతారు. లేదంటే మొండిగా ప్రవర్తించవచ్చు. స్నేహితులు, బంధువులతో సంబంధాలు దెబ్బతింటాయి. తల్లిదండ్రుల మధ్య విభేదాలు చూసిన పిల్లలు తమ భవిష్యత్తు సంబంధాలపై నమ్మకాన్ని కోల్పోతారు.

విడాకులు అనివార్యమైతే, పిల్లలపై ఆ ప్రభావం పడకుండా తల్లిదండ్రులు పరస్పర సహకారంతో ముందడుగు వేయాలి. భార్యాభర్తలుగా విడిపోయినా తల్లిదండ్రులుగా ప్రేమ, మద్దతు, మార్గదర్శకం పిల్లలకు ఇవ్వాలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

హెల్త్



● హార్ట్ ఫెయిల్యూర్

కొట్టుకునే గుండె తట్టుకోలేక...

చాలామంది హార్ట్ ఫెయిల్యూర్‌నూ, హార్ట్ ఎటాక్‌నూ ఒకటే అనుకుంటారు. కానీ ఈ రెండూ వేర్వేరు. హార్ట్ అటాక్ అంటే తన ధమనుల ద్వారా గుండెకు రక్తం అందక గుండె కండరం చచ్చుబడిపోవడం మొదలవుతుంది. ఇదొక తక్షణ మెడికల్ ఎమర్జెన్సీ. తక్షణం ఆసుపత్రికి తీసుకెళ్లి ఆ అడ్డంకిని స్టెంట్ వేయడం లేదా బైపాస్ వంటి సర్జరీ ద్వారా గుండె కండరానికి రక్త సరఫరాను పునరుద్ధరిస్తే ముప్పు తప్పుతుంది.

అయితే హార్ట్ ఫెయిల్యూర్ అంటే గుండె తన కార్యకలాపాలు సమర్థంగా నిర్వహించడంలో వైఫల్యం చెందడం. ఇదొక దీర్ఘకాలిక సమస్య. హార్ట్ ఫెయిల్యూర్ అంటే ఏమిటి, దానికి కారణమయ్యే అంశాలు, హార్ట్ ఫెయిల్యూర్‌లో కనిపించే లక్షణాల వంటి అనేక సమస్యలను తెలిపే కథనమిది.

హార్ట్ ఫెయిల్యూర్‌లో కండిషన్‌లో గుండె కండరం చాలా బలహీనంగా కావడంగానీ లేదా అదే కండరం చాలా బిగుతుగా (స్టిఫ్‌గా) మారిపోవడం గాని జరగవచ్చు. ఈ రెండింటిలో ఏది జరిగినప్పటికీ గుండె తన స్పందనలను కొనసాగించలేకపోవడం, దాంతో ఎప్పటిలాగా అన్ని అవయవాలకూ రక్తాన్ని సమర్థంగా పంప్ చేయలేకపోవడం జరగవచ్చు. పంపింగ్ పూర్తిగా జరగని ఫలితంగా రక్తం ఊపిరితిత్తులూ లేదా ఇతరత్రా అవయవాల్లోనే వెనకే ఉండిపోవచ్చు. దాంతో గుండె ఫెయిల్యూర్ బాధితుల్లో అనేక లక్షణాలు కనిపిస్తాయి.

హార్ట్ ఫెయిల్యూర్ బాధితుల్లో కనిపించే లక్షణాలు ...

● ఊపిరి సరిగా అందకపోవడం, ఆయాసం రావడం (ఉదాహరణకు నడుస్తున్నా లేదా మెట్లు ఎక్కుతున్నా విపరీతంగా ఆయాసం రావడం) ● తీవ్రమైన అలసట / విపరీతమైన నిస్సత్తువ ● కాళ్లలో, చీలమండ (యాంకిల్స్), పాదాల్లో వాపు రావడం ● బాధితులు ఆదేపనిగా దగ్గుతూ ఉండటం లేదా ఊపిరి తీసుకుంటున్నప్పుడు పిల్లికూతలు రావడం ● దేహంలోని ద్రవాలు బయటకు పోలేకపోవడంతో బరువు పెరగడం ● దేనిపైనా దృష్టినిలపలేకపోవడం / ఏకాగ్రత కొరవడటం / చురుగ్గా ఉండలేకపోవడం ● గుండె స్పందనల్లో / గుండె లయలో మార్పులు రావడం.

మన దేహంలోని ప్రతి కణానికి అనుక్షణం పోషకాలు అలాగే ఆక్సిజన్ సప్లై తప్పనిసరిగా అందుతూ ఉండాలి. రక్తం ద్వారా గుండె అలా పోషకాలనూ, ఆక్సిజన్‌నూ అందించలేకపోతే ఆ ప్రతికూల ప్రభావాన్ని ప్రతి కణమూ అనుభవిస్తుంది. సునాయాసంగా పూర్తయ్యే పని కూడా చాలా కష్టమ్మీద చేయాల్సి వస్తుంది. కొందరిలో గుండె ఫెయిల్యూర్ దుష్ప్రభావాలు తక్షణం కనిపించవచ్చు. మరికొందరిలో క్రమక్రమంగా జరుగుతుండవచ్చు. లక్షణాలు కనిపించడానికి వారాలూ, నెలలూ పట్టవచ్చు.

హార్ట్ ఫెయిల్యూర్‌కు కారణాలు

ఈ సమస్యకు చాలా కారణాలు ఉండవచ్చు. అనేక కారణాల వల్ల గుండె కండరం బలహీనం (వీక్‌గా) కావడం లేదా స్టిఫ్‌గా మారడం జరగవచ్చు. వాటిలో కొన్ని...

● కరొనరీ ఆర్టరీ డిసీజ్ (సీఏడీ – అంటే గుండెకు రక్తాన్ని అందించే ధమనుల్లో కొన్ని మూసుకుపోవడం లేదా సన్నబారడం) ● అధిక రక్తపోటు (హై–బీపీ) ● మధుమేహం (డయాబెటిస్) ● గుండె కవాటాల్లో సమస్యలు ● గతంలో గుండెపోటు రావడం ● విపరీతమైన మద్యం అలవాటు (క్రానిక్ ఆల్కహాలిజమ్) ● ఏవైనా ఇన్ఫెక్షన్లకు లోనుకావడం ● పోషకాలూ / విటమిన్ల లోపం ● పైన పేర్కొన్న లోపాల్లో ఏ కారణం చేతనైనా ఏదైనా లోపం ఏర్పడినప్పుడు గుండె చాలా వేగంగా స్పందిస్తూ ఆ లోపాన్ని తన వేగంతో భర్తీ చేయడానికి ప్రయత్నిస్తుంటుంది. అయితే అది కేవలం తాత్కాలికంగా మాత్రమే జరిగే ప్రక్రియ. దీర్ఘకాలంలో ఆ లోటు భర్తీ కాకపోవడం వల్ల అది క్రమంగా వైఫల్యానికి దారితీస్తుంది. అలా మొదట్లో కొద్దిపాటిగా ఉన్న లక్షణాలు కాస్తా దీర్ఘకాలంలో ప్రస్ఫుటంగా కనిపించడం మొదలవుతుంది. ఆ తర్వాత పరిస్థితి చాలా సీరియస్‌గా మారుతుంది.

గుండె వైఫల్యంతో సాధారణ జీవనం సాగించడమెలా...

గుండె వైఫల్యమన్నది ఒక తీవ్రమైన జబ్బు. పైగా ఇది జీవితాంతం కొనసాగే సమస్య. దీనికి నిత్యం డాక్టర్ల పర్యవేక్షణ, వారు సూచించిన మందులతో పాటు వ్యక్తిగత క్రమశిక్షణతో కూడిన జీవనశైలి మార్పులను తప్పక పాటించడం వంటి జాగ్రత్తలు అవసరం. ఈ కింద పేర్కొన్న సూచనలు పాటించడం ద్వారా హార్ట్ ఫెయిల్యూర్ బాధితులు చాలావరకు సాధారణ జీవితాన్ని కొనసాగించవచ్చు. అవి...


● గుండె తన సాధారణ కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు లక్షణాలను సాధ్యమైనంతగా తగ్గించడానికి డాక్టర్లు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడటం ● ఆహారంలో ఉప్పు తక్కువగా తీసుకోవడం ● వీలైనంతగా ద్రవాహారాలను తగ్గించడం ● ఒత్తిడిని (స్ట్రెస్‌ను) తగ్గించుకోవడం ● బరువు పెరగకుండా చూసుకోవడం. ఎప్పటికప్పుడు బరువును పరీక్షించుకుంటూ ఉండటం ● పరిస్థితి తీవ్రమైన కండిషన్లలో వారికి అవసరమైన ఉపకరణాలను (ఇంప్లాంటబుల్ డివైసెస్) అమర్చుకోవడం.



డాక్టర్ అమర్ నారాయణ్ పట్నాయక్
సీనియర్ కార్డియాలజిస్ట్

ఈ తరహా బాధితుల్లో ఇక గుండె మార్పిడి చికిత్స (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చివరి ప్రత్యామ్నాయం. అది చాలా సంక్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. పైగా మార్పిడికి అవసరమైన గుండె అందుబాటులోకి రావడం చాలా అరుదు. అందుకే వీలైనంతగా మంచి జీవనశైలిని అనుసరిస్తూ గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరూ విధిగా చేయాల్సిన పని.

గత పదేళ్లలో హార్ట్ ఫెయిల్యూర్ సమస్యకు చాలా ప్రభావవంతమైన మంచి మందులు అందుబాటులోకి వచ్చాయి. గుండె డాక్టర్ పర్యవేక్షణలో వాటిని వాడటం వల్ల మంచి ఫలితాలతో పాటు సాధారణ జీవితం గడిపేలాంటి అవకాశాలున్నాయి. ఇక కొందరు బాధితుల్లో గుండె స్పందనలు సరిగా జరిగేలా చేసేందుకు పేస్ మేకర్ వంటివి అమర్చాల్సిన 'సీఆర్‌టీ' వంటి మరికొన్ని చికిత్సలూ అవసరం పడవచ్చు.



మహిళలను రక్తహీనత (అనీమియా) సమస్య ఒక పట్టాన వదలదు. అసలు నెలనెలా వచ్చే రుతుస్రావం సమస్యతో రక్తం పోతూ ఉండటం, బిడ్డలకు జన్మనిచ్చే సమయంలో రక్తం పోవడం, వాళ్లకు వచ్చే యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ వంటి సమస్యలతో మహిళల్లో రక్తం పోవడం చాలా సాధారణం. మన కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా నిర్వహించే 5వ కుటుంబ ఆరోగ్య సర్వే (ఫిఫ్త్ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే)లోనూ గర్భవతుల్లోని 52 శాతం కంటే ఎక్కువమందిలో తీవ్రమైన రక్తహీనత ఉన్నట్లు అధికారికంగానే తేలింది. అంటే గర్భవతులందరిలో సగంమంది కంటే ఎక్కువే రక్తహీనతతో బాధపడుతున్నారన్న మాట. ఈ నేపథ్యంలో మహిళల్లో రక్తహీనత (అనీమియా) సమస్య, దాన్ని అధిగమించడమెలా అనే అంశాలను తెలుసుకుందాం.

రక్తం పంచే అమ్మకు బ్లడ్ తక్కువ!

సాధారణంగా రక్తహీనత అన్నది స్త్రీ, పురుషులిద్దరిలో కనిపించేదే అయినా మహిళల్లో మాత్రం చాలా ఎక్కువ. అందునా గర్భవతుల్లో 52 శాతానికి పైగా మహిళల్లో అనీమియా ఉండటం ఎలా ఉన్నా సాధారణ మహిళల్లోని దాదాపు 70 శాతం మందికి పైగా రక్తహీనత ఉంటుందనేది అనేక మంది డాక్టర్ల పరిశీలనల్లో తేలిన అంశం.

రక్తహీనత (అనీమియా) అంటే...

రక్తంలో తగినన్ని ఎర్రరక్తకణాలు లేకపోవడాన్ని రక్తహీనత (అనీమియా)గా పరిగణిస్తారు. మన శరీరంలోని అన్ని అవయవాలకూ రక్తంలోని ఎర్ర రక్తకణాల (ఆర్‌బీసీ) ద్వారానే పోషకాలూ, ఆక్సిజన్ అందుతాయి. వాటి సంఖ్య తగ్గడంతో అన్ని అవయవాలకూ పోషకాలూ, ఆక్సిజన్ అందకపోవడంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. మన రక్తం ఎర్రగా ఉండటానికి కారణం అందులోని హీమోగ్లోబిన్ అనే పదార్థం. ఈ హీమోగ్లోబినే అన్ని కణాలకూ ఆక్సిజన్ అందజేస్తుంటుంది.

మన శరీరంలో 100 గ్రాముల రక్తంలో... హీమోగ్లోబిన్ పరిమాణమన్నది మగవారిలో 13 గ్రాములు, మహిళల్లోనైతే 12 గ్రాములు, ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లల్లో 12 గ్రాములు ఉండాలి. ఒకవేళ ఈ హీమోగ్లోబిన్ పరిమాణం ఇంతకంటే తక్కువగా ఉంటే వారు రక్తహీనతతో బాధపడుతున్నారని అర్థం.

మహిళల్లో రక్తహీనతకు కారణాలివి...

మహిళల్లో ప్రతినెలా వచ్చే రుతుస్రావం కారణంగా ప్రతి నెలా రక్తం పోతుంటుంది. ఇక మరికొందరిలో ఎర్రరక్తకణాల తయారీ ప్రక్రియ దెబ్బతింటుంది. కొత్త ఎర్రరక్తకణాలు తయారయ్యే లోపే కొందరిలో పాతవి వేగంగా చనిపోవడం వల్ల కూడా రక్తహీనత వస్తుంది. ఇక మహిళల్లో బిడ్డకు జన్మనిచ్చే సమయంలో అతిగా రక్తంపోవడం, యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ వంటి అంశాలు కూడా రక్తహీనతకు కారణమవుతాయి. అనీమియా లక్షణాలు కొందరిలో తక్కువగానూ, మరికొందరిలో తీవ్రంగా ఉంటాయి.



డాక్టర్ విమీ బింద్రా
సీనియర్ గైనకాలజిస్ట్

రక్తహీనత లక్షణాలు : రక్తహీనత (అనీమియా) ఉన్నవారిలో ఎర్రరక్తకణాల (రెడ్ బ్లడ్ సెల్స్ / ఎరిథ్రోసైట్స్) సంఖ్య తగ్గిపోవడం వల్ల వాళ్లు పాలిపోయిన చర్మం, గోళ్ల కింద రక్తం లేని కారణంగా గోళ్లు తెల్లగా కనిపించడం, ఎర్రగా కనిపించాల్సిన కింది కనుపాప కింద తెల్లగా పాలిపోయినట్లుగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అనిమియా లక్షణాలను తెలుసుకోడానికి భౌతికంగా తొలి పరీక్షగా డాక్టర్లు వీటినే చూస్తారు. ఇవిగాక... ● ముఖం పాలిపోయినట్లుగా ఉండటం ● కొద్దిపాటి నడకకే ఆయాసం ● శ్వాస కష్టంగా తీసుకోవడం ● తీవ్రమైన నిస్సత్తువ, నీరసం, అలసట ● మగతగా ఉండటం ● చికాకు / చిరాకు / కోపం ● తలనొప్పి ● నిద్రపట్టకపోవడం ● పాదాలలో నీరు చేరడం ● ఆకలి తగ్గడం ● కాళ్లచేతుల్లో తిమ్మిర్లతో అవి చల్లగా మారడం ● కొందరిలో ఛాతీనొప్పి ● త్వరగా భావోద్వేగాలకు గురికావడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు / చికిత్స : మాంసాహారులైతే ఐరన్ పుష్కలంగా లభించే కాలేయం వంటివి తీసుకోవాలి. ఇక శాకాహారులతో పాటు అందరూ ముదురాకుపచ్చ రంగులో ఉండే అన్ని రకాల ఆకుకూరలు, నువ్వులు, ఖర్జూరం. అటుకులు, బెల్లం వంటివి ఎక్కువగా తీసుకోవాలి. రక్తహీనత సమస్య తీవ్రంగా ఉన్నవారు డాక్టర్ సలహా మీద ఐరన్ ట్యాబ్లెట్లు వాడాలి. సమస్య మరీ తీవ్రంగా ఉన్నప్పుడు కొందరికి రక్తం ఇవ్వాల్సి రావచ్చు. ఇక టాబ్లెట్లు వాడే సమయంలో కొందరికి మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉన్నందున వాటిని డాక్టర్ల సూచన మేరకు, వారి పర్యవేక్షణలోనే వాడాలి. ఇతరత్రా సమస్యలు కనిపిస్తుంటే డాక్టర్లు వారికి సరిపడే మందుల్ని సూచిస్తారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt.అకౌంటెంట్ ఆఫీసర్/ EPFO/ 1 Lakh PM/6' ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15087]

గౌడ/B.Tech/C.Govt. డివిజనల్ ఆఫీసర్/ మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్/80,000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15087]

క్రిస్టియన్ మాదిగ/MBA/C.Govt.Black డెవలప్‌మెంట్ ఆఫీసర్/LIC/90,000/-PM/ 6'ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15087]

SC మాల /కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C. Govt.Asst. ఇంజినీర్/ట్రాన్స్‌కో/ 90,000/-PM/5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15087]

మాదిగ /M.Tech IIT/C.Govt. సైంటిస్ట్ /DRDL / 98000/-PM / 5'10"ఎత్తు / 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15087]

దేవాంగ/(Cast No bar)/41y/5'5"/ Fair/ M.Tech/MCA, IRPM, Govt.Job, Sal 1,00,000/-(PM), ఆస్తి 4 కోట్లు, వరునికి, వధువు కావలెను (డైరెక్ట్). Ph: 7036361292 [HA-34805]

★★

కంసాలి/కన్వెర్టెడ్ Christian / 53 సంవత్సరములు (భార్య లేదు) నెలకు 40 వేలు సంపాదన గల వరునికి Christian రక్షణ పొందిన వధువు కావలెను ✆ 93929 12577 [B-138]

కాపు కన్వర్ట్, 2nd మ్యారేజ్, వయస్సు 34, 5.3 H, B.Tech., MBA సాఫ్ట్‌వేర్ HYD, నెలకు లక్ష జీతం వరుడుకి వధువు కావలెను. ✆ : 77949 11019 [R-1256874]

గవర సెకండ్ మ్యారేజ్ డైవర్సీ Age : 57 వరుడికి వధువు కావలెను కుల ప్రసక్తి లేదు. ఫోన్ : 70325 93118 [SCA25005644]

వరుడు కావలెను



రెడ్డి/2nd మ్యారేజ్/కుల, ఆస్తి పట్టింపు లేదు/30Y, H:5'4"/ సొంత బిజినెస్‌లు Medical Shop & Clinic గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకే) అన్ని కులాలు / వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9515673252 [H-783628]

వైశ్య/50y/MRO/Own Shopping Mall / 77 Acres Land /32 Lac Income/ కోట్ల ప్రాపర్టీ గల వధువుకి FC/BC వరుడు కావలెను. 9100808546 [H-783546]

కమ్మ/50y/విడో/అగ్రికల్చర్ ఆఫీసర్ /Asst Director/80 Acres Land/40 Lac Income/Own Cars Rents/ Caste no bar. 8522098546 [H-783546]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/ B.Com. Pvt Job/గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. Ph: 9603747809 [H-783628]

కుల పట్టింపు లేదు/ విడో / Pvt Employee/సొంత G+3 ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. 6281849287 [H-783546]

రెడ్డి/విడో /49/Govt. Rtd(HM)/ సొంత అపార్ట్‌మెంట్స్/30 ఎకరాల కొబ్బరితోట/రైస్ మిల్స్/ 4L/-PM గల వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 7732054195 [H-783546]

రెండవ పెళ్లి/విడో / 50y/ Fair/ గుంటూరు /Own Complex(రెంట్స్) ల్యాండ్స్/1 పాప, USA లో సెటిల్డ్ ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-783628]

రెడ్డి/2nd మ్యారేజ్(కుల-ఆస్తి) ప్రసక్తి లేదు 31Y, డిగ్రీ/ Business & Properties గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని వయస్సుల & కులాల వారికి 1వ/2వ సంబంధాలు కలవు. Ph: 9573002847 [H-783628]

SC హిందూ మాదిగ/B.Tech/Govt. Jr. Asst./రెవెన్యూ Dept/40,000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15087]

SC హిందూ మాల/B.Tech/C.Govt. టెక్నికల్ ఆఫీసర్/ ECIL/60,000/-PM/ 5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15087]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D.V.Koti Reddy, 690,Road No:3,Banjara Hills (TV- 9, Opp: Colony)(Near The Leela Hotel) Hyd. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5PM. www.avinashreddy.com + 91 9848011818/ + 91 9393311818

వధువు కావలెను

రెడ్డి Bengaluru, BE (IIT), 27, 5' 9", Sr. SWE, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 8", Amazon, 200 K, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 29, 6' 2", Very Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, Residency Doctor, 25, 5' 2", 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి PhD, 29, 5' 6", 12 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 6", SWE, 100 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE (NIT), MS, 27, 5' 10", Analyst, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 9", Project Manager, H1, 50 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 29, 5' 10", PG Doctor, 70 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 30, 5' 11", Residency Doctor, 10 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 27, 5' 6", 31 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, B Pharma (BITS), MBA, 26, 5' 4", Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 28, 5' 4", PG Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 7", Hyderabad, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో (Since 25 Years)

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో గత 25 సంవత్సరాలుగా అన్ని ప్రాంతాలవారికి కేవలం రెడ్డి సంబంధాలు మాత్రమే చూస్తూ 4 బ్రాంచీలు కలిగి ఉన్నటువంటి ఏకైక అగ్రగామి సంస్థ మీ నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో
Timings 10.30 AM to 6.30 PM

వధువు కావలెను

రెడ్డి / 1998 / 5'10" / B.Tech / MS/ USA / 150K PA / H1B సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1994 / 5'11" / MBBS / Clinical Research / Coordinator US Citizen సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1996 / 5'7" / B.Tech / SWE / 18 Lakhs PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1995 / 5'8" / B.Tech / MS / MBA / 130K PA / USA సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 8885559579 / 9848221166

రెడ్డి / 1993 / 5'10" / B.Tech / MS (Civil Engineer) USA 110K PA (Ful Time Job) H1B సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 9505551788 / 9848221166

రెడ్డి / 1992 / 5'7" / B.Tech / MS / Senior B1 Engineer / 180K / H1B / I-140 సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1993 / 5'8" / B.Tech / MS / USA / 115K PA/ Texas / H1B / I-140 Approved. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 8885559579 / 9848221166

రెడ్డి / 1998 / 5'8" / B.Tech / MS / Business / Hyd / Rents Income/8L PM / 300Cr. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1988 /5'7" / B.Tech / MS / US / 270K PA / Amazon / H1B / I-140/ సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి /డైవర్సీ / 1991 / 5'8½" / B.Tech / MS US / 350K PA H1B / I-140 సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

వరుడు కావలెను

రెడ్డి / Elite: 2000 / 5'2"/ B.Arch. Rental Income / 10L PM సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1995/5'5" / MBBS / MD Radiologist సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1998 / 5'9 / B.Tech / Pilot Air Bus 320 / 35L PA / V. Fair సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1993 / 5'4" / MBBS / MS/24L PA / Rental 4L PM / 100Cr సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 2001 / 5'7" / BS(CS) / Fair సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1997 / 5'7" / B.Tech / 18 Lakhs PA / Fair సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1991 / 5'3" / Architecture Own Firm / Very Fair సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1994 / 5'4" / BE / MS / Data Product Manager / Australia Citizenship Holder 200K PA సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1994 / 5'2"/ MBBS / MS / Research Assistant USA సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 2000 / 5'2" / B.Tech / MS/ Microsoft 200K PA US Citizen. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

LETTER

క్రిస్టియన్ మాల/25/5'5"/B.Tech (Mechanical) / Sr. Assistant Manager, Central Bank of India/90,000/-PM, Well Settled అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9346675639 [HA-15087]

వయసు: 35 Yrs/5'5"ఎత్తు/ గవర్నమెంట్ జాబ్, 1.2 Lakhs జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కులపట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 8019954482 [HA-15087]

SC మాల & క్రిస్టియన్/B.Tech(EEE)/ Govt.AEE/ ట్రాన్స్‌కో/12 Lakhs. PA/ 5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15087]

యాదవ/ఎర్రశాల/అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4"ఎత్తు/M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥ PM ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్ : 9989597799 [H-783625]

వైశ్య/48Y/విడో/Govt.Job VRS/Own Construction, Iron&Sand Business/12Lax Incom /70Acre Lands.కోట్ల ప్రాపర్టీ, పూర్తి ఫ్యామిలీ కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. ఇల్లరికం, పిల్లలున్నా ఓకే. 8106967428 [HA-15091]

ఆర్యవైశ్య/21y&22y&23y&25y &26y&27y& 28y& 29y&30y&31y&33y&35y&36y&37y&39y&40y&41y& 42y&43y&45y&47y&48y&49y&50y / జి.సుప్రజా గుప్తా "మా సేవ" (Since 1998): PH/W: 9291503949 [HA-15091]

కుల పట్టింపు లేదు/40yrs సెంట్రల్ Govt. జాబ్ 1.50 లక్షలు(pm), సొంత ఇల్లు డైవర్స్ 1 బాబు 10 సం॥ వెల్ సెటిల్డ్ అయిన వధువుకు Govt. జాబ్ బిజినెస్ వెల్ సెటిల్డ్ వరుడు కావలెను. 7286031653 [HA-15091]

రెడ్డి/కుల పట్టింపు లేదు/రెండవ పెళ్లి/50y/ విడో/సొంత ఇల్లులు/రెంట్స్/పిల్లలు లేరు/సొంత ప్రాపర్టీ/ఎలాంటి బాదరబందీ లేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [HA-15091]

Pastor Seeking Christian Grooms for Church Women. Details: * 25 Years Madiga, B.Sc Nursing, 15K. * 34 Years Mala, MHM, 50K, Call/Whats App: 9703943576. * 38 Years Divorcee Mala, MBA 30K; * 42 Years Divorcee Mala PG, 85K. Call/WhatsApp: 8179924420. Interested Young Men/ Parents/ Pastors Contact. [H-783672]

Reddy/Divorcee / Most Beautiful/ Govt - Doctor-Hyd / Very-Rich-Family / MBBS/ MD/DM/ 1986/ 5'4"/ Needs any Well Settled. Cont. Sunder Reddy. Ph: 9515790337 [HA-16044]

★★

వైశ్య/50Y/ విడో/ 5'4"/ Govt.టీచర్/ 80,000/-PM/ సొంత ఇల్లు ట్యూషన్స్/ 50 000/-/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7702995967 [H-783545]

వేదికలు



రెడ్డి: వధూవరుల పరిచయ వేదిక : 06.07.25న 10am to 5pm సెంట్రల్ బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్, LBనగర్, హైదరాబాద్. రిజిస్ట్రేషన్ ఫ్రీ వధువులకు, 9391198332 [H-783628]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Lakshmi, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15086]

శ్రీ రాజ రాజేశ్వరి మ్యారేజ్ బ్యూరో. ఓసీ గౌడ్స్ కులాల వారికి 1వ, 2వ, లేట్, విడో సంబంధాలు చూడబడును. సంప్రదించండి : 9959333807/6302346361 [HA-15091]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌర, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-783546]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Lakshmi, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15086]

Balija పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Lakshmi, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15086]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Lakshmi, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15086]

శ్రీరామ-అన్ని కులములకు, సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, VIP, అబ్రాడ్, 1st, 2nd వారికి పెళ్లి సంబంధాలు వ్యక్తిగత శ్రద్ధతో చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, ✆ 70937 22724. [T-3274]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Lakshmi, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15086]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 13.07.2025వ తేదీ ఉ॥ 10 గం॥లకు 67వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 22వ పునర్వివాహ పరిచయ వేదిక విజయవాడ KBN కాలేజీ లో జరుగును. ✆ 99895 00130, 81064 54284 [B-333]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1549]

హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్ని మతాల వారు వివాహ సంబంధాలకై సంప్రదించండి. Sunny. ✆ 9705820660 [SCA25005646]

Free Register. పద్మశాలి వధూ- వరుల స్వయంవరం (online) 29 June/ 2025న bhavanimatrimony, Hyd. వాట్సాప్ No. 9704656103, 9533608887 [HA-1512]

★★

హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్ని మతాల వారు వివాహ సంబంధాలకై సంప్రదించండి. గత 50 సంవత్సరాలుగా విజయవంతంగా నడుస్తున్న మ్యారేజ్ బ్యూరో Sunny. మీ వివరాలు వాట్సప్ చేయగలరు. ✆ 9705820660 [SCA25005467]



డీపీఆర్‌లో స్పష్టత లేదు

- హైదరాబాద్ మెట్రో ఫేజ్–2పై కేంద్రం అభిప్రాయం
- పలు కీలక ప్రశ్నలు లేవనెత్తిన కేంద్ర గృహనిర్మాణ శాఖ
- వాటిపై స్పష్టత వచ్చేవరకు ముందుకెళ్లకూడదని నిర్ణయం
- రూ.24,269 కోట్లతో 76.4 కి.మీ. రెండో దశ ప్రాజెక్ట్
- డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ రెండో దశలోని కొన్ని కీలక అంశాలపై తెలంగాణ ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడినందునే ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)లో ప్రాజెక్ట్‌కు సంబంధించిన చాలా అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాధానాలు రావాల్సి ఉందని, ఇవి లేకుండా ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నాయి. ముఖ్యంగా ఎల్ అండ్ టీ సంస్థ నెట్‌వర్క్‌పై ఉమ్మడి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవై) ట్రెన్లు నడిపే ఏర్పాట్లు ఎలా ఉంటాయి? ఎల్ అండ్ టీ నెట్‌వర్క్‌పై నడిస్తే విద్యుత్తు టారిఫ్, రవాణా చార్జీలు ఎంత ఉంటాయి? అనే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రం క్లారిటీ కోరుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చిన తర్వాత అనుమతులు ఇవ్వటంపై ముందుకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇటీవలే మెట్రో ఫేజ్–2 డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఆర్‌ఎల్) కేంద్రానికి సమర్పించింది. అయితే, పుణే మెట్రోకు అనుమతిచ్చిన కేంద్రం.. హైదరాబాద్ మెట్రోపై మాత్రం నోరు మెదపలేదు. డీపీఆర్‌లో స్పష్టత లేకుండా ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే అవకాశం లేదని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ప్రభుత్వానికి తేల్చి చెప్పింది.

కేంద్రం లేవదీసిన కొన్ని ప్రశ్నలు..

- మొత్తం 76.4 కి.మీ. నిడివితో 5 కారిడార్లతో రూ.2,269 కోట్ల ఖర్చుతో హైదరాబాద్ మెట్రో ఫేజ్–2ను నిర్మించేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొత్త లైన్లు, ఇప్పటికే ఉన్న లైన్లపై రైళ్లను సమన్వయంతో నడుపుతామని డీపీఆర్‌లో ప్రస్తావించారు. అయితే, ఎల్ అండ్ టీ నెట్‌వర్క్‌పై ఉమ్మడి ఎస్‌పీవై ట్రెన్లు నడిపే ఏర్పాట్లు ఎలా ఉంటాయన్నది స్పష్టంగా పేర్కొనలేదు.
- 50:50 ఎస్‌పీవై ట్రెన్లు ఎల్‌అండ్‌టీ నెట్ వర్క్‌పై నడిస్తే విద్యుత్తు టారిఫ్, రవాణా చార్జీలు ఎంత ఉంటాయనేది స్పష్టంగా తెలియాలి. ఇలాంటి సేవల వల్ల ఎల్ అండ్ టీకి పరోక్షంగా లాభం కలుగుతోంది. కానీ, ఎస్‌పీవై మాత్రం ఆ ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో కారిడార్లపై మూడు కార్ ట్రెన్లు నడుస్తున్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ట్రెన్లు చాలక కిక్కిరిసిపోతున్నాయి. ఎల్ అండ్ టీ సంస్థ అదనపు బోగీలు, ట్రెన్లను అందుబాటులోకి తేవాల్సి ఉంది. కానీ, డీపీఆర్‌లో దీనిపై స్పష్టత లేదు. ప్రభుత్వం ఈ విషయంపై ఎల్ అండ్ టీతో చర్చించిందా? అనే విషయంలోనూ స్పష్టత లేదు.
- జూన్ 3వ తేదీ తర్వాత మంత్రిత్వ శాఖ నిర్వహించిన సమావేశంలో ఎల్ అండ్ టీ మెట్రో రైలు ఎండీ పాల్గొన్నారు. ఖర్చు పంచుకోవడం, ఆపరేషనల్ అంశాలపై ఇంకా అంగీకారం లేదు. ఫేజ్–2 అమలయ్యాక ప్రభుత్వ సంస్థతో లాభాలు పంచుకోలేం అని ఆయన స్పష్టంగా తెలిపారు అని కేంద్రం పేర్కొంది.

కారిడార్ పేరు	దూరం	(కిలోమీటర్లు)	ఖర్చు అంచనా (రూ.కోట్లలో)
4	నాగోలు-ఆర్‌జీఐఏ	36.8	11,226
5	రాయదుర్గం- కోకాపేట	11.6	4,318
6	ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట	7.5	2,741
7	మియాపూర్-పటాన్‌చెరు	13.4	4,107
8	ఎల్బీనగర్-హయత్‌నగర్	7.1	1,877
	మొత్తం	76.4	24,269

రాష్ట్ర ఈవీ రంగానికి ఆర్ఈఈల కొరత

- అరుదైన భూగర్భ ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలతో తీవ్ర ప్రభావం
- ప్రపంచంలోకెల్లా 80 శాతానికిపైగా ఆర్ఈఈల వెలికితీత, ఎగుమతులు చైనా నుంచే..
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో కీలకమైన అరుదైన భూగర్భ ఖనిజాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) ఆర్ఈఈ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో తెలంగాణలో సంబంధిత రంగాలకు చెందిన పరిశ్రమల్లో ఆందోళన నెలకొంది. ఎలక్ట్రానిక్స్, ఈవీల ఉత్పత్తికి అవసరమైన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, ముడిపదార్థాలు, రసాయనాలను ఎక్కువగా చైనా నుంచే తెలంగాణ దిగుమతి చేసుకుంటోంది. అయితే అమెరికాతో ట్రేడ్ వార్‌లో భాగంగా ఆర్ఈఈల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించింది. ఏప్రిల్ 4న మొదలైన నిషేధం మరింతకాలంపాటు కొనసాగితే తెలంగాణలో తయారీ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆర్ఈఈలు లభ్యమయ్యే ప్రత్యామ్నాయ మార్గాలు, ప్రణాళికలు, వ్యూహాలు లేకపోవడంతో సమస్య తీవ్రమయ్యే సూచన కనిపిస్తోంది. మరోవైపు ఆర్ఈఈల ఉత్పత్తి పెంచేందుకు రూ. 5 వేల కోట్లతో కేంద్రం ప్రకటించిన దీర్ఘకాలిక పథకంతో తక్షణ ఉపశమనం లభించే అవకాశం కనిపించకపోవడంతో ఈవీ, ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలు ఆందోళన చెందుతున్నాయి.

ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం

ఎలక్ట్రానిక్ వాహనాలు, స్మార్ట్‌ఫోన్‌లతోపాటు విండ్ టర్బైన్లకు అవసరమయ్యే శాశ్వత మ్యాగ్నెట్ల తయారీలో నియోడిమియం, డిస్ప్రోసియం, టెర్బియం వంటి అరుదుగా లభించే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అత్యంత కీలకం. ప్రపంచంలోకెల్లా ఈ ఆర్ఈఈల వెలికితీత, శుద్ధి, ఎగుమతుల్లో 80 శాతం మార్కెట్‌ను చైనా నియంత్రిస్తోంది. గతేడాది చైనా నుంచి భారత్ 2,270 టన్నుల ఆర్ఈఈలను దిగుమతి చేసుకుంది. చైనా విధించిన ఆంక్షల మూలంగా ఆర్ఈఈల లభ్యత, ధరల పెరుగుదల వంటి సమస్యలను తెలంగాణ పరిశ్రమలు ఎదుర్కొంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, ఈవీ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యతను ఇస్తుండగా అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొనడం వల్ల పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్ర అవసరాల మేరకు దిగుమతులు లేకపోవడంతోపాటు ఉత్పాదనలో ఆలస్యం వల్ల నష్టాలు పెరిగి ఉద్యోగ కల్పనపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని అంటున్నాయి. దీర్ఘకాలంపాటు ఇదే పరిస్థితి కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడలేమనే భయం పరిశ్రమ వర్గాల్లో నెలకొంది.

ప్రత్యామ్నాయ మార్గాలు ఫలితమిచ్చేనా?

ఈ ఏడాది చివరి నాటికి ఎలక్ట్రానిక్స్ ఎగుమతులను 3 బిలియన్ డాలర్లకు చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. మరోవైపు 2030 నాటికి ప్రజారవాణా రంగంలో వంద శాతం ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తోంది. పునరుత్పాదక ఇంధన రంగం ద్వారా 2030 నాటికి 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల నుంచి ఆర్ఈఈల దిగుమతి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఇటీవల వినతిపత్రం ఇచ్చారు.

పెళ్లి హామీ ఉల్లంఘన నేరం కాదు

- హైదరాబాదీపై కేసును కొట్టివేసిన హైకోర్టు




సాక్షి, హైదరాబాద్: పెళ్లి చేసుకుంటానన్న హామీ నెరవేర్చకపోవడం క్రిమినల్ చర్య కిందకు రాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక హైదరాబాదీపై 2019లో నమోదు చేసిన కేసును కొట్టివేసింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశారంటూ కె.పద్మిని అనే మహిళ ఫిర్యాదుపై.. 2019లో తనపై నమోదైన కేసును సవాల్ చేస్తూ.. హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌కు చెందిన జీవన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. వివాహ హామీని ఉల్లంఘించినందుకు నిందితుడిపై మోసం కేసును కొనసాగించలేమని స్పష్టం చేశారు. మెరిట్స్‌ను పరిశీలించిన తర్వాత పిటిషన్‌ను అనుమతిస్తున్నామని చెబుతూ.. పిటిషనర్‌పై కేసు కొట్టివేశారు.

స్వేచ్ఛ మృతిపై సంతాపం

సాక్షి, హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్ స్వేచ్ఛ మృతిపై సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. చురుకైన జర్నలిస్టు, రచయితగా పేరొందిన స్వేచ్ఛ మరణంతో.. రాష్ట్రం ఒక మంచి జర్నలిస్టును కోల్పోయిందన్నారు. స్వేచ్ఛ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ.. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

దేవేందర్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: ప్రవాసీ కాంగ్రెస్ సమన్వయకర్త, రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ సలహా కమిటీ సభ్యుడు నంగి దేవేందర్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించింది. గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లోని ప్రవాసీయులకు అందించిన సేవలకు గుర్తింపుగా.. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ వర్గాలు ఆయనకు డాక్టరేట్ ఆఫ్ సోషల్ సర్వీసెస్ (స్పెషలైజేషన్ ఇన్ ఎన్‌ఆర్‌ఐ ఎఫైర్స్)ను అందజేశాయి. ఈ సందర్భంగా నంగి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రవాసీయుల కు చేస్తున్న సేవకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని చెప్పారు.

33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతులు

- ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ
- త్వరలోనే క్షేత్రస్థాయిలోకి జీపీవోలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌జీడీసీ)గా పనిచేస్తున్న 33 మంది అధికారులకు పదోన్నతులు లభించాయి. వీరికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ జారీ చేసిన జీవో మేరకు వీరికి పదోన్నతులు లభించాయి. పదోన్నతులు కల్పించినందుకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా, అంతకుముందు డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలోని రెవెన్యూ సంఘాలు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) లోకేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశాయి. అర్హత పరీక్ష ద్వారా గ్రామ పాలనాధికారు (జీపీవో)లుగా ఎంపికైన వారికి క్షేత్రస్థాయిలో విధులు కేటాయించి బాధ్యతలు అప్పగించాలని కోరాయి. జీపీవోలను విధుల్లోకి తీసుకోవడం ద్వారా రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన లోకేశ్‌కుమార్ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి వీలైనంత త్వరలో ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు రెవెన్యూ సంఘాల నేతలు తెలిపారు. లోకేశ్‌కుమార్‌ను కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక తదితరులున్నారు.

44 మంది సివిల్ డీఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 44 మంది సివిల్ డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చాలా కాలంగా ఒకే చోట ఉన్న వారికి స్థాన చలనం కలిగించడంతోపాటు.. పోస్టింగ్ కోసం డీజీపీ కార్యాలయంలో నిరీక్షిస్తున్న కొందరికి నియామకాలు ఇచ్చారు. బదిలీ అయిన అధికారులు తమకు కేటాయించిన స్థానాల్లో వెంటనే చేరాలని డీజీపీ తన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపు పూర్తి

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దోస్త్–2025 మూడో విడత కేటాయింపులు పూర్తయ్యాయి. మూడో విడతలో సీట్లు పొందిన అభ్యర్థుల వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ వి.బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యా కమిషనర్ దేవసేన విడుదల చేశారు. దోస్త్ మూడో విడతలో 85,680 మంది విద్యార్థులు సీట్లు పొందారు. ఇందులో మొదటి ప్రాధాన్యంలో సీట్లు పొందిన విద్యార్థులు 64,181, రెండో ప్రాధాన్యంతో సీట్లు పొందిన విద్యార్థులు 21,499, కాగా తక్కువ వెబ్ ఆప్షన్లు ఇవ్వడంతో 10,355 మంది సీట్లు పొందలేదు. విద్యార్థులు సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలను రిజిస్టర్డ్ మొబైల్ నంబర్, అభ్యర్థి లాగిన్ ద్వారా, వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు లాగిన్ ద్వారా ఈనెల 30వ తేదీ లోపు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కాలేజీలు, విశ్వవిద్యాలయ కాలేజీల్లో సీట్లు పొందిన, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద అర్హత పొందిన విద్యార్థులు ఫీజు చెల్లించకుండా సెల్ఫ్ రిపోర్టింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోకుంటే కేటాయించిన సీటును కోల్పోతారని అధికారులు తెలిపారు.

ఎలక్ట్రిక్ బస్సులో మంటలు


మంటలను ఆర్పుతున్న సిబ్బంది

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లోని టు డిపోలో పార్క్ చేసిన జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులో శనివారం ఉదయం 6 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. ప్రయాణికులను తీసుకెళ్లడానికి డిపోలో బస్సును స్టార్ట్ చేసిన డ్రైవర్.. పొగలు రావడం గమనించారు. వెంటనే బస్సును నిలిపివేసి డిపో సిబ్బందికి, జేబీఎం బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. ప్రమాదానికి గల కారణాలను అధికారులు విశ్లేషిస్తున్నారు.

క్లుప్తంగా...

ఆర్టీసీ లాజిస్టిక్స్ విధుల నుంచి కండక్టర్ల ఉపసంహరణ

ఒకటో తేదీ నుంచి వారు రెగ్యులర్ విధుల నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగంలో బుకింగ్ విధులు నిర్వర్తిస్తున్న 142 మంది కండక్టర్లను ఆ విధుల నుంచి ఉపసంహరించి తిరిగి వారికి రెగ్యులర్ విధులు అప్పగిస్తూ ఆర్టీసీ ఆదేశాలు జారీచేసింది. సంస్థలో ప్రస్తుతం కండక్టర్ల తీవ్ర కొరత ఉన్న సంగతి తెలిసిందే. దీంతో బస్సుల్లో టికెట్ల జారీ ఇబ్బందిగా మారింది. ఉన్న కండక్టర్లపై భారం పెరుగుతోంది. తప్పని పరిస్థితుల్లో ఓటీలు చేయాల్సి వస్తోంది. ఆర్టీసీ సరుకు రవాణా విభాగంలో పార్శిల్ బుకింగ్ కార్యాలయాల్లో గతంలో పలువురు కండక్టర్లను నియమించారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, వరంగల్.. సహా పలు ప్రాంతాల్లోని లాజిస్టిక్స్ కౌంటర్లలో వీరు బుకింగ్ విధుల్లో ఉన్నారు. ఇప్పుడు అందులో 142 మందిని ఆ విధుల నుంచి తప్పించి తిరిగి బస్సుల్లో టికెట్ల జారీ విధుల్లోకి తీసుకోవాలని సంస్థ నిర్ణయించింది. వీరి స్థానంలో లాజిస్టిక్స్ బుకింగ్ కేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించనుంది. ఔట్‌సోర్సింగ్ నియామకాల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించింది. ఆ రూపంలో వచ్చే సిబ్బందికి ఈనెల 30 వరకు శిక్షణ ఇచ్చి విధుల్లో ఉంచనుంది. వారు విధుల్లోకి వచ్చే వరకు అంటే ఈనెల 30 వరకు 142 లాజిస్టిక్స్ విభాగంలో కొనసాగి ఒకటో తేదీ నుంచి రెగ్యులర్ విధుల్లోకి రానున్నారు.

మహాటీవీకి బీఆర్ఎస్ లీగల్ నోటీసులు

ఫోన్ ట్యాపింగ్‌పై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: ఫోన్ టాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై దురుద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలు ప్రసారం చేశారని ఆరోపిస్తూ మహాటీవీకి లీగల్ నోటీసులు జారీ చేసినట్లు ఆ పార్టీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. జర్నలిజం ముసుగులో బీఆర్ఎస్ నాయకత్వంపై మహాటీవీ మేనేజ్ మెంట్ వ్యక్తిగతంగా విషం చిమ్ముతోందని ఆరోపించింది. మహాటీవీ తప్పుడు ప్రచారంపై న్యాయపరంగా పోరాడుతామని, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రశాంతంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. మహాన్యూస్ చానల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు శనివారం బషీర్‌బాగ్ డీసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

వ్యక్తిత్వ హననం జర్నలిజం కాదు: హరీశ్

సాక్షి, హైదరాబాద్: వ్యక్తిత్వ హననం జర్నలిజం కాదు.. అది దురుద్దేశమవుతుంది.. ప్రతి నాయకుడి వెనుక ఒక కుటుంబం ఉంటుందని మీడియా సంస్థలు గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఒక మీడియా చానల్.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై చేసిన ప్రసారాలను ఆయన శనివారం ఎక్స్‌లో ఖండించారు.

ప్రభుత్వ బడిలో చేర్పిస్తే.. ఉచిత ప్రమాద బీమా..



తల్లిదండ్రుల పేర ప్రమాద బీమా చేయిస్తున్న జితేందర్ నాయక్


రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని గిద్దబండతండాకు చెందిన సామాజిక కార్యకర్త బానోత్ జితేందర్ నాయక్ తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించిన తల్లిదండ్రులకు ఉచిత బీమా చేయించారు. గిద్దబండతండాలోని 16 మంది పిల్లలను తల్లిదండ్రులు కిలోమీటరు దూరంలో ఉన్న మేకలగట్టు ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన వారి నిర్ణయాన్ని జితేందర్ నాయక్ అభినందించారు. ప్రోత్సాహకంగా శనివారం పాఠశాలలో తపాలా బీపీఎం ప్రియాంక సమక్షంలో తల్లిదండ్రులకు ఒక్కొక్కరి పేర రూ.10 లక్షల ప్రమాద బీమా చేయించి ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా జితేందర్ నాయక్ మాట్లాడుతూ, గిద్దబండ తండా నుంచి కిలోమీటరు దూరంలోని మేకలగట్టు పాఠశాలకు విద్యార్థులను పంపించిన తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా బీమా చేయించానన్నారు.

స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్ లొంగుబాటు



చిక్కడపల్లి: టీవీ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్ణచందర్ నాయక్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. తన కుమార్తె ఆత్మహత్య చేసుకోవడానికి ఆమెతో సహజీవనం చేస్తున్న పూర్ణచందర్ కారణమంటూ స్వేచ్ఛ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో పూర్ణచందర్ తన అడ్వొకేట్ సమక్షంలో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు.

ఎగిరే ట్యాక్సీలు



అమెరికాలో తొలిసారి విద్యుత్ విమానాలు

మనదేశంలో 2026 నాటికి అందుబాటులోకి

తయారీకి 2 కంపెనీలను ఎంపిక చేసిన డీజీసీఏ

రూ. 2,000-3,000 వరకు ఎయిర్ టాక్సీ చార్జీ!

పౌర విమానయాన చరిత్రలోనే తొలిసారిగా జూన్ 3న అమెరికాలో 'అలియా సీఎక్స్300' అనే విద్యుత్ విమానం ఐదుగురు ప్రయాణికులతో విజయవంతంగా గమ్యస్థానాన్ని చేరుకుని చరిత్ర సృష్టించింది. 130 కి.మీ. ప్రయాణానికి దీనికి పట్టిన సమయం 35 నిమిషాలు కాగా, ఇంధనానికి (విద్యుత్‌కు) అయిన ఖర్చు సుమారుగా రూ.700. అంత చౌకగా విమానయానాన్ని సాధ్యం చేయటంలో కొత్త శకానికి నాంది పలికిన ఈ విమానం.. మనదేశ ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ అభివృద్ధి ప్రయత్నాలకూ పరోక్షంగా ప్రోత్సాహాన్నిచ్చింది. అత్యాధునిక విమాన రవాణా (ఏఏఎమ్)లో భాగంగా ఇప్పటికే కీలక చర్యలు చేపట్టిన మనదేశం వచ్చే ఏడాది నాటికి ఈ విమానాలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పనిచేస్తోంది.

2023లో బెంగళూరులో జరిగిన ఒక అధ్యయనంలో.. ప్రైవేటు వాహనాలు వాడే ఉద్యోగుల్లో 57 శాతం, ప్రజా రవాణా ద్వారా ప్రయాణించే ఉద్యోగుల్లో 55 శాతం మంది కార్యాలయాలకు ఆలస్యంగా వస్తున్నారని తేలింది. ఆలస్యం కారణంగా ఏడాదిలో సుమారు 7 లక్షల పని గంటలు నష్టపోయారని అంచనా. 2023లో ట్రాఫిక్ రద్దీ కారణంగా కోల్పోయిన పని గంటల వల్ల ఒక్క బెంగళూరు నగరమే 200 బిలియన్ డాలర్లు నష్టపోయింది. పట్టణాల్లో ఇలాంటి సమస్యలు అధిగమించేందుకు తక్కువ వ్యవధిలో గమ్యానికి చేర్చే అత్యాధునిక విమాన రవాణా (ఏఏఎమ్) ఎంతో ఉపయోగపడుతుందని 'స్కై వేస్ టు ద ఫ్యూచర్ – ఆపరేషనల్ కాన్సెప్ట్స్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ ఇన్ ఇండియా' నివేదికలో పేర్కొన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్, భారత పౌర విమానయాన మంత్రిత్వశాఖ కలిసి సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి.

అంతర్జాతీయ సంస్థలతో కలిసి..

మానవ రహిత ఎయిర్ ట్యాక్సీ, ఎయిర్ మొబిలిటీలో నూతన ఆవిష్కరణల కోసం.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), యూరోపియన్ యూనియన్ సేఫ్టీ ఏజెన్సీ (ఈఏఎస్ఏ) మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. అంతేకాకుండా, ఈ వ్యవస్థ నిర్వహణ కోసం అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ), అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ వంటి వాటితోనూ మనదేశం కలిసి పనిచేస్తోంది. విద్యుత్ ఎయిర్ ట్యాక్సీలపై అధ్యయనం చేసేందుకు డీజీసీఏ 7 వర్కింగ్ గ్రూపులను ఏర్పాటుచేసిందని ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ గ్రూపులు దృష్టి సారిస్తున్న అంశాల్లో ప్రధానమైనది వెర్టిపోర్టులు (ఎయిర్ ట్యాక్సీల కోసం ప్రత్యేకించిన ఎయిర్‌పోర్టులు. సాధారణ హెలికాప్టర్ మాదిరిగానే ఎయిర్ ట్యాక్సీలు నిలువుగా టేకాఫ్ అవుతాయి. అదే విధంగా ల్యాండ్ అవుతాయి.). ఇంకా అటానమస్ డ్రోన్ల ట్రాఫిక్ వ్యవస్థ, ఎయిర్ ట్యాక్సీల నిర్వహణ, మరమ్మతులు, నియంత్రణ మార్గదర్శకాలు, సురక్షిత ప్రయాణానికి అవసరమైన మౌలిక వసతుల వంటి అంశాలపై ఈ గ్రూపులు పనిచేస్తున్నాయి.

ట్రయల్ రన్స్ కోసం..

ఎయిర్ ట్యాక్సీలను పరీక్షించడానికి, ఫలితాలను అధ్యయనం చేయడానికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. వీటిని ట్రయల్ రన్స్ చేయడానికి ఎంపిక చేసే ప్రాంతాలను విమానయాన పరిభాషలో 'శాండ్‌బాక్స్ సైట్స్' అంటారు. వీటి ఎంపిక కోసం 2025 జనవరిలో కేంద్ర పౌర విమానయాన శాఖ, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌కు చెందిన బృందాలు విస్తృతంగా పర్యటించాయి. అవి నాలుగు ప్రాంతాలను ఎంపిక చేశాయని కేంద్రం వెల్లడించింది. అవి.. **గుజరాత్‌లోని 1. కచ్‌లోని మాండవి ఎయిర్‌స్ట్రిప్ 2. సబర్మతి రివర్ ఫ్రంట్, ఆంధ్రప్రదేశ్‌లోని 1. కర్నూలు విమానాశ్రయం 2. పుట్టపర్తి విమానాశ్రయం**

ఎన్నో ప్రయోజనాలు

వెర్టిపోర్టులన్నీ సౌర, పవన విద్యుత్‌వంటి సంప్రదాయేతర ఇంధన వనరులతో నడిచేలా చూడాలన్నది కేంద్రం ఆలోచన. అలాగే, ఇవి పూర్తిగా గ్రీన్ పోర్టులుగా పర్యావరణ హితంగా ఉండాలని యోచిస్తోంది. విద్యుత్ ఎయిర్ ట్యాక్సీలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

- రోడ్లమీద ట్రాఫిక్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చు
- కాలుష్య కారక ఉద్గారాలను విడుదల చేయవు. శబ్ద కాలుష్యమూ ఉండదు.
- ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు సరకు రవాణా, ఎమర్జెన్సీ సేవలకూ పనికొస్తుంది
- అత్యాధునిక సాంకేతికత, ప్రమాణాలతో పనిచేస్తాయి కాబట్టి ప్రమాదాలకు ఆస్కారం చాలా తక్కువ
- సరికొత్త ఉద్యోగావకాశాలు వస్తాయి
- మారుమూల ప్రాంతాలకు కూడా ఈ ట్యాక్సీ సేవలను అందించవచ్చు

రెండు దశల్లో విస్తరణ

భారత్‌లో తొలి విద్యుత్ ఎయిర్ ట్యాక్సీ 2026 అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. డీజీసీఏ ఏర్పాటు చేసిన కమిటీలు 2026 నాటికి ఎయిర్ ట్యాక్సీలను మొదట ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరులలో ప్రారంభించి, తదుపరి దశలో చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు విస్తరింపజేసే దిశగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీల విధి విధానాలు ఖరారు అయ్యాక ఇండిగో మాతృసంస్థ అయిన ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ (ఐజీఇ), అమెరికా ఎయిర్ ట్యాక్సీ తయారీ కంపెనీ 'ఆర్చర్ ఏవియేషన్'తో కలిసి ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనుందట.

చార్జీలు ఎంత ఉండొచ్చు?

ఎయిర్ ట్యాక్సీ చార్జీలు ప్రస్తుతం ఉన్న క్యాబ్ చార్జీల కంటే కాస్త మాత్రమే ఎక్కువగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఉదాహరణకు ప్రస్తుతం క్యాబ్‌లో ఢిల్లీ నుండి గుర్గావ్‌కు ఒక మనిషికి రూ. 1,500–2,000 చార్జీ అవుతుండగా, దీనికి ఒకటిన్నర రెట్లు మాత్రమే ఎక్కువగా రూ. 2,000–3,000 వరకు ఎయిర్ ట్యాక్సీ చార్జీ ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ఏమని పిలవాలి?

విద్యుత్ ఎయిర్ ట్యాక్సీని సాంకేతికంగా 'ఎలక్ట్రిక్ వెర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్' (ఇ.వి.టి.ఓ.ఎల్.) ఎయిర్‌క్రాఫ్ట్ అంటున్నారు. మొత్తంగా ఈ రవాణా వ్యవస్థని 'అత్యాధునిక విమాన రవాణా (ఏఏఎమ్)' అంటారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

పనిచేస్తున్న 2 సంస్థలు

డీజీసీఏ రికార్డుల ప్రకారం ప్రస్తుత దేశంలో పౌర విమానయాన రంగంలో ఎయిర్ ట్యాక్సీల తయారీకోసం 2 సంస్థలు పనిచేస్తున్నాయని పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటించింది. అవి



చెన్నైకి చెందిన 'యుబిఫ్లై టెక్నాలజీస్' లేదా ఈ-ప్లేన్ కంపెనీ. ఐఐటీ మద్రాసులో ప్రాణం పోసుకున్న ఈ కంపెనీ ఎయిర్ ట్యాక్సీ, కార్గో ట్యాక్సీల తయారీలో పనిచేస్తోంది.



చండీగఢ్‌కి చెందిన 'నల్వా ఏరో'. ఇది కనీసం ఐదుగురు ప్రయాణించగలిగే ఎయిర్ ట్యాక్సీ రూపకల్పనలో నిమగ్నమై ఉంది.

607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

▶ మొదటి పేజీ తరువాయి

అసోసియేట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించాలని నిర్ణయం తీసుకుంది.

2,258 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరం

రాష్ట్రంలోని 34 ప్రభుత్వ వైద్య కళాశాలలకు సంబంధించి క్యాడర్ స్ట్రెంత్‌ను 3,696గా లెక్క తేల్చారు. ప్రస్తుతం 1,390 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా రెగ్యులర్ బేసిస్‌లో పనిచేస్తున్నారు. మరో 985 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన విధుల్లో ఉన్నారు. కాగా 34 వైద్య కళాశాలలకు 2,288 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరమని ప్రభుత్వానికి ఆరోగ్యశాఖ నివేదిక సమర్పించింది. దీంతో మొదటగా 607 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. త్వరలోనే మరో 714 పోస్టులు భర్తీ చేయనున్నారు. మొత్తంగా 1,321 మంది కొత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధుల్లో చేరుతారు. ఆ వెంటనే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లలో అర్హులైన 231 మందిని అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమిస్తారు. ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉన్నవారిలో 308 మందిని ప్రొఫెసర్లుగా నియమించనున్నారు. డీపీసీ ప్యానల్ 349 మందిని పదోన్నతులకు అర్హులుగా గుర్తించినప్పటికీ, తొలుత 308 మందికి మాత్రమే పదోన్నతులు కల్పించనున్నారు. కాగా, ఇప్పుడున్న ప్రొఫెసర్లలో 44 మందిని అదనపు డీఎంఈలుగా పదోన్నతి కల్పించి, బోధనాసుపత్రులకు సూపరింటెండెంట్లుగా, ప్రిన్సిపాళ్లుగా నియమిస్తారు. రెండు రోజుల క్రితమే 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్, 2 స్పీచ్ థెరపిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, గడిచిన 17 నెలల్లో ఆరోగ్య శాఖలో 8 వేలకు పైగా వివిధ పోస్టులను భర్తీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇవి కాకుండా మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 1,931 మల్టీ పర్పస్ ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రక్రియ కొనసాగుతోంది.

34 వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులు..

విభాగం	పోస్టులు	విభాగం	పోస్టులు
మల్టీజోన్ 1	879	ఫోరెన్సిక్ మెడిసిన్	21
మల్టీజోన్ 2	228	కమ్యూనిటీ మెడిసిన్	25
గైనకాలజీ	90	బయోకెమిస్ట్రీ	18
జనరల్ మెడిసిన్	47	ఫిజియాలజీ	29
జనరల్ సర్జరీ	43	అనాటమీ	22
అనస్థీషియా	44	మైక్రోబయాలజీ	15
పీడియాట్రిక్స్	28	పాథాలజీ	15
రేడియోడయాగ్నసిస్	21	ఎమర్జెన్సీ మెడిసిన్	15
హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్	21	సీటీ సర్జరీ	14
ఫార్మకాలజీ	28	ఆర్థోపెడిక్స్	12

మిగిలిన విభాగాల్లో పదిలోపు పోస్టుల చొప్పున ఉన్నాయి.

కోర్టు భవనంపై నుంచి దూకిన కుటుంబం

- భార్య మృతి.. భర్త, ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు
- భర్తపైనే మృతురాలి బంధువుల అనుమానం



సంఘటనా స్థలంలో రమ్య మృతదేహం


మెదక్‌జోన్/మెదక్ కలెక్టరేట్/మెదక్ మున్సిపాలిటీ: అత్త, భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తి భార్యాపిల్లలతో కలిసి శనివారం మెదక్ జిల్లా కోర్టుకు వచ్చాడు. కేసుకు హాజరైన అనంతరం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో కుటుంబంతో కలిసి కోర్టు భవనం మూడో అంతస్తు నుంచి దూకాడు. ఘటనలో భార్య అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఇద్దరు పిల్లలు, అతడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన డాకొల్ల నవీన్ ఐదేళ్ల క్రితం మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రమ్య (24)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్లలోపు ఆడపిల్లలు రుచిక, యశ్విక ఉన్నారు. గతేడాది నవీన్ తన అత్తగారిల్లు లక్ష్మాపూర్‌కు వచ్చి గొడవపడ్డాడు. ఈ క్రమంలో అత్త రాజమణి, భార్య రమ్యను చంపే ప్రయత్నం చేశాడు. ఈ కేసులో రామాయంపేటలో నవీన్‌పై హత్యాయత్నం కేసు నమోదుకాగా, జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో రమ్య సైతం నవీన్‌పై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. ఇటీవలే లోక్‌అదాలత్‌లో ఈ కేసుపై వారిద్దరూ రాజీపడినట్లు పోలీసులు తెలిపారు. కాగా, అత్త, భార్యపై హత్యాయత్నం కేసు విషయమై శనివారం కోర్టుకు హాజరైన నవీన్.. భార్య పిల్లలతో కలిసి కోర్టు భవనంపైనుంచి దూకాడు. భార్య అక్కడికక్కడే దుర్మరణం చెందగా నవీన్, పిల్లలు గాయపడ్డారు. వీరిని హుటాహుటిన మెదక్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. అదనపు ఎస్పీ మహేందర్ ఘటనాస్థలిని పరిశీలించారు. కాగా, నవీనే భార్యాపిల్లలను చంపే కుట్రలో భాగంగా భవనంపైనుంచి తోసిఉంటాడని రమ్య కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేశారు.

తల్లడిల్లుతున్న చిన్నారులు..

కాగా, బాలిక రుచికకు ఎడమ చేయి మూడు చోట్ల విరిగింది. ఛాతీలోనూ తీవ్ర గాయమైంది. ఏడాదిన్నర వయసున్న యశ్విక నోట్లోని పళ్లన్నీ రాలిపోయాయి. తీవ్రగాయాలతో ఉన్న ఆ చిన్నారులను చూసిన వారంతా చలించిపోతున్నారు.

ప్రభుత్వ సలహాదారుగా డా.నోరి దత్తాత్రేయుడు

ఉత్తర్వులు జారీచేసిన సీఎస్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ప్రపంచ ప్రఖ్యాత కేన్సర్ నిపుణుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రివెంటివ్, క్యూరేటివ్, అఫర్డబుల్ కేన్సర్ కేర్ రంగాలలో ఆయన అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఈ మేరకు ప్రభుత్వ వైద్య రంగంలో ఆయన సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. అత్యాధునిక చికిత్సా పద్ధతుల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడును రాష్ట్ర సలహాదారుగా నియమిస్తున్నట్టు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను తీసుకోవడం ద్వారా కేన్సర్‌పై పోరాటంలో ముందడుగు వేసిందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

158 మంది ఐఏఎస్‌ల ప్రొబేషన్ పూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాల క్యాడర్లకు కేటాయించిన 2020, 2021, 2022 బ్యాచుల్లోని 158 మంది ఐఏఎస్ అధికారుల ప్రొబేషన్ పూర్తయింది. దీనికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వీరిలో 2022 బ్యాచ్ తెలంగాణ క్యాడర్‌కు చెందిన కిరణ్మయి కొప్పిశెట్టి, మయాంక్ సింగ్, నారాయణ్ అమిత్ మాలెంపాటి, శ్రద్ధ శుక్లా, ఉమాశంకర్ ప్రసాద్, వికాస్ మహతో తదితరులున్నారు. కాగా 2023 బ్యాచ్ తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి గరిమ నరులను కేంద్ర ప్రభుత్వం రాజస్తాన్ క్యాడర్‌కు బదిలీ చేసింది. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు సంబంధించి ప్రొబేషన్ పూర్తి చేసుకున్న 2022 బ్యాచ్‌లో బచ్చు స్మరణ్‌రాజ్, బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కల్పశ్రీ కె ఆర్, మంత్రి మౌర్య భరద్వాజ్, రాఘవేంద్ర మీనా, సూర్యమన్ పటేల్, తిరుమణి శ్రీపూజ, వి.సంజనసింహ తదితరులు ఉన్నారు.



తనను తాను డెలివరీ చేసుకుంది!

తొలిసారిగా పూర్తిస్థాయి అటానమస్ కారు స్వీయ డెలివరీ

- ఫ్యాక్టరీ నుంచి సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ యజమాని ఇంటికి చేరుకున్న టెస్లా 'మోడల్ వై'.. హైవేపై ట్రాఫిక్‌ను దాటుకుంటూ గంటకు గరిష్టంగా 115 కి.మీ. వేగంతో ప్రయాణం
- 'ఎక్స్'వేదికగా ప్రకటించిన ఎలాన్ మస్క్.. వీడియో నెట్టింట వైరల్



కొత్త పుంతలు తొక్కుతున్న కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీకి సరికొత్త నిదర్శనం ఇది.. సైన్స్ ఫిక్షన్ సినిమాను పోలిన సన్నివేశం ఇది.. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టిన వస్తువు చిటికెలో డోర్ డెలివరీ అవుతున్నట్లుగా ఒక కొత్త టెస్లా కారు ఫ్యాక్టరీ నుంచి స్వయంగా డ్రైవింగ్ చేసుకుంటూ కస్టమర్ ఇంటికి వచ్చేసింది! హైవేపై సాఫీగా ముందుకు కదులుతూ.. మధ్యమధ్యలో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగుతూ.. గరిష్టంగా 115 కి.మీ. వేగంతో దూసుకెళ్తూ తన కొత్త ఓనర్ ఉన్న లొకేషన్‌కు భద్రంగా చేరుకుంది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా కంపెనీ ప్రపంచంలోనే తొలిసారిగా ఏమాత్రం మానవ ప్రమేయం లేకుండా తమ కొత్త కారును నేరుగా వినియోగదారుడి చెంతకు చేర్చింది. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో నడిచే పూర్తిస్థాయి అటానమస్ కారు 'మోడల్ వై'ను టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్ నగరంలో ఉన్న ఫ్యాక్టరీ నుంచి అక్కడికి 30 నిమిషాల ప్రయాణ దూరంలో ఉన్న కస్టమర్ ఇంటికి పంపించింది. మార్గమధ్యలో ట్రాఫిక్ సిగ్నళ్లు, ఫ్లైఓవర్లు, హైవేలను దాటుకుంటూ కారు తన కొత్త యజమాని ఇంటికి చేరుకుంది. ఫ్యాక్టరీ నుంచి గమ్యస్థానం చేరుకొనే వరకు కారు సాగించిన ప్రయాణాన్ని అందులోని 'డాష్ క్యామ్' రికార్డు చేసింది. ఇందుకు సంబంధించి టెస్లా విడుదల చేసిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మరోవైపు తమ అటానమస్ కారు డెలివరీని ఎలాన్ మస్క్ 'ఎక్స్'వేదికగా ప్రకటించారు. 'తొలిసారి ఒక కారు యజమానికి తనను తాను డెలివరీ చేసుకుంది' అని పేర్కొన్నారు. నిర్ణీత గడువుకన్నా ఒక రోజు ముందే కారును డెలివరీ చేశామన్నారు. తనకు తెలిసినంత వరకు వాహనంలో వ్యక్తులెవరూ లేకుండా లేదా రిమోట్ ఆపరేటింగ్ లేకుండా ఒక పబ్లిక్ హైవేపై ప్రయాణించిన తొలి పూర్తిస్థాయి అటానమస్ కారు తమదేనన్నారు. ఈ విజయాన్ని సాధించినందుకు టెస్లా సాఫ్ట్‌వేర్, ఏఐ చిప్ డిజైన్ బృందాలను ఆయన అభినందించారు. మోడల్ వై కారు గంటకు గరిష్టంగా 115 కి.మీ. వేగంతో ప్రయాణించినట్లు టెస్లా ఏఐ, ఆటోపైలట్ విభాగం చీఫ్ అశోక్ ఎల్లుస్వామి వెల్లడించారు.

- సాక్షి, సెంట్రల్ డెస్క్

వివాహితపై అమానవీయ దాడి ఘటన..
పోలీసుల అదుపులో నిందితులు

- సాక్షి కథనంపై స్పందించిన అధికార యంత్రాంగం
- హుటాహుటిన తాటికాయల గ్రామానికి సివిల్ జడ్జీలు, అధికారులు
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్



తాటికాయలలో పర్యటిస్తున్న జడ్జీలు

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఓ వివాహితను వివస్త్రను చేసి అమానవీయంగా దాడి చేసిన ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి ఘటనపై 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. న్యాయసేవా అధికార సంస్థ హనుమకొండ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండేతోపాటు మరో జడ్జి శ్రావణ స్వాతి, వివిధ శాఖల అధికారులు, పోలీసులు హుటాహుటిన తాటికాయల గ్రామానికి చేరుకున్నారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తుల ద్వారా వివరాలు సేకరించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ప్రజలు పోలీసులను లేదా కోర్టును ఆశ్రయించాలి తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని జడ్జీలు హెచ్చరించారు. జిల్లాలో న్యాయసేవా అధికార సంస్థను ఏర్పాటు చేశామని.. దీనిద్వారా ఉచితంగా న్యాయసేవలు అందుతాయన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇలాంటి ఘటనలకు పాల్పడితే వారిని కూడా నేరస్తులుగా పరిగణించి శిక్షలు విధిస్తామని హెచ్చరించారు.

అశ్లీల వీడియోలు షేర్ చేయడం నేరం

ఈ అంశంపై కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి ధర్మసాగర్ పోలీసు స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై వివరాలు సేకరించగా దాడి జరిగింది నిజమేనని తేలిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి విచారణ కొనసాగుతోందని.. బాధితుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. ఒకరు తప్పు చేశారని, మరొకరు ఇంకో తప్పు చేస్తే పెద్దశిక్షలు పడతాయని చెప్పారు. నిందితులు తమ అదుపులోనే ఉన్నారని, వారిని విచారించి పూర్తి సమాచారం సేకరించాల్సి ఉందన్నారు. జుగుప్సాకరమైన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం నేరమని.. అశ్లీల కంటెంట్‌ను షేర్ చేస్తే సెక్షన్ 67 కింద కనీసం 5 ఏళ్ల జైలుశిక్ష, రూ. 10 లక్షల జరిమానా పడుతుందన్నారు.

రిమ్స్‌లో ఫ్లోరింగ్ టైల్స్ ఏర్పాటు



ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జరిపిన ఆకస్మిక తనిఖీ సందర్భంగా.. పగిలిన ఫ్లోరింగ్‌ను చూసి ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. 'డైరెక్టర్ గారూ.. వాట్ ఈజ్ దిస్' అని ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన స్పందించి మరమ్మతులకు ఆదేశించారు. పగిలిన ఫ్లోరింగ్‌ను తొలగించి కొత్త టైల్స్‌ను ఏర్పాటు చేశారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


పెద్ద సాకడలో పెద్ద దేవుని వద్ద మొక్కుతున్న ఆదివాసీలు


పెద్ద సాకడలో శివారులోని అడవిలో వంటలు చేస్తున్న ఆదివాసీలు

ప్రథమ పండుగ 'అకాడి'

ఆదివాసీ గూడేల్లో పండుగలకు శ్రీకారం

నాలుగు నెలలపాటు కొనసాగనున్న పూజలు ● దీపావళి, భోగీతో ముగింపు

పశువులకు రక్షణ కల్పించే దేవుడిగా మొక్కులు

ఆదివాసీల ప్రథమ పండుగ అకాడి సంబురాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. పశువులకు రక్షణ కల్పించే దేవుడి పండుగగా దీనిని భావిస్తారు. అడవులకు వెళ్లి ప్రత్యేక పూజలు, వంటావార్పులతో ఆనందంగా గడుపుతున్నారు.

కెరమెరి (ఆసిఫాబాద్): పండుగలు జరుపుకోవడం, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆదివాసీలు ముందుంటారు. వానాకాలం సీజన్ ప్రారంభమైంది మొదలు చినుకు రాలినా.. దుక్కి దున్నినా.. విత్తనాలు వేసి పంటలు చేతికొచ్చేవరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి. శనివారం నుంచి ప్రారంభమైన అకాడి పూజలు వారం రోజులపాటు కొనసాగనున్నాయి. దీంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఆషాడ మాసం నుంచి..

ఆషాడ మాసం ప్రారంభంతో గిరిజన గ్రామాల్లో పండుగలు ప్రారంభమవుతాయి. ఇందులో మొదట వచ్చే పండుగ అకాడి. అడవిని దేవతగా కొలిచే ఆదివాసీలు.. రాజుల్‌పేన్‌ను పాడిపశువులకు రక్షణ కల్పించే దేవతగా మొక్కుతారు. నెలవంక కనిపించగానే ప్రతీ గ్రామంలో పూజలు నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దుక్కులు కాస్త ఆలస్యం కావడంతో.. పండుగ కూడా కొంత ఆలస్యంగా మొదలు పెట్టామని ఆదివాసీ పెద్దలు, కటోడాలు వెల్లడించారు.

వనంలో పూజలు..

అకాడి వేడుకల్లో భాగంగా గూడేల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ పొలిమేరలో ఉండే చెట్టువద్దకు వెళ్లి దేవతల ప్రతిమలను శుద్ధి చేస్తారు. పసుపు గీతలు వేసి బియ్యంతో రాజుల్‌పేన్‌కు పూజలు చేస్తారు. అనంతరం కటోడాలు ఇచ్చే అక్షింతలను సమర్పిస్తారు. అడవిలోనే నైవేద్యం తయారు చేస్తారు. సహపంక్తి భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. తర్వాత ఓ గీత గీసి దాని పైనుంచి పశువులను అడవుల్లోకి తోల్కొని వెళ్తారు. ఈ సందర్భంగా తుర్రను ప్రత్యేకంగా ఊదుతారు. ఇది పశువుల కాపరుల వద్ద ఉంటుంది. పశువులు అడవిలో తప్పిపోకుండా ఎక్కడ ఉన్నా ఈ శబ్దం విని ఇళ్లకు చేరుకుంటాయని నమ్ముతారు. అడవిలోని చెట్లను దేవుడిగా భావించి అకాడిపేన్ పూజల అనంతరం ఆకులను ఇంటికి తీసుకెళ్తారు.

కోడి జాతకం ప్రత్యేకం..

అకాడి పూజల్లో కోడి జాతకం ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రతీ ఇంటి నుంచి కోడిని కొనుగోలు చేసి దేవతకు బలి ఇస్తారు. ఈ ఏడాదంతా ఎలా గడుస్తుంది?.. వర్షాలు ఎలా పడతాయి?.. పంటలు ఎలా పండుతాయనే విషయాలను ఆదివాసీలు కోడి జాతకం ద్వారా తెలుసుకుంటారు. గ్రామం నుంచి సేకరించిన బియ్యంతో భోజనం తయారు చేస్తారు. ముద్దలుగా చేసి ఆరగిస్తారు.

ఏత్మాసార్ పేన్‌కు మొక్కులు

అకాడి అనంతరం గ్రామంలోకి చేరుకునే ఆదివాసీలు ఏత్మాసార్ పేన్‌కు మొక్కులు చెల్లిస్తారు. ప్రజలు, పశువులు క్షేమంగా ఉండాలని పూజలు చేస్తారు. అకాడి పండుగ అనంతరం నాగుల పంచమి, జామురావూస్, శివబోడి, పొలాల అమావాస్య, బడిగా, దసరా, భోగి, దీపావళి పండుగలను ఆదివాసీ గూడేల్లో జరుపుకొంటారు.


పెద్ద సాకడలో ఏత్మాసార్ దేవుని వద్ద పూజలు


సిర్పూర్(యూ)లో తుర్ర మోగిస్తున్న పెద్దలు



అనాదిగా వస్తున్న ఆచారం

అకాడి పండుగ అనాదిగా వస్తున్న ఆచారం. ఈ పండుగ తర్వాత మిగిలిన పండుగలు జరుపుకొంటాం. రాజుల్ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తాం.

– కుర్సెంగ సోంజి, రైతు, పెద్దసాకడ, మం.కెరమెరి



ఆయురారోగ్యాలతో ఉండాలని..

ప్రజలతోపాటు పశుపక్ష్యాదులు ఆయురారోగ్యాలతో ఉండాలని రాజుల్ దేవతను కొలిచే పండుగ ఇది. ఇందులో భాగంగా కోడి పంచాంగం చెబుతుంది. దాని ప్రకారమే ఏడాదంతా జరుగుతుందని నమ్ముతాం.

– పెందోర్ మోతీరాం, మాజీ ఎంపీపీ, కెరమెరి



ఏత్మాసార్‌పేన్‌కు పూజలు

అకాడి పూజల తర్వాత ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం . అనంతరం నాలుగు నెలలపాటు పూజలు కొనసాగుతాయి. గుస్సాడీ దీక్ష స్వీకరించే వారు మొక్కుకుంటారు. సహపంక్తి భోజనాలు ఆదివాసీల్లో ఐకమత్యం నింపుతాయి.

– ఆత్రం బొజ్జిరావు, సార్‌మేడి, చౌపన్‌గూడ, మం.కెరమెరి

కోటిలింగాల అభివృద్ధి జరిగేనా?

నిధుల కొరతతో అర్ధంతరంగా ఆగిన పురావస్తుశాఖ తవ్వకాలు

పాలకుల నిర్లక్ష్యంతో మరుగున పడిన చరిత్ర

స్వరాష్ట్రంలోనూ కోటిలింగాలపై దృష్టి సారించని పాలకులు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చరిత్ర గోదారి పాలేనా?


ఇటీవల మత్స్యకారుడికి గోదావరి ఒడ్డున లభించిన విక్టోరియా మహారాణి ఫొటోతో ఉన్న నాణేలు

వెల్గటూర్ (ధర్మపురి): శాతవాహన తొలి రాజధానిగా చరిత్రకెక్కిన కోటిలింగాల క్షేత్రంలో వారం రోజుల కిందట గోదావరిలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడికి క్వీన్ విక్టోరియా ఫొటోతో పురాతన నాణేలు లభ్యమవడంతో కోటిలింగాల పేరు మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో 1979 నుంచి 1984 వరకు అనంతరం 2009 ఫిబ్రవరిలో రెండోసారి పురావస్తు శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిపారు. మొదటిసారి జరిపిన తవ్వకాల్లో కోటిలింగాలలో 100 ఎకరాల విస్తీర్ణంలో దీర్ఘచతురస్రాకారంలో ఎత్తైన గోడలతో పాటు కోట బురుజులతో ఉన్న శాతవాహనుల రాజధాని నగరం బయటపడింది. కాలక్రమేణా కోట శిథిలమైన తర్వాత బురుజుపై కోటేశ్వరస్వామిని ప్రతిష్ఠించారు. రెండవసారి నిధుల కొరతతో అర్ధంతరంగా తవ్వకాలు ఆపేయడంతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కోటిలింగాల చరిత్ర మరుగునపడిపోయింది.

పుస్తకాల్లోనూ దక్కని చోటు


జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న కోటిలింగాలను రాజధానిగా చేసుకొని సుమారు రెండు వేల ఏళ్ల కిందట క్రీ.పూ.230 నుంచి క్రీ.శ.220 వరకు శాతవాహనులు పరిపాలించారు. కాగా, 1979 నుంచి 1984 వరకు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాలలో శాతవాహన వంశమూల పురుషుడు (చిముక) శ్రీముఖుని పేరుతో వందలాది సీసం, రాగి నాణేలు లభ్యం కావడంతో కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని నగరంగా చారిత్రక ఆధారాలు లభించాయి. పూర్తిగా తయారు కాని నాణేలు లభించడంతో, ఇక్కడే నాణేల ముద్రణాలయం కూడా ఉండేదని ఆధారాలు లభించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాతవాహనుల తొలి రాజధాని ప్రాతిష్ఠానపురం (పైఠాన్), మలి రాజధాని ధాన్యకటకం (అమరావతి)గా పాఠ్య పుస్తకాలు, చరిత్ర పుస్తకాల్లోనూ రాసుకున్నారు. తవ్వకాలు జరిగిన సుమారు 20 ఏళ్ల వరకు కోటిలింగాల ఎక్స్‌కవేషన్ రిపోర్టును ఉమ్మడి రాష్ట్ర పాలకులు బయటపెట్టకుండా కోటిలింగాలకు తీవ్ర అన్యాయం చేశారు. అలాగే తవ్వకాల్లో బయటపడిన నాణేలు, పనిముట్లు, మట్టి పాత్రలు, పూసలు, ఆభరణాలు, పురాతన వస్తువులు కొన్ని ఆర్కియాలజీ విభాగంలో, కొన్ని హైదరాబాద్ సెంట్రల్ మ్యూజియంలో, కరీంనగర్‌లోని మ్యూజియంలో చెట్టుకొకటి పుట్టకొకటి లాగా అపూర్వ సంపద మొత్తం తరలిపోయింది. నాగముచిలింద లాంటి అరుదైన శిల్పాలు నవ్యాంధ్ర రాజధాని అమరావతికి తరలించారు. ఘన కీర్తి కలిగిన కోటిలింగాల చరిత్రను వెలుగులోకి రానీయకుండా మరుగున పడేసి అమరావతిని శాతవాహన రాజధానిగా అభివృద్ధి చేసుకున్నారు. ఉమ్మడి పాలనలో వివక్షకు గురైన కోటిలింగాలను తెలంగాణ ఏర్పాటు తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గొప్ప పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి.

మంత్రి అడ్లూరి చొరవతో..

ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన కోటిలింగాల ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌తో మూడు వైపులా నీటితో నిండిపోయి, చరిత్ర ఆనవాళ్లు కనుమరుగు అయ్యాయి. కాగా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోటిలింగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారు. కోటిలింగాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గత పాలకులు హామీ ఇచ్చినట్లుగా గోదావరికి సేఫ్టీవాల్ నిర్మించి, ఇక్కడి నుంచి తరలించిన చారిత్రక ఆనవాళ్లను, శిల్పాలను తిరిగి తీసుకువచ్చి మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. 2027 సంవత్సరంలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి కోటిలింగాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, సరైన ప్రచారం కల్పిస్తే దేశ నలుమూలల నుంచి పర్యాటకులను ఆకర్షించి గొప్ప పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.


తవ్వకాల్లో బయటపడిన శ్రీముఖుడి నాణేలు


తవ్వకాల్లో బయటపడిన శాతవాహనుల కాలం నాటి బావి


తవ్వకాల్లో బయటపడిన శాతవాహనుల కాలం నాటి మట్టిగోడలు


పీవీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న పి.వి.నరసింహారావు బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశానికి ఎనలేని సేవలను అందించారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పీవీ సేవలు మరువలేనివి

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: దేశానికి, కాంగ్రెస్ పార్టీకి మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అందించిన సేవలు మరువలేనివని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. పీవీ సేవలు తరతరాలకు స్ఫూర్తి కలిగించేలా స్మరించుకోవాలన్నారు. పీవీ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆయనకు మహేశ్‌కుమార్‌గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. గాంధీభవన్‌లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు టీపీసీసీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేషన్ చైర్మన్లు ఫయీమ్, వెంకట్ రాంరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్ రావు తదితరులు పాల్గొన్నారు.

నవ భారత నిర్మాత పీవీ నరసింహారావు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: నవ భారత నిర్మాత దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలంగాణ గడ్డపై పుట్టడం మనందరికీ గర్వకారణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. శనివారం పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. పీవీ సంస్కరణశీలి, బహుభాషా కోవిదుడు అని కొనియాడారు. అలాగే కవి, ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, నిత్య విద్యార్థి.. ఇలా పీవీ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనన్నారు. తన సొంత భూమిని ప్రభుత్వానికి అప్పగించి దేశంలో కీలకమైన భూసంస్కరణలను ప్రారంభించిన మహనీయుడు పీవీ అని పేర్కొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి వేడుకలు



సాక్షి, హైదరాబాద్: దేశ మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతిని శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ పీవీ నరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రధానిగా పీవీ చేసిన సేవలు, ముఖ్యంగా ఆర్థిక రంగంలో చేసిన సంస్కరణలు, విద్యారంగంలో చేసిన అభివృద్ధి, భాషా, సాంస్కృతిక రంగాల పట్ల ఆయన చూపిన అభిమానాన్ని పోలీస్ అధికారులు గుర్తుచేసుకున్నారు. శాంతి భద్రతల ఏఐజీ రమణకుమార్, సీఎస్‌వో యోగేశ్వరరావు, డీఎస్పీలు వేణుగోపాల్, ఉదయ భాస్కర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీకి అఖిలపక్షం

బీసీ సంక్షేమ సంఘం సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించిన బీసీ బిల్లును ఆమోదించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించేలా ఒత్తిడి తేవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుకోసం అవసరమైతే ప్రధాని కార్యాలయం ముందు ధర్నా చేయాలని ఆయన సూచించారు.

సినీనటుల్ని మించిన శ్రీధర్‌బాబు

మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా పనిచేసిన శ్రీధర్‌బాబును.. 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై అందరూ ప్రశ్నించాలని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు కోరారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సినిమా నటుల్ని మించి నటిస్తున్న శ్రీధర్‌బాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఆస్కార్ కమిటీకి లేఖ రాస్తున్నట్లు చెప్పారు. మంథనిలో తెర వెనుక ఎన్నో పనులు చేస్తూ.. మంచివాడిగా చలామణి అవుతున్న శ్రీధర్‌బాబుకు ఉత్తమ నటుడు అవార్డు ఇవ్వాల్సిందేనని ఎద్దేవా చేశారు. మేధావిగా కీర్తిస్తున్న శ్రీధర్‌బాబు మంథనిని మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.


మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం పీవీఆర్ సినిమాస్‌లో ప్రదర్శించిన పూలే సినిమాను తిలకిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఇతర పార్టీ నాయకులు

క్లుప్తంగా...

10న జూనియర్ కాలేజీల్లో పీటీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్‌మెంట్లలోని అన్ని జూనియర్ కాలేజీల్లో వచ్చేనెల 10వ తేదీన పేరెంట్–టీచర్ సమావేశాలు (పీటీఎం) నిర్వహించాలని ఇంటర్మీడియట్ విద్యా మండలి డైరెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఈమేరకు పాటించాల్సిన మార్గదర్శకాలను అన్ని కాలేజీలకు అందించాలని ఆర్ఐవో, డీఐఈవో, డీవోఈవోలను సూచించారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి: డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా జాబ్ క్యాలెండర్ ఊసే లేదన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ ఎప్పుడు?

ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేయకుండా, ఉన్నత విద్యామండలి డ్యూయల్ మేజర్ సబ్జెక్టు విధానంపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం దారుణమని రివల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావొస్తున్నా ఇప్పటి దాకా ప్రభుత్వం అడ్మిషన్స్ నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. విద్యార్థులు, బోధనా సిబ్బంది నుంచి అభిప్రాయాలు తీసుకుని వారి సూచనల మేరకు సింగిల్ మేజర్ కొనసాగించాలా? డ్యూయల్ మేజర్ ప్రవేశపెట్టాలా? అనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దళిత క్రైస్తవులకు, ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలి

నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులు, దళిత ముస్లింల డిమాండ్స్‌పై ఈ నెల 30న విజయవాడలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ 2023లో అప్పటి సీఎం వైఎస్ జగన్ అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. ఈ విషయంలో కేంద్రంలో భాగస్వామిగా ఉన్న సీఎం చంద్రబాబు ప్రధాని మోదీపై ఒత్తిడి తెచ్చి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా సాధించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దళిత క్రైస్తవులు, ముస్లింలు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు రిజర్వేషన్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 11న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని రాజకీయపార్టీలకు విజ్ఞప్తి చేశారు.

ఎఫ్‌సీఐ పనితీరు సంతృప్తికరం: ఎంపీ లావు

సాక్షి, అమరావతి: ఆహార ధాన్యాల సేకరణలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) పనితీరు బాగుందని ఏపీ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు అన్నారు. అమరావతిలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ప్రాంతీయ కార్యాలయంలో శనివారం సమావేశమైన కమిటీ ఎఫ్‌సీఐ కార్యకలాపాలపై సమీక్షించింది. ఈ ఏడాది ఎఫ్‌సీఐ 5.81 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున 15.51 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ఎంపీ చెప్పారు.

పార్ట్ టైం టీచర్ మృతికి మంత్రి సంతాపం

సాక్షి, అమరావతి: గురుకులం పార్ట్ టైం టీచర్ వీర కుమారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై రాష్ట్ర మంత్రి డీబీవీ స్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. కృష్ణా జిల్లా బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పార్ట్ టైం టీచర్ వీరకుమారి శుక్రవారం పాఠశాల నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. వీరకుమారి కుటుంబానికి పరిహారం అందించి అండగా ఉంటామన్నారు.

మాచ్‌ఖండ్ మిలమిల



మాచ్‌ఖండ్‌శ్రీ జలవిద్యుత్ కేంద్రం

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్‌జలవిద్యుత్ కేంద్రం పూర్తిస్థాయి ఉత్పాదన దిశగా అడుగులు వేస్తోంది. ప్రాజెక్ట్ సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తూ ఆరు యూనిట్లలో ఐదింటిని వినియోగంలోకి తెచ్చారు. మిగతా యూనిట్‌లో కూడా విద్యుత్ ఉత్పత్తి చేపట్టేలా ఇరు రాష్ట్రాల అధికారులు శ్రమిస్తున్నారు.

- ప్రాజెక్ట్‌లో మెరుగుపడుతున్న విద్యుత్ ఉత్పాదన
- వినియోగంలో ఐదు యూనిట్లు.. 97 మెగావాట్ల మేర ఉత్పత్తి
- మిగతా యూనిట్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- కొద్దిరోజుల్లో పూర్తిస్థాయి ఉత్పాదన దిశగా అడుగులు
- ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది సమష్టి కృషి



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో జనరేటర్లు

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పాదన గాడిలో పడుతోంది. కొంతకాలంగా తరచూ జనరేటర్లు మొరాయిస్తుండటంతో ప్రాజెక్టు ఉద్యోగులు అవస్థలు పడుతూ వచ్చారు. మరోపక్క నీటి సమస్య కూడా ఉత్పాదనకు ఆటంకం కలిగించింది. ఇప్పుడు ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ప్రాజెక్ట్ జలాశయాల నీటిమట్టాలు కూడా మెరుగుపడుతున్నాయి. అధికారులు, సిబ్బంది రేయింబళ్లు శ్రమించి ప్రాజెక్ట్‌లోని ఆరు యూనిట్లలో ఐదింటిని వినియోగంలోకి తెచ్చారు. ప్రస్తుతం 1,2,3,5,6 జనరేటర్ యూనిట్ల ద్వారా 97 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. నాలుగో నంబరు జనరేటర్‌కు మరమ్మతులు జరుగుతున్నాయి. దీనిని కూడా వినియోగంలోకి తెచ్చేందుకు కృషి జరుగుతోందని ప్రాజెక్ట్ అధికారవర్గాలు తెలిపాయి. ఆరు జనరేటర్లు పనిచేస్తే 120 మెగావాట్ల మేర ఉత్పాదన జరుగుతుందని పేర్కొన్నాయి.

- జనరేటర్లు మరమ్మతుల కారణంగా దాదాపుగా 15 ఏళ్లుగా విద్యుత్ ఉత్పాదన కుంటుపడింది. 2023 ఆగస్టులో మాత్రమే ప్రాజెక్ట్‌లోని ఆరు జనరేటర్లు పనిచేయడం వల్ల పూర్తిస్థాయిలో 120 మెగా వాట్ల విద్యుత్ ఉత్పాదన సాధ్యమైంది. అప్పటిలో రెండు నెలల మాత్రమే పూర్తిగా జనరేటర్లు పనిచేశాయి. ఆ తరువాత నుంచి మొరాయింపుతో ఉత్పాదన తగ్గిపోయింది. కొద్ది నెలల క్రితం వరకు 68 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరిగేది. అధికా రులు సిబ్బంది కృషి వల్ల 97 మెగావాట్లకు చేరింది.

మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ వివరాలు

మొత్తం యూనిట్లు	: 6
పనిచేస్తున్నవి	: 5
మొత్తం సామర్థ్యం	: 120 మెగావాట్లు
ప్రస్తుత ఉత్పాదన	: 97 మెగావాట్లు

కొద్దిరోజుల్లో పూర్తిస్థాయి ఉత్పాదన

డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో గతంలో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం నీటి నిల్వలు పెరుగుతున్నందున విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీరు అందుబాటులో ఉంది. నాలుగో నంబరు జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో పూర్తిస్థాయి ఉత్పాదనకు ఆస్కారం ఉంది.

– ఏపీ సుబ్రమణ్యేశ్వరరావు, ఎస్ఈ,మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం

జలాశయాల్లోకి వరద నీరు

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే డుడుమ,జోలాపుట్టు జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నెల రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో రెండు జలాశయాల్లో భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది.

- డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2,590 అడుగులు కాగా బుధవారం నాటికి 2,579 అడుగులుగా నమోదు అయింది.
- జోలాపుట్టు జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా మంగళవారం నాటికి 2,725 అడుగులుగా నమోదు అయింది. గత ఏడాది ఇదే రోజు 2,697 అడుగుల మేర నీరు ఉంది.



వరద నీటితో డుడుమ జలాశయం




నిండుగా జోలాపుట్టు జలాశయం

ప్రాణాలకు తెగిస్తేనే పాఠాలు

గుండె తరుక్కుపోయే కఠిన వాస్తవం.. చదువు కోసం చిన్నారులు ప్రాణాలకు తెగించి చేస్తున్న ప్రమాదకర ప్రయాణం.. పడవపై రైవాడ జలాశయం దాటి, కొండలు గుట్టల్లో నడిచి, పొరుగు జిల్లా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలల సాహస కృత్యం.. వారి దీనావస్థ కఠిన హృదయులను సైతం కదిలిస్తుంది.. గిరిజన ప్రాంతంలో పుట్టిన పాపానికి ఆ అడవి బిడ్డలు పడుతున్న కష్టం పగవారికి కూడా వద్దనిపిస్తుంది.

- నాటు పడవలో.. బురదలో కాలినడకన రాకపోకలు
- 5 కి.మీ దూరంలో ఉన్న బడికి ప్రమాదకర ప్రయాణం
- అనంతగిరి మండలం సొలబంగు బాలల అవస్థలు
- దేవరాపల్లి మండలం తామరబ్బ పాఠశాలలో చదువు
- గ్రామానికి రోడ్డు, బడి లేక చిన్నారుల ఇక్కట్లు
- పిల్లలు ఇంటికి చేరుకునే వరకు భయాందోళనలో తల్లిదండ్రులు



తామరబ్బ పాఠశాలలో పాఠాలు వింటూ..



నాటు పడవపై తామరబ్బ పాఠశాలకు పయనమైన సొలబొంగు విద్యార్థులు



కర్రల సహాయంతో బురద రోడ్డులో పాఠశాలకు నడిచి వెళ్తున్న చిన్నారులు

దేవరాపల్లి: రైవాడ జలాశయానికి ఆవల.. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పరిధిలోని గిరిజన ప్రాంతం ఉంది. పినకోట పంచాయతీ శివారు సొలబొంగు గ్రామానికి చెందిన బాలలు చదువు కోసం ప్రాణాలకు తెగించి, అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి, పాఠశాల లేకపోవడంతో ఈ గ్రామానికి చెందిన 12 మంది విద్యార్థులు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండల పరిధిలోని తామరబ్బ ఎంపీయూపీ పాఠశాలకు పడవపైన, కాలినడకన వచ్చి చదువుకుంటున్నారు. సొలబొంగు నుంచి తామరబ్బకు చేరుకోవాలంటే రెండు మార్గాలు. వీరభద్రపేట మీదుగా పొలాల గట్లపై జారు బురదలో సుమారు 5 కిలోమీటర్ల మేర కాలినడకన చేరుకోవాలి. వర్షం పడితే ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టం. దీనికి ప్రత్యామ్నాయంగా సొలబొంగు నుంచి నాటు పడవపై రైవాడ జలాశయంలో సుమారు 3 కిలోమీటర్ల మేర ప్రయాణించి, దేవరాపల్లి మండల పరిధిలోని లోవ ముకుందపురం గ్రామానికి చేరుకొని.. అక్కడి నుంచి మళ్లీ ఒక కిలోమీటరు మేర చెట్లు, పుట్టల గుండా కర్రలు చేత పట్టుకొని ప్రయాణించి తామరబ్బ పాఠశాలకు చేరుకోవాలి. ప్రస్తుతం వర్షాలు కురవడంతో విద్యార్థులు పడవపైనే పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వారు తిరిగి ఇంటికి చేరుకునే వరకు తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేని పరిస్థితుల్లో పాఠశాలకు పంపిస్తున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరభద్రపేట రోడ్డు నిర్మాణ పనులను అసంపూర్తిగా నిలిపివేయడంతో తమకు మరిన్ని కష్టాలు వెంటాడుతున్నాయని సొలబొంగు గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామంలో 16 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. సుమారు 70 మంది వరకు జనాభా ఉన్నారు. ప్రస్తుతం 12 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గ్రామస్తులు సైతం నిత్యావసర సరకుల కోసం పడవపైన, లేదా వీరభద్రపేట మీదుగా తామరబ్బ వైపునకు చేరుకోవాల్సిన పరిస్థితి. ఈ గ్రామానికి చెందిన గర్భిణులు ఆసుపత్రికి చేరుకోవాలంటే సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని దేవరాపల్లి ఆసుపత్రే దిక్కు.

దారీ తెన్నూ లేదు



మా గ్రామానికి దారీ తెన్నూ లేదు. మా గ్రామంలో బడి లేక పిల్లల్ని దేవరాపల్లి మండలంలోని తామరబ్బ స్కూల్‌కు పంపిస్తున్నాం. నా కుమార్తె అంజలి 4వ తరగతి చదువుతోంది. సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పొలాల గట్ల మీదుగా తుప్పలు, డొంకలను దాటుకుంటూ నడిచి వెళ్తున్నారు. వర్షం కురిస్తే కాలినడక మార్గం బురదమయంగా మారుతుంది. ప్రభుత్వం స్పందించి మా పిల్లలు పడుతున్న కష్టాలను తీర్చాలి.

– దిప్పల దేముడుబాబు, విద్యార్థిని తండ్రి, సొలబొంగు

ప్రభుత్వం స్పందించాలి



మాకు ఎలాగూ చదువు లేదు.. మా పిల్లలనైనా చదివించాలని ఆశ పడుతున్నాం. నా కూతురు శివజ్యోతి ఒకటో తరగతి చదువుతోంది. ప్రస్తుత వర్షాలకు వీరభద్రపేట మార్గం అడుగు తీసి అడుగు వేయలేని విధంగా బురదమయంగా మారింది. ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో నాటు పడవలపై పిల్లలను లోవ ముకుందపురం వరకు పంపిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి మా గ్రామానికి బడి, రోడ్డు సౌకర్యం కల్పించి ఆదుకోవాలి.

–గమ్మెల రాజు, విద్యార్థిని తండ్రి, సొలబొంగు

శ్రీవారి దర్శనానికి 20 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 68,229 మంది స్వామి వారిని దర్శించుకోగా 30,559 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

అంజన్నకు అభిషేక సేవ



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో స్వయంభువై వెలిసిన శ్రీ మద్దిఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించే అభిషేక సేవ సందర్భంగా ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మానసిక వేదనతోనే రాజీనామా చేశా

నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం కోటితీర్థం గ్రామ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం మధుసూదన్‌రావు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిరసనతో తన ఉద్యోగానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఆయనను సాక్షి పలుకరించగా తన రాజీనామాకు దారితీసిన ఆవేదనా భరిత అంశాలను విశదీకరించారు. ఇంటర్వ్యూ వివరాలు ఇలా... –ఆత్మకూరు

- కూటమి ప్రభుత్వంలో టీచర్లపై ఒత్తిడి ఎక్కువైంది
- ఉద్యోగిగా సంతృప్తి లేని పరిస్థితి
- పలు రకాల యాప్‌లతో వేధింపులు
- జగన్ హయాంలో మౌలిక వసతుల పురోగతి
- నేడు అన్ని విభాగాల్లో తిరోగమనం
- బదిలీల ప్రక్రియలో తీవ్ర అన్యాయాలు
- సమస్యలపై ఉపాధ్యాయులను చైతన్యవంతులను చేస్తా
- సాక్షితో కోటితీర్థం ఎంపీపీ పాఠశాల మాజీ హెచ్‌ఎం ఎం.మధుసూదన్‌రావు



ప్ర: రాజీనామా చేసేందుకు కారణం ఏమిటి?

జ: విద్యాబుద్ధులు నేర్పి భావితరాలకు ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తారు. అయితే కూటమి ప్రభుత్వం చదువుకు సంబంధంలేని పలు రకాల యాప్‌లు ఉపాధ్యాయులపై రుద్ది వాటికి సమాధానాలు సకాలంలో ఇవ్వకపోతే మెమోలు ఇస్తోంది. దీంతో వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడి ఏర్పడి రాజీనామా ఇచ్చేశా.

ప్ర: తదుపరి ఏమి చేయనున్నారు?

జ: యాప్‌లతో విసిగి వేసారిన ఎందరో ఉపాధ్యాయులు వారి కష్టాలను బహిరంగంగా చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎవరో ఒకరు ఈ విషయాన్ని ఎదిరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. అందుకే ఈ చిన్న ప్రయత్నం చేద్దామనే ఉద్దేశంతో రాజీనామా సమర్పించాను. సమస్యలపై ప్రజలను, ఉపాధ్యాయులను చైతన్య పరిచేందుకు ఉద్యమం చేస్తా.

ప్ర: అందరిదీ ఇదే పరిస్థితా?

జ: యాప్‌లతో చదువుకు సంబంధంలేని ఇతర పనులకు సమయం కేటాయించలేక అంకితభావంతో వృత్తి బాధ్యతలు నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు ఎందరో ఉన్నారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛ ఇవ్వండి. నాణ్యమైన విద్యను రాబట్టండి అని మేము చెప్పేందుకు స్వేచ్ఛలేని పరిస్థితి ఏర్పడింది. దాదాపు 90 శాతానికిపైగా ఉపాధ్యాయులది ఇదే పరిస్థితి.

ప్ర: వృత్తి పట్ల సంతృప్తి ఎలా ఉంది?

జ: నేను గత మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. గతంలో ఎన్నడూలేనంత ఒత్తిడి ఈ ప్రభుత్వంలోనే అనుభవించా. విసిగి వేసారి రాజీనామా చేశా. చేస్తున్న వృత్తికి న్యాయం చేయలేకపోవడం, ఉద్యోగిగా సంతృప్తి లేని పరిస్థితి ఇటీవల కాలంలో ఎక్కువైంది. దీంతో నాలాంటి వారిని తోడు చేసుకొని ఉపాధ్యాయులను మేలుకొలుకొలిపేందుకు ఈ ప్రయత్నం ప్రారంభిస్తున్నా.

ప్ర: పాఠశాలలు ఎలా ఉన్నాయి?

జ: గత ప్రభుత్వ కాలంలో పట్టణాలతో పాటు మారుమూల పల్లెల్లో సైతం ప్రభుత్వ పాఠశాలల భవనాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాయి. రెండు దశల్లో చేసిన ఈ అభివృద్ధి పనుల్లో పాఠశాలల్లో అనేక మౌలిక వసతులు ఏర్పడి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు జరిగాయి. ఆధునిక చదువు పల్లెలకు వచ్చిందని గట్టిగా చెప్పవచ్చు. ఆ పరిస్థితి ఈ ప్రభుత్వంలో లేదు. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా ఉపాధ్యాయులను మాత్రం బొమ్మల్లా ఆడుకుంటున్నారు.

ప్ర: ఎవరైనా చెబితే విరమించుకుంటారా?

జ: ప్రభుత్వ విధానాలపై విసిగివేసారి వృత్తికి న్యాయం చేయలేకపోతున్నానన్న మానసిక క్షోభతో రాజీనామా చేశా. ఎట్టి పరిస్థితిలోనూ రాజీనామాకు కట్టుబడి ఉన్నా. ఉద్యమం చేపట్టి ఉపాధ్యాయులను చైతన్య పరిచేందుకు కృషి చేస్తా.

ప్ర: యాప్‌లతో వచ్చిన ఇబ్బంది ఏమిటి?

జ: వృత్తికి న్యాయం చేయలేక ఓవైపు ఇబ్బందులు పడుతున్నాం. యాప్‌లు పనిచేయక, హాజరు సరైన సమయానికి ఆన్‌లైన్‌లో నమోదు చేయలేక తీవ్ర వేదనకు గురవుతున్నాం. ఈ పరిస్థితుల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఫోన్లు చేస్తూ పాఠశాలకు హాజరయ్యారా లేదా అంటూ అనుమానంతో ప్రశ్నిస్తున్నారు. దీనితో ఏ తప్పు చేయక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాం. నెట్‌వర్క్ సరిగాలేక యాప్‌లు పనిచేయకపోతే మేమెందుకు శిక్ష అనుభవించాలి? సంబంధిత నెట్‌వర్క్ ఉద్యోగులను ప్రశ్నించాలి? లేదా దాని కెపాసిటీని పెంచాలి. మాపై ఒత్తి చేస్తే మేమేమి చేస్తాం? యాప్‌లు పెట్టడం తప్పుకాదు. వాటిని సక్రమంగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం తప్పు.

ప్ర: బదిలీలు ఎలా జరిగాయి?

జ: ఈ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ ఉన్న క్రమంలో బదిలీల్లో చాలా అన్యాయాలు జరిగాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఉపాధ్యాయ కౌన్సెలింగ్ రాత్రిళ్లు జరగడం బాధాకరం. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి విఫలం అయ్యారు. బదిలీలలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. బదిలీలు అయిన వారికి రిలీవ్‌కు అవకాశం ఇవ్వకపోవడం దారుణం. బదిలీల్లోనూ వివాదాలు, అక్రమాలు చోటు చేసుకున్నాయి.

ప్ర: బాత్‌రూముల ఫొటోల విషయం ఏమిటి?

జ: మూడు నెలల క్రితం పాఠశాలల్లోని బాత్‌రూముల ఫొటోలు వెంటనే అప్‌లోడ్ చేయాలని ఓ యాప్‌ను సృష్టించారు. దానిని కొందరు ఉపాధ్యాయులు సకాలంలో పూర్తి చేయలేకపోయారు. ఆలస్యమైనందుకు మెమోలు ఇచ్చారు. ఉపాధ్యాయులకు బాత్‌రూముల ఫొటోలు తీయమని పనులు అప్పగించడమేమిటి?

ప్ర: యోగాపై మీ అభ్యంతరాలు ఏమిటి?

జ: యోగాపై నాకెలాంటి అభ్యంతరాలు లేవు. యోగా మంచిదే. కేవలం ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా యోగాను ప్రమోట్ చేసి ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకోవడం సరికాదు. 6, 7 సంవత్సరాల చిన్నారులను, పాఠశాలలకు ఎంతో దూరంలో నివసిస్తూ ఉండే మహిళా ఉపాధ్యాయులను ఉదయం 6 గంటలకే పాఠశాలలకు వచ్చి యోగాలో పాల్గొనాలని ఒత్తిడి చేయడం దారుణం. ఇది నచ్చక రాజీనామా పత్రంలో విమర్శలు చేశా.



● ఆమిర్ ఖాన్



● ప్రభాస్



● ఎన్టీఆర్



● రామ్ చరణ్



● అల్లు అర్జున్

స్టార్ ఛేంజ్

● ఒకరి కథ మరొకరికి!

తినే ప్రతి గింజపై తినేవారి పేరు ఉంటుందంటుంటారు. అలాగే ఓ దర్శకుడు రెడీ చేసిన కథ కూడా ఏ హీరో చేయాలని ఉంటే ఆ హీరో చెంతకు వెళ్తుందేమో. అప్పటికే ఒప్పుకున్న సినిమాలు, నిర్మాణ వ్యయాలు, స్క్రిప్ట్‌లో మార్పులూ చేర్పులు, కాల్షీట్స్ క్లాష్... ఇలా కారణాలు ఏమైనా ఇటీవలి కాలంలో కథలు ఒక హీరో నుంచి మరో హీరోకి షిఫ్ట్ అవుతున్న ట్రెండ్ బాగా కనిపిస్తోంది. ఇలా ఒకరు చేస్తారనుకున్న కథలో వేరే కథానాయకుడు ఎంట్రీ ఇస్తున్నారు. ఒక హీరోతో ప్లాన్ చేసిన కథలో మరో హీరో కనిపించనున్నారు. ఆ వివరాల్లోకి...

సూపర్ హీరో

దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కమల్‌హాసన్ లీడ్ రోల్‌లో రూపొందిన 'విక్రమ్' సినిమా క్లైమాక్స్‌లో రోలెక్స్ అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించారు సూర్య. 'లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా రూపొందిన ఈ 'విక్రమ్' సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న రోలెక్స్ రోల్‌కి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ లభించింది. అయితే 'విక్రమ్' సినిమా సమయంలోనే సూర్యతో లోకేశ్ ఓ కొత్త సినిమాను ప్లాన్ చేశారని, కానీ ఇది 'లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్'లోని సినిమా కాదని, ఇదొక సూపర్ హీరో ఫిల్మ్ అనే టాక్ తెరపైకి వచ్చింది. అయితే రీసెంట్‌గా దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమా చేయనున్నట్లుగా బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్ కన్ఫార్మ్ చేశారు. ఇది సూపర్ హీరో ఫిల్మ్ అని, వచ్చే ఏడాదిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని ఆమిర్ ఖాన్ స్పష్టం చేశారు. దీంతో సూర్య హీరోగా చేయాల్సిన సూపర్ హీరో ప్రాజెక్ట్ ఆమిర్ ఖాన్ చేతికి వెళ్లిందనే టాక్ తెరపైకి వచ్చింది. సినిమా జానర్, దర్శకుడు ఒకరే కావడంతో సూర్య సినిమాయే ఆమిర్ ఖాన్‌కు వెళ్లినట్లుగా స్పష్టం అవుతోంది.

బ్రహ్మ రాక్షస

'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత దర్శకుడు ప్రశాంత్ వర్మ 'బ్రహ్మ రాక్షస' (ప్రచారంలోకి వచ్చిన టైటిల్) అనే సినిమాను ఆరంభించారు. బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించాల్సింది. కానీ క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్ల ఈ సినిమా నుంచి హీరో రణ్‌వీర్ సింగ్ తప్పుకున్నారు. అయితే ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ ప్రభాస్ చేతిలోకి వెళ్లిందని, హీరో క్యారెక్టరైజేషన్‌లో కాస్త నెగటివ్ షేడ్స్ ఉండే ఈ 'బ్రహ్మ రాక్షస' సినిమా చేసేందుకు ప్రభాస్ కూడా ఆసక్తి చూపిస్తున్నారని టాక్. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న సినిమాల చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'బ్రహ్మ రాక్షస' సినిమాను సెట్స్‌పైకి తీసుకువెళ్లాలని ప్రశాంత్ వర్మ ఆలోచిస్తున్నారని, ఆ దిశగా కార్యాచరణను మొదలుపెట్టారని తెలిసింది. ఇలా రణ్‌వీర్ సింగ్ చేయాల్సిన ప్రాజెక్ట్ ప్రభాస్ చేంతకు చేరింది.

గేమ్ చేంజ్

ఎన్టీఆర్ ఆడాల్సిన ఆటలను రామ్‌చరణ్ ఆడుతున్నారనే టాక్ వినిపిస్తోంది. 'ఉప్పెన' సినిమా తర్వాత బుచ్చిబాబు సాన ఓ రూరల్ బ్యాక్‌డ్రాప్ స్పోర్ట్స్ డ్రామా కథను రెడీ చేసుకున్నారు. ఈ కథకు ఎన్టీఆర్‌ను హీరోగా అనుకుని కొన్ని రోజులు వర్క్ చేశారు. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు డైరెక్షన్‌లోని సినిమా ఇదే అని అందరూ అనుకున్నారు. కానీ ఈ దర్శకుడి రెండో సినిమా 'పెద్ది'లో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్నారు. ఎన్టీఆర్ కోసం బుచ్చిబాబు రెడీ చేసిన స్క్రిప్ట్ స్పోర్ట్స్ డ్రామా కావడం, ఇప్పుడు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా కూడా స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతుండటంతో ఎన్టీఆర్ చేయాల్సిన 'పెద్ది' సినిమా రామ్‌చరణ్‌కు షిఫ్ట్ అయినట్లుగా ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇక 'పెద్ది' సినిమాలో క్రికెట్, కబడ్డీ, కుస్తీ, ఖోఖో... ఇలా పలు రకాల క్రీడల ప్రస్తావన ఉంటుందని తెలిసింది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతి బాబు, దివ్యేందు వర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

కార్తికేయుడు

అల్లు అర్జున్ హీరోగా చేయాల్సిన మైథాలజీ ప్రాజెక్ట్ ఎన్టీఆర్ చేతికి వచ్చినట్లు తెలుస్తోంది. 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల.. వైకుంఠపురములో..' వంటి చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ మైథాలజీ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లాల్సింది. కానీ 'పుష్ప: ది రూల్' సినిమా తర్వాత త్రివిక్రమ్‌తో కాకుండా తమిళ దర్శకుడు అట్లీతో తన సినిమాను ముందుకు తీసుకు వెళ్లారు అల్లు అర్జున్. అయితే అల్లు అర్జున్‌తో తాను చేయాల్సిన మైథాలజీ ప్రాజెక్ట్ కోసం ఏడాదిన్నరపైనే ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ చేశారు త్రివిక్రమ్. దీంతో ఈ సినిమాను వదులుకోలేక ఈ సినిమాను ఎన్టీఆర్‌తో చేసేందుకు సిద్ధమయ్యారు త్రివిక్రమ్.

కార్తికేయ (కుమారస్వామి, మురుగన్) ఆధారంగా ఈ మైథాలజీ సినిమా ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. వీటికి తోడు ఇటీవల ముంబై ఎయిర్‌పోర్టులో ఎన్టీఆర్ చేతిలో 'మురగ: గాడ్ ఆఫ్ వార్' అనే పుస్తకం కనిపించింది. దీంతో త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ ఈ మైథాలజీ సినిమాను చేసేందుకే సన్నద్ధమౌతున్నారని, అందులో భాగంగానే 'మురుగ' పుస్తకాన్ని చదువుతున్నారని తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ప్రశాంత్ నీల్‌తో 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. ఈ సినిమా కాకుండా దర్శకుడు నెల్సన్‌తో ఓ సినిమా కమిట్‌మెంట్ ఉందన్న వార్తలు ఉన్నాయి. ఇంకా దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. కొరటాల శివతో 'దేవర 2' ఉంటుందని ఎన్టీఆర్‌నే కన్ఫార్మ్ చేశారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ చేసే సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి కాస్త సమయం పట్టేలా ఉంది. ఈలోపు వెంకటేశ్‌తో త్రివిక్రమ్ ఓ సినిమాను పూర్తి చేస్తారని, ఆ తర్వాత ఎన్టీఆర్‌తో సినిమాను సెట్స్‌పైకి తీసుకుని వెళ్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

రావణం

కొంతమంది దర్శకులకు కొన్ని డ్రీమ్ ప్రాజెక్ట్స్ ఉంటాయి. అలా 'సలార్, కేజీఎఫ్' చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ డ్రీమ్ ప్రాజెక్ట్స్‌లో 'రావణం' ఒకటి. ఈ మైథాలజీ సినిమాను 'దిల్' రాజు నిర్మిస్తారు. అయితే ఈ సినిమాలో ప్రభాస్ హీరో అనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ ఈ చిత్రం ఇప్పుడు అల్లు అర్జున్ చేతికి వెళ్లిందని టాక్. ప్రభాస్‌కు భారీ లైనప్ ఉండటం వల్లనే అల్లు అర్జున్‌తో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. మరి... ప్రభాస్ ప్రాజెక్ట్ అల్లు అర్జున్ చేతికి వెళ్లిందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. అయితే అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో సినిమా చేస్తున్నారు. సందీప్‌రెడ్డి వంగాతో ఓ సినిమా, సుకుమార్‌తో 'పుష్ప 3' సినిమాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'రావణం' సినిమా సెట్స్‌కు వెళ్లడానికి మరింత సమయం పట్టేలా తెలుస్తోంది.

తొలిసారి కొత్తగా...

యాక్షన్, లవ్‌స్టోరీ, ఫ్యామిలీ డ్రామా... ఇలాంటి తరహా సినిమాలను చాలానే చేశారు హీరో రామ్. కానీ సస్పెన్స్, హారర్, థ్రిల్ జానర్స్‌లో రామ్ హీరోగా వచ్చిన సినిమాలు లేవు. ఇప్పుడు ఈ జానర్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు రామ్ సిద్ధమయ్యారనే టాక్ వినిపిస్తోంది. నాగచైతన్య కోసం కిశోర్ అనే ఓ నూతన దర్శకుడు ఓ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ స్టోరీని రెడీ చేశారట. రానా స్పిరిట్ మీడియా, ఆర్కా మీడియా సంస్థలు ఈ సినిమాను నిర్మించేందుకు సిద్ధమయ్యాయని సమాచారం. కానీ 'విరూపాక్ష'తో సూపర్ హిట్ సాధించిన కార్తీక్ వర్మ దండు డైరెక్షన్‌లో 'వృషకర్మ' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే మూవీతో నాగచైతన్య ముందుకు వెళ్లారు. ఇలా కిశోర్ రెడీ చేసిన కథ హోల్డ్‌లో పడింది. అయితే ఈ కథ ఇప్పుడు రామ్ చెంతకు చేరిందని, ఈ సినిమా స్క్రిప్ట్ పట్ల రామ్ చాలా ఆసక్తిగా ఉన్నారని, త్వరలోనే ఈ సినిమా సెట్స్‌కు వెళ్ల నుందనీ సమాచారం.



● రామ్



● నితిన్



● కిరణ్ అబ్బవరం

తమ్ముడు

వెండితెరపై 'తమ్ముడు' రీ ప్లేస్ అయ్యాడు. నితిన్ హీరోగా చేసిన తాజా చిత్రం 'తమ్ముడు'. కానీ ఈ సినిమా హీరో నాని చేయాల్సిందని తెలిసింది. చివరి నిమిషంలో నితిన్ చేశారు. మరో ఆసక్తిరమైన విశేషం ఏంటంటే... 'బలగం' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత వేణు ఎల్దండి 'ఎల్లమ్మ' అనే మరో రూరల్ బ్యాక్‌డ్రాప్ మూవీ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ సినిమాలోని హీరో పాత్ర కోసం నానీని మేకర్స్ సంప్రదించారు. కొన్ని చర్చలు కూడా జరిగాయి. కానీ చివరి నిమిషంలో ఈ సినిమా నితిన్ చేతికి చేరింది. ఈ ఏడాదిలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. 'బలగం' సినిమాను నిర్మించిన 'దిల్' రాజు ఈ 'ఎల్లమ్మ' సినిమానూ నిర్మించనున్నారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్‌గా సాయిపల్లవి, కీర్తీ సురేష్ వంటి తారల పేర్లు తెరపైకి వచ్చాయి.

చెన్నై లవ్‌స్టోరీ

ఆనంద్ దేవరకొండ లవ్‌స్టోరీ కిరణ్ అబ్బవరంకి వెళ్లింది. వైష్ణవీ చైతన్య, ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ నటించిన 'బేబీ' సినిమా 2023లో రిలీజై, సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'కలర్ ఫొటో' ఫేమ్ సాయి రాజేశ్ దర్శకుడు. కాగా ఈ సినిమా తర్వాత సాయిరాజేశ్ మరో లవ్‌స్టోరీని రెడీ చేశారు. రవి నంబూరి ఈ సినిమాకు దర్శకుడు. 'బేబీ' సినిమాలో లీడ్ పెయిర్‌గా నటించిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య ఈ సినిమా చేయాల్సింది. కానీ ఈ సినిమా నుంచి ఇద్దరూ తప్పుకోవడంతో వారి స్థానాల్లో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరిప్రియ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. వీలైతే ఈ ఏడాది లేకపోతే, వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఇలా ఈ తరహాలో ముందు ఓ కథను ఓ హీరో ఆల్మోస్ట్ ఒప్పుకుని, ఆ తర్వాత ఆ కథలో మరో హీరో నటిస్తున్న, నటించనున్న సినిమాలు మరికొన్ని ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు

దాదాసాహెబ్... అంత సులభం కాదు

దివంగత ప్రముఖ దర్శక–నిర్మాత–స్క్రీన్ రైటర్ దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఆమిర్ ఖాన్ టైటిల్ రోల్ చేయనున్నారు. ఆమిర్ ఖాన్‌తో 'త్రీ ఇడియట్స్, పీకే' వంటి హిట్ చిత్రాలు తెరకెక్కించిన రాజ్‌కుమార్ హిరాణి దర్శకత్వంలో ఈ దాదాసాహెబ్ బయోపిక్ రూపొందనుంది. తాజాగా ఈ సినిమా గురించి ఆమిర్ ఖాన్ మాట్లాడారు. ''దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ చేయడం అనేది పెద్ద చాలెంజ్. వాణిజ్యపరమైన అంశాలున్న సాధారణ సినిమా కాదు ఇది. ఆ రోజుల్లోనే ఎవరూ ఊహించలేని విధంగా అడ్వెంచర్ చేసిన వ్యక్తి కథ ఇది. ఆయన జీవితంలో ఎన్నో ఎగ్జైట్ చేసే అంశాలు, సంగతులు, సంఘటనలు ఉన్నాయి. అడ్వెంచర్ జర్నీలాంటి ఈ సినిమా చేయడం అంత సులభం కాదు. దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ చేయడాన్ని నేను, రాజు (దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణి కావొచ్చు) పెద్ద గౌరవంగా ఫీల్ అవుతున్నాం. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణను ప్లాన్ చేశాం'' అని ఆమిర్‌ఖాన్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ సమాచారం.



● ఆమిర్ ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి

చదువు చాలా అవసరం

''చదువు అనేది చాలా అవసరం. అయితే అది సహజంగా ఉండాలి. కానీ, కేవలం ర్యాంక్స్ కోసం చదవడం అనేది ఒక రకమైన హింస. అలాంటి తల్లిదండ్రులకి 'ఆల్ ఇండియా ర్యాంకర్స్' సిరీస్ ఒక గుణపాఠం కావాలి. '90'కి మించిన మరో పెద్ద బ్లాక్ బస్టర్ సిరీస్ 'ఆల్ ఇండియా ర్యాంకర్స్' అని నాకు అనిపించింది'' అని నటుడు శివాజీ అన్నారు. హర్ష రోషన్, భాను, జయతీర్థ ప్రధాన పాత్రల్లో జోసెఫ్ క్లింటన్ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'ఏఐఆర్: ఆల్ ఇండియా ర్యాంకర్స్'. సందీప్ రాజ్ షో రన్నర్‌గా వ్యవహరించిన ఈ సిరీస్ జూలై 3 నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి నటులు శివాజీ, సుహాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుహాస్ మాట్లాడుతూ– ''ఈ సిరీస్ కోసం నేను ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు. సందీప్ రాజ్ మాట్లాడుతూ– ''జోసెఫ్ చెప్పిన కథ వినగానే ఇందులో భాగమవ్వాలనిపించింది. అందరికీ కనెక్ట్ అయ్యే కంటెంట్ ఇది'' అని చెప్పారు. ''మీ అందరికీ ట్రైలర్ నచ్చిందనుకుంటున్నాను. కంటెంట్ కూడా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు జోసెఫ్ క్లింటన్.



● సుహాస్, శివాజీ, హర్ష రోషన్



● ఇలియానా

మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి

- ఇలియానా



● ఇలియానా రెండో కుమారుడు కియాను

రామ్ హీరోగా పరిచయమైన 'దేవదాసు' (2006) సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు ఇలియానా. ఆ తర్వాత 'పోకిరి, జల్సా, కిక్, జులాయి' వంటి పలు సినిమాల్లో నటించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారామె. 'అమర్ అక్బర్ ఆంటోనీ' (2018) చిత్రం తర్వాత ఆమె తెలుగులో నటించలేదు... బాలీవుడ్ చిత్రాలకే పరిమితమయ్యారు. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఈ బ్యూటీ అమ్మతనాన్ని ఆస్వాదిస్తున్నారు. 2023 మేలో మైఖేల్ డోలన్, ఇలియానా వివాహం చేసుకున్నారు. అదే ఏడాది ఆగస్టులో ఓ బాబుకి (కోవా ఫీనిక్స్ డోలన్) జన్మనిచ్చారు ఇలియానా. తాజాగా మరో బిడ్డకు జన్మనిచ్చారు ఇలియానా. ఈ నెల 19న ఓ కుమారుడికి జన్మనిచ్చారామె. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ మేరకు శనివారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో బాబు ఫొటో షేర్ చేసి, ''కియాను రఫే డోలన్ (రెండో బాబు పేరు)ని పరిచయం చేస్తున్నాం. మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి'' అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు ఇలియానా.

బిజినెస్ రీల్

'భారీ బంగారం రేట్లతో డిమాండ్‌లో మార్పులు'



న్యూఢిల్లీ: బంగారం రేట్లు భారీ స్థాయిలో పెరిగిన నేపథ్యంలో వివిధ సెగ్మెంట్లలో డిమాండ్‌లో మార్పులు కనిపించవచ్చని బ్రాండెడ్ ఆభరణాల తయారీ దిగ్గజం టైటాన్ తమ 2024-25 వార్షిక నివేదికలో పేర్కొంది. భౌగోళిక-రాజకీయ అంశాలు, స్థూల ఆర్థిక అనిశ్చితుల వల్ల పసిడి రేట్లు అధిక స్థాయిలోనే కొనసాగవచ్చని వివరించింది. రిటైల్ విస్తరణ, కొత్త కలెక్షన్లు, మార్కెటింగ్‌పై మరింతగా పెట్టుబడులు పెట్టడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రాధాన్యతనివ్వడాన్ని కొనసాగిస్తామని టైటాన్ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో పసిడి రేట్లు భారీ స్థాయిలో ఉన్నప్పటికీ జ్యువెలరీ డివిజన్ ఆరోగ్యకరంగా 20 శాతం, సేమ్-స్టోర్ అమ్మకాల వృద్ధి 14 శాతం మేర నమోదైందని వివరించింది. తనిష్క్ సబ్-బ్రాండ్ అయిన మీఅ రూ. 1,000 కోట్ల మార్కును దాటగా, క్యారట్‌లేన్ విభాగం ఆదాయం 30 శాతం పెరిగిందని పేర్కొంది.

మహీంద్రా స్కార్పియో జెడ్8టీ వేరియంట్

ధర రూ. 20.29 లక్షలు



ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా కొత్తగా స్కార్పియో-ఎన్ వాహనానికి సంబంధించి జెడ్8 శ్రేణిని విస్తరించింది. జెడ్8టీని ఆవిష్కరించింది. దీని ధర రూ. 20.29 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో డైమండ్ కట్ అలాయ్ వీల్స్, 12 స్పీకర్ సోనీ బ్రాండెడ్ ఆడియో సిస్టం, ఫ్రంట్ కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్‌లాంటి ఫీచర్లు ఉన్నాయి. మరోవైపు, స్కార్పియో-ఎన్ వాహనాల్లో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టంను కూడా ప్రవేశపెట్టినట్లు సంస్థ తెలిపింది.

పునరుత్పాదక విద్యుత్‌పై కలర్‌షైన్ ఇండియా కసరత్తు



న్యూఢిల్లీ: అభయ్ ఇస్పాత్‌లో భాగమైన కలర్‌షైన్ ఇండియా సంస్థ 10 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ వినియోగంపై దృష్టి పెడుతోంది. ఇందుకోసం అధునాతన సౌర విద్యుత్ టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు ప్రముఖ పునరుత్పాదక విద్యుదుత్పత్తి సంస్థలతో కలిసి పని చేయనున్నట్లు కలర్‌కోటెడ్ స్టీల్ తయారీ కంపెనీ తెలిపింది. ఈ విధంగా సంప్రదాయ వనరుల ద్వారా వచ్చే విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోనున్నట్లు వివరించింది. రెన్యువబుల్ ఎనర్జీకి మారే ప్రక్రియను దశలవారీగా అమలు చేయనున్నట్లు పేర్కొంది.

మెరుగైన రాబడులకు మల్టీ-అసెట్ ఫండ్



ముంబై: వివిధ కాలావధులకు సంబంధించి, రిస్కులకు తగ్గట్లుగా మల్టీ అసెట్ ఫండ్స్ మెరుగైన రాబడులు అందిస్తున్నట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ వెల్లడించింది. నిర్దుష్ట ఫండ్ ఎంత రిస్కుకి ఎంత రాబడి అందించిందో తెలుసుకునేందుకు కొలమానాలుగా ఉపయోగించే షార్ప్, ట్రెనార్ తదితర నిష్పత్తుల్లో తమ మల్టీ అసెట్ ఫండ్ స్థిరంగా రాణించినట్లు తెలిపింది. గత మూడేళ్ల వ్యవధిలో పోటీ పథకాలతో పోలిస్తే అత్యధిక షార్ప్ నిష్పత్తి (0.63), ట్రెనార్ నిష్పత్తిని (2.72) సాధించినట్లు పేర్కొంది.

ట్యాక్స్ ఆడిట్లు 60కి పరిమితం

సీఏలకు ఐసీఏఐ కొత్త నిబంధన



న్యూఢిల్లీ: వ్యక్తిగతంగా గానీ లేదా ఏదైనా సంస్థలో భాగస్వామిగా గానీ చార్టర్డ్ అకౌంటెంట్లు సంవత్సరానికి ట్యాక్స్ ఆడిట్లు 60 మాత్రమే చేసేలా చార్టర్డ్ అకౌంటెంట్స్ ఇనిస్టిట్యూట్ ఐసీఏఐ నిర్ణయం తీసుకుంది. ఈ పరిమితి 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఇప్పుడు కూడా ఈ నిబంధన ఉన్నప్పటికీ, పార్ట్‌నర్స్ కోసం కూడా ఆడిట్ నిర్వహించేందుకు వెసులుబాటు ఉంది. తాజాగా ప్రతిపాదించిన పరిమితిలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఐసీఏఐ ప్రెసిడెంట్ చరణ్‌జోత్ సింగ్ నందా తెలిపారు. అవకతవకలు జరగకుండా చూసేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం యూనిక్ డాక్యుమెంట్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూడీఐఎన్) సిస్టంను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-6-2025

విశాఖ	580-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	565-00
విజయవాడ	575-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	560-00
వరంగల్	562-00
రిటైల్ ధర	6.20

ఐపీవో స్ట్రీట్ ...

లిస్టింగ్‌కు కంపెనీల క్యూ

- సెబీకి తాజాగా ప్రాస్పెక్టస్ దాఖలు
- జాబితాలో క్రెడిలా ఫిన్ సర్వీసెస్
- షాడోఫ్యాక్స్, రేజన్ సోలార్ సైతం











న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్లు మళ్లీ సరికొత్త గరిష్టాలవైపు పరుగు తీస్తుండటంతో గత కొద్ది నెలలుగా ప్రైమరీ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. పలు అన్‌లిస్టెడ్ కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు క్యూ కడుతున్నాయి. వచ్చే వారం పలు దిగ్గజాలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానుండగా.. మరిన్ని కంపెనీలు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. వివరాలు చూద్దాం..

రూ. 5,000 కోట్లకు రెడీ

గత డిసెంబర్‌లో గోప్యతా విధాన పబ్లిక్ ఇష్యూ బాట పట్టిన విద్యా సంబంధ రుణాలందించే క్రెడిలా ఫిన్ సర్వీసెస్ సెబీకి తాజాగా అప్‌డేటెడ్ డాక్యుమెంట్లు అందించింది. గత నెలలో అనుమతి పొందిన కంపెనీ ఐపీవో ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధపడుతోంది. ఇష్యూలో భాగంగా రూ. 3,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా మరో రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్, ప్రస్తుత ఇన్వెస్టర్ సంస్థలు విక్రయానికి ఉంచనున్నాయి. వీటిలో ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ రూ. 1,050 కోట్ల విలువైన ఈక్విటీని ఆఫర్ చేయనుంది. ఐపీవోకంటే ముందుగా రూ. 600 కోట్ల సమీకరణపై కంపెనీ కన్నేసింది. దీంతో ఐపీవోలో ఇష్యూ పరిమాణం ఆ మేర తగ్గే అవకాశముంది. 2006లో ఏర్పాటైన కంపెనీ నిధులను భవిష్యత్‌లో బిజినెస్ వృద్ధికి అవసరమయ్యే మూలధన పటిష్టతకు వినియోగించనుంది. విద్యా సంబంధ రుణాలపై అధికంగా దృష్టిసారించే ఎన్‌బీఎఫ్‌సీలో హెచ్‌డీఎఫ్‌సీ 2009లో ఇన్వెస్ట్ చేసింది. 2010 నుంచి హెచ్‌డీఎఫ్‌సీకి అనుబంధ సంస్థగా వ్యవహరిస్తోంది. అయితే 2023లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో మాతృ సంస్థ విలీనంకావడంతో ఈక్యూటీ, క్రిస్‌క్యాపిటల్ గ్రూప్‌లు ఉమ్మడిగా 2024 మార్చిలో 90 శాతం వాటాను కొనుగోలు చేశాయి.

రూ. 1,500 కోట్లకు సై

పునరుత్పాక ఇంధన రంగంలో కార్యకలాపాలు కలిగిన రేజన్ సోలార్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు వీలుగా సెబీకి ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. ఐపీవో ద్వారా గుజరాత్ కంపెనీ రూ. 1,500 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు అనుగుణంగా రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఐపీవోకంటే ముందుగా రూ. 300 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఇది జరిగితే ఐపీవో పరిమాణం తగ్గనుంది. కాగా.. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 1,265 కోట్లు సొంత అనుబంధ సంస్థ రేజన్ ఎనర్జీపై వెచ్చించనుంది. తద్వారా 3.5 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఏర్పాటవుతున్న సంస్థకు ఆర్థికంగా దన్నునివ్వనుంది. సోలార్ ఫొటోవోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీలో కార్యకలాపాలు విస్తరించిన రేజన్ సోలార్ 2017లో ప్రారంభమైంది. 2025 మార్చికల్లా 6 గిగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్యానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా, కేపీఐ గ్రీన్ ఎనర్జీ, మైక్రోటెక్ ఇంటర్నేషనల్, అక్మే క్లీన్‌టెక్ సొల్యూషన్స్, వీగార్డ్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలకు సేవలందిస్తోంది. గతేడాది (కేలండర్ 2024)లో రూ. 1,957 కోట్ల ఆదాయం, రూ. 239 కోట్ల నికర లాభం ఆర్జించింది.

వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్

హోమ్ అండ్ ఫర్నీషింగ్స్ కంపెనీ వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు వీలుగా సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. వీటి ప్రకారం ఐపీవోలో రూ. 468 కోట్లకుపైగా విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా 5.84 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. 2016లో ఏర్పాటైన కంపెనీ ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 145 కోట్లు ప్రస్తుత స్టోర్ల లీజ్‌తోపాటు, లైసెన్స్ ఫీజు చెల్లింపులకు వినియోగించనుంది. మరో రూ. 82 కోట్లు 117 కోకో రెగ్యులర్ స్టోర్లతోపాటు ఒక జుంబో స్టోర్ ఏర్పాటుకు, రూ. 15 కోట్లు కొత్త పరికరాలు, మెషీనరీ కొనుగోలుకీ వెచ్చించనుంది. ఈ బాటలో రూ. 108 కోట్లు మార్కెటింగ్, ఇతర వ్యయాలకు కేటాయించనుంది. 2023-24లో రూ. 986 కోట్లకుపైగా ఆదాయం సాధించింది.

రూ. 2,500 కోట్లపై చూపు

దిగ్గజాలు టీపీజీ, ఫ్లిప్‌కార్ట్, మిరాయ్ అసెట్స్ తదితరాలకు పెట్టుబడులున్న ఈకామర్స్ కంపెనీ షాడోఫ్యాక్స్ వచ్చే వారం సెబీకి గోప్యతా విధానంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం తద్వారా రూ. 2,500 కోట్లవరకూ సమకూర్చుకునేందుకు ప్రణాళికలు వేసింది. ఇందుకు కొత్తగా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను సామర్థ్య విస్తరణ, వృద్ధి, నెట్‌వర్క్‌పై వినియోగించనుంది. 2015లో ఏర్పాటైన కంపెనీ ఫిబ్రవరిలో సుమారు రూ. 6,000 కోట్ల విలువలో నిధులను సమీకరించింది.

సుదీప్ ఫార్మా ఐపీవో బాట

ఔషధ రంగ కంపెనీ సుదీప్ ఫార్మా పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 95 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా ప్రమోటర్లు 1,00,76,492 షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 76 కోట్లు పెట్టుబడి వ్యయాలకు వెచ్చించనుంది. గుజరాత్‌లోని నందెసారి యూనిట్‌లో ఉత్పత్తికి వీలుగా మెషీనరీ కొనుగోలుకి నిధులు వినియోగించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. 1989లో ఏర్పాటైన వడోదర సంస్థ సుదీప్ ఫార్మా ప్రధానంగా ఫార్మాస్యూటికల్, ఫుడ్ అంట్ న్యూట్రిషన్‌లో కార్యకలాపాలు విస్తరించింది. కలరింగ్ ఏజెంట్స్, ప్రిజర్వేటివ్స్ విభాగంలో 100 రకాల ప్రొడక్టులను రూపొందిస్తోంది. ఫార్మా, ఫుడ్, న్యూట్రిషన్ పరిశ్రమల్లో వీటిని వినియోగిస్తారు. వడోదరలోగల మూడు యూనిట్ల ద్వారా మొత్తం 65,579 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యాన్ని కలిగి ఉంది. కంపెనీ క్లయింట్ల జాబితాలో ఫార్మా రంగ దిగ్గజాలు ఫైజర్, ఇన్‌టాస్ ఫార్మా, మ్యాన్‌కైండ్ ఫార్మా, మెర్క్ గ్రూప్, క్యాడిలా ఫార్మా, మైక్రో ల్యాబ్స్‌తోపాటు ఫ్రెంచ్ దిగ్గజం గ్రూప్ దానోన్ చేరింది. గత క్యాలండర్ ఏడాది(2024)లో ఆదాయం రూ. 344 కోట్లను అధిగమించగా, దాదాపు రూ. 95 కోట్ల నికర లాభం ఆర్జించింది.

రెండు సంస్థల ఆధిపత్యం మంచిది కాదు

- ఏ రంగంలోనైనా పోటీ ఉండాలి
- టెలికం శాఖ మంత్రి సింధియా వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఏ రంగంలోనైనా రెండే సంస్థల గుత్తాధిపత్యం ఉంటే మంచిది కాదని టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వ్యాఖ్యానించారు. తప్పనిసరిగా మరింత పోటీ ఉండాలని బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. దేశీ టెలికం రంగంలో భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో ఆధిపత్యం నడుస్తుండటం, ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వొడాఫోన్ మనుగడ ప్రశ్నార్థకంగా మారడం, బీఎస్‌ఎన్‌ఎల్ ఇప్పటికీ దేశవ్యాప్తంగా 4జీ, 5జీ సేవలను ప్రవేశపెట్టడంపై కసరత్తే చేస్తుండటం తదితర అంశాల నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దేశీయంగా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల మధ్య తీవ్రమైన పోటీ ఉందని ఆయన చెప్పారు. వైఫై సర్వీసులకు ఉపయోగపడే 6 గిగాహెట్జ్ స్పెక్ట్రం డీలైసెన్సింగ్‌కి సంబంధించి ఆగస్టు 15లోగా ప్రభుత్వం నిబంధనలను ప్రకటించే అవకాశం ఉందని సింధియా చెప్పారు. శాటిలైట్ కమ్యూనికేషన్స్ సర్వీసులకు త్వరలోనే స్పెక్ట్రం కేటాయించనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరికి టెక్నాలజీ ఫలాలు అందేలా అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ బాధ్యతని సింధియా చెప్పారు. సాధారణంగా పరిమాణం పెరిగే కొద్దీ ధర తగ్గుతుందని, ఒకప్పుడు దేశీయంగా ఫోన్ కాల్ చేస్తే నిమిషానికి రూ. 16 చార్జీ ఉండేదని, పదేళ్ల క్రితం అది అర్ధ రూపాయికి తగ్గిందని, ఇప్పుడు 0.03 పైసలకు దిగి వచ్చిందని ఆయన తెలిపారు. మరోవైపు ప్రజలు మరింతగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగించుకునేందుకు వీలుండేలా డివైజ్‌లను చౌకగా తయారు చేయడంపై దృష్టి పెట్టాలని డివైజ్, చిప్‌ల తయారీ కంపెనీలను మంత్రి కోరారు.

క్రిజాక్ ఐపీవో జులై 2న

- రూ. 860 కోట్ల సమీకరణకు సై
- విదేశీ చదువులకు ప్లాట్‌ఫామ్!



న్యూఢిల్లీ: విద్యార్థుల రిక్రూట్‌మెంట్ సొల్యూషన్లు అందించే క్రిజాక్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. జులై 2న ప్రారంభంకానున్న ఇష్యూ 4న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు జులై 1న షేర్లను కేటాయించనుంది. ఐపీవోలో భాగంగా కంపెనీ ప్రమోటర్లు రూ. 860 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ నిధులు ప్రమోటర్లకు చేరనున్నాయి. కాగా.. గతేడాది నవంబర్‌లో రూ. 1,000 కోట్లు సమీకరించాలని ప్రణాళికలు వేసింది. తాజాగా ఇష్యూ పరిమాణాన్ని రూ. 860 కోట్లకు కుదించింది. తొలుత 2024 మార్చిలో క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. అయితే జులైలో ప్రాస్పెక్టస్‌ను సెబీ తిప్పిపంపింది. ఆపై నవంబర్‌లో తిరిగి ఐపీవో చేపట్టేందుకు సెబీ తలుపు తట్టింది. 2025 మార్చిలో అనుమతి పొందింది. గ్లోబల్ ఇన్‌స్టిట్యూషన్స్, ఏజెంట్లకు బీటూబీ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ ద్వారా అంతర్జాతీయస్థాయిలో విద్యార్థుల రిక్రూట్‌మెంట్ సొల్యూషన్లు అందిస్తోంది. ఈ కోల్‌కతా కంపెనీ ద్వారా విద్యార్థులు యూకే, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో ఉన్నత చదువులకు వెళ్లేందుకు గ్లోబల్ సంస్థలు తోడ్పాటునిస్తున్నాయి. రిజిస్టర్డ్ ఏజెంట్ల ద్వారా గత మూడేళ్లలో 75 దేశాలకుపైగా ఎన్‌రోల్‌మెంట్ అప్లికేషన్లకు కంపెనీ ప్లాట్‌ఫామ్ వీలు కల్పించింది. సుమారు 7.11 లక్షల విద్యార్థుల అప్లికేషన్ల ప్రాసెస్ చేసింది. కాగా.. గతేడాది(2024-25) రూ. 849 కోట్లకుపైగా ఆదాయం, రూ. 153 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ప్లాంటుపై టెస్లాకు ఆసక్తి లేదు


- కార్ల విక్రయాలకే ఆ సంస్థ ప్రాధాన్యత
- కేంద్ర మంత్రి కుమార స్వామి వెల్లడి
- ఈవీ స్కీమ్ కోసం పోర్టల్ ప్రారంభం



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లాకు భారత్‌లో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయడంపై పెద్దగా ఆసక్తి లేదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పునరుద్ఘాటించారు. ఇక్కడ తమ కార్ల విక్రయాల కోసం షోరూమ్‌లను తెరవడంపై మాత్రమే కంపెనీ ఆసక్తిగా ఉందని చెప్పారు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై ఇన్వెస్ట్ చేసే సంస్థలకు దిగుమతి సుంకాలపరంగా ప్రోత్సాహకాలిచ్చే స్కీమునకు సంబంధించి పోర్టల్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. అక్టోబర్ 21 వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుంది. అవసరాన్ని బట్టి 2026 మార్చి 15 వరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు భారీ పరిశ్రమల శాఖ అప్లికేషన్ విండోను తిరిగి ప్రారంభించవచ్చు. 4-5 వాహన కంపెనీలు ఈ పథకంపై ప్రాథమికంగా ఆసక్తి కనపర్చాయని, అయితే వాస్తవంగా ఎన్ని దరఖాస్తులు వస్తాయనేది వేచి చూడాల్సి ఉంటుందన్నారు. స్కీములో పాలుపంచుకోవాలంటూ జర్మనీ, అమెరికా, బ్రిటన్ తదితర అన్ని దేశాల వాహన దిగ్గజాలను ఆహ్వానిస్తున్నామని.. అయితే చైనా, పాకిస్తాన్‌లాంటి పొరుగు దేశాల సంస్థలకు ఆంక్షలు వర్తిస్తాయన్నారు. కొత్త ఈవీ పథకం ప్రకారం, భారత్‌లో తయారీపై రూ. 4,150 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసే వాహన సంస్థలు, 15% సుంకానికే 8,000 వరకు వాహనాలను దిగుమతి చేసుకునే వీలుంటుంది. ప్రస్తుతం ఈ సుంకాలు 70-100 శాతం వరకు ఉంటున్నాయి.

నికర ఇంధన ఎగుమతిదారుగా భారత్

- ఆరేళ్లలో సాధిస్తామన్న కేంద్ర మంత్రి గడ్కరీ
- 9 శాతానికి తగ్గనున్న లాజిస్టిక్స్ వ్యయాలు



న్యూఢిల్లీ: భారత్ ప్రస్తుతం నికర ఇంధన దిగుమతిదారుగా ఉండగా, వచ్చే ఆరేళ్లలో నికర ఎగుమతిదారుగా అవతరిస్తుందని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైడ్రోజన్‌ను భవిష్యత్ ఇంధనంగా పేర్కొన్నారు. ఇథనాల్, బయోడీజిల్ తదితర బయో ఇంధనాలు, హైడ్రోజన్‌తోపాటు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుకూల ఇంధనాలకు మారడం వల్ల కాలుష్యం తగ్గుతుందని, లాజిస్టిక్స్ వ్యయాలు కూడా దిగొస్తాయని మంత్రి చెప్పారు. అదే సమయంలో కొత్త రహదారుల నిర్మాణం వల్ల ఇంధన వ్యయాలు, లాజిస్టిక్స్ (రవాణా) వ్యయాలు ఈ ఏడాది చివరికి 9 శాతానికి దిగిరానున్నట్లు తెలిపారు. దేశంలో లాజిస్టిక్స్ వ్యయాలు ఆరు శాతం మేర తగ్గాయన్న ఒక సర్వే ఫలితాలను ప్రస్తావించారు. "నేడు చైనాలో లాజిస్టిక్స్ వ్యయాలు జీడీపీలో 8 శాతంగా ఉన్నాయి. అమెరికాలో, ఐరోపా దేశాల్లో 12 శాతం మేర ఉన్నాయి. అదే భారత్‌లో 16 శాతంగా ఉన్నాయి" అని మంత్రి గడ్కరీ వెల్లడించారు. ఆర్థికంగా లాభసాటి అయిన బయో ఇంధనాల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని గుర్తు చేస్తూ.. ఎగుమతులను పెంచుకోవడం కోసం రవాణా వ్యయాలను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

గృహ రుణ రేట్లు 6 శాతానికి తగ్గించాలి

- ఇది అమ్మకాలకు ఊతమిస్తుంది
- కొనుగోళ్లపై ధరల పెరుగుదల ప్రభావం
- నరెడ్కో ప్రెసిడెంట్ హరిబాబు



న్యూఢిల్లీ: గృహ రుణ వడ్డీ రేట్లను 6 శాతానికి తగ్గించాలని నరెడ్కో అధ్యక్షుడు జి.హరిబాబు డిమాండ్ చేశారు. ఇలా చేయడం వల్ల ఇళ్ల అమ్మకాలకు ఊతమిచ్చినట్లు అవుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఏడు నగరాల్లో ఇళ్ల విక్రయాలు జూన్ త్రైమాసికంలో (2025-26 క్యూ1) 20 శాతం తగ్గి 96,285 యూనిట్లకు పరిమితమైనట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తాజాగా ఒక నివేదిక రూపంలో వెల్లడించడం గమనార్హం. ఇందులో ఒక్క హైదరాబాద్ మార్కెట్ వరకే చూసినా అమ్మకాలు క్రితం ఏడాది ఇదే త్రైమాసికతో పోల్చినప్పుడు 27 శాతం తక్కువగా 11,040 యూనిట్లుగా ఉన్నాయి. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా టాప్-7 నగరాల్లో ఇళ్ల ధరలు ఇదే కాలంలో 11 శాతం పెరిగినట్టు అనరాక్ నివేదిక వెల్లడించింది. రియల్ ఎస్టేట్ రంగ విశ్లేషణ సంస్థ ప్రాప్ ఈక్విటీ సైతం జూన్ త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 9 ప్రధాన నగరాల్లో 23 శాతం తగ్గిపోవచ్చని అంచనా వేయడం గమనార్హం. దీనిపై హరిబాబు స్పందించారు. ఇళ్ల అమ్మకాలు తగ్గడానికి అధిక సరఫరాకు తోడు ధరలు పెరిగిపోవడం, అంతర్జాతీయ అనిశ్చితులను కారణంగా పేర్కొన్నారు. ముఖ్యంగా గత మూడేళ్లలో ధరలు గణనీయంగా పెరిగిపోవడం కొనుగోలు సామర్థ్యంపై ప్రభావం చూపించినట్టు చెప్పారు. ఇళ్ల ధరల పెరుగుదల స్థాయిలో వేతనాలు వృద్ధి చెందలేదన్నారు. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ డిమాండ్ స్తబ్దుగా ఉండొచ్చన్న అంచనా వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆర్‌బీఐ రెపో రేటును ఒక శాతం మేర తగ్గించడం కస్టమర్లకు కొంత ఉపశమనం కల్పిస్తుందని, ఈఎంఐలు దిగొస్తాయన్నారు.

భూముల ధరలకు రెక్కలు..

కరోనా అనంతరం భూముల ధరలు గణనీయంగా పెరిగినట్టు హరిబాబు తెలిపారు. అధిక ధరల కారణంగా అందుబాటు ధరల ఇళ్ల నిర్మాణం చేపట్టడం డెవలపర్లకు కష్టంగా మారినట్టు చెప్పారు. ప్రథమ, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో మురికివాడల పునర్నిర్మాణానికి కొత్త విధానాన్ని తీసుకొస్తే హౌసింగ్ ప్రాజెక్టులకు మరింత భూమి అందుబాటులోకి వస్తుందన్నారు.

రియల్టీలో తగ్గనున్న సంస్థాగత పెట్టుబడులు

- ఆరు నెలల్లో రూ.26,300 కోట్లు
- గతేడాది కంటే 37 శాతం తక్కువ



న్యూఢిల్లీ: దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్లో సంస్థాగత (ఇనిస్టిట్యూషన్స్) పెట్టుబడులు ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో (జనవరి-జూన్) 37 శాతం తక్కువగా 3.06 బిలియన్ డాలర్లు (రూ.26,300 కోట్లు)గా ఉండొచ్చని ఈ రంగానికి చెందిన కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. ఇందులో హౌసింగ్ ప్రాజెక్టుల వాటా 38 శాతం ఉంటుందని అంచనా వేసింది. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ఆర్థిక సవాళ్లు నెలకొనడాన్ని కారణంగా పేర్కొంది. దీంతో పెట్టుబడుల లావాదేవీల గడువు పొడిగింపునకు గురవుతున్నట్టు వివరించింది. క్రితం ఏడాది మొదటి ఆరు నెలల్లో రియల్ ఎస్టేట్‌లో ఇనిస్టిట్యూషన్స్ 4.89 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్టు జేఎల్ఎల్ ఇండియా నివేదిక తెలిపింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో మొత్తం సంస్థాగత పెట్టుబడుల్లో.. విదేశీ ఇన్వెస్టర్ల వాటా 68 శాతంగా ఉంటే, దేశీ ఇనిస్టిట్యూషన్స్ మిగిలిన 32 శాతం వాటాను ఆక్రమించినట్టు పేర్కొంది. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్‌లు), క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీలు), లిస్టెడ్ సంస్థల్లో సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగుతున్నట్టు జేఎల్ఎల్ ఇండియా నివేదిక వెల్లడించింది.

పెట్టుబడులకు ఆకర్షణీయం..

"భారత రియల్ ఎస్టేట్ రంగం ఇప్పటికీ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా కొనసాగుతోంది. అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా ఈ ఏడాది మొదటి 6 నెలల్లో సవాళ్లు నెలకొన్నప్పటికీ దేశీ, విదేశీ ఇన్వెస్టర్లలో విశ్వాసం కొనసాగింది" అని జేఎల్ఎల్ ఇండియా క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ లతా పిళ్లై తెలిపారు. గత 5 ఏళ్లుగా రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు 5 బిలియన్ డాలర్లకు మించి నమోదవుతున్నట్టు గుర్తు చేశారు. ఈ ఏడాది దీనికి అనుగుణంగానే ఉండొచ్చన్నారు.

ఒకే గ్రూపులో భారత్, పాక్



ట్రోఫీతో ఎఫ్ఐహెచ్ అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రామ్, హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్

- జూనియర్ హాకీ వరల్డ్ కప్ డ్రా విడుదల
- ఈ ఏడాది భారత్‌లో మెగా టోర్నీ

లుసానే (స్విట్జర్లాండ్): ఈ ఏడాది భారత్ ఆతిథ్యమివ్వబోయే జూనియర్ పురుషుల ప్రపంచకప్ హాకీలో చిరకాల ప్రత్యర్థులు ఒకే గ్రూపులో తలపడనున్నారు. ఇక్కడ ఉన్న అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం ఈ యువ మెగా టోర్నీకి సంబంధించిన డ్రాను తీశారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎఫ్ఐహెచ్ అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రామ్, **హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్, డైరెక్టర్** ఆర్.కె.శ్రీవాస్తవ పాల్గొన్నారు. పూల్ 'బి'లో ఆతిథ్య భారత్‌తో పాటు పాకిస్తాన్, చిలీ, స్విట్జర్లాండ్ జట్లున్నాయి. ముందెన్నడూ లేని విధంగా ఈ సారి ఏకంగా 24 జట్లు ప్రపంచకప్ బరిలో ఉన్నాయి. ఈ జట్లను ఆరు పూల్స్‌గా విభజించారు. ఒక్కో పూల్‌లో నాలుగు జట్లున్నాయి. భారత్‌లోని చెన్నై, మదురై వేదికల్లో ఈ నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు జూనియర్ ప్రపంచకప్ మ్యాచ్‌లు జరుగుతాయి. జర్మనీ డిఫెండింగ్ చాంపియన్ జర్మనీ పూల్ 'ఎ'లో ఉంది. గత 2023 ప్రపంచకప్ ఫైనల్లో జర్మనీ 2–1తో ఫ్రాన్స్‌ను ఓడించి విజేతగా ఆవిర్భవించింది. అయితే ఆ టోర్నీలో 16 జట్లే పోటీపడ్డాయి. కానీ **ఈ సారి మరో 8 జట్లు కప్ కోసం పోటీపడ**తాయి. హాకీ ఇండియా కార్యదర్శి భోళనాథ్ మాట్లాడుతూ 'ఈ ప్రపంచకప్‌తో భారత్‌లో హాకీ శోభ మరింత పెరగనుంది. మౌలిక వసతుల ఆధునీకరణ, మదురైలోని అధునాతన స్టేడియంలో మ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహిస్తాం' అని అన్నారు.

ఏ పూల్‌లో ఏ ఏ జట్లు...

పూల్ 'ఎ': జర్మనీ, దక్షిణాఫ్రికా, కెనడా, ఐర్లాండ్; పూల్ 'బి': భారత్, పాకిస్తాన్, చిలి, స్విట్జర్లాండ్; పూల్ 'సి': అర్జెంటీనా, న్యూజిలాండ్, జపాన్, చైనా; పూల్ 'డి': స్పెయిన్, బెల్జియం, ఈజిప్ట్, నమీబియా; పూల్ 'ఇ': మలేసియా, ఇంగ్లండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్స్; పూల్ 'ఎఫ్': ఫ్రాన్స్, **ఆస్ట్రేలియా, కొరియా, బంగ్లాదేశ్.**



ఓటమి నెం.7

- చైనా చేతిలోనూ ఓడిన భారత మహిళల జట్టు
- ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ

బెర్లిన్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ టోర్నీలో భారత మహిళల జట్టు తమ పరాజయాల పరంపరను కొనసాగిస్తూనే ఉన్నారు. యూరోపియన్ అంచె పోటీల్లో గెలుపు అసాధ్యమన్నట్లుగా అమ్మాయిల ఆటతీరు సాగుతోంది. శనివారం జరిగిన పోరులో భారత్ 0–3తో చైనా చేతిలో కంగుతింది. భారత అమ్మాయిలు నాలుగు క్వార్టర్లలో అసలు ఖాతానే తెరువలేకపోయారు. కానీ పేలవమైన రక్షణపంక్తి ఆటతీరుతో ప్రత్యర్థికి మూడు గోల్స్‌ను సమర్పించుకుంది. చైనా క్రీడాకారిణిల్లో రెండో క్వార్టర్‌లో చెన్ యంగ్ (21వ నిమిషంలో), జంగ్ యింగ్ (26వ ని.), అన్హుల్ యూ (45వ ని.) తలా ఒక గోల్ చేశారు. ఈ అంచెలో భారత్‌కిది వరుసగా ఏడో పరాజయం కావడం గమనార్హం. దీంతో ప్రొ లీగ్ నుంచి అవుటయ్యే ముప్పు మరింత పెరిగింది. ఆదివారం చైనాతో జరిగే రెండో మ్యాచ్‌లో తప్పకుండా గెలిస్తేనే ప్రొ లీగ్‌లో ఉంటుంది. లేదంటే దిగువ స్థాయి జట్లతో వచ్చే ఏడాది ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్ ఆడాల్సిన పరిస్థితి వస్తుంది. ఇదివరకే ఆస్ట్రేలియా, అర్జెంటీనా, బెల్జియంలతో జరిగిన డబుల్ హెడర్ ఆరు మ్యాచ్‌ల్లోనూ భారత్ పరాజయాన్నే మూటగట్టుకుంది.


డోపింగ్‌లో దొరికిన జాతీయ క్రీడల చాంప్

ట్వింకిల్‌పై సస్పెన్షన్ వేటు వేసిన ఏఐయూ

న్యూఢిల్లీ: జాతీయ క్రీడల్లో మూడుపతకాలు గెలుపొందిన అథ్లెట్ ట్వింకిల్ చౌదరీ డోపింగ్‌లో పట్టుబడింది. దీంతో ఆమెపై అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) సస్పెన్షన్ వేటు వేసింది. ఈ ఏడాది ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో జలంధర్‌కు చెందిన 28 ఏళ్ల ట్వింకిల్ 4×400 మీటర్ల రిలేలో స్వర్ణం, 800 మీటర్ల పరుగులో రజతం, 4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో కాంస్యం గెలుచుకుంది. కొచ్చిలో జరిగిన జాతీయ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 800 మీటర్ల పరుగులో కొత్త మీట్ రికార్డును నెలకొల్పింది. తైవాన్ ఓపెన్‌లో 800 మీటర్ల పరుగులో రజతం, గుమి (దక్షిణకొరియా)లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. అయితే ఆమె మెథైల్‌టెస్టోస్టెరాన్ అనే నిషిద్ధ ఉత్ప్రేరకాన్ని తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది. దీంతో ఏఐయూ తాత్కాలిక నిషేధం విధించి... వివరణ కోరుతూ నోటీసు జారీ చేసింది. విచారణలో ఆమె ఉద్దేశపూర్వకంగా తీసుకుందో లేదో తేలాల్సి ఉంది. అప్పటివరకు తాత్కాలిక నిషేధం కొనసాగుతుంది.

ప్రిటోరియస్, బాష్ సెంచరీలు





- దక్షిణాఫ్రికా 418/9
- జింబాబ్వేతో తొలి టెస్టు

1 టెస్టు క్రికెట్‌లో అతి పిన్న వయసు (19 ఏళ్ల 93 రోజులు)లో 150 ప్లస్ పరుగులు స్కోరు చేసిన ప్లేయర్‌గా ప్రిటోరియస్ రికార్డుల్లోకెక్కాడు. గతంలో పాకిస్తాన్ ఆటగాడు జావెద్ మియాందాద్ 19 ఏళ్ల 119 రోజుల వయసులో న్యూజిలాండ్‌పై ఈ ఫీట్ సాధించాడు. తొలి టెస్టులో వేగంగా 150 పరుగులు చేసిన ఆటగాళ్లలో శిఖర్ ధావన్ (131 బంతుల్లో) తర్వాత ప్రిటోరియస్ (157) రెండో స్థానంలో నిలిచాడు.

బులవాయో (జింబాబ్వే): ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) విజేత దక్షిణాఫ్రికా జట్టు... జింబాబ్వే పర్యటనను మెరుగ్గా ఆరంభించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం ప్రారంభమైన తొలి టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీ జట్టు... తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 418 పరుగులు చేసింది. డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆస్ట్రేలియాపై విజయం సాధించి 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ చేజిక్కించుకున్న దక్షిణాఫ్రికా ఈ సిరీస్‌లో ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగినా భారీ స్కోరు చేసింది. తొలి టెస్టు ఆడుతున్న లువాన్ డ్రె ప్రిటోరియస్ (160 బంతుల్లో 153; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) భారీ సెంచరీతో కదం తొక్కగా... కార్బిన్ బాష్ (124 బంతుల్లో 100 బ్యాటింగ్) 'శత'క్కొట్టాడు. అరంగేట్ర టెస్టులోనే డెవాల్డ్ బ్రెవిస్ (41 బంతుల్లో 51; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ హాఫ్‌సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ సిరీస్‌లో సఫారీ జట్టుకు కేశవ్ మహరాజ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా... తొలి టెస్టు ద్వారా ముగ్గురు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు అరంగేట్రం చేశారు. ప్రిటోరియస్, డెవాల్డ్ బ్రెవిస్, యూసుఫ్‌కు ఇదే తొలి టెస్టు మ్యాచ్ కాగా... ఈ ముగ్గురూ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. టోనీ డీ జోర్జీ (0), మాథ్యూ బ్రీజ్‌కే (13), ముల్డర్ (17), డెవిడ్ బెడింగ్‌హామ్ (0), కైల్ వెరీన్ (10) విఫలంకాగా... కేశవ్ (21; 1 ఫోర్, 2 సిక్స్‌లు), యూసుఫ్ (27; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. టాపార్డర్ విఫలమవడంతో ఒక దశలో సఫారీ జట్టు 55 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా... బ్రెవిస్‌తో కలిసి 19 ఏళ్ల ప్రిటోరియస్ భారీ షాట్లతో ఇన్నింగ్స్‌ను ఉరకలెత్తించాడు. జింబాబ్వే బౌలర్లలో చివాంగా 4 వికెట్లు పడగొట్టగా... బ్లెస్సింగ్ ముజరబానీ 2 వికెట్లు తీశాడు.

శ్రీలంకదే సిరీస్

రెండో టెస్టులో ఇన్నింగ్స్ 78 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి



కొలంబో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక జట్టు... సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది. శనివారం ముగిసిన రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంక ఇన్నింగ్స్78 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసింది. ఓవర్‌నైట్ స్కోరు 115/6తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్... చివరకు 44.2 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. లిటన్‌దాస్ (43 బంతుల్లో 14) క్రితం రోజు స్కోరుకు ఒక్క పరుగు మాత్రమే జోడించి వెనుదిరగగా... నయీమ్ హసన్ (5), తైజుల్ ఇస్లామ్ (6), ఇబాదత్ హుసేన్ (6) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. శనివారం అరగంటలోపే బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసింది. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 5 వికెట్లు పడగొట్టగా... ధనంజయ డిసిల్వా, తిరిందు రత్ననాయకే చెరో రెండు వికెట్లు తీశారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్యకు టెస్టుల్లో ఇది 12వ ఐదు వికెట్లు ప్రదర్శన. అంతకుముందు బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేయగా... శ్రీలంక 458 పరుగులు చేసింది. ఇరు జట్ల మధ్య తొలి టెస్టు 'డ్రా'గా ముగియగా... ఈ విజయంతో ఆతిథ్య శ్రీలంక 1–0తో సిరీస్ చేజిక్కించుకుంది. సిరీస్‌లో రెండో సెంచరీ ఖాతాలో వేసుకున్న పాథుమ్ నిసాంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య బుధవారం నుంచి మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.


కెప్టెన్సీనుంచి తప్పుకున్న నజ్ముల్

ఈ మ్యాచ్‌తో నజ్ముల్ హసన్ షంటో... బంగ్లాదేశ్ టెస్టు కెప్టెన్సీకి వీడ్కోలు పలికాడు. జాతీయ జట్టుకు 14 టెస్టుల్లో సారథిగా వ్యవహరించిన నజ్ముల్ 4 మ్యాచ్‌ల్లో జట్టుకు విజయాలు అందించాడు. గతేడాది పాకిస్తాన్‌పై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన సమయంలో బంగ్లా జట్టుకు నజ్ముల్ నాయకత్వం వహించాడు. తాజాగా శ్రీలంక చేతిలో సిరీస్ కోల్పోయి అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో నజ్ముల్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి కూడా సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాడు.

మిల్నేకు పిలుపు

- కాన్వేకు దక్కని చోటు
- ముక్కోణపు టి20 టోర్నీకి న్యూజిలాండ్ జట్టు ఎంపిక





వెల్లింగ్టన్: జాతీయ కాంట్రాక్ట్ తీసుకునేందుకు నిరాకరించిన న్యూజిలాండ్ సీనియర్ ఓపెనర్ డెవాన్ కాన్వేను... ముక్కోణపు టి20 టోర్నమెంట్‌కు ఎంపిక చేయలేదు. వచ్చేనెలలో దక్షిణాఫ్రికా, జింబాబ్వేతో కలిసి న్యూజిలాండ్ జట్టు టి20 టోర్నమెంట్ ఆడనుంది. ఈ ముక్కోణపు పోటీకి జింబాబ్వే ఆతిథ్యమిస్తుండగా... దీని కోసం న్యూజిలాండ్ బోర్డు శుక్రవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఇందులో సీనియర్ ఓపెనర్ కాన్వేకు చోటు దక్కలేదు. ఫ్రాంచైజీ క్రికెట్ ఆడేందుకు వీలుగా అతడు జాతీయ కాంట్రాక్ట్‌ను వదులుకోగా... ఈ టోర్నీకి అందుబాటులో ఉండనని మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ప్రకటించాడు. అతడు ప్రస్తుతం ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో మిడిల్‌సెక్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 23 ఏళ్ల బెవాన్ జాకబ్‌కు మరో అవకాశం దక్కింది. శ్రీలంకతో సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేసినా... మ్యాచ్ ఆడే అవకాశం దక్కలేదు. మేజర్ లీగ్ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్న ఆడమ్ మిల్నే, టిమ్ సీఫెర్ట్, ఫిన్ అలెన్‌లను తిరిగి జట్టులోకి వచ్చారు. అలెన్ ఇటీవల ఈ లీగ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో 19 సిక్స్‌లు కొట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. గత ఏడాది ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో జరిగిన టి20లో చివరిసారి మిల్నే న్యూజిలాండ్ తరఫున బరిలోకి దిగాడు. ఈ జట్టుకు మిచెల్ సాంట్నర్ సారథ్యం వహించనున్నాడు. 'ముక్కోణపు టోర్నీ కోసం బలమైన జట్టును ఎంపిక చేశాం. ఐపీఎల్ కారణంగా పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌కు అందుబాటులో లేని పలువురు ఆటగాళ్లు ఈ టోర్నీ బరిలోకి దిగనున్నారు. వారంతా మెరుగైన ప్రదర్శన కనబరుస్తారనే నమ్మకముంది' అని న్యూజిలాండ్ హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ అన్నాడు. వచ్చే నెల 14–26 వరకు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మూడు జట్ల మధ్య ఈ టోర్నీ జరగనుంది.

చిక్కుల్లో యశ్ దయాళ్!

క్రికెటర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు



ఘజియాబాద్: పేస్ బౌలర్ యశ్ దయాళ్‌పై ఒక అమ్మాయి తీవ్ర ఆరోపణలు చేసింది. పెళ్లి చేసుకుంటానని తనను నమ్మించి మోసం చేశాడని, లైంగిక వేధింపులకు గురి చేశాడని ఆమె పేర్కొంది. తాను, యశ్ గత ఐదేళ్లుగా కలిసి ఉన్నామని, తనతో అన్ని రకాలుగా అతను సంబంధం పెట్టుకున్నాడని ఉజ్వల అనే ఆ అమ్మాయి వెల్లడించింది. అయితే ఇప్పుడు తీరా పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి తప్పించుకుంటున్నాడని వెల్లడించింది. మరో వైపు ఇతర అమ్మాయిలతో కూడా సంబంధాలు పెట్టుకొని తనను మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. సోషల్ మీడియా ద్వారా తన పేరుతో సహా ఈ విషయాలన్నింటినీ బహిరంగపర్చిన ఆ అమ్మాయి అధికారికంగా కూడా ఘజియాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేసింది. గతంలో కూడా మహిళల హెల్ప్‌లైన్ ద్వారా తన సమస్య చెప్పేందుకు ప్రయత్నించగా ఎలాంటి స్పందన రాలేదన్న ఆమె...ఇప్పుడైనా జోక్యం చేసుకొని తనకు న్యాయం చేయాలని నేరుగా యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు విజ్ఞప్తి చేసింది. దీనిపై ఇంకా దయాళ్ స్పందించలేదు. ప్రయాగ్‌రాజ్‌కు చెందిన 27 ఏళ్ల లెఫ్టార్మ్ పేసర్ దయాళ్ ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్, బెంగళూర రాయల్స్ చాలెంజర్స్ జట్ల తరఫున ఆడి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల ఆర్‌సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవడంలో అతను కీలక పాత్ర పోషించాడు.

ఆస్ట్రేలియా విజయం

141 పరుగుల తేడాతో వెస్టిండీస్ చిత్తు ● హాజల్‌వుడ్‌కు 5 వికెట్లు



బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచిన ఆస్ట్రేలియా... 2025–27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో బోణీ కొట్టింది. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 159 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో పేలవ బ్యాటింగ్‌తో విమర్శలు ఎదుర్కొన్న ఆస్ట్రేలియా... రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన బ్యాటింగ్‌తో పాటు... కట్టుదిట్టమైన బౌలింగ్‌తో విజయం సాధించింది. 301 పరుగుల లక్ష్యఛేదనలో వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 33.4 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా మూడు రోజుల్లోనే ముగిసిన పోరులో ఆసీస్ జయభేరి మోగించింది. షామర్ జోసెఫ్ (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), జస్టిన్ గ్రీవ్స్ (53 బంతుల్లో 38 నాటౌట్; 8 ఫోర్లు) పోరాడారు. కెప్టెన్ రోస్టన్ చేజ్ (2), బ్రాత్‌వైట్ (4), బ్రాండన్ కింగ్ (0), షై హోప్ (2) విఫలమయ్యారు. జాన్ క్యాంప్‌బెల్ (23), కార్టీ (20) మెరుగైన ఆరంభాలను వృథా చేసుకున్నారు. ఒక దశలో 86 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన విండీస్... జోసెఫ్ మెరుపులతో ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన జోసెఫ్... క్రీజులో ఉన్నంతసేపు టి20 తరహాలో దంచికొట్టాడు. అయితే అతడి మెరుపులు ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమయ్యాయి. ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హాజల్‌వుడ్ 5 వికెట్లు పడగొట్టగా... లయన్ 2 వికెట్లు తీశాడు. అంతకు ముందు ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 310 పరుగులు చేసి... విండీస్ ముందు 301 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. పట్టుదలగా ఆడాల్సిన చోట కరీబియన్ జట్టు... ధనాధన్ షాట్లు ఆడేందుకు ప్రయత్నించి విఫలమైంది. విండీస్ ప్లేయర్లను భారీ షాట్లు ఆడేలా ఉసిగొల్పిన కంగారూ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధశతకాలు సాధించిన ట్రావిస్ హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి రెండో టెస్టు సెయింట్ జార్జెస్‌లో జరుగుతుంది.



హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం జాతీయ ఎలైట్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభమైంది. భారత స్టార్ బాక్సర్, రెండు సార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ సహా పలువురు యువ బాక్సర్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీబాలా దేవి, భారత బాక్సింగ్ సమాఖ్య, తెలంగాణ బాక్సింగ్ సంఘం అధికారులు ఇందులో పాల్గొన్నారు.



థాయ్‌లాండ్ ప్రధాని షినవత్రా రాజీనామాకు డిమాండ్ చేస్తూ రాజధాని బ్యాంకాక్‌లో విక్టరీ స్మారకం వద్ద జరిగిన ఆందోళన సభకు ఇసుక వేస్తే రాలనంతగా హాజరైన ప్రజలు



పురిలో వార్షిక జగన్నాథ రథయాత్ర రెండో రోజు శనివారం స్వామి రథాన్ని లాగుతున్న అశేష భక్తజనం



స్వలింగ సంపర్కుల ప్రదర్శనలపై నిషేధాన్ని నిరసిస్తూ శనివారం హంగరీ రాజధాని బుడాపెస్ట్‌లో ఎలిజబెత్ బ్రిడ్జిపై వార్షిక 'ప్రైడ్ మార్చ్'లో భాగంగా భారీ సంఖ్యలో కదం తొక్కిన ఎల్జీబీటీక్యూ+ మద్దతుదారులు

రాజ్యాంగ ప్రవేశిక పవిత్రమైంది

ఎమర్జెన్సీ కాలంలో మానని గాయమైంది

- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: మన రాజ్యాంగంలోని ప్రవేశిక ఎంతో పవిత్రమైందని, ఇది మార్చరానిదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. అయితే, ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ పీఠికకు మార్పులు చేసిందన్నారు. ఈ చర్య రాజ్యాంగ నిర్మాతల ఆదర్శాలకు ద్రోహం చేయడమేనని ఆయన అభివర్ణించారు. 1976లో అత్యవసర పరిస్థితి కాలంలో 42వ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో చేర్చిన పదాలను మానని గాయంగా ఆయన పేర్కొన్నారు. అప్పుడే సోషలిస్ట్, సెక్యులర్ పదాలను జత చేశారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతలను జైళ్లకు పంపించిన అప్పటి ప్రభుత్వం ఎంతో సునాయాసంగా, ఎటువంటి పట్టింపు లేకుండా ప్రవేశికను మార్చడం ద్వారా న్యాయాన్ని అపహాస్యం చేసిందన్నారు. ఈ మార్పు తిరుగుబాటుకు కూడా కారణం కావచ్చని హెచ్చరించారు. ప్రవేశికను రాజ్యాంగ విత్తనంగా ఆయన పేర్కొన్నారు. మన రాజ్యాంగం తప్ప ప్రపంచంలో మరే దేశ రాజ్యాంగ ప్రవేశిక కూడా మార్పునకు గురికాలేదని ఆయన నొక్కి చెప్పారు.

ఎమెర్జెన్సీ కాలంలో చేపట్టిన రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చిన సోషలిస్ట్, సెక్యులర్ పదాలపై సమీక్ష అవసరమని ఆర్‌ఎస్‌ఎస్ గురువారం వ్యాఖ్యానించడం తెల్సిందే. తాజాగా, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో సోషలిజం అవసరం లేనే లేదు, మన సంస్కృతిలో సెక్యులరిజం ప్రధానమైన అంశం కాదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సైతం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యంగంలో సోషలిజం , సెక్యులరిజం అనేవి భాగం కాదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు.

బంగ్లా జూట్, అనుబంధ ఉత్పత్తులపై ఆంక్షలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ జనపనార, అనుబంధ ఉత్పత్తుల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇవి తక్షణమే అమల్లోకి వచ్చాయి. భూమార్గం, మహారాష్ట్రలోని నావ సేవా పోర్టు మినహా అన్ని నౌకాశ్రయాల ద్వారా వచ్చే వాటికి ఆంక్షలు వర్తిస్తాయి. ఈ మేరకు వాణిజ్య శాఖ పరిధిలోని ఫారిన్ ట్రేడ్ డైరెక్టరేట్ జనరల్ శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీ చేశారు. బంగ్లాదేశ్‌తో సంబంధాల్లో అగాధం పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం సంభవించడం గమనార్హం. దక్షిణాసియా వాణిజ్య స్వేచ్ఛా ప్రాంత(సాఫ్టా) నిబంధనల ప్రకారం బంగ్లా నుంచి వచ్చే జనపనార దిగుమతులపై భారత్‌లో ఇప్పటి వరకు ఎలాంటి పన్నులూ లేవు. ఇది దేశీయ జూట్ పరిశ్రమపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అందుకే, ఇకపై బంగ్లాదేశ్ నుంచి దిగుమతయ్యే జనపనార, సంబంధిత ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ డ్యూటీ(ఏడీడీ) విధించింది. ఈ చర్య బంగ్లాదేశ్ దిగుమతులపై గణనీయమైన ప్రభావాన్ని చూపలేకపోయింది. పైపెచ్చు, బంగ్లాదేశ్ ఎగుమతిదారులు సాంకేతికపరమైన సాకులు చూపుతూ ఏడీడీ నుంచి తప్పించుకుంటున్నారు. తాజాగా విధించిన ఆంక్షలతో బంగ్లాదేశ్ జనపనార ఉత్పత్తుల నాణ్యత తనిఖీలను క్రమబద్ధీకరించడం, తప్పుడు ప్రకటనలు, మోసపూరిత లేబులింగ్‌ను నివారించడం, మూడో దేశం ద్వారా చేసే దిగుమతులను నిలువరించేందుకు వీలవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. తద్వారా దేశీయ పరిశ్రమను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపాయి.

పాక్, పీఓకేలో ఉగ్రవాద క్యాంపుల పునర్నిర్మాణం

ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన మౌలిక సదుపాయాలు

- మళ్లీ నిర్మిస్తున్న పాక్ సైన్యం, ఐఎస్ఐ, ప్రభుత్వం

ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత వైమానిక దళం దాడుల్లో ధ్వంసమైన ఉగ్రవాదుల క్యాంపులు, శిక్షణ శిబిరాలు, లాంచ్‌ప్యాడ్‌లను మళ్లీ నిర్మించుకొనే పనిలో పాకిస్తాన్ నిమగ్నమైంది. ఇందుకోసం పాకిస్తాన్ సైన్యం, నిఘా సంస్థ ఐఎస్ఐతోపాటు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తున్నట్లు తెలిసింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాల పునర్నిర్మాణాన్ని పాక్ సర్కారు ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. వాటిని యథాతథ స్థితికి తీసుకురావాలని సంకల్పించింది. ముందుగా పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో పునర్నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. మే 7న భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. పాక్‌తోపాటు పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలను సైన్యం ధ్వంసం చేసింది. లాంచ్‌ప్యాడ్‌లు సైతం నామరూపాల్లేకుండా పోయాయి. జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన మౌలిక సదుపాయాలు నేలమట్టమయ్యాయి. ఈ ఆపరేషన్‌తో పాఠాలు నేర్చుకున్న పాక్ ఉగ్రవాద సంస్థలు నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వెంబడి దట్టమైన అడవుల్లో చిన్నపాటి హైటెక్ టెర్రర్ క్యాంప్‌లు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. వైమానిక దాడులతోపాటు నిఘా నుంచి తప్పించుకోవాలన్నదే ముష్కరుల వ్యూహమని చెబుతున్నారు. పీఓకేలో 13 లాంచ్‌ప్యాడ్‌లను పాక్ సైన్యం, ఐఎస్ఐ కలిసి మళ్లీ నిర్మిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఉగ్రవాద శిబిరాలు, శిక్షణ కేంద్రాలను భారీగా కాకుండా చిన్నవిగా నిర్మిస్తున్నట్లు సమాచారం. మినీ క్యాంప్‌లైతే దాడి జరిగినా నష్టం తక్కువగానే ఉంటుందన్నదే వారి ఆలోచన.

లా స్టూడెంట్‌పై ఎన్‌ఎస్‌ఏ ప్రయోగమా?

ఏమాత్రం అంగీకార యోగ్యం కాదు..

అతడిని వెంటనే విడుదల చేయండి • సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ పోలీసులు లా విద్యార్థి ఒకరిని జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ)కింద అరెస్ట్ చేయడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ చర్య ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ, ఆ విద్యార్థిని వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అన్ను అలియాస్ అనికేత్ 2024లో బెతుల్‌లోని యూనివర్సిటీ క్యాంపస్‌లో ఒక ప్రొఫెసర్‌తో ఘర్షణ పడ్డాడు.పోలీసులు అతడిపై హత్యాయత్నం, ఇతర ఆరోపణలపై కేసు నమోదు చేశారు. బెతుల్‌లోని జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అన్నును పోలీసులు 2024 జూలై 11వ తేదీన అరెస్ట్ చేసి, భోపాల్ సెంట్రల్ జైలులో వేశారు. ఆ తర్వాత పలు మార్లు అతడి నిర్బంధాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. తాజా పొడిగింపుతో, అన్నును జూలై 12వ తేదీ వరకు జైల్లోనే గడపాల్సి ఉంది. దీనిపై బాధితుడి తండ్రి మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించినా ఫలితం కనిపించలేదు. దీంతో, సుప్రీంకోర్టు తలుపుతట్టాడు. శుక్రవారం కేసును విచారించిన జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం.. ఇతడిపై మొత్తం 9 క్రిమినల్ కేసులుండటంతో ఎన్ఎస్ఏలోని సెక్షన్లకింద నిర్బంధించినట్లు చెప్పడం సరికాదని పేర్కొంది. ఎన్ఎస్ఏలోని ప్రివెంటివ్ డిటెన్షన్ ప్రకారం పిటిషనర్‌ను అరెస్ట్ చేయాలంటూ మేజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వులు సహేతుకంగా లేవని తెలిపింది. అతడిని వెంటనే విడుదల చేయాలంటూ అధికారులను ఆదేశిస్తూ..పూర్తి వివరాలతో తీర్పును తర్వాత విడుదల చేస్తామని వెల్లడించింది.

అయోధ్యకు 5.5 కోట్ల మంది భక్తులు

అయోధ్య: అయోధ్యలోని రామాలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపన జరిగినప్పటి నుంచి 5.5 కోట్ల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని యూపీ ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. 2024 జనవరి 22వ తేదీన విగ్రహ ప్రతిష్టాపన జరిగిన రోజు నుంచి భక్తుల రాక కొనసాగుతోందని వివరించింది. సామాన్యులే కాదు ప్రముఖులు సైతం శ్రీరాముని దర్శించుకున్న వారిలో ఉన్నారంది. కేంద్రమంత్రులు, గవర్నర్లు, సీఎంలు, తదితర వీఐపీలు సుమారు 4.5 లక్షల మంది ఆలయాన్ని దర్శించుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అందరికీ సులభంగా దర్శనం కల్పించేందుకు ఆన్‌లైన్ పాస్ వ్యవస్థను అమలు చేయడం వంటి చర్యలు తీసుకున్నామని సీఎం యోగి ఆదిత్యనాథ్ చెప్పారు.ఇలా ఉండగా, ఆలయంలో అసంపూర్తిగా ఉన్న ప్రధానమైన పనులన్నిటినీ జూలై ఆఖరు కల్లా పూర్తి చేస్తామని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. 'అవసరమైన మొత్తం 14 లక్షల ఘనపుటడుగుల బన్సి పహార్పూర్ శాండ్‌స్టోన్‌కు గాను 13 లక్షల ఘనపుటడుగుల రాయి ఇప్పటికే చేరుకుంది. ఆలయ గోడలపై రామకథ చిత్రాల చెక్కడం సైతం పూర్తి కావొచ్చింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా రామాలయం కిటికీలకు టైటానియం లోహాన్ని వాడాం. ఈ లోహం చెక్కు చెదరకుండా వెయ్యేళ్లు మన్నుతుంది'అని వివరించారు.

గాజాలో 24 గంటల్లో 81 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్: గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా సాగించిన దాడుల్లో గత 24 గంటల వ్యవధిలో కనీసం 81 మంది పాలస్తీనియన్లు చనిపోయారని, 422 మంది గాయాల పాలయ్యారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. గాజా నగరంలోని పాలస్తీనా స్టేడియంలో ఆశ్రయం పొందుతున్న 12 మంది శరణార్థులు సైతం ప్రాణాలు కోల్పోయారు. అపార్టుమెంట్లపై జరిగిన దాడిలో మరో 8 మంది మృతి చెందారని షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరో 23 మృతదేహాలను తమ ఆస్పత్రి మార్చురీకి తీసుకువచ్చారని నాస్సెర్ ఆస్పత్రి అధికారులు చెప్పారు. టుఫ్పాలో నలుగురు చిన్నారులు సహా 11 మంది మృతి చెందారని అహ్లి ఆస్పత్రి తెలిపింది. రఫాలోని ఆహార పంపిణీ కేంద్రం వద్ద జనంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో ఆరుగురు, ఖాన్‌యూనిస్ నగరంలోని అల్ ఖరారాలో నలుగురు చనిపోయారు.

ఆ వార్తలు అబద్ధం: నెతన్యాహూ

గాజాలో అమెరికా, ఇజ్రాయెల్ ప్రభుత్వాల సాయంతో ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జనంపై కాల్పులు జరపాలని ఆర్మీకి ఆదేశాలు జారీ చేసినట్లుగా వచ్చిన వార్తలను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తీవ్రంగా ఖండించారు. అవన్నీ సైన్యాన్ని అప్రతిష్ట పాలు చేసే వార్తలంటూ కొట్టిపారేశారు. జనంపై ఆర్మీ ఉద్దేశపూర్వకంగా కాల్పులు జరుపుతోందంటూ వచ్చిన వార్తలపై దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు. దాదాపు రెండున్నర నెలలుగా గాజాను పూర్తిగా దిగ్బంధించిన ఇజ్రాయెల్ సైన్యం నెల క్రితం ఆహార పంపిణీ కేంద్రాలను ప్రారంభించింది. ఈ కేంద్రాల వద్ద సైన్యం యథేచ్ఛగా సాగిస్తున్న కాల్పుల్లో ఇప్పటి వరకు కనీసం 500 మంది పాలస్తీనియన్లు చనిపోగా వందలాదిగా గాయపడ్డారు.

త్వరలోనే కాల్పుల విరమణ

వచ్చే వారం గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. శుక్రవారం వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం ఖరారయ్యే దిశగా చర్చలు సాగుతున్నాయన్నారు. ఈ ఒప్పందంతోపాటు ఇరాన్, తదితర అంశాలపై చర్చించేందుకు ఇజ్రాయెల్ వ్యూహాత్మక వ్యవహారాల శాఖ మంత్రి రాన్ డెర్మర్ వచ్చే వారం వాషింగ్టన్ వెళ్తారని సమాచారం.

రాజ్యాంగం జోలికెళితే ఊరుకోం: మాయావతి

లక్నో: రాజ్యాంగ ప్రవేశికలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలపై సమీక్ష జరపాలంటూ ఆర్ఎస్ఎస్ లేవనెత్తిన చర్చపై ప్రతిపక్ష పక్షాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. తాజాగా, బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) చీఫ్ మాయావతి ఈ విషయమై తమ పార్టీ వైఖరిని కుండబద్దలు కొట్టారు. 'రాజ్యాంగం ప్రాథమిక స్ఫూర్తి, లక్ష్యాలతోపాటు ప్రవేశికలో ఎటువంటి మార్పులు చేయరాదు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యల్ని మేం పట్టించుకోం. రాజ్యాంగం పేర్కొన్న ఆదర్శాలను మార్చేందుకు ప్రయత్నిస్తే మాత్రం ఊరుకోం. వీధుల్లోకి వచ్చి పోరాడుతాం. చూద్దాం ఏ జరుగనుందో'అని వ్యాఖ్యానించారు. గతంలో అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ గానీ, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం గానీ కోట్లాది మంది దేశ ప్రజల ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని పూర్తి నిజాయితీతో, సమగ్రతతో ఎప్పుడూ అమలు చేయలేదని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు తమ సిద్ధాంతాలు, రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యాంగానికి అనవసరమైన మార్పులు చేశాయని మాయావతి చెప్పారు.

ఎన్నార్సీని దొడ్డిదారిన తెచ్చే ప్రయత్నం

ఈసీ చేపట్టిన ఓటరు జాబితా సవరణపై టీఎంసీ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)ని దొడ్డిదారిన తీసుకువచ్చేందుకు జరుగుతున్న కుట్రగా టీఎంసీ నేత డెరెక్ ఒ బ్రియాన్ ఆరోపించారు. దీనిని ఆయన జర్మనీలో ఒకప్పుడు నాజీలు తెచ్చిన పూర్వీకుల పాస్‌లతో పోల్చారు. ఈ అంశంపై కలిసి కట్టుగా పోరాడేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. శనివారం డెరెక్ ఒ బ్రియాన్ మీడియాతో మాట్లాడారు. బిహార్‌లో మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా ఈ ప్రక్రియను అధికారులు మొదలు పెట్టారని, అయితే వచ్చే ఏడాదిలో బెంగాల్‌లో జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పుడే ఓటర్ల జాబితా సవరణ ఎందుకని ప్రశ్నించారు. ఈసారి బెంగాల్‌లో ఎలాగైనా గెలవాలన్నదే బీజేపీ లక్ష్యంగా ఉందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 46 నుంచి 49 సీట్లు మాత్రమే సీట్లు దక్కుతాయని బీజేపీ అంతర్గత సర్వేలో తేలడంతో ఈ ప్రక్రియను హఠాత్తుగా ఇప్పుడే ఈసీ మొదలుపెట్టిందని ఆయన వ్యాఖ్యానించారు.

కోల్‌కతా గ్యాంగ్‌రేప్ కేసులో నాలుగో నిందితుడి అరెస్టు

కోల్‌కతా: సంచలనం సృష్టించిన కోల్‌కతా గ్యాంగ్‌రేప్ కేసులో నాలుగో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. న్యాయ కళాశాల సెక్యూరిటీ గార్డును అదుపులోకి తీసుకున్నారు. ఇదే కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై ఈ నెల 25న సామూహిక అత్యాచారం జరిగినట్లు కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడితోపాటు ఇద్దరు విద్యార్థులను ఇప్పటికే అరెస్టు చేశారు. గ్యాంగ్‌రేప్ ఉదంతంలో సెక్యూరిటీ గార్డు ప్రమేయం సైతం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అతడిని అరెస్టు చేశారు. గ్యాంగ్‌రేప్ కేసులో విచారణ కోసం ఉన్నతాధికారులు ఐదుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు.



నవ దంపతుల ఆనందహేల

వివాహ వేడుకలు ముగిసిన అనంతరం ఫొటోలకు పోజిస్తున్న నూతన దంపతులు జెఫ్ బెజోస్, లారెన్ శాంచెజ్. ప్రపంచ కుబేరుడైన 62 ఏళ్ల బెజోస్ 55 ఏళ్ల మాజీ జర్నలిస్టు శాంచెజ్ శుక్రవారం రాత్రి వెనిస్‌లో అంగరంగ వైభవంగా జరిగిన వేడుకల సాక్షిగా దాంపత్య బంధంలోకి అడుగు పెట్టారు.

ఉత్తరాది వాళ్లు తమిళం నేర్చుకోవాలి: కనిమొళి

చెన్నై: 'హిందీ ఏ ఒక్క భారతీయ భాషకు వ్యతిరేకం కాదు, పైపెచ్చు అన్ని భాషలకు మిత్రుడు, ఏ ఒక్క భాషకు తాము విరోధులం కాదు'అంటూ ఇటీవల హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై డీఎంకే ఎంపీ కనిమొళి పరోక్షంగా ఎదురు దాడికి దిగారు. 'హిందీ ఏ భాషకూ శత్రువు కాకపోతే, తమిళం కూడా ఏ భాషకూ శత్రువు కాదు. ఉత్తరాది వాళ్లను తమిళం నేర్చుకోనివ్వండి. ఉత్తర భారతదేశ ప్రజలు కనీసం ఒక దక్షిణ భారత భాషనైనా నేర్చుకోనివ్వండి. అదే నిజమైన జాతీయ సమైక్యత'అని ఆమె పేర్కొన్నారు. 'మనం ఎవరికీ శత్రువులం కాదు. మనం అందరికీ స్నేహితులం. మన భాషను కూడా నేర్చుకోండి'అని తెలిపారు. అయితే, ఆమె కేంద్ర మంత్రి అమిత్ షా పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం విద్యాసంస్థల్లో హిందీ తప్పనిసరి బోధనను తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం తెల్సిందే. నూతన విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రాన్ని స్కూళ్లలో అమలు చేసేది లేదని స్పష్టం చేసింది. హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నంలోనే రాష్ట్రానికి రావాల్సిన విద్యా పథకాల నిధులను అందకుండా చేస్తోందని మండిపడుతోంది. అంతకుముందు అమిత్ షా, దేశాన్ని విభజించేందుకు భాషను ఆయుధంగా మార్చుకోవడం తగదని, ఇలాంటి ప్రయత్నాలు విజయవంతం కాబోవని వ్యాఖ్యానించారు.

సీబీడీటీ చైర్మన్ పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సీబీడీటీ)చైర్మన్ రవి అగర్వాల్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. 2026 జూన్ దాకా లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన బాధ్యతల్లో కొనసాగుతారని శనివారం పేర్కొంది. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని తెలిపింది. ఆదాయ పన్ను(ఐటీ) శాఖలో విధాన నిర్ణయ విభాగమే సీబీడీటీ. ఈ విభాగం చైర్మన్‌గా అగర్వాల్ 2024 జూన్‌లో మొదటిసారిగా ఏడాది కాలానికిగాను నియమితులయ్యారు. 1988 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్(ఐఆర్ఎస్) అధికారి అయిన రవి అగర్వాల్ జూన్ 30వ తేదీన రిటైరవ్వాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ అధికారుల పునర్నియామకం నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. చైర్మన్ సారథ్యంలోని సీబీడీటీలో ఆరుగురు సభ్యులుంటారు. వీరికి స్పెషల్ సెక్రటరీ హోదా ఉంటుంది.

ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం నీరు నిలిచిపోవడంతో చిరాగ్ ఢిల్లీలోని కీలక రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ విభాగం పేర్కొంది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం. రాజీవ్ చౌక్, ఐటీవో, ఇండియా గేట్, లజ్‌పత్ నగర్, హౌజ్‌ఖాస్, సఫ్దర్‌జంగ్‌తోపాటు నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్ ప్రాంతాల్లో బారీ వర్షం పడే ఛాన్సుందని తెలిపింది. ఈశాన్య రుతు పవనాలు ఇంకా ఢిల్లీకి చేరుకోనప్పటికీ, వాతావరణ శాఖ తాజా సూచన ఆశాజనకంగా మారింది.

వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు త్వరలో ఢిల్లీలో కృత్రిమ వర్షం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కొత్త ప్రయత్నం ప్రారంభించింది. క్లౌడ్‌సీడింగ్‌తో కృత్రిమ వర్షం కురిపించేందుకు ముహూర్తం ఖరారు చేసింది. జూలై 4, 11వ తేదీల్లో ఇందుకు అనువైన వాతావరణ పరిస్థితులుంటాయని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా శనివారం తెలిపారు. కాన్పూర్ ఐఐటీ రూపొందించిన ఈ ప్రణాళికకకు పుణేలోని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) సాంకేతిక సహకారం అందజేస్తోందని వివరించారు. జూలై 3వ తేదీ వరకు క్లౌడ్ సీడింగ్‌కు సానుకూల పరిస్థితులు లేవన్నారు. జూలై 4, 11వ తేదీల్లో వాతావరణం ఒక వేళ సహకరించకుంటే మరో తేదీలో విమానం ద్వారా క్లౌడ్ సీడింగ్‌కు అనుమతివ్వాలని డీజీసీఏకు లేఖ రాశామని చెప్పారు. ఢిల్లీ వాసులకు పరిశుభ్రమైన గాలిని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. భద్రతాపరమైన ఆంక్షలు తక్కువగా ఉండే వాయవ్య, ఔటర్ ఢిల్లీ ప్రాంతాల్లోని 100 చదరపు కిలోమీటర్ల పరిధిలో గంటన్నర పాటు సెస్నా రకం విమానం ద్వారా మేఘ మథనం జరుగుతుందన్నారు. ఇందుకోసం సిల్వర్ అయోడైడ్, అయోడైజ్డ్ సాల్ట్, రాక్ సాల్ట్ వంటివాటిని వాడుతామని వివరించారు.

ఇజ్రాయెల్‌పైకి హౌతీల క్షిపణి ప్రయోగం

జెరుసలేం: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు శనివారం ఇజ్రాయెల్‌పైకి క్షిపణిని ప్రయోగించారు. తమ భూభాగంలోకి ప్రవేశించిన వెంటనే ఈ క్షిపణిని విజయవంతంగా అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. గాజాలోని పాలస్తీనియన్లకు సంఘీభావంగా యెమెన్‌లోని ఇరాన్ ప్రేరేపిత హౌతీలు ఇజ్రాయెల్ పైకి తరచుగా రాకెట్లు, క్షిపణులను ప్రయోగించడం తెలిసిందే. ఎర్ర సముద్రం గుండా వెళ్లే అమెరికా, పశ్చిమ దేశాల నౌకలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు సైతం దిగుతున్నారు. ఇజ్రాయెల్ సైతం హౌతీల సైనిక లక్ష్యాలపై ఎదురుదాడులు చేస్తోంది.

బీజేపీ నూతన అధ్యక్షుడు ఎవరు?

- ప్రధాని మోదీ విదేశీ పర్యటన ముగిసిన తర్వాత ప్రకటించే అవకాశం
- రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షుల ఎన్నికపై కొనసాగుతున్న కసరత్తు

న్యూఢిల్లీ: బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడి ఎంపికపై రాజకీయ వర్గాల్లో, పార్టీ వర్గాల్లోనూ చర్చలు జోరుగా సాగుతున్నాయి. జేపీ నడ్డా పదవీకాలం ముగిసి రెండేళ్లయినా, ఇంకా కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయలేదు. బీజేపీ వర్గాల నుంచి అందిన తాజా సమాచారం ప్రకారం.. జూలై రెండో వారంలో బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం ఉంది. బీజేపీ నియమావళి ప్రకారం, జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ముందు కనీసం సగం రాష్ట్ర శాఖల (స్టేట్ యూనిట్ల) అధ్యక్ష ఎన్నికలు పూర్తవ్వాలి. దేశవ్యాప్తంగా బీజేపీకి 37 రాష్ట్ర శాఖలు ఉన్నాయి. అంటే 19 రాష్ట్రాల అధ్యక్ష ఎన్నికలు పూర్తయిన తర్వాతే జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ మొదలవుతుంది. ఇప్పటి వరకు పార్టీ 14 రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తి చేసింది. మిగతా ఐదు రాష్ట్రాల ఎన్నికలు కూడా త్వరలో పూర్తయ్యే అవకాశముంది. జూలై రెండో వారంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడి పేరును ప్రకటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీజేపీ అధ్యక్ష ఎన్నిక ఇలా..

బీజేపీ దశలవారీ ప్రక్రియ ద్వారా అధ్యక్షుడిని ఎంచుకుంటుంది. ముందుగా బూత్ అధ్యక్షులు, ఆ తర్వాత మండల అధ్యక్షులు, తర్వాత జిల్లా అధ్యక్షులను ఎన్నుకుంటారు. సగం జిల్లాల అధ్యక్షులు ఎంపికైన తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిని నియమిస్తారు. అలాగే 19 రాష్ట్ర అధ్యక్షులు ఎన్నికైన అనంతరం జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు మార్గం సుగమమవుతుంది. చాలా సందర్భాల్లో ఈ ఎన్నికలు ఏకగ్రీవ పద్ధతిలోనే జరుగుతాయి. పార్టీ నేతలు, ఆర్ఎస్ఎస్ నాయకత్వం కలిసి బీజేపీ జాతీయ అధ్యక్ష అభ్యర్థిని ఖరారు చేస్తారు.

కొత్త అధ్యక్షుడి ముందు సవాళ్లు

జేపీ నడ్డా జనవరి 2020లో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీకాలం జనవరి 2023లోనే ముగిసింది. కానీ 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆయన పదవీ కాలాన్ని పొడిగించారు. ఇప్పుడు బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకంపై దృష్టి పెట్టారు. కొత్త అధ్యక్షుడి ఆధ్వర్యంలోనే 2025లో బిహార్, 2026లో పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ ఎదుర్కోవాల్సి ఉంది.

కుల, ప్రాంత సమీకరణపై దృష్టి

కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయడంలో కుల సమీకరణ, ప్రాంతీయ ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికలను పరిగణనలోకి తీసుకుంటారు. పలువురు కేంద్ర మంత్రుల పేర్లు కూడా చర్చకు వస్తున్నాయి. అందువల్ల కేంద్ర కేబినెట్‌లో మార్పులు, కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మంత్రివర్గ విస్తరణలు జరిగే అవకాశాలున్నాయి. ప్రధానమంత్రి మోదీ జూలై 2 నుంచి 9వ తేదీ వరకు ఐదు దేశాల పర్యటనకు వెళ్తున్నారు. ఆయన విదేశాల నుంచి తిరిగివచ్చిన తర్వాత, జూలై రెండో వారంలో కొత్త జాతీయ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

‘సైలెంట్ స్ప్రింగ్’ అనే పుస్తకాన్ని ఎవరు రాశారు?

అనాదిగా మానవుడికి ప్రకృతితో విడదీయలేని బంధం ఉంది. అతడు పర్యావరణంతో మమేకమై జీవిస్తాడు. పర్యావరణమే జీవరాశికి ప్రాణాధారం. అనేక అవసరాలు తీర్చడానికి, మానసిక వికాసానికి ప్రకృతి ఒక వరం లాంటిది. మానవ మనుగడకు మూలాధారం ప్రకృతే అనే మౌలిక వాస్తవాన్ని విస్మరించి ఆధునిక మానవుడు పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్నాడు. తాను కూర్చున్న కొమ్మను తానే నరికేస్తున్నాడు. పర్యావరణ వినాశనం వల్ల మానవుడి మనుగడ అసాధ్యం. కాబట్టి పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యం. ఇది ఏ ఒక్క వ్యక్తికో, దేశానికో సంబంధించిన సమస్య కాదు. దీని కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాల్సి ఉంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పర్యావరణం

పర్యావరణ ఉద్యమాలు

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను దశాబ్దాల కిందటే గుర్తించినా ఇప్పటివరకూ ఈ దిశగా సరైన చర్యలు తీసుకోలేదు. దీని కోసం అనేక మంది ఉద్యమాలు చేస్తున్నారు. 1945 నుంచే భూ గోళం పర్యావరణ సంక్షోభంలోకి ప్రవేశించింది. ప్రజలు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి ప్రకృతిపై అన్ని వైపుల నుంచి దాడి ప్రారంభించారు. ప్రారంభంలో పరిశ్రమల స్థాపన, తర్వాత శాస్త్ర సాంకేతిక విప్లవం, ఇటీవల ప్రపంచీకరణ పర్యావరణ పతనానికి దారితీశాయి. అడవులను నరికి విస్తారమైన వ్యవసాయ క్షేత్రాలను ఏర్పరచడం కూడా పర్యావరణ సమతౌల్యం దెబ్బతినడానికి కారణమైంది. నూతన పారిశ్రామికాభివృద్ధి, శాస్త్ర విజ్ఞానం ఫలితంగా సింథటిక్ ఉత్పత్తుల వినియోగం పెరిగింది. ఈ సింథటిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుంది. ఇలాంటి ఉత్పత్తులన్నీ ప్రకృతికి విఘాతం కలిగిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ విస్తరించేకొద్దీ మానవుల కార్యకలాపాలు ప్రకృతికి విరుద్ధంగా పరిణమిస్తున్నాయి. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం నాశనం అవుతోంది.

పూర్వకాలంలో మానవుల అవసరాలు పరిమితంగా ఉండేవి. వారు ప్రకృతి వనరులను తక్కువగా వినియోగించేవారు. అందువల్ల పర్యావరణ సమతౌల్యం మెరుగ్గా ఉండేది. ప్రస్తుతం విలాసవంతమైన జీవితం, సంపద కోసం ప్రకృతి వనరులపై ఒత్తిడి పెరిగింది. అవసరానికి మించి ప్రకృతి వనరులను వినియోగించడం వల్ల భావి తరాల జీవితం ప్రశ్నార్థకమయ్యే దుస్థితి తలెత్తింది. అమెరికా పర్యావరణ శాస్త్రవేత్త ఎడ్వర్డ్ గోల్డ్ స్మిత్ పేర్కొన్నట్లు అనేక అవసరాల కోసం తాను ఆధారపడే ప్రకృతిని ఆధునిక మానవుడు వేగంగా నాశనం చేస్తున్నాడు. అడవుల్లో బంజరు భూములను దుర్వినియోగం చేస్తున్నారు. పగడాల దీవులను విచక్షణా రహితంగా తవ్వేస్తున్నారు. పంట పొలాలు నాశనమై చౌడు భూములుగా, ఎడారులుగా మారుతున్నాయి. కాలుష్య సమస్య తీవ్రమైంది. ప్రస్తుతం ప్రతి జీవి శరీరంలోనూ పారిశ్రామిక, వ్యవసాయ రసాయనాలు కేన్సర్ కారకాలుగా పరిణమిస్తున్న అంశాన్ని గమనిస్తే.. దీని తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పర్యావరణం అంటే..?

ఒక జీవి లేదా జీవరాశుల చుట్టూ ఉన్న పరిసరాలు (గాలి, నేల, నీరు, జీవ సమూహాలు), వాటి స్థితిగతుల మొత్తాన్ని కలిపి ‘పర్యావరణం’ అంటారు. ఆంగ్లంలో దీన్ని ‘ఎన్విరాన్‌మెంట్’ అంటారు. ఇది ఫ్రెంచి భాషా పదమైన ‘ఎన్విరాన్’ నుంచి ఆవిర్భవించింది. ఫ్రెంచిలో ‘ఎన్విరాన్’ అంటే ‘ఆవరణం – చుట్టూ ఉన్న ప్రదేశం’ అని అర్థం.

పర్యావరణం - మూలకాల సంఘటనం

ప్రకృతిలోని పంచభూతాలు మానవుడికి పంచ ప్రాణాల లాంటివి. గాలిలో, నీటిలో, భూమిపై ఉండాల్సిన మూలకాలు తగిన నిష్పత్తిలో లేకపోతే మానవుడికి ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. అలాంటి వాటి గురించి తెలుసుకుందాం..

కార్బన్ డై ఆక్సైడ్

వాతావరణంలో మానవుడికి పెద్దగా అవసరం లేని కార్బన్ డై ఆక్సైడ్ అధికంగా ఉండగా, అత్యవసరమైన ప్రాణవాయువు (ఆక్సిజన్) తక్కువ పరిమాణంలో ఉంది. దీంతో పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటోంది. ఇది మానవులకు హానికరంగా తయారైంది. సూర్యుడి నుంచి వచ్చే కాంతి, అందులో ఉండే అతినీల లోహిత రేడియో ధార్మికత భూ వాతావరణం ద్వారా నేలను చేరి, దాన్ని వేడెక్కిస్తాయి. ఈ వేడిమి శక్తి తిరిగి పరారుణ రేడియో ధార్మికత రూపంలోకి పరావర్తనం చెందుతుంది. అయితే వాతావరణంలో ఉండే కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి, మరికొన్ని వాయువులు దీన్ని కొంత మేర గ్రహించి భూ ఉపరితలం వేడిగా ఉండేట్లు చేస్తాయి. ఇది కొంతమేర ఉండటం మేలు చేస్తుంది. కానీ వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ స్థాయికి మించితే భూతాపం పెరుగుతుంది. దీన్నే ‘గ్రీన్ హౌస్ ప్రభావం’ అంటారు. నిత్యం బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువులను మండించడం వల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి, సల్ఫర్ డై ఆక్సైడ్ (SO_2) లాంటి వాయువుల స్థాయి పెరిగిపోతోంది. పారిశ్రామిక విప్లవానికి ముందు 260 PPMV(పార్ట్స్ పర్ మిలియన్ బై వాల్యూం) మేర ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ ప్రస్తుతం 370 PPMVకి చేరింది. ఈ శతాబ్దాంతానికి దీని స్థాయి 500 PPMVకి చేరొచ్చునని ఆందోళన చెందుతున్నారు. అడవుల నరికివేత వల్ల కూడా ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. భారతదేశ విస్తీర్ణంలో భౌగోళికంగా 33 శాతం అడవులు ఉండాలి. ప్రస్తుతం వీటి విస్తీర్ణం 23 శాతంగా ఉంది.

మిథేన్

మిథేన్‌కు పరారుణ కాంతిని గ్రహించే సామర్థ్యం చాలా ఎక్కువ. వాతావరణంలో ఇది స్వల్పంగానే ఉన్నా దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పారిశ్రామిక విప్లవానికి ముందు వాతావరణంలో ఇది 600 PPBV మేర ఉండేది. ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ 1950 నాటికి 1300 PPBVకి, 1990 నాటికి 1700 PPBVకి పెరిగింది.

నీరు నిల్వ ఉండే సాగు విధానం, ఈ వాయువును విడుదల చేసే పేడ లాంటి పదార్థాలు పెరగడం, శిలాజ ఇంధనాల వాడకం ఈ వాయువు అధికమవడానికి కారణాలు. మిథేన్ వాతావరణంలోకి ఒకసారి చేరితే గరిష్ఠంగా పదేళ్లు ఉంటుంది.

క్లోరో ఫ్లోరో కార్బన్లు (CFC)

వాతావరణంలో వీటి ఉనికి ఇటీవల విపరీతంగా పెరిగింది. ఫ్రిజ్‌లు, బెడ్‌ల కోసం ఉపయోగించే ఫోమ్, అగ్నిమాపక రసాయనాల లాంటి వాటి వాడకం పెరగడమే దీనికి కారణం. 1950లో ‘సున్నా’గా ఉన్న CFC–11 లేదా R-11 (chloro fluoro methane) 1984 నాటికి 3 లక్షల టన్నులకు చేరింది. 1984 నుంచి CFC–11 క్రమంగా పెరుగుతూ వస్తోంది. 1940లో సున్నాగా ఉన్న CFC–12 లేదా R-12 లేదా freon-12 (DiChloro fluoro methane) పరిమాణం 1984 నాటికి నాలుగు టన్నులకు చేరింది.

నైట్రస్ ఆక్సైడ్

దీన్ని ‘లాఫింగ్ గ్యాస్’ అంటారు. శిలాజ ఇంధనాలను మండించడం, అమ్మోనియా ఎరువుల వినియోగం, అడవుల నరికివేత లాంటి కారణాల వల్ల వాతావరణంలో నైట్రస్ ఆక్సైడ్ పరిమాణం పెరుగుతోంది. పారిశ్రామికీకరణకు ముందు 275 PPBVగా ఉన్న నైట్రస్ ఆక్సైడ్ 1992 నాటికి 311 PPBVకి పెరిగింది.

ఏరోసాల్స్ (Aerosols)

వాతావరణంలో ఉండే చిన్నపాటి ఘన, ద్రవ రేణువులనే ఏరోసాల్స్ అంటారు. వీటి పరిమాణం పెరిగితే భూమి నుంచి విశ్వంలోకి వెళ్లే రేడియో ధార్మికతను ఇవి అడ్డుకుంటాయి. తద్వారా భూతాపం పెరుగుతుంది. ఈ ఏరోసాల్స్ వల్ల ఓజోన్ పొర క్షీణిస్తుంది. శిలాజ ఇంధనాలను మండించడం, పారిశ్రామిక ఉద్గారాల వల్ల పొగ, ధూళి రేణువులు పెరిగి వాతావరణంలో ఏరోసాల్స్ పరిమాణం అధికం అవుతోంది. ఈ విధంగా వాతావరణంలో వివిధ వాయువుల పరిమాణం అధికమవడం వల్ల ‘గ్లోబల్ వార్మింగ్’ పెరుగుతోంది. భూగోళంపై ఉష్ణోగ్రత పెరగడం వల్ల గాలి, నీరు, నేల సమతౌల్యం కోల్పోతున్నాయి. దీంతో జీవరాశులన్నింటి మనుగడ దుర్భరమవుతోంది. కాలుష్యాల సాంద్రత, కాలుష్యీకరణ తీవ్రత ఇలాగే కొనసాగితే ప్రపంచ భౌగోళిక ప్రవృత్తుల్లో తీవ్రమైన అనుత్క్రమణీయ (Irreversible) మార్పులు సంభవిస్తాయి. మనల్ని మనం కాపాడుకోవాలంటే పర్యావరణ పరిరక్షణ చేపట్టాల్సిందే.

ప్రముఖుల నిర్వచనాలు

జీవులు, పరిసరాలకు మధ్య ఒక నిర్దిష్ట సమన్వయ సహకారం ఉంటుంది. ఈ జీవ, నిర్జీవ అంశాల సమన్వయ సహకార సంక్లిష్టతనే ‘పర్యావరణం’గా పేర్కొనవచ్చు.– **టాలెమీ**

‘మన చుట్టూ ఆవరించి ఉన్న భౌతిక రసాయనిక, జీవ రసాయనిక అంశాల మధ్య ఉన్న సమన్వయ సహకార సమ్మేళన వ్యవస్థీకృత స్వరూపాన్ని ‘పర్యావరణం’ అంటారు. – **ఓడమ్**

పర్యావరణ వాదం

పర్యావరణాన్ని సంరక్షించడం, పునరుద్ధరించడం లేదా మెరుగుపర్చడంపై శ్రద్ధ కలిగి ఉండటాన్ని ‘పర్యావరణ వాదం’ అంటారు. పర్యావరణ ప్రాముఖ్యాన్ని గుర్తించి వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. పర్యావరణాన్ని రక్షించడానికి కృషి చేయడాన్నే ‘పర్యావరణ వాదం’గా పేర్కొంటారు. యూరప్‌లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, తీవ్రమవుతున్న కాలుష్యానికి ప్రతిచర్యగా దీన్ని ప్రారంభించారు.

1949లో ‘ఆల్డో లియోపాల్డ్’ అనే అమెరికన్ పర్యావరణవేత్త "A Sand County Almanac" అనే పుస్తకంలో పర్యావరణ కాలుష్యం వల్ల మానవ సమాజం ఎదుర్కొనే సమస్యలను ఎత్తి చూపారు. ఈ గ్రంథం 20వ శతాబ్దంలో పర్యావరణ వాదాన్ని విశేషంగా ప్రభావితం చేసింది. అమెరికాకు చెందిన జీవ శాస్త్రవేత్త ‘రేచల్ కార్సన్’ 1962లో ‘సైలెంట్ స్ప్రింగ్’ అనే పుస్తకం రాశారు. ఇందులో డి.డి.టి.(dichloro diphenyl trichloroethane), ఇతర పురుగు మందుల వాడకం కేన్సర్‌ను కలిగిస్తుందని, వ్యవసాయంలో వీటిని వినియోగించడం వల్ల వన్యప్రాణులకు.. ముఖ్యంగా పక్షులకు ప్రమాదం ఏర్పడుతోందని ఆమె పేర్కొన్నారు. దీని ప్రభావంతో 1970లో ‘యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ’ని స్థాపించారు. ఇది 1972లో అమెరికాలో డి.డి.టి.ని నిషేధించడంలో ప్రధాన పాత్ర పోషించింది. ఈ పుస్తకం వల్ల పర్యావరణ అంశాలపై శ్రద్ధ పెరిగి ‘గ్రీన్ పీస్’, ‘ఫ్రెండ్స్ ఆఫ్ ద ఎర్త్’ లాంటి స్వచ్ఛంద సంస్థలు ఆవిర్భవించడానికి నాంది పడింది.

1973లో Endangered Species Act, 1975లో Convention on International Trade in Endangered Species (CITES) ఏర్పడటంతో పర్యావరణ వాదం మరింత ప్రభావవంతమైంది. 1972లో యూఎన్‌వో ఆధ్వర్యంలో ‘స్టాక్‌హోం’లో జరిగిన ‘మానవుడు – పర్యావరణం’ అనే అంశంపై నిర్వహించిన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో 114 దేశాలు పాల్గొన్నాయి. ఈ సమావేశం ఫలితంగా ‘యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్’ ప్రారంభమైంది. పర్యావరణ పరిరక్షణ కోసం ‘నేషనల్ వైల్డ్ లైఫ్ ఫెడరేషన్’, ‘వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్’ (డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్.) లాంటి సంస్థలు ప్రారంభమయ్యాయి. జూన్–5ను ‘ప్రపంచ పర్యావరణ దినోత్సవం’గా యావత్ ప్రపంచం పాటించాలని 1972లో యూఎన్‌వో ప్రతిపాదించింది.

‘యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్’ (యూఎన్ఈపీ) ఆధ్వర్యంలో గ్రీన్ హౌస్ వాయువుల నియంత్రణ కోసం 1982లో ‘ధరిత్రీ సదస్సు’ నిర్వహించారు. 1997లో క్యోటో ప్రోటోకాల్ వెలువడింది. 2007లో బాలిలో నిర్వహించిన సదస్సు, 2009లో జరిగిన కొపెన్‌హెగన్ సదస్సులో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.2015 డిసెంబర్‌లో పారిస్‌లో నిర్వహించిన కాప్–11 సదస్సులో 2100 నాటికి భూతాపాన్ని రెండు డిగ్రీల కంటే తక్కువకు తగ్గించడానికి 195 దేశాలు అంగీకారం కుదుర్చుకున్నాయి.

వర్ధమాన దేశాలకు 2020 నుంచి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు ఏటా వంద బిలియన్ డాలర్ల మేర సమకూర్చడానికి కూడా ఒప్పందం కుదిరింది.

ఖండాల భూపటలాన్ని ఏమని పిలుస్తారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భూగోళశాస్త్రం

భూపటలం - శిలలు

సగటున సుమారు 30 కిలోమీటర్ల మందం కలిగిన భూగోళం బాహ్య పొరను ‘పటలం’ అంటారు. పటలం వివిధ రకాల శిలలతో కూడిన దృఢమైన పొర. ఈ శిలలు అనేక ఖనిజాలతో ఇమిడి ఉంటాయి. పటలంలో ప్రధానంగా తేలికైన సిలికాన్, అల్యూమినియం మూలకాలు కేంద్రీకృతమై ఉంటాయి. అందువల్ల పటలాన్ని ‘సియాలిక్’ పొరగా కూడా పిలుస్తారు. పటలం సాంద్రత సుమారుగా 2.7. ఇది భూగోళ సగటు సాంద్రత (5.5) కంటే చాలా తక్కువ. పటలం దృఢంగా ఉన్నప్పటికీ.. అవిచ్ఛిన్న పొర మాత్రం కాదు. పటలం అనేక చిన్నా పెద్ద ముక్కలుగా విభజించి ఉంటుంది. ఈ ముక్కలను అస్మావరణ పలకలుగా వ్యవహరిస్తారు.అస్మావరణ పలకలు ఖండాలు, సముద్రాలను కలిగి ఉన్నాయి. పటలానికి చెందిన ఈ అస్మావరణ పలకలు కింద ఉన్న ఆస్తినో ఆవరణ పాక్షిక శిలా ద్రవంలో తేలియాడుతూ వివిధ దశల్లో చలిస్తున్నాయి. అంటే..ఖండాలు,సముద్రాలు వివిధ దశల్లో చలిస్తున్నాయన్నమాట! ఈ పలకల చలనం వల్ల పలకల మధ్య అపసరణ, అభిసరణ లేదా సమాంతర సరిహద్దులు ఏర్పడతాయి. ఈ పలకల సరిహద్దు మండలాల వద్దనే పర్వతోద్భవనం,అగ్నిపర్వత ప్రక్రియ, భూకంప ప్రక్రియ కేంద్రీకృతమై ఉంటుంది.

పటల శిలలు మూడు రకాలు

పటల శిలలను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి.. 1. అగ్ని శిలలు 2. రూపాంతర శిలలు 3. అవక్షేప శిలలు

పర్వతోద్భవనం, అగ్నిపర్వత, క్రమక్షయ ప్రక్రియల కారణంగా శిలల స్వభావం మారిపోయి కొత్త శిలలు ఏర్పడుతుంటాయి. శిలా చక్రంలో భాగంగా ఒక తరగతికి చెందిన శిలలు క్రమేపీ మరో రకానికి చెందిన శిలలుగా మార్పు చెందే అవకాశం ఉంది.

పటలంలో మొట్టమొదటగా ఏర్పడే అగ్ని శిలలను ‘ప్రాథమిక శిలలు’గా పిలుస్తారు. పటల అంతర్భాగాల్లో అధిక ఉష్ణోగ్రత, పీడనాల వల్ల శిలలు పాక్షిక ద్రవ రూపంలో ఉంటాయి. ఈ పాక్షిక శిలా ద్రవాన్ని ‘మాగ్మా’ అంటాం. భూ ఉపరితలం పైకి ఉబికి వచ్చిన తర్వాత మాగ్మాను ‘లావా’గా పిలుస్తారు. మాగ్మా లేదా లావా చల్లబడి క్రమంగా ఘనీభవించి అగ్ని శిలలు ఏర్పడతాయి. పటలం అంతర్భాగంలో అధిక లోతుల్లో మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడే అగ్ని శిలలను ‘ప్లుటానిక్ అగ్ని శిలలు’గా వ్యవహరిస్తారు. ఉపరితలానికి చేరే క్రమంలో మార్గ మధ్యంలోనే మాగ్మా ఘనీభవం చెందగా ఏర్పడే శిలలను ‘హైపర్ బేసల్ అగ్ని శిలలు’గా పిలుస్తారు. భూ ఉపరితలం పైకి లావా ఉద్భేదించిన తర్వాత ఘనీభవించగా ఏర్పడే శిలలను ‘లావా శిలలు’గా అభివర్ణిస్తారు. గ్రానైట్, బసాల్ట్, గాబ్రో, డయరైట్, ఆండెసైట్ మొదలైనవి ప్రధాన అగ్ని శిలలు. అగ్నిశిలలు కఠినం గా, దృఢంగా ఉంటాయి. సచ్ఛిద్రంగా ఉండవు. వీటిలో శిలాజాలు ఏర్పడవు. అగ్ని శిలల్లో ప్రధానంగా ఫెర్రస్ జాతికి చెందిన లోహ ఖనిజాలు కేంద్రీకృతమై ఉంటాయి. పటల అంత ర్భాగంలోని శిలలు ప్రధానంగా అగ్ని శిలల తరగతికి చెందుతాయి.

భూ ఉపరితలం పైన పని చేసే బాహ్య బలాలు కఠిన పటల శిలలను శిథిలం చేస్తాయి. ఈ ప్రక్రియనే శిలా శైథిల్యం/ క్రమక్ష యంగా పిలుస్తారు. ప్రవహించే నదులు, హిమానీనదాలు, పవనాలు, సముద్ర వేలాతరంగాలు, భూగర్భ జల ప్రవాహాలు ప్రధానమైన బాహ్య బలాలు లేదా క్రమక్షయ కారకాలు. శిథిల శిలా పదార్థాలు నదీ హరివాణాలు, లోయలు, మైదానాలు, సముద్ర భూతలంపై నిక్షేపమై కాలక్రమేణ శిలలుగా రూపొందుతాయి. పై పొరల సంపీడనం వల్ల కింది పొరల్లోని శిలా శిథిలాలు క్రమంగా సంఘటితమై ఏర్పడే ఈ శిలలను అవక్షేప శిలలుగా పరిగణిస్తారు. ఇసుకరాయి, షేల్, సున్నపురాయి, కాంగ్లో మేరేట్ ప్రధాన అవక్షేప శిలల రకాలు. అవక్షేప శిలలు స్తరిత శిలల తరగతికి చెందుతాయి. ఇవి సచ్ఛిద్ర శిలలు. అవక్షేప శిలల్లో శిలాజాలు ఏర్పడతాయి. శిలాజాల వల్ల పురాభౌమ్య యుగంలో శీతోష్ణ స్థితి, సహజ ఉద్భిజ సంపద, జీవజాతుల సమాచారం లభ్యమవుతుంది. అవక్షేప శిలలు కఠినంగా కానీ లేక మృదువుగా కానీ ఉండవచ్చు. అవక్షేప శిలల్లో సాధారణంగానే అనేక పగుళ్లు ఉంటాయి. వివిధ తరగతులకు చెందిన శిలలు అధిక ఉష్ణోగ్రతలు, అధిక పీడనాలు లేదా రెండిటికీ లోనైనప్పుడు వాటి భౌతిక, రసాయనిక ధర్మాలు పూర్తిగా మార్పు చెంది ఏర్పడే సరికొత్త శిలలనే రూపాంతర శిలలుగా పిలుస్తారు. రూపాంతర శిలల మాతృక శిలలు అవక్షేప లేదా అగ్ని లేదా రూపాంతర శిలలుగా ఉండవచ్చు. అగ్ని పర్వత ప్రక్రియ లేదా పర్వతోద్భవన ప్రక్రియ సందర్భంగా ప్రధానంగా రూపాంతర శిలలు ఏర్పడతాయి. పటలంలో మాగ్మా ప్రవహిస్తున్నప్పుడు సమీపంలో శిలలు రూపాంతరం చెందుతాయి. పర్వతోద్భవన మండలంలో అధిక ఉష్ణోగ్రతలు, పీడనం కారణంగా రూపాంతర ప్రక్రియ సంభవిస్తుంది. అందువల్లే పలకల సరిహద్దుల వద్ద రూపాంతర ప్రక్రియ సర్వసాధారణం. అవక్షేప శిలలైన షేల్, ఇసుకరాయి, సున్నపురాయి రూపాంతరం చెందడం వల్ల వరుసగా స్లేట్, క్వార్ట్జైట్, పాలరాయి వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. గ్రానైట్, గాబ్రొ వంటి అగ్ని శిలల రూపాంతరం వల్ల వరుసగా నీస్, ఫిల్లైట్ వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. స్లేట్, క్వార్ట్జైట్‌లు మర లా రూపాంతర ప్రక్రియకు లోనవడం వల్ల సిస్ట్, ఫిల్లైట్ వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. అవక్షేప శిలల్లో శిలాజ ఇంధన వనరులైన బొగ్గు, చమురు, సహజవాయువులు విస్తారంగా లభిస్తాయి. రూపాంతర శిలల్లో నాన్ ఫెర్రస్ జాతికి చెంది లోహ ఖనిజాలు, అలోహ ఖనిజాల వనరులు ఉంటాయి. రూపాంతర శిలలు కఠినంగా, దృఢంగా ఉండటం వల్ల భవన నిర్మాణ రంగంలో విశేషంగా ఉపకరిస్తాయి. భూ ఉపరితలం మీద ఉన్న శిలలు ప్రధానంగా అవక్షేప శిలల తరగతికి చెందుతాయి.

విశ్వానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

- చరిత్రకు అందినంత వరకు విశ్వం గురించి తొలిసారిగా పరిశోధనలు చేసిన వ్యక్తి ‘టాలమీ’. విశ్వానికి కేంద్రం భూమి అని, సూర్యుడు, గ్రహాలు, ఉపగ్రహాలు సమస్త విశ్వ పదార్థాలు భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాయని ఈయన క్రీ.శ. 130-140 మధ్యకాలంలో ప్రతిపాదించాడు.
- 16వ శతాబ్దంలో పోలండ్ ఖగోళ శాస్త్రవేత్త నికోలస్ కోపర్నికస్ ‘టాలమీ’ భూకేంద్ర సిద్ధాంతాన్ని తోసిపుచ్చాడు. విశ్వానికి కేంద్రం సూర్యుడు అని ప్రతిపాదించాడు.
- 1609లో జర్మనీ శాస్త్రవేత్త కెప్లర్ సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని సమర్థిస్తూనే ‘సూర్యుడు విశ్వానికి కేంద్రం కాదని, సౌర వ్యవస్థకు మాత్రమే కేంద్రం’ అని వివరించాడు. గ్రహాల వృత్తాకార కక్ష్యను కూడా నిర్ణయించాడు.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో క్రమక్షయం వల్ల ఏర్పడే శిల ఏది?
   ఎ) పాలరాయి బి) సున్నపురాయి
   సి) గ్రానైట్ డి) పలకరాయి
2. పాలరాయి ఏ మాతృక శిల రూపాంతరం వల్ల ఏర్పడుతుంది?
   ఎ) సున్నపురాయి బి) ఇసుకరాయి
   సి) షేల్ డి) బసాల్ట్
3. మహారాష్ట్రలోని దక్కన్ నాపల ప్రాంతం ఏ రకమైన శిలలతో కూడి ఉంది?
   ఎ) నీస్ బి) చార్నోకైట్
   సి) గ్రానైట్ డి) బసాల్ట్
4. భారతదేశంలోని కింది తరగతికి చెందిన శిలల్లో చమురు సహజవాయువు నిక్షేపాలు కేంద్రీకృతమై ఉన్నాయి?
   ఎ) కర్నూలు–కడప శ్రేణి శిలలు
   బి) టైపామ్ శ్రేణి ఇసుకరాయి
   సి) ధార్వారియన్ శిలలు
   డి) చార్నోకైట్‌లు
5. కింది సూచించిన ఏ తరగతికి చెందిన శిలల్లో భూగర్భ జలవనరులు సమృద్ధిగా ఉంటాయి?
   ఎ) అవక్షేప శిలలు
   బి) రూపాంతర శిలలు
   సి) అగ్ని శిలలు డి) పైవన్నీ
6. ఏ మూలకాలు కేంద్రీకృతమవడం వల్ల పటలం అల్ప సాంద్రతను కలిగి ఉంటుంది?
   ఎ) ఇనుము, నికెల్
   బి) ఇనుము, సిలికాన్
   సి) సిలికాన్, మెగ్నీషియం
   డి) సిలికాన్, అల్యూమినియం
7. భారతదేశంలో చార్నోకైట్, కోండలైట్ శిలలు ఏ ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి?
   ఎ) పశ్చిమ కనుమలు
   బి) దక్షిణ పీఠభూమి
   సి) తూర్పు కనుమలు
   డి) హిమాలయాలు
8. హిమాలయాల్లోని శివాలిక్ కొండలు ప్రధానంగా కింది శిలలతో నిర్మితమై ఉన్నాయి?
   ఎ) అవక్షేప శిలలు
   బి) రూపాంతర శిలలు
   సి) అగ్ని శిలలు డి) పైవేవీ కావు
9. కింది వాటిలో అగ్ని శిల కానిదేది?
   ఎ) గ్రానైట్ బి) గాబ్రో
   సి) కాంగ్లోమెరేట్ డి) బసాల్ట్
10. మోహోలిక్ తలం వేటిని వేరు చేస్తుంది?
   ఎ) ప్రావారం–కేంద్రకం
   బి) పటలం–ప్రావారం
   సి) సముద్రాలు–ఖండాలు
   డి) బాహ్య కేంద్రకం–అంతర్ కేంద్రకం
11. భూమికి సంబంధించిన కింది పొరను ‘శిలావరణం’గా వ్యవహరిస్తారు?
   ఎ) భూపటలం బి) ప్రావారం
   సి) కేంద్రకం డి) పైవేవీ కావు
12. భూకంపాలు భూమికి సంబంధించిన ఏ భాగంలో ఉద్భవిస్తాయి?
   ఎ) భూపటలం బి) ప్రావారం
   సి) కేంద్రకం డి) పైవేవీ కావు
13. భూఉపరితలం నుంచి అంతర్భాగానికి వెళ్లేకొద్దీ?
   ఎ) సాంద్రత తగ్గుతుంది
   బి) సాంద్రత పెరుగుతుంది
   సి) సాంద్రత తగ్గి, పెరుగుతుంది
   డి) సాంద్రత పెరిగి, తగ్గుతుంది
14. మోహోవిక్ తలం భూమిలో సగటున సుమారుగా ఎంత లోతులో ఉంటుంది?
   ఎ) 5 కి.మీ. బి) 10 కి.మీ.
   సి) 30 కి.మీ. డి) 50 కి.మీ.
15. ఖండాల భూపటలాన్ని ఏమని పిలుస్తారు?
   ఎ) సియాలో పొర బి) సీమా పొర
   సి) నైఫ్ పొర డి) పైవేవీ కావు
16. భూ అంతర్భాగానికి చెందిన కింది పొరను ‘పెరిడోటైట్’ కర్పరంగా పిలుస్తారు?
   ఎ) భూపటలం బి) ప్రావారం
   సి) కేంద్రకం డి) పైవేవీ కావు
17. ‘బాథోలిథ్’ భూస్వరూపం ఏ రకమైన శిలలతో నిర్మించబడుతుంది?
   ఎ) అవక్షేప శిలలు
   బి) రూపాంతర శిలలు
   సి) అగ్ని శిలలు డి) పైవన్నీ
18. గ్యుటెన్‌బర్గ్ తలం భూ అంతర్భాగంలో సుమారు ఎంత లోతులో ఉంటుంది?
   ఎ) 2000 కి.మీ. బి) 2200 కి.మీ.
   సి) 2500 కి.మీ. డి) 2900 కి.మీ.
19. రూపాంతర శిలలు ఏర్పడటానికి ఏ అంశాలు దోహదపడతాయి?
   1) అధిక పీడం
   2) అధిక ఉష్ణోగ్రత
   3) అధిక వర్షపాతం
   ఎ) 1, 2 బి) 2, 3
   సి) 3, 1 డి) పైవన్నీ
20. భూపటలంలో శిలలు ప్రధానంగా ఏ మూలకాలని కలిగి ఉంటాయి?
   ఎ) మెగ్నీషియం బి) ఇసుక
   సి) ఇనుము డి) సిలికాన్

సమాధానాలు

1) బి	2) ఎ	3) డి	4) బి	5) ఎ
6) డి	7) సి	8) ఎ	9) సి	10) బి
11) ఎ	12) ఎ	13) బి	14) సి	15) ఎ
16) బి	17) సి	18) డి	19) ఎ	20) డి

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈసీఐఎల్, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ప్రోగ్రామర్/ సీనియర్ డెవలపర్/సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్–1,ప్రోగ్రామ్ డెవలపర్/సాఫ్ట్‌వేర్ ఇంజనీర్–3, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్–1.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంసీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ ప్రోగ్రామ్‌కు రూ.66,000, ప్రోగ్రామర్‌కు రూ.44,000, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్‌కు రూ.29,500.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ–56/ఏ–17, సెక్టార్–62, నోయిడా–201307(ఉత్తరప్రదేశ్) చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** https://www.becil.com

ఐఎన్ఎంఏఎస్-డీఆర్‌డీవో, ఢిల్లీలో జేఆర్ఎఫ్‌లు

ఢిల్లీలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు నెట్ గేట్ అర్హత సాధించి ఉండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, రాతపరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** sonia.inmas@-gov.in
» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in

కంచర్ల గోపన్న ఎవరి మేనల్లుడు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీల యుగ విశేషాలు

భాషా సాహిత్యాలు

మహమ్మద్ కులీ కుతుబ్‌షా

ఇబ్రహీం కుతుబ్‌షా తర్వాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడి తల్లి భగీరథి. మహమ్మద్ కులీ తన ప్రేయసి అయిన భాగమతి పేరుమీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. చార్మినార్ లాంటి అనేక కట్టడాలను నిర్మించాడు. ఇతడు మీర్జా మహమ్మద్ అమీన్, ముల్లా మూమిన్, మిసాక్ సుబాజ్ వలి అనే పార్సీ కవులను ఆదరించాడు. వజాహి, గవాస్సీ అనే ప్రముఖ ఉర్దూ కవులకు ఆశ్రయమిచ్చాడు. మహమ్మద్ కులీ స్వయంగా కవి, గ్రంథకర్త. ఫారసీ కవితా సంకలన కర్తయిన అలామ మీర్ మోమిన్ ఇతడి కాలంలో పీష్వా పదవిని అలంకరించాడు. పటమట సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సారంగు తమ్మయ్య, కామారెడ్డిలను కులీ సన్మానించాడు. ఇతడి ఆస్థానంలో గణేశ పండితుడు కూడా ఉండేవాడు.

ఉర్దూ కవుల్లో కులీ ప్రథముడు కాకపోయినా ఆ భాషలోని రచనలు ఒక సంపుటంగా పుస్తక రూపంలో వెలువడటం ఈయనతోనే మొదలైంది. మహమ్మద్ కులీ తొలి ఉర్దూ రాజ కవి. ఇతడు పార్సీ, తెలుగు భాషల్లోనూ కవిత్వం రాశాడని భావిస్తారు. కానీ అవి అలభ్యం. మహమ్మద్ కులీ కవితల సంకలనాన్ని అతడి అల్లుడైన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా 'దివాన్' పేరుతో వెలువరించాడు. ఇతడి కవిత్వం పర్షియన్, భారతీయ సంస్కృతుల సమ్మేళనం. కులీ కవితల్లో తెలుగు పదాలు, ఆచార వ్యవహారాలు, హోళీ, బతుకమ్మ పండుగల ప్రస్తావన ఉంది. అప్పటి వరకూ మత సంబంధంగా ఉన్న ఉర్దూ కవిత్వంలో లౌకిక భావనను ప్రవేశపెట్టిన కవుల్లో కులీ ప్రథముడు. నాటి తెలుగు, ఉర్దూ కవిత్వాల తరహాలోనే ఇతడిది ప్రధానంగా శృంగార కవిత్వం.

సారంగు తమ్మయ్య

తమ్మయ కులీ కుతుబ్‌షాకు ఆప్తుడు. గోల్కొండకు కరణీకం చేసేవాడు. అనేక కావ్యాలను రచించాడు. హరిభక్తి సుధోదయం అనే గ్రంథానికి తమ్మయ్య రాసిన వ్యాఖ్యానంలో భగీరథ పట్టణ ప్రస్తావన ఉంది. ఈ పట్టణమే భాగ్యనగరం (హైదరాబాద్). తమ్మయ్య ముఖ్య రచన 'వైజయంతీ విలాసం'. తెలుగులో వెలువడిన గొప్ప శృంగార కావ్యాల్లో ఇదొకటి. ఇందులో భక్తిని, శృంగారాన్ని మేళవించారు.

నేబతి కృష్ణమంత్రి మహమ్మద్ కులీ ఆస్థాన కవి. కులీకి మంచి స్నేహితుడైన ఇతడు మంత్రిగానూ వ్యవహరించాడు. ఇతడు రాజనీతి రత్నాకరం అనే గ్రంథాన్ని రాశాడు. నాటి రాజకీయ పరిస్థితులు, సాహిత్యం తదితర విషయాల గురించి ఈ గ్రంథం తెలియజేస్తోంది.

దోమకొండ సంస్థానం

దోమకొండ (బిక్కనవోలు, నిజామాబాద్ జిల్లా) సంస్థానాన్ని తెలంగాణలో తొలి సంస్థానంగా భావించవచ్చు. ఈ సంస్థాన మూల పురుషుడు కాచారెడ్డి (1415–35). ఇతడి మునిమనవడైన ఒకటో ఎల్లారెడ్డి (1500–25) కాలం నుంచి ఈ సంస్థానం సాహిత్యాన్ని పోషించింది. బాలభారతం, కిరాతార్జునీయం అనే గ్రంథాలను ఎల్లారెడ్డి అంకితం తీసుకున్నాడు. అనేక మంది కవిపండితుల్ని పోషించాడు. ప్రస్తుతం వారి కావ్యాలేవి లభించడం లేదు. జంగమరెడ్డి, రెండో కామిరెడ్డి, రెండో ఎల్లారెడ్డి, రెండో మల్లారెడ్డి అనే నలుగురు ఇతడి మనవళ్లు. చివరి ముగ్గురు కృతిభర్తలు, కృతికర్తలు. ఈ ముగ్గురూ 16 శతాబ్దం ఉత్తరార్ధానికి చెందినవారు.

కామిరెడ్డి(1530–1600) తన సహాధ్యాయి అయిన పటమట సోమనాథ సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సోమయాజి 'సూత సంహిత'ను అనువదించి కామిరెడ్డికి అంకితమిచ్చాడు. బ్రహ్మోత్తర ఖండాన్ని కామిరెడ్డి సోదరుడైన రెండో ఎల్లారెడ్డికి అంకితమిచ్చాడు. సోమయాజి గ్రంథాల ద్వారా దోమకొండ సంస్థాన విషయాలు తెలుస్తున్నాయి. రెండో ఎల్లారెడ్డి కృతికర్త కూడా. అయన వాసిష్ఠం, లింగపురాణం రచించాడు. కానీ అవి అలభ్యం. కామిరెడ్డి చివరి తమ్ముడైన రెండో మల్లారెడ్డి రాజకవి మల్లారెడ్డిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు ఎన్నో గ్రంథాలు రచించాడు. కానీ ఆయన రాసిన షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం అనే గ్రంథాలు మాత్రమే లభిస్తున్నాయి.

ఉర్దూ భాషకు స్వర్ణయుగం..

పైడిమర్రి వెంకటపతి (1570–1640) అనే కవి కులీకుతుబ్‌షా కాలానికి చెందినవాడు. ఇతడు హైదరాబాద్, బీదర్ పరిసర ప్రాంతాల్లో నివసించాడు. బ్రౌన్, బహుజనపల్లి లాంటి వాళ్లు ఈ కవిని ప్రామాణికుడిగా భావించారు. స్కంధపురాణంలోని 11 శ్లోకాల కథను తనదైన శైలిలో వర్ణించాడు. దీన్ని 'చంద్రాంగద చరిత్ర' అనే రసవత్ప్రబంధంగా మలిచాడు. తన పూర్వీకుల మాదిరిగానే మహమ్మద్ కులీ కుతుబ్‌షా కూడా కవి పండితులను పోషించాడు. ఇతడి ఆస్థాన కవి మీర్ మోమెన్. సయ్యద్ మీర్ కుతుబుద్దీన్, సయ్యద్ కమాలుద్దీన్, మాజ్ సదరానీ తదితర పండితులు ఇతడి ఆస్థానంలో ఉండేవారు.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తర్వాత సుల్తాన్ అబ్దుల్లా కులీ కుతుబ్‌షా రాజయ్యాడు. ఇతడు సంస్కృత 'శుకసప్తతి'ని తోతినామా పేరుతో పార్సీ భాషలోకి అనువాదం చేయించాడు. దాన్నే 'సబ్‌రస్' (కామరూప కళాకథలు) పేరుతో ఉర్దూలోకి అనువదింపజేశాడు. ఇతడు ఉర్దూ భాషకు చాలా సేవ చేశాడు. ఇతడి పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగం. ఇతడు కవిపండిత పోషకుడే కాకుండా స్వయంగా కవి. అబ్దుల్లా పేరుతో కవితలు వెలువరించాడు. ఇతడి ఆస్థానంలో అలామీ మీర్ మజీదుద్దీన్, మౌలానా రౌనఖీ మొదలైన ఎనిమిది మంది కవి పండితులుండేవారు. గవాసీ ఇబిన్ నిషాత్ లాంటి గొప్పకవులను ఇతడు ఆదరించాడు. గవాసి 'తోతినామా' అనే కథలు రాశాడు. తబీయ అనే కవి బహరావగుల్ అనే మనోరంజకమైన కథను రాశాడు. అబ్దుల్లా కులీ కుతుబ్‌షా ఆస్థానంలో తులసీమూర్తి లాంటి తెలుగు కవులు కూడా ఉండేవారు. క్షేత్రయ్య ఈ రాజును దర్శించాడు. అబ్దుల్లా పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు.

హరివాసర మహాత్మ్యం రాసిన మరింగంటి వెంకట (ప్రథమ) నరసింహాచార్యులు, శశిబిందు చరిత్రం రచయిత చరిగొండ నరసింహకవి, కూర్మ పురాణాన్ని రచించిన రాజలింగ కవి ఈ కాలానికి చెందినవారే. బమ్మెర కేసకవి – మల్లకవి, వజ్రాభ్యుదయాన్ని రాసిన కోననారాయణ, రాజేశ్వర విలాసం రచయిత పిల్లలమర్రి వెంకటపతి, చెన్నబసవ పురాణాన్ని రచించిన గోపతి లింగకవి తదితరులు కూడా ఈ కాలానికి చెందినవారే. ఓరుగల్లుకు చెందిన కాసెసర్వప్ప (1600) ఏకామ్రనాథుడి 'ప్రతాప రుద్ర చరిత్ర'ను అనుసరించి ద్విపదలో 'సిద్ధేశ్వర చరిత్ర' రాశాడు. ఈ గ్రంథాన్ని వ్యవహారిక భాషలో రచించాడు.

ఎలకూచి బాలసరస్వతి

తెలంగాణ కుతుబ్‌షాహీల పాలనలో ఉన్నప్పటికీ సరిహద్దు ప్రాంతాలు ఇతర రాజుల చేతులు మారుతూ వచ్చాయి. సురభి మాధవరాయలు విజయనగర అళియరాయల నుంచి జటప్రోలును(కొల్లాపూర్) కానుకగా పొందాడు. తర్వాత అతడి కుమారులు అబ్దుల్లా కుతుబ్‌షా నుంచి సనదు రూపంలో జటప్రోలు సంస్థానాన్ని పొందారు. రేచర్ల పద్మనాయకులైన వీరికి సురభి వంశనామమైంది. ఈ వంశానికి చెందిన సురభి మాధవరాయలు(1620–70) చంద్రికా పరిణయమనే ప్రౌఢ కావ్యాన్ని రచించాడు. సురభి మాధవరాయల ఆస్థానకవి ఎలకూచి బాలసరస్వతి (1570–1650). ఆంధ్రశబ్ద చింతామణి ద్వారా ఇతడి పేరు చర్చనీయాంశమైంది. సంస్కృతంలో రాసిన ఈ తొలి తెలుగు వ్యాకరణ గ్రంథం నన్నయ రచనా? కాదా? బాలసరస్వతే రాసి నన్నయ పేరు పెట్టాడా? అనే విషయాలు చర్చనీయమయ్యాయి. మాధవరాయలతోపాటు ఇతడు కూడా 'చంద్రికా పరిణయం' రాశాడు. కానీ ఈ రెండింటిలో వేర్వేరు కథలున్నాయి. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువదించాడు. మాధవరాయల తండ్రయిన మల్లభూపాలుడికి సుభాషిత రత్నావళిని అంకితం చేశాడు. ఇది తొలి అనువాదం. 'యాదవ రాఘవ పాండవీయం' అనే త్ర్యర్థి కావ్యంతో పాటు మొత్తం పది గ్రంథాలను ఇతడు రచించాడు. ఇతడి గ్రంథాల వల్ల జటప్రోలు, పర్తియాల (జూపల్లి వారు) సంస్థానాల విశేషాలు తెలుస్తున్నాయి.

బాలసరస్వతి ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్య రాసిన కొద్ది కాలానికే కాకునూరి అప్పకవి అదే గ్రంథానికి భాష్యం లాంటి ప్రసిద్ధమైన అప్పకవీయం రాశాడు. అప్పకవి తెలంగాణ వాడేనని బూర్గుల రామకృష్ణారావు నిరూపించారు. అప్పకవీయం లక్షణ గ్రంథమైనా, సందర్భాన్ని బట్టి 'నిజదేశంబుల వేషభాషలపయిన్ని త్యాభిమానస్థులై ప్రజమెచ్చన్' అని ప్రాంతాభిమానాన్ని చాటాడు. సాధ్వీజ నధర్మం (ద్విపదకావ్యం), అనంత వ్రతకల్పం(కావ్యం), శ్రీశైలమల్లికార్జునుడి మీద శతకం, అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) మొదలైన ఇతర గ్రంథాలు కూడా అప్పకవి రచించాడు. కానీ ఇవి లభ్యం కావడం లేదు.దేవరకొండ పాలకుడైన పానుగోటి జగన్నాథరాయలు 'కుముదవల్లీ విలాసం' రచించాడు. ఇందులోని ఇతివృత్తం భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉంటుంది. కుతుబ్‌షాహి వంశంలో చివరి రాజులైన అబ్దుల్లా కుతుబ్‌షా (1626–72), అబ్దుల్ హసన్ తానీషా (1672–87) వద్ద అక్కన్న, మాదన్న అధికారులుగా పనిచేశారు. వారి మేనల్లుడైన కంచర్ల గోపన్న (భక్త రామదాసు) భద్రాచలం తహశీల్దార్ అయ్యాడు. తొలి సంకీర్తనాచార్యుల్లో ఒకడిగా రామదాసు ప్రసిద్ధి చెందాడు. ఇతడి జీవితం గురించి యక్షగానం వచ్చింది. దీన్ని బట్టి రామదాసు ఎంత గొప్పవాడో అర్థమవుతుంది. ఇతడి కీర్తనల్లో పాండిత్య ప్రకర్ష ఉండదు. అవి ఆర్తితో, సహజభక్తి భావావేశంతో అప్రయత్నంగా వచ్చాయి. దేశీయ గేయ రీతులను పుణికి పుచ్చుకున్నాయి. ఇతడు రాసిన 'దాశరథీ శతకం' కూడా ప్రసిద్ధి చెందింది. భక్తరామదాసు పేరు వినగానే అబుల్ హసన్ తానీషా పేరు స్ఫురిస్తుంది. రామదాసును జైల్లో పెట్టిన నిర్దయుడిగానే ఇతడి గురించి తెలుసు. కానీ ఇతడు రసహృదయం ఉన్న కవి. ఇతడు పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు.

రచయితలు	రచనలు
సారంగు తమ్మయ్య	- వైజయంతీ విలాసం
నేబతి కృష్ణమంత్రి	- రాజనీతి రత్నాకరం
మరింగంటి వెంకట	
నరసింహాచార్యులు (ప్రథమ)	- హరివాసర మహాత్మ్యం
కాసెసర్వప్ప	- సిద్ధేశ్వర చరిత్ర
సురభి మాధవరాయలు	- చంద్రికా పరిణయం (కావ్యం)
ఎలకూచి బాలసరస్వతి	- యాదవ రాఘవ పాండవీయం
పానుగోటి జగన్నాథరాయలు	- కుముదవల్లీ విలాసం
గవాసి	- తోతినామా (అనువాద కథలు)

తానీషా ఆస్థానంలో లతీఫ్, షాహినూరి, మీర్జా గులాం అలీ లాంటి ప్రసిద్ధ కవులుండేవారు. ఇతడి కాలంలో వజ్జి, గవాసీ తదితర ఉర్దూ కవులు తమ కవిత్వం ద్వారా ఉర్దూ భాషాభివృద్ధికి తోడ్పడ్డారు. ఉర్దూ రాజభాషగా పరిణతి చెందింది. అక్కన్న, మాదన్న, లింగన్నలకు ముఖ్య పదవులిచ్చాడు. పరమత సహనం చూపి ఉదార స్వభావిగా పేరొందాడు.అష్టదిగ్గజాల్లో ఒకడైన తెనాలి రామలింగడు (కృష్ణుడు) కాకుండా మరో తెనాలి రామలింగకవి (1666–86) ఉన్నాడు. విశ్వ బ్రాహ్మణుడైన ఇతడు అక్కన్న, మాదన్నల వద్ద ఆశ్రయం పొందాడు. ఇతడు ధీరజనమనో విరాజితం (పరిమళ చోళచరిత్ర) అనే కావ్యాన్ని రాశాడు. విశ్వ బ్రాహ్మణులకు జరిగిన అన్యాయాలే ఈ ప్రబంధంలోని కథావస్తువు.

ఇతర కవులు..

పెన్నలూరి వెంకటాద్రి రామోదాహరణం, భువన మోహినీ విలాసం అనే గ్రంథాలను రచించాడు. పదిహేడో శతాబ్దికి చెందిన విశ్వనాథయ్య సిద్దేశ్వర పురాణం అనే ద్విపద రాశాడు. అన్నంభట్టు తర్క సంగ్రహాన్ని, కర్పూరం కృష్ణమాచార్యులు భగవద్గీత ద్విపదను రచించారు. అత్తాను రామానుజాచార్యుడు శ్రీ రుక్మిణీకురవంజి అనే గ్రంథాన్ని రాయగా, పూడూరి కృష్ణయామాత్యుడు భగవద్గీత యథాశ్లోకానువాదం చేశాడు. శ్రీనాథుని వెంకటరామయ్య అశ్వరాయ చరిత్ర రాశాడు. అన్నమయ్య తర్వాత ఎక్కువ కీర్తనలు (3476) రాసిన ముష్టిపల్లి వేంకటభూపాలుడు ఈ కాలానికి చెందినవాడే. లక్ష్మీ శకవి, కాంద్రవేటి రామానుజాచార్యులు, ఎడపాటి ఎర్రన, సింహాద్రి వెంకటాచార్యులు, మరింగంటి వేంకట (ద్వితీయ) నరసింహాచార్యులు (1650–1720), సురభి నర్సింగరావు, బోరవెల్లి కృష్ణప్ప కూడా ఈ కాలానికి చెందిన కవులే. వీరే కాకుండా కుతుబ్‌షాహీల కాలానికి చెందిన ఎంతో మంది కవులు తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు

The seriousness of the situation is..

BANK EXAMS

GENERAL ENGLISH



Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements:
Climate change may force the shifting of locations of the existing crops due to
a) Melting of glaciers
b) Water availability and temperature suitability at other locations
c) Poor productivity of crops
d) Wider adaptability of crop plants
Which of the statements given above are correct?
1) a, b, & c 2) b & c only
3) a & d only 4) a & c
5) a, b, c, & d

2. To promote agricultural research in India is important because:
1) To predict variations in monsoon patterns and to manage water resources.
2) To make long term investment decisions for economic growth.
3) To facilitate wider adaptability of crops.
4) To predict drought conditions and to recharge aquifers.
5) Changed weather patterns in future.

3. The spillover from the Himalayas is due to
1) large-scale shifts in agro-ecological conditions.
2) changed weather patterns in future
3) productivity of crops
4) melting of glaciers
5) adaptability of crop plants

4. The antonym of **Critical** is
1) waver 2) steady 3) unsure
4) insecure 5) fasten

5. The synonym of **promote** is
1) encompass 2) encourage
3) entangle 4) entrust 5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
1) vary 2) variety 3) similar
4) reported 5) yawning

7. She ____ to escape from her office job.
1) earned 2) yelled 3) yearned
4) yielded 5) learn

8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
1) easy; complete
2) different; wholesome
3) difficult; totality
4) hard; completeness
5) tough; compliment

9. The new policy was adopted in the ____ of fierce ____.
1) wake; opponent
2) show; postponement
3) teeth; criticism
4) course; outcome
5) reality; injustice

10. The computer is now an ____ tool for the family doctor.
1) value 2) valid
3) price 4) worth
5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued year two times.
1) year twice 2) twice yearly
3) yearly two 4) two yearly
5) no correction required

12. She yelled at the child to getting down from the wall.
1) got down 2) get down
3) getting away 4) get upon
5) no correction required

13. All her yesterday's has vanished without a trace.
1) Have 2) had
3) has been 4) have being
5) no correction required

14. My son's 13 but he's younger for his age.
1) Youngest 2) youth
3) older 4) young
5) no correction required

15. When the needle enters the red zone the engine is indicator hot.
1) Too 2) much
3) becomes 4) left
5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)

17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)

18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)

19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)

20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)

21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)

22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)

23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)

24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)

25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred** in recent years (2) and **was widely** (3) **reported** in (4) the press.

27. A (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)

28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)

29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)

30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.
B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfeld's "English Grammar".
C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.
D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.
E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.
F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

33. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

34. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) E 5) F

35. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
3) extraneous 4) bucollic
5) conundrum

37. 1) powwow 2) malignant
3) untenable 4) capricious
5) dissipete

38. 1) railery 2) splenetic
3) palaver 4) lachrymose
5) tenacity

39. 1) exiguity 2) pillary
3) concomitant 4) surfeit
5) adjudicate

40. 1) promulgate 2) cataclysm
3) deluge 4) simulacrom
5) mural

Answers

1) 1;	2) 4;	3) 4;	4) 2;	5) 2;
6) 5;	7) 3;	8) 1;	9) 3;	10) 5;
11) 2;	12) 2;	13) 2;	14) 4;	15) 1;
16) 3;	17) 5;	18) 3;	19) 4;	20) 2;
21) 1;	22) 4;	23) 1;	24) 3;	25) 3;
26) 3;	27) 1;	28) 3;	29) 2;	30) 2;
31) 1;	32) 4;	33) 2;	34) 1;	35) 3;
36) 4;	37) 5;	38) 1;	39) 2;	40) 4.